ఈనాడు

విజయవాడ 30-12-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 140

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


MARUTI SUZUKI ARENA
VICTORIS
HYBRID
VICTORIS
VICTORIS
GOT IT ALL
SCAN AND CONNECT TO
A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY AT
WWW.MARUTISUZUKI.COM
CONTACT US AT 1800-102-1800
Applicable T&C available at your nearest dealership. Creative visualization. Car colour may vary due to printing on paper. Images used are for illustration purposes only. Features may vary by model/conditions.
VICTORIS

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 30-12-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 140 | రూ. 6-50 పేజీలు 14 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఏప్రిల్ 23 నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ దరఖాస్తుల స్వీకరణ

షెడ్యూల్ విడుదల చేసిన ఐఐటీ రూర్కీ

2 లో

భారీగా తగ్గిన వెండి, బంగారం ధరలు

వివరాలు బిజినెస్ లో

లోపలి పేజీలో

అ‘పూర్వ’ ప్రేమ

ఐఐటీ కాన్పూర్‌కు రూ.100 కోట్ల విరాళం

కుక్క కాటుతో గేదె మృతి.. దాని పెరుగు తిన్న 200 మందికి వ్యాక్సిన్

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘటన



కొత్త జిల్లాలు పోలవరం, మార్కాపురం



అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లె

26 నుంచి 28కి పెరిగిన జిల్లాల సంఖ్య

- తిరుపతి జిల్లాలోకి రైల్వేకోడూరు, వైఎస్సార్ కడపలోకి రాజంపేట
- అన్నమయ్య జిల్లాలోనే రాయచోటి నియోజకవర్గం
- కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు, ఒక మండలం
- పలు రెవెన్యూ డివిజన్లలో మార్పులు, చేర్పులు
- మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర
- 31న తుది నోటిఫికేషన్.. జనవరి 1 నుంచి పాలన

ఈనాడు - అమరావతి

కొత్తగా పోలవరం, మార్కాపురం జిల్లాల ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. అన్నమయ్య జిల్లాను కొనసాగిస్తూనే.. జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చే ప్రతిపాదనకు పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం ఈ జిల్లాలో ఉన్న రాజంపేట నియోజకవర్గాన్ని వైఎస్సార్ కడప జిల్లాలోకి, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో కలపాలని నిర్ణయించింది. రాయచోటి నియోజకవర్గం అన్నమయ్య జిల్లాలోనే ఉంటుంది. సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం.. జిల్లాల పునర్విభజనపై విస్తృతంగా చర్చించి ఆమోదం తెలిపింది. కొత్తగా 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతోపాటు.. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని రెండుగా విభజించనున్నారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ గ్రామం పేరును వాసవీ పెనుగొండగా మార్చనున్నారు. గూడూరు నియోజకవర్గంలోని (మిగతా 3లో)



సోమవారం సచివాలయంలో నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు, ఉన్నతాధికారులు

స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు

గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మార్పు

చట్టసవరణకు ఆర్డినెన్స్ జారీకి అనుమతి

12 లో

తిరుపతి జిల్లాలో దుగరాజపట్నం పోర్టు

అక్కడే నౌకా నిర్మాణ కేంద్రం

నేరాలు తగ్గాయ్.. శిక్షలు పెరిగాయ్

హత్యలు, అత్యాచారాలు, దాడులు తగ్గుముఖం

రాష్ట్ర వార్షిక నేర గణాంక నివేదిక-2025 విడుదల చేసిన డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం హత్యలు, అత్యాచారాలు, దాడులు, మహిళలపై నేరాలు వంటివి తగ్గుముఖం పట్టగా.. ఆర్థిక నేరాలు, హత్యాయత్నాలు, పగటిపూట ఇళ్ల కొల్లగొట్టడాలు వంటి ఘటనలు పెరిగాయి. సైబర్ నేరాల కేసుల సంఖ్య తగ్గినప్పటికీ.. ఆయా ఘటనలపై వేలల్లో ఫిర్యాదులు నమోదయ్యాయి. వాటి బారిన పడి బాధితులు రూ.వందల కోట్లు నష్టపోయారు. దళితులు, గిరిజనులపై నేరాలు, మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఘటనలు బాగా తగ్గుముఖం పట్టాయి. మొత్తంగా అన్ని రకాల నేరాలు కలిపి 2024 కంటే 2025లో 6.17 శాతం మేర తగ్గాయి. అదే సమయంలో శిక్షలు 6.51 శాతం మేర పెరిగాయి. చోరీలు, దొంగతనాలు, దోపిడీలు వంటి ప్రాపర్టీ నేరాల ఛేదన రేటు పెరిగింది. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా సోమవారం మంగళగిరిలోని (మిగతా 3లో)

ముగ్గురు ప్రభుత్వ సలహాదారుల నియామకం

మాస్ కమ్యూనికేషన్‌కు కార్టూనిస్ట్ శ్రీధర్

యోగా, ప్రకృతి చికిత్సకు మంతెన సత్యనారాయణరాజు


దేవాలయాలకు సీతారామాంజనేయ ప్రసాద్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ సలహాదారులుగా ముగ్గురిని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్ (మాస్ కమ్యూనికేషన్), ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు (ప్రకృతి వైద్యం- యోగా), చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ (దేవాలయాల)లను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులిచ్చారు. వీరు రెండేళ్లపాటు సలహాదారులుగా కొనసాగనున్నారు.

(మిగతా 3లో)



శ్రీధర్



సత్యనారాయణరాజు



సీతారామాంజనేయ ప్రసాద్

రేపు మనదవ్వాలంటే...



కదిలే కాలంలా....
జారే రుతువుల్లా...
మారే వాతావరణంలా....
ప్రపంచాన్ని
‘ఆర్టిఫిషియల్’
మార్పులూ...
కమ్మేస్తున్నాయి!
సాంకేతిక విప్లవాలు....
భౌగోళికాధిపత్యాలు...
ఆర్థిక సమీకరణాలు...
సామాజిక స్వరూపాలను
అనూహ్యంగా
మార్చేస్తున్నాయి.

వందల సంవత్సరాల్లో
కనిపించని మార్పు...
రాబోయే పదేళ్లలో
కనిపిస్తుందంటున్నారు...
ఇప్పుడున్న ఉద్యోగాలు ఉండకపోవచ్చు...
చదువులు ఇలాగే సాగకపోవచ్చు...
జీవితాలిలాగే గడవకపోవచ్చు!
ఆల్గోరిథమ్‌లు... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లతో
పేద-పెద్ద అనే తేడా లేకుండా
అందరిపైనా అప్రమేయ ప్రభావం!

అందుకే....
వానాకాలానికి గొడుగులతో...
మండుటెండలకు
చల్లదనంతో సిద్ధమైనట్లు...
అనూహ్య మార్పులకు
సిద్ధమవటమూ
ప్రతి కుటుంబానికీ ఇప్పుడు ఆవశ్యకం!
అప్పుడే... రాబోతున్న ఆర్టిఫిషియల్ తుపానులో
కొట్టుకుపోకుండా నిలబడగలుగుతాం!
ఆ సన్నద్ధత మనలో ఎంతుందో బేరీజు వేసుకోవటానికి...
అనివార్యమైన మార్పునకు సంసిద్ధమవటానికి...
క్యాలండర్ మారుతున్న వేళ ఓ సుముహూర్తం!
రండి... అనిశ్చిత భవిష్యత్తుకు
సిద్ధమవటం ఎలాగో... చూద్దాం!

ప్రత్యేక కథనం 8లో

అతన్ని బయటకు వదలొద్దు

‘ఉన్నావ్ కేసు’ నిందితుడి శిక్ష సస్పెన్షన్‌పై సుప్రీంకోర్టు స్టే

దిల్లీ హైకోర్టు ఆదేశాలను పక్కన పెట్టిన అత్యున్నత న్యాయస్థానం




కుల్దీప్ సింగ్ సెంగర్

దిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉత్తర్ ప్రదేశ్‌లోని ఉన్నావ్ అత్యాచారం కేసులో భాజపా మాజీ నేత కుల్దీప్ సింగ్ సెంగర్‌కు విధించిన జీవిత ఖైదును సస్పెండు చేస్తూ దిల్లీ హైకోర్టు జారీ చేసిన ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే ఇచ్చింది. నిందితుడికి నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరీ, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశాలిచ్చింది. ఈ అంశాన్ని పరిశీలించాల్సి ఉందని, డిసెంబరు 23వ తేదీ నాటి హైకోర్టు తీర్పును అనుసరించి నిందితుడిని జైలు నుంచి విడుదల చేయవద్దని ఆదేశించింది. ఈ విషయంలో చట్టపరంగా ముఖ్యమైన ప్రశ్నలు ఎదురయ్యాయని వ్యాఖ్యానించింది. దిల్లీ హైకోర్టు తీర్పును (మిగతా 3లో)

కనరో భాగ్యము.. కలియుగ వైకుంఠము!

తిరుమలకు ముక్కోటి కాంతులు

అర్ధరాత్రి తర్వాత తెరుచుకున్న వైకుంఠ ద్వారాలు



తిరుమలలో శ్రీవారి ఆలయం వెలుపల ఆకట్టుకుంటున్న శ్రీరంగనాథస్వామి అంతరాలయం నమూనా

2లో

అజ్ఞాతంలోకి వల్లభనేని వంశీ!

ఫోన్ స్విచాఫ్ చేసిన వైకాపా నేత


హత్యాయత్నం కేసులో అరెస్టు తప్పించుకునేందుకేనని అనుమానాలు

2 లో

కలిసి చదివి... కలల ప్రపంచానికి చేరి.. స్నేహితురాళ్ల విషాదాంతం

అమెరికాలో ఇద్దరు తెలంగాణ యువతుల దుర్మరణం

ఇదీ సంగతి!



అదొక చిన్న విషయం..
దీనికే ఇంత రాద్ధాంతమా!

టాటా-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

- అర్ధరాత్రి ఎలమంచిలి సమీపంలో దుర్ఘటన
- రెండు బోగీలు పూర్తిగా, ఒకటి పాక్షికంగా దగ్ధం
- మంటల్లో చిక్కుకుని ఒకరు మృతి.. మిగిలిన వారు సురక్షితం
- ఆర్టీసీ బస్సుల్లో సామర్లకోటకు ప్రయాణికుల తరలింపు
- అక్కడ కొత్త బోగీలు జతచేసి, ప్రయాణం యథాతథం



ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లో కాలిపోతున్న బోగీలు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి-న్యూస్‌టుడే, ఎలమంచిలి: ప్రయాణికులంతా గాఢనిద్రలో ఉన్నవేళ నడుస్తున్న రైలులో అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. క్షణాల్లో రెండు బోగీలకు వ్యాపించాయి. సిబ్బంది అప్రమత్తమై రైలును నిలిపివేయడంతో పెనుముప్పు తప్పింది. సకాలంలో బయటకు రాలేని ఓ వృద్ధుడు బోగీలోనే సజీవదహనం కాగా, మిగతా ప్రయాణికులు తేరుకొని వెంటనే దిగేయడంతో ప్రాణాలతో బయటపడ్డారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి 12:45 గంటల సమయంలో టాటానగర్-ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్ అగ్నిప్రమాదానికి గురైంది. ఝార్ఖండ్‌లోని టాటానగర్ నుంచి ఆదివారం ఉదయం 5 గంటలకు బయల్దేరిన ఈ రైలు.. నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 12.15కు అనకాపల్లి (మిగతా 3లో)



బూడిదైన బోగీ లోపలి భాగం



5వ శతాబ్దం నాటి నౌక పునఃసృష్టి!

లోహాలు, ఇంజిన్‌లేకుండా రూపొందిన ఐఎన్ఎస్‌వీ కౌండిన్య

గుజరాత్ నుంచి ఒమన్‌కు పయనం

3లో

కలిమెయ్యిండోయ్.. బుస కొట్టేస్తదండోయ్!



చారలతో విభిన్నంగా కనిపిస్తున్న ఈ చేపను మత్స్యకారులు కలిమెయ్య పాములు అని పిలుచుకుంటారు. శాస్త్రీయంగా వీటిని లెపర్డ్ మోరే ఈల్‌గా పిలుస్తారని విశాఖ సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) ప్రధాన శాస్త్రవేత్త డా.కేకే జోయా తెలిపారు. 'దాదాపు ఆరేడు అడుగుల పొడవు పెరిగే ఈ కలిమెయ్య పాములు సముద్రంలో చాలా లోపల నివసిస్తాయి. ఆహార అన్వేషణలో భాగంగా రాత్రివేళ బయటకు వచ్చే సందర్భాల్లో అరుదుగా వలలకు చిక్కుతాయి' అని వివరించారు. రుషికొండ తీరంలో సోమవారం మత్స్యకారుల వలల్లో ఈ జీవులు పడగా.. తీరం చేరేటప్పటికే మరణించాయి. – న్యూస్‌టుడే, విశాఖపట్నం (సాగర్‌నగర్)

ఇదేం చేపయ్యా.. ఇంత టాలెంటెడ్‌గా ఉంది?




తలపై జల్లెడలా ఉన్న ఈ చేపను మత్స్యకారులు చూష లేదా బిళ్ల చేపలని పిలుస్తారు. శాస్త్రీయనామం ఎఖనేస్ నాక్రటిస్. చర్మంపై గరుగ్గా ఉన్న జల్లెడలాంటి భాగం సాయంతో తిమింగలాల వంటి పెద్ద చేపలకు అతుక్కుపోతాయి. వాటితో పాటే వెళుతూ ఏ మాత్రం కష్టపడకుండా అవి తినగా వదిలేసిన ఆహారాన్ని ఆరగిస్తుంటాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడిబాడవలోని వైనతేయ నదిలో మత్స్యకారుడు అంకాని సత్యనారాయణ (బుజ్జి) వలకు సోమవారం ఈ అరుదైన చేప చిక్కింది. – న్యూస్‌టుడే, మామిడికుదురు

టికెట్ కొన్నా గురూ!



పిల్లితో బస్ ఎక్కిన ఓ ప్రయాణికుడికి వింత అనుభవం ఎదురైంది. దానికీ టికెట్ కొనాలని కండక్టర్ చెప్పడంతో ఆయన సరే అన్నారు. దీంతో కండక్టర్ ఇద్దరికి టికెట్ కొట్టి.. ఒకటి పిల్లికి అని రాశారు. శుక్రవారం కర్ణాటకలోని మైసూరు-మడికేరి బస్సులో ఈ ఘటన జరగగా ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'టికెట్ తీసుకున్నాక ఒకరి ఒళ్లో ఎందుకు కూర్చుంటా.. నాకో సీట్ ఉంది' అనే దర్పంతో ఆ మార్జాలం ఇలా ఫొటోకు పోజు ఇచ్చింది. – న్యూస్‌టుడే, మడికేరి




ఇంటికి వందేళ్ల వార్షికోత్సవం
ఐదుతరాల అనుబంధానికి ప్రతిరూపం

తమిళనాడులో ఓ ఇంటిని నిర్మించి వందేళ్లయింది. దానిని పురస్కరించుకొని ఐదు తరాలకు చెందిన వారసులు వార్షికోత్సవం నిర్వహించారు. శివగంగ జిల్లా కారైక్కుడి కొట్టైయూర్ పంచాయతీ వేలంగుడిలో 1926లో పెరియణ్ణన్, ఆయన సోదరుడు సుబ్బయ్యలు కలిసి చెట్టినాడు సంప్రదాయ పద్ధతిలో ఇంటిని నిర్మించారు. ఆ ఇంటి కుటుంబీకులు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతూ అపురూపంగా చూసుకుంటున్నారు. ప్రస్తుతం 99 ఏళ్లు పూర్తి చేసుకుని 100వ ఏడాదిలోకి అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో ఆదివారం 100వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఐదు తరాలకు చెందిన 300 మంది వారసులు కెనడా, మలేసియా, సింగపూర్ దేశాల నుంచి వచ్చి పాల్గొన్నారు. ఉద్యోగాల రీత్యా ఎక్కడున్నా ముఖ్యమైన పండుగలు, శుభకార్యాల సమయంలో అందరం ఇక్కడికి వస్తామని, పూర్వీకుల నిర్ణయాన్ని గౌరవిస్తూ ఇల్లు దెబ్బతినకుండా కాపాడుకుంటున్నట్లు వారు తెలిపారు. – న్యూస్‌టుడే, చెన్నై(ప్యారిస్)

కనరో భాగ్యము.. కలియుగ వైకుంఠము!

- అర్ధరాత్రి తర్వాత తెరుచుకున్న వైకుంఠ ద్వారాలు





శ్రీవారి ఆలయం వద్ద శేషునిపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ◆ పూలు, విద్యుత్ దీపాలతో వెలుగులీనుతున్న శ్రీవారి ఆలయం

తిరుమల, న్యూస్‌టుడే: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కొలువైన తిరుమల క్షేత్రం దేదీప్యమానంగా వెలుగులీనుతోంది. వైకుంఠ ఏకాదశి పర్వదినానికి అణువణువూ ముస్తాబైంది. సోమవారం రాత్రి 8.30 గంటల నుంచి సర్వదర్శనం క్యూలైన్‌లోకి భక్తుల ప్రవేశాన్ని నిలిపివేసిన తితిదే అధికారులు.. అప్పటికే ఉన్నవారికి స్వామివారి దర్శనం కల్పించారు. శ్రీవేంకటేశ్వరునికి ఏకాంత సేవ అనంతరం స్వల్ప విరామమిచ్చి.. అర్ధరాత్రి 12 గంటలకు ప్రధాన ఆలయాన్ని తెరిచారు. పూజాది కైంకర్యాలు పూర్తిచేశారు. రాత్రి 1.30 నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభించారు. తొలుత వీఐపీలకు దర్శన భాగ్యం కల్పించి, అనంతరం ఈ-డిప్ టోకెన్లు కలిగిన సామాన్య భక్తులను క్యూలైన్‌లోకి అనుమతిస్తున్నారు. ఏర్పాట్లను తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరిలు పర్యవేక్షించారు. అలిపిరి, శ్రీవారి మెట్టుమార్గంలో పోలీసు, విజిలెన్స్ సిబ్బంది పెద్దఎత్తున తనిఖీలు చేపట్టారు. సాయంత్రం తర్వాత టికెట్లు ఉన్నవారిని మాత్రమే తిరుమలకు అనుమతించారు. మంగళవారం ఉదయం శ్రీమలయప్ప స్వామి ప్రత్యేకంగా స్వర్ణరథంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయప్రదానం చేయనున్నారు.

సిరిగలవాని సేవకు విదేశీ విరులు

వైకుంఠ ద్వార దర్శనాల సందర్భంగా పది రోజుల పాటు తిరుమల వ్యాప్తంగా తితిదే ప్రత్యేక అలంకరణలు చేపట్టింది. ప్రధాన ఆలయాన్ని వర్ణరంజిత, సుగంధ భరిత పుష్పాలు, విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దింది. లోపలికి ప్రవేశించగానే భక్తులకు దివ్యానుభూతి కలిగేలా ధ్వజస్తంభం, బలిపీఠం, వెండి వాకిలి, బంగారు వాకిలి, వైకుంఠ ద్వారాన్ని వివిధ దేశాల నుంచి తెప్పించిన పత్రాలు, పుష్పాలు, ఫలాలతో ముస్తాబు చేసింది. ప్రాకారాలు, గోపురాలు రంగురంగుల విద్యుత్ కాంతులతో వెలుగులీనుతున్నాయి. ఆలయం ఎదుట తీర్చిదిద్దిన సెట్టింగ్‌లతో ఆధ్యాత్మిక వైభవం విరాజిల్లుతోంది.

భక్తులు సంయమనంతో శ్రీవారిని దర్శించుకోవాలి

- 'ఈనాడు-ఈటీవీ'తో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. సోమవారం 'ఈనాడు-ఈటీవీ'తో ఆయన మాట్లాడారు. 'శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం వచ్చే భక్తులకు నెల రోజుల నుంచి ముందస్తు సమాచారం అందిస్తున్నాం. మొదటి మూడురోజులకు నూతనంగా తీసుకువచ్చిన ఈ-డిప్ విధానంలో 1.80 లక్షల మందికి టోకెన్లు జారీ చేశాం. భక్తులు సంయమనంతో శ్రీవారిని దర్శించుకోవాలి. జనవరి 2 నుంచి భారీగా భక్తులు వచ్చినా సర్వదర్శనం కల్పించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. వచ్చినవారికి వచ్చినట్లు దర్శనం చేసి పంపిస్తాం. ఈ పది రోజుల్లో ప్రణాళికకు అనుగుణంగా 7.50 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించడమే లక్ష్యం' అని ఛైర్మన్ వెల్లడించారు.

శ్రీవారి సేవలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డికి శ్రీవారి జ్ఞాపిక అందజేస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో వైకుంఠద్వార దర్శనాలు సోమవారం అర్ధరాత్రి 1:30 గంటలకు ప్రారంభమయ్యాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ఉత్తర ద్వారం గుండా బయటకు వచ్చారు. ముందుగా ఆయనకు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఇతర అధికారులు స్వాగతం పలికారు.



ఉత్తర ద్వార దర్శనం అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వెలుపలకు వస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

ఏప్రిల్ 23 నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ దరఖాస్తుల స్వీకరణ

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఏడాది మే 17న జరగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్-2026కు ఏప్రిల్ 23వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. దేశంలోని 23 ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో బీటెక్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికి అడ్వాన్స్‌డ్ పరీక్షను మే 17న జరుపుతామని ఈనెల 5వ తేదీన ప్రకటించిన ఐఐటీ రూర్కీ సోమవారం పూర్తి షెడ్యూల్‌ను జారీ చేసింది. జేఈఈ మెయిన్‌లో కనీస స్కోర్ సాధించిన 2.50 లక్షల మందికి మాత్రమే అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయడానికి అవకాశం ఉంటుంది.

ఇదీ పూర్తి షెడ్యూల్.. ఏప్రిల్ 6- మే 2 వరకు: విదేశీయులు, భారతీయ సంతతి విద్యార్థులకు నేరుగా రిజిస్ట్రేషన్ అవకాశం

- ◆ ఏప్రిల్ 23- మే 2వ తేదీ వరకు: మెయిన్‌లో అర్హత సాధించిన వారికి రిజిస్ట్రేషన్ గడువు
- ◆ మే 11-17వ తేదీ వరకు: హాల్‌టికెట్లు (అడ్మిట్ కార్డు) డౌన్‌లోడ్ చేసుకోవడం
- ◆ మే 17వ తేదీ: పరీక్ష నిర్వహణ (ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్-2)
- ◆ మే 21న: జవాబులు (రెస్పాన్స్ షీట్) వెబ్‌సైట్‌లో ఉంచుతారు
- ◆ మే 25వ తేదీ: ప్రాథమిక కీ విడుదల
- ◆ మే 25- 26వ తేదీ వరకు: ప్రాథమిక కీపై అభ్యంతరాలు, అభిప్రాయాల స్వీకరణ
- ◆ జూన్ 1 ఉదయం 10 గంటలకు: తుది కీ విడుదల, ర్యాంకుల వెల్లడి

జూన్ 2 నుంచి జోసా కౌన్సెలింగ్

జూన్ 1వ తేదీన అడ్వాన్స్‌డ్ ఫలితాలు వెల్లడవుతున్నందున ఆ మరుసటి రోజు 2వ తేదీ నుంచి ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే సాంకేతిక విద్యా సంస్థలకు కలిపి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణులైన వారు బీఆర్క్ కోర్సుల్లో చేరాలనుకుంటే ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్టు(ఏఏటీ) రాయాల్సి ఉంటుంది. అందుకు జూన్ 4వ తేదీన ఆ పరీక్ష నిర్వహిస్తారు. వాటి ఫలితాలు జూన్ 7న సాయంత్రం 5 గంటలకు విడుదల చేస్తారు.


ఆధారాలు లభించాకే చెవిరెడ్డిపై కేసు

- మద్యం లంచాల సొమ్ము నిల్వ, తరలింపులో కీలకపాత్ర
- హైకోర్టులో సీఐడీ వాదనలు.. తీర్పు రిజర్వు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంతో సంబంధం ఉన్నట్లు ఆధారాలు లభించిన తర్వాతే వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి (ఏ38)ని ఈ కేసులో నిందితుడిగా చేర్చామని సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా సోమవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. కేసు నమోదు చేసిన వెంటనే ఆయన్ను నిందితుడిగా చేర్చలేదన్నారు. రాజకీయ ప్రతీకారంతో కేసులో ఇరికించారన్న చెవిరెడ్డి వాదనలో వాస్తవం లేదని చెప్పారు. 'మద్యం లంచాల సొమ్మును దాచి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలించడంలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి కీలక పాత్ర పోషించారు. సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) వాహనాలను వినియోగించి మద్యం లంచాల సొమ్మును తరలించారు. తుడా వాహనాలు ఆ సమయంలో మరో ప్రాంతంలో ఉన్నట్లు లాగ్ పుస్తకాల్లో తప్పుగా నమోదు చేయించారు. హైవేల్లోని టోల్‌ప్లాజాల వద్ద సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తే ఆ విషయం బయటపడింది. మద్యం కుంభకోణం కేసులో నిందితులతో కలిసి చెవిరెడ్డి పలు సమావేశాల్లో పాల్గొన్నారనడానికి డిజిటల్ రికార్డులు, టవర్ లొకేషన్ ఆధారాలు లభించాయి. మద్యం కంపెనీల నుంచి ప్రతి నెలా రూ.60 కోట్ల నుంచి 70 కోట్లు లంచాలు వసూలు చేశారు. అట్టపెట్టెల్లో సొమ్మును ప్యాక్ చేసి, అపార్ట్‌మెంట్‌లోకి తీసుకెళ్లినట్లు సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారు. ముడుపుల ద్వారా వచ్చిన సొమ్ముతో బంగారం కొనడంతోపాటు స్థిరాస్తి వ్యాపారంలో పెట్టుబడులు పెట్టారు. చెవిరెడ్డి ఆదేశిస్తేనే సొమ్మును తరలించినట్లు ఆయన వ్యక్తిగత భద్రత సిబ్బంది వాంగ్మూలం ఇచ్చారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉండగా చెవిరెడ్డి ఆదేశాలతో ఓ కంటెయినర్ ద్వారా తరలిస్తున్న రూ.8 కోట్ల సొమ్మును అధికారులు సీజ్ చేశారు. చెవిరెడ్డిపై 70 కేసులున్నాయి. విదేశాలకు పారిపోయే ప్రయత్నం చేశారు. ఈ కేసులో చెవిరెడ్డి పాత్ర ఉందనే ఏసీబీ కోర్టు ఆయన బెయిల్ పిటిషన్‌ను కొట్టేసింది. దర్యాప్తు కొనసాగుతోంది. బెయిలిస్తే దానిపై ప్రభావం పడుతుంది. బెయిల్ పిటిషన్‌ను కొట్టేయండి' అని కోరారు. సోమవారం జరిగిన విచారణలో చెవిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రకటించారు.

ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ పిచ్చేశ్వరరావు కుటుంబానికి రూ.కోటి ప్రమాద బీమా పరిహారం

- చెక్కు అందజేసిన సీఎం



పిచ్చేశ్వరరావు కుటుంబానికి రూ.కోటి నగదు చెక్కును అందజేస్తున్న చంద్రబాబు. చిత్రంలో కొల్లు రవీంద్ర తదితరులు

ఈనాడు, అమరావతి: విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ పిచ్చేశ్వరరావు కుటుంబానికి ప్రమాద బీమా పరిహారం రూ.కోటి సీఎం చంద్రబాబు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం-ఎస్‌బీఐల మధ్య ఈ ఏడాది మార్చిలో కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు ఎస్‌బీఐ బీమా పథకం కింద ఈ పరిహారం మంజూరైంది. సచివాలయంలో దీనికి సంబంధించిన నగదు చెక్కును సోమవారం పిచ్చేశ్వరరావు కుటుంబసభ్యులకు చంద్రబాబు అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా, కమిషనర్ చెరుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కలిసి చదివి... కలల ప్రపంచానికి చేరి.. స్నేహితురాళ్ల విషాదాంతం

అమెరికాలో ఇద్దరు తెలంగాణ యువతుల దుర్మరణం



మేఘనారాణి



భావన

గార్ల, న్యూస్‌టుడే: గ్రామంలో ఒకటో తరగతి మొదలు.. అమెరికాలో ఎంఎస్ దాకా కలిసి చదువుకున్న ఇద్దరు యువతులు ఆదివారం అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో విగతజీవులుగా మారారు. వారి మరణ వార్త తెలిసి మహబూబాబాద్ జిల్లా గార్ల, ముల్కనూరు గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గార్ల మండల కేంద్రానికి చెందిన పుల్లఖండం మేఘనారాణి(25), ముల్కనూరు గ్రామవాసి కడియాల భావన(24) గార్లలో ప్రాథమిక విద్య మొదలుకొని హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ వరకు కలిసే చదువుకున్నారు. ఎంఎస్ చేసేందుకు మూడేళ్ల కిందట అమెరికా వెళ్లారు. అక్కడ ఒహాయో రాష్ట్రం డేటన్‌లో ఉంటూ యూనివర్సిటీ ఆఫ్ డేటన్‌లో ఎంఎస్ పూర్తి చేశారు. ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నారు. ఈ క్రమంలో ఎనిమిది మంది మిత్రులు కలిసి రెండు కార్లలో విహారయాత్రకు అలబామా హిల్స్ వెళ్తుండగా మార్గమధ్యలో వీరి కారు లోయలో పడటంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మేఘనారాణి తల్లిదండ్రులు నాగేశ్వరావు, శిరీష గార్లలో మీ-సేవ కేంద్రాన్ని నడుపుతున్నారు. భావన తండ్రి కోటేశ్వరరావు ముల్కనూరు గ్రామ ఉపసర్పంచి కాగా తల్లి రేణుక గృహిణి. మరో వారం రోజుల్లో(జనవరి 5) భావన పుట్టినరోజని, అంతలోనే తమకు దూరమైందని కన్నీరుమున్నీరు అవుతున్నారు.

గ్రహం అనుగ్రహం

30-12-2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్యమాసం, శుక్లపక్షం

ఏకాదశి: రా. 1-27 తదుపరి ద్వాదశి
భరణి: రా. 1-10 తదుపరి కృత్తిక
వర్జ్యం: ఉ. 11-41 నుంచి 1-11 వరకు
అమృత ఘడియలు: రా. 8-40 నుంచి 10-10 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-45 నుంచి 9-29 వరకు
రా. 10-44 నుంచి 11-36 వరకు
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6.34; సూర్యాస్తమయం: సా.5.31
వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.7	29.3
హైదరాబాద్	13.0	27.2
విజయనగరం	16.0	26.0
అనంతపురం	16.6	30.0
కర్నూలు	16.7	29.6
కడప	17.0	27.0
శ్రీకాకుళం	17.0	28.0
రాజమహేంద్రవరం	17.0	32.0
విశాఖపట్నం	17.6	28.0
విజయవాడ	19.0	28.5
గుంటూరు	19.0	29.0
తిరుపతి	19.6	28.4
నరసాపురం	19.6	29.6
ఒంగోలు	20.0	30.6
నెల్లూరు	21.4	29.6
తాడేపల్లిగూడెం	27.0	29.0

అజ్ఞాతంలోకి వల్లభనేని వంశీ!

- హత్యాయత్నం కేసులో అరెస్టు తప్పించుకునేందుకేనని అనుమానాలు



ఈనాడు, అమరావతి: గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత వల్లభనేని వంశీ అజ్ఞాతంలోకి వెళ్లారు. కొన్ని రోజులుగా ఆయన బయట కనిపించడం లేదు. మాచవరం పోలీసులు అరెస్టు చేస్తారన్న అనుమానంతో అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. వంశీని ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ ఈ నెల 17న విజయవాడలోని మాచవరం స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులోనే యతీంద్ర రామకృష్ణ, కొమ్మా కోట్లు, ఓలుపల్లి రంగా, కాట్రు శేషు, ఎం.బాబు, ముల్పూరి ప్రభుకాంత్, అనగాని రవి, మరికొంతమందిని నిందితులుగా చేర్చారు. 2024 జూన్ 7న సునీల్‌పై దాడి చేయమని వంశీ తన అనుచరులను రెచ్చగొట్టారని.. దీంతో వారు కర్రలు, మారణాయుధాలతో తీవ్రంగా గాయపర్చారన్నది నేరాభియోగం. దీనికి సంబంధించి వారం కిందట వంశీ నివాసానికి వెళ్లి, సమన్లు ఇచ్చేందుకు పోలీసులు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించినా.. ఉపశమనం లభించలేదు. దీంతో ఫోన్ స్విచాఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లారు. విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో విచారణలో ఉన్న సత్యవర్ధన్ కేసు వాయిదాకు సోమవారం హాజరుకావాల్సి ఉన్నా.. రాలేదు. సునీల్‌పై దాడి కేసులో నిందితుడిగా ఉన్న ఆయన అనుచరుడు ఓలుపల్లి రంగా కూడా ఎస్సీ, ఎస్టీ కోర్టు వాయిదాకు రాలేదు. మిగిలిన అనుచరులు సైతం అజ్ఞాతంలోకి వెళ్లారు. పరారీ నేపథ్యంలో పోలీసులు వంశీ కోసం గాలిస్తున్నారు.

మద్యం కేసులో చాణక్య బెయిల్ పిటిషన్ డిస్మిస్

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో నిందితుడు బూనేటి చాణక్య దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఈ మేరకు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో గుంటూరు కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న బాలాజీకుమార్ యాదవ్ తరఫున అతని న్యాయవాది సోమవారం జైలులో అదనపు సౌకర్యాలు కల్పించాలని పిటిషన్ వేశారు.

రికార్డు స్థాయిలో దుర్గగుడి తలనీలాల వేలం

రూ.10.10 కోట్లకు పాడుకున్న ఓ సంస్థ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: బెజవాడ దుర్గగుడి మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో భక్తులు సమర్పించే తలనీలాలు పోగు చేసుకునే హక్కుల కోసం సోమవారం వేలం పాట నిర్వహించారు. 19 మంది గుత్తేదారులు పాల్గొనగా, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ సంస్థ రూ.10.10 కోట్లకు టెండరు దక్కించుకుంది. రెండేళ్ల కిందట వేలం నిర్వహించగా, రూ.5.67 కోట్లు వచ్చాయి. 2026-27కు రూ.10.10 కోట్లు, 2027-28కు 10 శాతం అధికంగా రూ.11.11 కోట్లకు టెండర్ ఖరారు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

వైద్య కళాశాలల టెండర్ల గడువు పెంపు

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో మెడికల్ కళాశాలల ఏర్పాటుకు సంబంధించిన టెండర్ల గడువును పొడిగించనున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ విషయంలో జగన్ తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరన్నారు. సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పీపీపీ విధానంలో నడపాలని నిర్ణయించిన ఆదోనీ వైద్య కళాశాలకు ఒకరు హై నెట్‌వర్క్ కేటగిరీలో టెండర్ వేశారు. సంబంధిత సంస్థతో ఆ కళాశాల నిర్వహణకు తగ్గట్లు నిర్ణయం తీసుకుంటాం' అని స్పష్టం చేశారు.

కొత్త జిల్లాలు పోలవరం, మార్కాపురం

(మొదటి పేజీ తరువాయి)

మూడు మండలాల్ని శ్రీపొట్టి శ్రీరాములు జిల్లాలో కలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నుంచి కందుకూరు, బాపట్ల జిల్లా నుంచి అద్దంకి నియోజకవర్గాలు ప్రకాశం జిల్లాలో కలవనున్నాయి. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలతోపాటు పలుచోట్ల మార్పులు, చేర్పులపై ఈ నెల 31న తుది నోటిఫికేషన్ జారీ కానుంది. జనవరి 1 నుంచి పాలన ప్రారంభం అవుతుంది. మొత్తంగా రాష్ట్రంలో జిల్లాల సంఖ్య ప్రస్తుతం ఉన్న 26 నుంచి 28కి పెరిగింది.



కొత్త జిల్లాలు

1. రంపచోడవరం కేంద్రంగా పోలవరం (12 మండలాలు) (రంపచోడవరం రెవెన్యూ డివిజన్ 8, చింతూరు రెవెన్యూ డివిజన్ 4 మండలాలు)
2. మార్కాపురం (21 మండలాలు) (మార్కాపురం రెవెన్యూ డివిజన్ 15 మండలాలు, కనిగిరి 6 మండలాలు)



కొత్త రెవెన్యూ డివిజన్లు

1. అడ్డరోడ్డు జంక్షన్, అనకాపల్లి జిల్లా (7 మండలాలు) (యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, ఎస్.రాయవరం)
2. అద్దంకి, ప్రకాశం జిల్లా (10 మండలాలు) (అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిశపాడు, ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి, దొనకొండ, కురిచేడు)
3. పీలేరు, అన్నమయ్య జిల్లా (8 మండలాలు) (సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లి, కలికిరి, వాల్మీకిపురం)
4. మడకశిర, శ్రీసత్యసాయి జిల్లా (5 మండలాలు) (మడకశిర, గుడిబండ, రొళ్ల, అమరాపురం, అగలి)
5. బనగానపల్లి, నంద్యాల జిల్లా (5 మండలాలు) (బనగానపల్లి, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల)

కొత్త మండలం

■ ఆదోని మండలం రెండుగా విభజన

■ ఆదోని – 1 (29 గ్రామాలు) | ■ ఆదోని – 2 (17 గ్రామాలు)

జిల్లా కేంద్రం మదనపల్లెకు మార్పు

■ అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నుంచి మదనపల్లెకు

మొత్తం మండలాలు: 24

రెవెన్యూ డివిజన్లు: మదనపల్లె (11), పీలేరు (8), రాయచోటి (5)

ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోకి.. మూడు మండలాలతో గూడూరు రెవెన్యూ డివిజన్..

ప్రస్తుతం తిరుపతి జిల్లాలోని గూడూరు రెవెన్యూ డివిజన్‌లో మార్పులు, చేర్పులు చేశారు. గూడూరు, చిల్లకూరు, కోట మండలాలతో కూడిన గూడూరు రెవెన్యూ డివిజన్‌ను నెల్లూరు జిల్లాలో కలుపుతున్నారు. ఈ డివిజన్‌లో మిగిలే మండలాల్లో.. వాకాడు, చిట్టమూరును సూళ్లూరుపేట డివిజన్‌లో, బాలాయపల్లె, డక్కిలి, వెంకటగిరి మండలాల్ని శ్రీకాళహస్తి డివిజన్‌లో కలుపుతారు.

■ కలువాయి మండలం ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో, రాపూరు, సైదాపురం మండలాలు నెల్లూరు డివిజన్‌లో కొనసాగించనున్నారు.

రెవెన్యూ డివిజన్లలో మార్పులు, చేర్పులివే

■ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం రెవెన్యూ డివిజన్‌లోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం డివిజన్‌లో కలుపుతారు.

■ కందుకూరు రెవెన్యూ డివిజన్‌లోని కొండాపురం, వరికుంటపాడు మండలాల్ని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కావలి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేస్తారు. కందుకూరు రెవెన్యూ డివిజన్‌లో మిగిలే 5 మండలాల్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేస్తారు.

■ శ్రీకాకుళం జిల్లా పలాస రెవెన్యూ డివిజన్‌లోని నందిగాం గ్రామాన్ని టెక్కలి డివిజన్‌లో కలుపుతారు.

■ సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దాపురం డివిజన్‌లో విలీనం చేయనున్నారు.

■ చీడికాడ మండలాన్ని నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ నుంచి అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో కలపనున్నారు. మునగపాక మండలాన్ని అనకాపల్లి డివిజన్‌లో కొనసాగించనున్నారు.

■ కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని మర్రిపూడి, పొన్నలూరు మండలాల్ని కందుకూరు డివిజన్‌లో చేర్చనున్నారు.

■ అద్దంకి నియోజకవర్గంలోని ఐదు మండలాల్ని బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాలోకి చేరుస్తారు.

■ పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని బంగారుపాళ్యం మండలాన్ని చిత్తూరు డివిజన్‌లోకి చేర్చారు.

■ ఆమడగూరు మండలాన్ని కదిరి డివిజన్ నుంచి పుట్టపర్తి డివిజన్‌లోకి, గోరంట్ల మండలాన్ని పుట్టపర్తి డివిజన్ నుంచి పెనుకొండ డివిజన్‌లో కలుపుతారు.

17 జిల్లాల్లో మార్పులు, చేర్పులు

★ జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల పునర్విభజన సందర్భంగా ప్రస్తుతం ఉన్న 26 జిల్లాల్లో 17 చోట్ల మార్పులు చేర్పులు జరిగాయి. 9 జిల్లాల్లో ఎలాంటి మార్పులు లేవు.

మార్పులు తర్వాత జిల్లాల్లో డివిజన్లు, మండలాలు

జిల్లా	రెవెన్యూ డివిజన్లు	మండలాలు
శ్రీకాకుళం	3	30
అనకాపల్లి	3	24
అల్లూరి సీతారామరాజు	1	11
పోలవరం	2	12
కాకినాడ	2	21
అంబేడ్కర్ కోనసీమ	3	19
తూర్పుగోదావరి	2	22
పశ్చిమగోదావరి	3	20
బాపట్ల	3	20
ప్రకాశం	3	28
మార్కాపురం	2	21
ఎస్పీఎస్ఆర్ నెల్లూరు	4	36
తిరుపతి	3	36
చిత్తూరు	4	28
అన్నమయ్య	3	25
వైఎస్సార్ కడప	5	40
శ్రీసత్యసాయి	5	32
కర్నూలు	3	27
నంద్యాల	4	30

తిరుపతి రెవెన్యూ డివిజన్‌లోకి

రైల్వేకోడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలోకి చేరుతోంది. ఆ నియోజకవర్గంలోని కోడూరు, పెనగలూరు, చిట్వేలు, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాలు తిరుపతి రెవెన్యూ డివిజన్‌లో విలీనం కానున్నాయి.

అన్నమయ్య జిల్లా నుంచి వైఎస్సార్ కడప జిల్లాలోకి

నందలూరు, రాజంపేట, వీరబల్లి, టి.సుండుపల్లి మండలాలతో కూడిన రాజంపేట రెవెన్యూ డివిజన్ కడప జిల్లాలోకి రానుంది.

అన్నమయ్య జిల్లాలోనే

రాయచోటి, సంబేపల్లి, చిన్నమండ్యం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలతో కూడిన రాయచోటి రెవెన్యూ డివిజన్ మదనపల్లె కేంద్రంగా ఏర్పాటయ్యే అన్నమయ్య జిల్లాలోనే ఉంటుంది.



నేరాలు తగ్గాయ్.. శిక్షలు పెరిగాయ్

(మొదటి పేజీ తరువాయి)

పోలీసు ప్రధాన కార్యాలయంలో 'వార్షిక నేర గణాంక నివేదిక-2025' విడుదల చేసి ఆ వివరాలు వెల్లడించారు.

శిక్షలు పెరిగాయ్

■ అన్ని రకాల నేరాలకు సంబంధించి 2024లో 1,10,193 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 1,03,397కు పరిమితమైంది. 6.17% మేర నేరాలు తగ్గాయి.

■ గతేడాది న్యాయస్థానాల్లో విచారణ జరిగిన ప్రతి వంద కేసుల్లో సగటున 43.5 కేసుల్లో శిక్షలు పడగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 50.01కి ఎగబాకింది. శిక్షల శాతం 6.51 శాతం మేర పెరిగింది.

■ ఆర్థిక నేరాల్లో మోసాలు, నేరపూరిత విశ్వాస ఘాతుక ఘటనలు పెరగ్గా... నకిలీ స్టాంపులు, నకిలీ కరెన్సీ కేసులు తగ్గాయి. పోక్సో కేసులు 11.4 శాతం మేర తగ్గాయి.

■ 41 శాతం రోడ్డు ప్రమాదాల్లో మరణాలు సంభవించాయి. ఈ ఏడాది 18,430 రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. వాటిలో 7,540 ప్రమాదాల్లో మరణాలు సంభవించాయి.

డ్రగ్స్ కేసుల్లో 9,478 మంది అరెస్టు

■ మాదకద్రవ్యాల కేసుల్లో 9,478 మంది అరెస్టు. 75 మందిపై పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం ప్రయోగం. 850 హాట్‌స్పాట్‌ల జియోట్యాగింగ్.

■ డ్రోన్ల వినియోగం ద్వారా 6,993, సీసీ కెమెరాల ద్వారా 2,514 కేసుల ఛేదన.

■ చోరీకి గురైన సెల్‌ఫోన్లలో రూ.56.42 కోట్ల విలువైన 35,116 ఫోన్ల రికవరీ.

వివిధ నేరాల పెరుగుదల/తగ్గుదల

1. **భౌతిక దాడుల నేరాలు:** పెరిగినవి- కల్పబుల్ హోమీసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్, హత్యాయత్నాలు.

■ **తగ్గినవి:** అల్లర్లు, హత్యలు, అపహరణలు, తీవ్రమైన, సాధారణ దాడులు.

2. **ప్రాపర్టీ నేరాలు:** పెరిగినవి: పగటిపూట ఇళ్లు కొల్లగొట్టడాలు.

■ **తగ్గినవి:** లాభం కోసం హత్యలు, రాత్రి పూట ఇళ్లు కొల్లగొట్టడాలు, డెకాయిటీ, రాబరీ, చోరీలు

3. **మహిళలపై నేరాలు:** పెరిగినవి: లేవు.

■ **తగ్గినవి:** హత్యాచారాలు/సామూహిక అత్యాచారాలు, మహిళల హత్యలు, మ్యారిటల్ క్రైమ్, అత్యాచారాలు, మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఘటనలు, సామాజిక మాధ్యమాల్లో మహిళలపై దాడులు.

తగ్గిన నేరాలు..

నేరం	2024లో	2025లో	తగ్గుదల శాతం
అల్లర్లు	534	246	53.88
హత్యలు	856	772	9.8
అపహరణలు	768	645	16
అత్యాచారాలు	1,478	1,467	0.7
మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించడం	5,388	4,974	7.7
భౌతికదాడులు	22,358	20,075	10.21
ప్రాపర్టీ క్రైమ్స్	17,630	17,406	1.27
మహిళలపై నేరాలు	16,994	16,347	3.81
ఎస్సీ, ఎస్టీలపై నేరాలు	2,402	1,818	24.32
మాదకద్రవ్యాల కేసులు	1,875	1,727	7.9
రోడ్డు ప్రమాదాలు	18,430	17,730	3.80
సైబర్ నేరాలు	2,877	2,332	18.94

డిజిటల్ అరెస్టు బాధితుల్లో వృద్ధులు, విద్యావంతులే అధికం

"సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరిట చేస్తున్న మోసాలకు వృద్ధులు, బాగా చదువుకున్న వారు ఎక్కువగా బాధితులవుతున్నారు. వారు పోగొట్టుకుంటున్న సొత్తంతా సైనాలోని అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠాలకు చేరుతోంది. నేరగాళ్లు ఆ డబ్బును క్రిప్టో కరెన్సీలోకి మార్చేస్తుండడంతో రికవరీ చేయడం కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ రంగంలో కొన్ని కఠిన చర్యల కోసం సిఫార్సులు చేశాం. జిల్లాకొకటి చొప్పున 26 సైబర్ పోలీస్‌స్టేషన్లు త్వరలో ఏర్పాటు చేస్తాం. వీటి ద్వారా ఈ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నాం. చట్టవిరుద్ధంగా పేకాట క్లబ్బులు నిర్వహించేవారిపై పీడీ చట్టం ప్రయోగిస్తాం" అని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. వివిధ కేసుల్లో అరెస్టు చేస్తున్న వారిని పోలీసులు నడిరోడ్డుపై నడిపించుకుంటూ ప్రదర్శనగా తీసుకెళ్లడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు వ్యతిరేకం కదా! అని ఓ విలేకరి అడగ్గా.. పెట్రోలింగ్ వాహనాల కొరత వల్ల వారిని నడిపించుకుని తీసుకెళుతున్నామని, ఇది ఫుట్ పెట్రోలింగ్ అని డీజీపీ నవ్వుతూ సమాధానమిచ్చారు.



అతన్ని బయటకు వదలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సవాలు చేస్తూ శిక్ష సస్పెన్షన్‌పై స్టే ఇవ్వాలని సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై దర్యాప్తు సంస్థ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

ఉన్నావ్ అత్యాచారం కేసులో నిందితుడైన సెంగర్‌కు 2019లో దిల్లీలోని ట్రయల్ కోర్టు జీవిత ఖైదు విధించింది. అప్పటి నుంచి అతడు జైలులో ఉన్నాడు. తనకు విధించిన శిక్షను సెంగర్ దిల్లీ హైకోర్టులో సవాలు చేశాడు. విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. ఈ నెల 23వ తేదీన శిక్షను సస్పెండు చేస్తూ తీర్పునిచ్చింది. ఇప్పటికే నిందితుడు 7 ఏళ్ల 5 నెలల జైలు శిక్షను అనుభవించాడని, అతడి అప్పీలు పెండింగ్‌లో ఉన్నందున శిక్షను సస్పెండు చేస్తున్నామని పేర్కొంది. అయితే బాధితురాలి తండ్రి కస్టడీలో మరణించిన కేసులో సెంగర్‌కు 10ఏళ్ల జైలు శిక్ష పడటంతో జైలు నుంచి విడుదల చేయలేదు. ఆ కేసులో హైకోర్టు బెయిలు ఇవ్వలేదు.

రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడారు

సెంగర్ శిక్షను సస్పెండు చేసిన దిల్లీ హైకోర్టు జడ్జీలపై ఆరోపణలు చేయడంద్వారా కొందరు రాజకీయ ప్రయోజనాలను పొందేందుకు ప్రయత్నించారని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. 'మేం అర్థం చేసుకున్నాం. మేమేమీ ఎత్తైన టవర్లపై కూర్చోలేదు. కొంత మంది దీనిని అడ్వాంటేజ్‌గా తీసుకోవడానికి ప్రయత్నించారని మాకు అర్థమైంది' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. సెంగర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ఎన్ హరిహరన్.. హైకోర్టు జడ్జీలపై కొందరు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. అటువంటి వారిని నిలువరించాలని కోరారు. కొంత మంది జడ్జీల ఫొటోలనూ బహిరంగపరిచారని సెంగర్ తరఫు మరో న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 'నిజాయతీగా చెప్పాలంటే ఆ జడ్జీలు అత్యంత ప్రతిభావంతులు' అని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఉరి తీసేవరకూ వదలం: బాధితురాలు

ఉన్నావ్: సుప్రీం కోర్టు ఆదేశాలపై ఉన్నావ్ అత్యాచార బాధితురాలు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే నిందితుడికి ఉరి శిక్ష పడే వరకూ వదలబోమని స్పష్టం చేశారు. 'సుప్రీం కోర్టు నిర్ణయంపట్ల సంతోషంగా ఉన్నా. మొదటి నుంచీ న్యాయం కోసం పోరాడుతున్నా. ఏ కోర్టుపైనా నేను ఆరోపణలు చేయడం లేదు. అన్ని కోర్టులపైనా నాకు నమ్మకం ఉంది. కానీ సుప్రీం కోర్టు నాకు న్యాయం చేసింది. నిందితుడిని ఉరి తీసేవరకూ పోరాడుతూనే ఉంటా. అప్పుడే నాకు, నా కుటుంబానికి న్యాయం జరుగుతుంది' అని బాధితురాలు పేర్కొన్నారు.

■ 'సెంగర్ ఓ రాక్షసుడు. తొలుత అతడు నా సోదరిపై అత్యాచారం చేశాడు. ఆ తర్వాత మా కుటుంబాన్ని నాశనం చేశాడు' అని బాధితురాలి సోదరి వ్యాఖ్యానించారు.

■ సుప్రీం కోర్టు ఆదేశాలను మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా స్వాగతించారు. ఇది బాధితురాలి విజయమని, న్యాయ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

టాటా-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

(మొదటి పేజీ తరువాయి)

స్టేషన్‌కు చేరుకుంది. అక్కడి నుంచి బయల్దేరి ఎలమంచిలి చేరుకుంటుండగా, ప్యాంట్రీకార్‌ను ఆనుకుని ఉన్న బీ1 బోగీలో మంటలను గమనించిన లోకోపైలట్లు, గార్డులు స్టేషన్‌లో రైలును నిలిపివేశారు. బీ1తో పాటు పక్కనున్న ఎం2 బోగీల్లోకి పొగ దట్టంగా వ్యాపించడంతో నిద్రలో ఉన్న ప్రయాణికులకు తొలుత ఏం జరిగిందో అర్థం కాలేదు. తర్వాత భయాందోళనతో బోగీల్లో నుంచి దిగి, స్టేషన్‌లోకి పరుగులు తీశారు. ప్రమాద సమాచారం అందుకున్న ఎలమంచిలి అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే రెండు బోగీలను అగ్నికీలలు కమ్మేశాయి. మరో బోగీ(ఎం1) పాక్షికంగా దెబ్బతింది. పరిసరాల్లో పొగ దట్టంగా వ్యాపించింది. నక్కపల్లి, అనకాపల్లికి చెందిన అగ్నిమాపక సిబ్బంది కూడా వచ్చి, మూడు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. కాలిపోయిన రెండు బోగీలను రైలు నుంచి వేరుచేశారు. రైల్వే భద్రతా కమిటీ కూడా చేరుకుని మిగతా బోగీల పరిస్థితిని పరీక్షించింది. పాక్షికంగా దెబ్బతిన్న ఎం1 బోగీని కూడా రైలు నుంచి విడగొట్టారు. మిగిలిన బోగీలతో వాటిలోని ప్రయాణికులను ఎక్కించుకొని రైలును సామర్లకోటకు తరలించారు. ఈ ఘటనతో అనకాపల్లి, తుని, విశాఖపట్నం రైల్వేస్టేషన్లలో పలు రైళ్లు నిలిచిపోయాయి. అన్ని బోగీల్లోంచి దిగిన సుమారు 2 వేల మంది ప్రయాణికులు ఎలమంచిలి స్టేషన్ పరిసరాల్లో వణికించే చలిలో రెండు గంటలపాటు పడిగాపులు పడ్డారు. కాలిపోయిన బీ1లో 76 మంది, ఎం2లో 82 మంది ప్రయాణికులు ఉండగా, వారిని తెల్లవారుజామున ఎలమంచిలి రైల్వేస్టేషన్ నుంచి 3 ఆర్టీసీ బస్సుల్లో సామర్లకోట స్టేషన్‌కు తరలించారు. అక్కడ కొత్తగా మూడు బోగీలను సిద్ధంచేసి, వాటిని రైలుకు జతచేసి గమ్యస్థానానికి పంపించారు. రైలులో ఎక్కువ మంది అయ్యప్పస్వామి మాలధారులే ఉన్నారు.



చంద్రశేఖర్ సుందర్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న సిబ్బంది



చంద్రశేఖర్ వద్దనున్న సంచిలో కాలిన నోట్ల కట్టలు, వస్తువులు

మృతుడి బ్యాగులో భారీగా నగదు

బీ1 బోగీలో ప్రయాణిస్తున్న విజయవాడ నున్న ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ సుందర్ (70) సకాలంలో బయటకు రాలేక, అగ్నికీలల్లో చిక్కుకుని ఆహుతయ్యారు. ఆయన వస్త్ర వ్యాపారి. చెన్నైకి చెందిన వీరి కుటుంబం విజయవాడకు వచ్చి స్థిరపడింది. ఇటీవల విశాఖలోని తన కుమార్తె వద్దకు వెళ్లిన సుందర్.. అక్కడి నుంచి దుస్తుల కొనుగోలుకు విజయనగరం వెళ్లి, అక్కడే రైలులో విజయవాడ బయల్దేరారు. తాను ప్రయాణిస్తున్న బోగీలో మంటలు రావడంతో నిద్రలేచిన సుందర్.. కుమార్తెకు ఫోన్ చేసి రైలు కాలిపోతోందని కూడా చెప్పారు. అయితే దట్టమైన పొగలో చిక్కుకొని, బయటకు రాలేక అక్కడే కుప్పకూలినట్లు అధికారులు గుర్తించారు. అతని వెంట ఉన్న బ్యాగును కుటుంబసభ్యుల సమక్షంలో తెరవగా, అందులో రూ.5.8 లక్షల నగదు, బంగారం ఉన్నట్లు నిర్ధారించారు. చాలావరకు నోట్లు కాలిపోయాయి. రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లో రైలు ప్రమాదాన్ని పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, విజయవాడ డీఆర్ఎం మోహిత్

బోగి బ్రేకులు పట్టేయడం వల్లే?


రైల్వే భద్రతా కమిటీ, రెండు ఫోరెన్సిక్ బృందాలు ప్రమాద స్థలంలో ఆధారాలు సేకరించాయి. విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ 'రైలు బీ1 కోచ్‌లో మంటలు పుట్టి, అక్కడి దుప్పట్ల కారణంగా పక్క బోగీకి వేగంగా వ్యాపించాయని భావిస్తున్నాం. బోగీ బ్రేకులు పట్టేయడంతో మంటలు చెలరేగాయని లోకో పైలట్లు చెబుతున్నారు. దానిపై అధికారిక ధ్రువీకరణ జరగాల్సి ఉంది. ప్రమాదంపై సమగ్ర విచారణ జరుగుతోంది. చనిపోయిన ప్రయాణికుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇస్తామ'ని తెలిపారు.

పోలీసులు, ఫైర్ సిబ్బంది స్పందన భేష్

సీఎం సహా పలువురు నేతల ప్రశంసలు

ఈనాడు, అమరావతి: రైలు ప్రమాదంపై సత్వరమే స్పందించి ప్రయాణికులను సురక్షితంగా తరలించడంలో ఎలమంచిలి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కీలకంగా వ్యవహరించారని పలువురు నేతలు ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్'లో వారికి అభినందనలు తెలిపారు. 'రైలు కోచ్‌లను వేరుచేసి ఆర్పీఎఫ్, సిబ్బంది నష్టతీవ్రతను తగ్గించారు. వారికి ప్రత్యేక అభినందనలు. ఒక ప్రయాణికుడు మరణించడం బాధాకరం. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి' అని చంద్రబాబు పేర్కొన్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, లోకో పైలట్, టీటీఈల సత్వర స్పందన ప్రమాదంలో ప్రాణనష్టాన్ని తగ్గించిందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయంతో వ్యవహరించడంతో రైలు ప్రమాద తీవ్రత తగ్గిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ విచారం వ్యక్తంచేశారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యమందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అందరూ అరవడంతో లేచాను



– హరికృష్ణ, విశాఖపట్నం

దువ్వాడ నుంచి రైలు రాత్రి 11.30కి బయల్దేరింది. నేను ఎం2లో ఎక్కి, ఎర్నాకుళం వెళ్తున్నా. ఎక్కువ మంది అయ్యప్ప మాలధారులే ఉన్నారు. అందరం నిద్రలో ఉన్నప్పుడు బోగీలో భారీగా పొగ కమ్మేసింది. ఒక్కసారిగా అందరు మంటలూ.. మంటలూ అని అరవడంతో నేను కూడా దిగి, బయటకు పరుగెత్తాను.

సామగ్రి అంతా కాలిపోయింది

– మాలతీ బస్కే, టాటానగర్



నా భర్తతో కలిసి కేరళ వెళ్తున్నాం. రోజంతా ప్రయాణం బాగానే జరిగింది. రాత్రి భోజనం చేశాక, మా బెర్తుల్లో పడుకొని నిద్రలోకి జారుకున్నాం. అర్ధరాత్రి వేళ పొగతో ఊపిరి ఆడలేదు. లేచి చూసేసరికి ఎవరు ఎక్కడున్నారో తెలియదు. చిమ్మ చీకట్లో రైల్లోంచి దూకి, బయటపడ్డాం. మా సామగ్రంతా కాలిపోయింది.

5వ శతాబ్దం నాటి నౌక పునఃసృష్టి!

● లోహాలు, ఇంజిన్‌లేకుండా రూపొందిన ఐఎన్ఎస్‌వీ కౌండిన్య

● ఒమన్‌కు పయనం



పోర్‌బందర్: భారత పురాతన నౌకా నిర్మాణ కౌశలం ఆధునిక ప్రపంచం ఎదుట ఆవిష్కృతమైంది. అజంతా గుహల్లోని 5వ శతాబ్దం నాటి పెయింటింగ్‌లోని ఒక నౌక నుంచి ప్రేరణ పొందిన ఆధునిక భారత నిపుణులు దాన్ని పునఃసృష్టించారు. ఐఎన్ఎస్‌వీ కౌండిన్య పేరిట భారత నౌకాదళంలో చేరిన ఈ తెరచాప పడవ.. సోమవారం గుజరాత్‌లోని పోరుబందర్ నుంచి ఒమన్‌లోని మస్కట్‌కు పయనమైంది. ఐఎన్ఎస్‌వీ కౌండిన్య తయారీలో ఆధునిక పద్ధతుల జోలికి పోకుండా పురాతన విధానాలనే అవలంబించారు. లోహాలు, మేకులను ఉపయోగించలేదు. చెక్కలను వాడారు. వీటిని కొబ్బరి పీచుతో తయారుచేసిన తాళ్లతో గుదిగుచ్చారు. అందువల్ల ఈ నౌకను 'స్టిచ్డ్ షిప్'గా పిలుస్తున్నారు. సముద్ర ఉప్పునీటి నుంచి రక్షణ కోసం దీనికి సహజసిద్ధ జిగురుపూతను వేశారు. ఈ నౌకలో ఇంజిన్ ఉండదు. తెరచాపల సాయంతో ప్రయాణిస్తుంది.

ఐఎన్ఎస్‌వీ కౌండిన్యలో 18 మంది నావికులు ఉన్నారు. నౌకాదళ పశ్చిమ విభాగం అధిపతి వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ ఈ నౌకకు జెండా ఊపి, యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారత్‌లో ఒమన్ రాయబారి ఇస్సా సలేహ్ అల్ షిబాని కూడా పాల్గొన్నారు. ఈ నౌక 15 రోజుల్లో 1400 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఒమన్ చేరుకుంటుంది. భారత పురాతన సముద్రమార్గాల్లో ఇది కూడా ఉంది. నాడు భారత పశ్చిమ తీరం నుంచి ఒమన్‌కు నౌకా ప్రయాణాలు సాగేవి. తద్వారా వర్తకంతోపాటు సాంస్కృతిక, నాగరికపరమైన సంబంధాలు సాగాయి. ఒమన్, ఆగ్నేయాసియా ప్రధాన వాణిజ్య మార్గంలో భారత్ కీలకంగా ఉండేది. ఈ మార్గంలో సుగంధ ద్రవ్యాలు, వస్త్రాల వ్యాపారం జరిగేది. తాజా యాత్ర ద్వారా ఒమన్‌తో సంబంధాలు మరింత బలపడతాయని అధికారులు చెబుతున్నారు. సముద్రయాన దౌత్యం, వారసత్వ పరిరక్షణ, ప్రాంతీయ సహకారానికీ ఇది దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఐఎన్ఎస్‌వీ కౌండిన్య సిబ్బందికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. దీన్ని నిర్మించిన భారత నిపుణులను ఆయన అభినందించారు.

ఐఎన్ఎస్‌వీ కౌండిన్య నిర్మాణం 2023లో ప్రారంభమైంది. కేంద్ర సాంస్కృతిక శాఖ, భారత నౌకాదళం, హోదీ ఇన్నోవేషన్స్ ఈ కసరత్తులో పాలుపంచుకున్నాయి. కేరళకు చెందిన బాబు శంకరన్ బృందం దీనిని నిర్మించింది. ఎలాంటి నమూనాలు లేకపోయినా.. అజంతా గుహలోని పెయింటింగ్, కొన్ని రచనల్లోని వర్ణనలను ఆధారంగా చేసుకొని దీన్ని రూపొందించారు. నౌక పొడవు 19.6 మీటర్లు కాగా వెడల్పు 6.5 మీటర్లు. భారత తొలి నావికుడిగా పేరొందిన కౌండిన్య పేరును దీనికి ఖరారు చేశారు. దీని తెరచాపలపై కదంబ పాలకుల రాజచిహ్నమైన గండభేరుండ చిత్రం, సూర్యుడి ఆకృతి ఉన్నాయి. నౌకపై 'సింహ యాలి'ని చెక్కారు. హరప్పా తరహా రాతి లంగర్లు డెక్ భాగంలో కనిపిస్తాయి. దీనికి చతురస్రాకార తెరచాపలను ఏర్పాటు చేశారు.

ముగ్గురు ప్రభుత్వ సలహాదారుల నియామకం

(మొదటి పేజీ తరువాయి)

■ కార్టూనిస్ట్ శ్రీధర్ 1958 ఆగస్టు 1న జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ పొలిటికల్ సైన్స్ చదివారు. 'ఈనాడు' గ్రూప్‌నకు చెందిన సితారలో 1979లో లేఅవుట్ ఆర్టిస్ట్‌గా ఉద్యోగంలో చేరారు. 1981 నుంచి 2021 వరకు కార్టూనిస్టుగా పనిచేసి, ఖ్యాతి గడించారు.

■ డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు స్వస్థలం గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెం మండలం అలకాపురం. 1967 ఏప్రిల్ 23న జన్మించారు. తల్లిదండ్రులు ప్రకృతి చికిత్స పద్ధతులు అవలంబించడంతో ఆయన చిన్నతనం నుంచే ఆహార క్రమశిక్షణ పాటించడం, ప్రకృతితో జీవించడానికి ప్రాధాన్యం ఇచ్చేవారు. బీ ఫార్మసీ చదువుకున్నారు. తర్వాత తండ్రి మార్గంలో యోగ, ప్రకృతి చికిత్సను జీవన విధానంగా తీసుకున్నారు. 1996 నుంచి 2011 వరకు ఏపీ అంతటా పర్యటించి యోగా తరగతులు నిర్వహించారు. 2012లో గుంటూరు జిల్లా వెంకటపాలెం సమీపంలో మంతెన నేచర్ కేర్ ఆరోగ్యాలయం స్థాపించారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా ఎందరికో యోగా, ప్రకృతి వైద్యంపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయుష్ మంత్రిత్వశాఖ నుంచి జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు.

■ ఒంగోలుకు చెందిన చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ 2018-2019లో దేవాదాయశాఖకు అనుబంధంగా ఉండే హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. తితిదేకు చెందిన హిందూ ధర్మ ప్రచార పరిషత్‌కు ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పనిచేశారు. అదే సమయంలో రాష్ట్ర దేవాదాయ పరిపాలన విభాగం డైరెక్టర్‌గానూ కొనసాగారు.


ఈనాడు

విపత్తు నామ సంవత్సరం!

ముప్పు ముంచుకొస్తోందని తెలిసీ చేతులు ముడుచుకుని కూర్చోవడం మూర్ఖత్వం అనిపించుకుంటుంది. తరుముకొస్తున్న ప్రమాద తీవ్రతను మరింత పెంచేలా వ్యవహరించడమైతే ఏకంగా ఆత్మహత్యా సదృశమవుతుంది. శిలాజ ఇంధనాలను ఇష్టమొచ్చినట్లు వాడేస్తుండటంతో కర్బన ఉద్గారాలు కట్టుతప్పుతున్నాయి. వాటి మూలంగా అంతకంతకూ పెరిగిపోతున్న భూతాపంతో వేగవంతమవుతున్న వాతావరణ మార్పులే పెనువిపత్తులై విరుచుకుపడుతున్నాయి. ఎంతోమంది ప్రాణాలు తీస్తూ, అంతులేని ఆస్తినష్టానికి కారణమవుతున్న అవి జనజీవితాలను దుర్భరం చేస్తున్నాయి. ఈ విధ్వంసాన్ని ప్రపంచమంతా గుడ్లప్పగించి చూస్తోందే తప్ప శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించట్లేదు! 2017-2024 మధ్య ప్రపంచవ్యాప్తంగా కాలుష్యకారక ఇంధనాల వాడకం ఏడుశాతం పెరిగిందని అంచనా. 2015తో పోలిస్తే 2025లో కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలూ పదిశాతం అధికమయ్యాయి. సమష్టి కృషితో పర్యావరణాన్ని కాపాడుకోవాలన్న పారిస్ ఒప్పంద స్ఫూర్తిని కాలరాస్తున్న ప్రపంచ దేశాల నిర్వాకాల కారణంగా ఈ ఏడాదిలో ప్రకృతి విపత్తులు లోగడ ఎన్నడూ లేనంత తీవ్రస్థాయిలో మానవాళిపై దండెత్తాయి!

వడగాడ్పులు, వరదలు, కరవులు, కార్చిచ్చులు, తుపానులు, చలిగాలుల వంటివి ఈ సంవత్సరంలో ప్రపంచం నలుమూలలా విధ్వంసం మిగిల్చాయి. వాటిలో అతిభయానకమైన మొదటి పది ఉత్పాతాల కారణంగానే 12,200 కోట్ల డాలర్ల నష్టం వాటిల్లినట్లు తాజా అధ్యయనాంశాలు వెల్లడిస్తున్నాయి. అమెరికాలో కార్చిచ్చులు, దక్షిణ-ఆగ్నేయాసియాల్లో సైక్లోన్లు, చైనాలో వరదలు, ఇండియా-పాకిస్థాన్‌లలో అధిక వర్షాలు, బ్రెజిల్‌లో కరవులతో జనజీవనం నానా అవస్థల పాలైంది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్ఈ) విశ్లేషణ ప్రకారమైతే, 2025 జనవరి-నవంబరు మధ్యలోని 334 రోజుల్లో 331 దినాల పాటు భారతావని ఏదో ఒక వాతావరణ వైపరీత్యాన్ని చవిచూసింది. నిరుడు ఇదే 11నెలల కాలంలో ఇలాంటి దుర్దినాలు 295 నమోదైతే- ఈ ఏడాది వాటి సంఖ్య ఎక్కువ కావడమే కలవరపరుస్తోంది. ప్రకృతి విపత్తులతో కనీసం 4.3కోట్ల ఎకరాల్లో పంటలు ప్రభావితమైనట్లు 'సీఎస్ఈ' లెక్కగట్టింది. మౌలిక వసతులు, పాడిపశువులనూ పరిగణనలోకి తీసుకుంటే జరిగిన నష్టం ఇంకెన్నో రెట్లు అధికంగా ఉంటుంది. కర్బన ఉద్గారాలతో భూమి వేడెక్కడం వల్ల 1991-2020 మధ్యలో ప్రపంచవ్యాప్తంగా 28 లక్షల కోట్ల డాలర్ల సంపద ఆవిరైనట్లు పరిశోధకులు పేర్కొంటున్నారు. ఇలా దేశదేశాల సౌభాగ్యాన్ని హరిస్తున్న ఉత్పాతాల పాపంలో ప్రధాన వాటా శిలాజ ఇంధనాలదే! వాటి వినియోగాన్ని కట్టడిచేసేందుకు ఉద్దేశించిన ప్రయత్నాలను ఎప్పటికప్పుడు తమ పరపతితో నీరుగార్చుతున్న చమురు ఉత్పత్తి దేశాలూ బడా కంపెనీలదే!

సకల శిలాజ ఇంధనాల వాడకాన్ని దశల వారీగా తగ్గించేయాలని ప్రపంచ దేశాలకు పిలుపిచ్చిన ఇండియా- 2070 నాటికి 'నెట్‌జీరో'(కర్బన ఉద్గార తటస్థత)ను సాధించే లక్ష్యాన్ని ప్రకటించింది. 2030 నాటికి దేశీయంగా అవసరమైన విద్యుత్తులో సగం వరకు పునరుత్పాదక ఇంధన వనరులతోనే సమకూర్చుకుంటామని పేర్కొంది. విస్పష్ట ప్రణాళికలూ పెట్టుబడుల దన్నుతో నిర్దేశిత గడువుకు అయిదేళ్ల మునుపే ఆ గమ్యాన్ని చేరుకుని కొద్దినెలల క్రితమే కొత్త చరిత్ర సృష్టించింది. జీవావరణాన్ని నాశనం చేసే కర్బన ఉద్గారాలను అదుపు చేయాలంటే బొగ్గు తదితరాల వినియోగాన్ని కుదించక తప్పదు. హరిత ఇంధనాలకు ప్రాధాన్యమివ్వడంలో ప్రపంచమంతా ఒకేమాట మీద నిలబడితేనే విశ్వమానవాళి భవితకు భద్రత లభిస్తుంది!




పేదరిక నిర్మూలన ద్వారానే ప్రజారోగ్యాన్ని కాపాడుకోగలం. దానికోసం జీడీపీలో కనీసం మూడుశాతం నిధులను వైద్యారోగ్య రంగంపై ఖర్చు చేయాలి. అందులోనూ ఎక్కువ భాగం ప్రాథమిక ఆరోగ్య సేవల కోసం వెచ్చించాలి.

– డాక్టర్ హనుమప్ప సుదర్శన్

బ్రహ్మజ్ఞాని... భక్తకవి

అచంచల భక్తికి, అపార జ్ఞానానికి నిలువెత్తు నిదర్శనం రమణ మహర్షి. ఆయన ఎంతటి పూర్ణజ్ఞానులో, అంతటి భక్తిపూర్ణులు. పరమభక్తులకు భాగవతోత్తముడిగా, పారమార్థిక పిపాసితులకు జ్ఞానమూర్తిగా దర్శనమిచ్చే మహానుభావుడు. ఆ మౌనర్షి ఓ మహాకావ్యం. ఆస్వాదించ గలిగినంత ఆస్వాదించడమే. అది మన అర్హత, యోగ్యతలను బట్టి ఉంటుంది. రమణులను ఆశ్రయించినవారు ఎవరూ నిరాశగా తిరిగి వెళ్లరు. ఆధ్యాత్మికోన్నతికి మహర్షి రెండు మార్గాలను నిర్దేశించారు. ఒకటి ఆత్మవిచారణ. ఇది జ్ఞానమార్గం. 'నేనెవరు?' అని విచారణ చేసుకోవడం ద్వారా మనసు అణుగుతుంది. ఆ ప్రశ్న ఆలోచనలన్నిటినీ ధ్వంసం చేస్తుంది. చితిలో కట్టెలు ఎగదోయటానికి వాడే కట్టెలాగా, ఆ ప్రశ్న కూడా చివరికి ఆ చితిలోనే దగ్ధమైపోతుంది. అప్పుడు ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది అనేవారు మహర్షి.



అంతర్యామి

'నువ్వు, ప్రపంచం, భగవంతుడు- ఒక్కటే. ఈ అనుభవాన్ని పొందడమే అద్వైతసిద్ధి' అని ప్రబోధించేవారు. కానీ మనుషులు తమను తాము ఆత్మ విచారణ చేసుకోకుండా తప్పించుకుని తిరుగుతున్నారని, తమ మూలాలు కనుగొన్నవారి చేతులు మహాశక్తితో సంపన్నమై ఉంటాయని ఉద్ఘాటించారు. జ్ఞానుల హృదయం వెన్నవంటిదని, పూర్ణప్రేమయే పరమ జ్ఞానమని రమణులు నిరూపించారు.

ఇక రెండోది శరణాగతి. ఇది భక్తిమార్గం. 'విశ్వమయమైన శక్తికి నిన్ను నువ్వు హృదయపూర్వకంగా, పరిపూర్ణంగా సమర్పించుకో! ఆ శక్తిలో నువ్వూ ఏకమవుతావు' అనేవారు మహర్షి. వారి ఆధ్యాత్మిక ప్రయాణం ఆరంభమైంది మదురైలోని మీనాక్షి అమ్మవారి సన్నిధి నుంచే! పరమశివుడిపై ప్రార్థనా గీతాలు రాసి తన శివభక్తిని లోకానికి చాటారు. గణపతిపై పద్యాలు రచించి విఘ్నేశ్వరుడి అనుగ్రహానికి పాత్రులయ్యారు. ఇలా జ్ఞాన, భక్తియోగాలను ప్రబోధించడమే కాదు, ఆ రెండు మార్గాలను ఆచరణలో చూపి దీపగోపురంగా నిలిచినవారు రమణులు. అందుకే జ్ఞాన, భక్తి సాధకులందరూ ఆ మహనీయుడికి ఆకర్షితులయ్యారు.

మహర్షి తమిళం, తెలుగు, మలయాళం, సంస్కృత భాషల్లో కవిత్వం చెప్పిన భక్తకవి. ప్రాచ్య, పాశ్చాత్య భావుకుల మధ్య రససేతువు నిర్మించిన భాషాజ్ఞాని. మహర్షి కవిత్వంలో మకుటాయమానమైంది- ఆయన తమిళంలో రచించిన 'అక్షర మనమాలై'. అరుణాచలేశ్వరుణ్నే వరుడిగా భావించి తాను వధువై అల్లిన 'అక్షర వరమాల' అది. అరుణగిరి ప్రదక్షిణ సమయంలో భక్తులు పరవశంతో పాడుకోవడానికి రమణులు ఆశువుగా అనుగ్రహించిన కవితల మాలికే ఆ 'అక్షర మనమాలై'.

రమణమహర్షిని దర్శించేందుకు వచ్చే విదేశీయులకు స్థానిక భక్తులు, ఆశ్రమ సిబ్బంది ఆచారాల నెపంతో నిబంధనలు పెట్టేవారు. కానీ రమణులు పాశ్చాత్యుల పరిస్థితిని పెద్ద మనసుతో అర్థం చేసుకుని సడలింపులు చేసేవారు. ఆచారాలూ సంప్రదాయాల కన్నా విశుద్ధ భక్తి, విశ్వాసాలు ముఖ్యమనేవారు. ఎవరిపై ఎలాంటి వివక్షా లేకుండా అందరినీ ఆదరించేవారు. అందుకే 'ఆ నవ్వులో ఎంత దాక్షిణ్యమో, ఆ చూపులో ఎంత కారుణ్యమో' అని భక్తులు ముగ్ధులైపోయేవారు. 'రమణులు ప్రశాంతతకు ప్రతిరూపం. ఆయన యోగులకే యోగిలాంటివారు' అన్నారు మహర్షి అరవిందులు.


(నేడు రమణుల జయంతి)

– బి.సైదులు

కొత్త ఒప్పందాలు సరికొత్త అవకాశాలు

ట్రంప్ సుంకాల బాదుడుకు అంతర్జాతీయ వాణిజ్యం కుదేలైంది. దీంతో ఆయా దేశాలతో విడివిడిగా ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) జోరందుకున్నాయి. ఈ విషయంలో ఇండియా దూకుడుగా ముందుకెళ్తోంది. ఇప్పటికే బ్రిటన్‌తో ఎఫ్‌టీఏ కుదుర్చుకుంది. అమెరికా, ఐరోపా సమాఖ్యలతో చర్చలు సాగిస్తోంది. తాజాగా న్యూజిలాండ్‌తోనూ ఒప్పందంపై సంతకం చేసింది.

ఎఫ్‌టీఏ చలవతో భారతీయ ఐటీ, బీపీవో, ఫిన్‌టెక్, హెల్త్‌టెక్ సేవల సంస్థలకు న్యూజిలాండ్‌లో మార్కెట్ విస్తరిస్తుంది. టూరిజం వృద్ధి అవుతుంది. భారతీయ ఇంజినీర్లు, కన్సల్టెంట్లు, అధ్యాపకులు, విద్యార్థులు, శిక్షకులకు ఆ దేశంలో సులువుగా ప్రవేశం లభిస్తుంది. ఇరుదేశాల మధ్య వాణిజ్యం రెట్టింపై 500 కోట్ల డాలర్లకు చేరుతుంది. భారతీయ వస్తువులు సుంకాలు లేకుండా ఆ దేశంలోకి ప్రవేశించగలుగుతాయి. భారత్ నుంచి 1,379 రకాల వ్యవసాయ సరకులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, 363 సముద్ర ఉత్పత్తులు, వెయ్యి వస్త్రాలు, దుస్తుల రకాలు సున్నా సుంకంతో న్యూజిలాండ్ మార్కెట్‌కు ఎగుమతి అవుతాయి.



మరోవైపు, భారత్‌లోకి న్యూజిలాండ్ వస్తువుల ఎగుమతులపై భారీగా సుంకాలు సడలిస్తారు. వచ్చే 15 ఏళ్లలో ఇండియాలోకి 2వేల కోట్ల డాలర్ల న్యూజిలాండ్ పెట్టుబడులు వస్తాయి. దీనివల్ల భారతీయ వ్యవసాయ, పారిశ్రామిక, సర్వీసుల రంగాలు లబ్ధి పొందుతాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఎగుమతి కేంద్రిత సంస్థలూ లాభపడతాయి.

ఎగుమతులకు గిరాకీ

ఎఫ్‌టీఏ కారణంగా న్యూజిలాండ్‌కు వస్తువులను ఎగుమతి చేస్తున్న ఇతర దేశాలు 10 శాతం సుంకం చెల్లిస్తే, ఇండియా ఎగుమతి చేసే వివిధ తరగతుల వస్తువులపై సుంకమే ఉండదు. దీనివల్ల మన ఎగుమతులకు మార్కెట్‌లో ఆధిక్యం లభిస్తుంది. భారత్ ఎగుమతి చేసే తోలు వస్తువులు, పాదరక్షలు, సంబంధిత ఉపకరణాలపైనా సుంకాలు తొలగిపోవడంతో న్యూజిలాండ్ మార్కెట్‌లో ఇతర దేశాల వస్తువులకన్నా చవక అవుతాయి. తద్వారా మార్కెట్ పెరుగుతుంది. ఆటో విడిభాగాలు, యంత్రభాగాలు, మెషిన్ టూల్స్, ఎలక్ట్రానిక్స్, ఇతర ఇంజినీరింగ్ ఎగుమతులపైనా సుంకాలు తొలగడం వల్ల భారతీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) ఎగుమతులు పెంచుకుని లబ్ధి పొందవచ్చు. సాధారణంగా ఆభరణాలు, గిల్టు నగలు, ఫ్యాషన్ ఉపకరణాల ధర బాగా ఎక్కువగా ఉంటుంది. వీటిపై సుంకాలు తగ్గించడం వల్ల భారతీయ ఎగుమతులకు న్యూజిలాండ్ మార్కెట్‌లో గిరాకీ పెరుగుతుంది. సున్నా సుంకాలతో బియ్యం, మసాలా ద్రవ్యాలు, టీ, కాఫీ, నూనెగింజలు, ప్రాసెస్ చేసిన పండ్లు, కూరగాయలు, సిద్ధాహారాలు, మిఠాయిల ఎగుమతులు పెరుగుతాయి. శీతలీకరించిన రొయ్యలు, చేపల ఎగుమతులకు న్యూజిలాండ్ ఆకర్షణీయ గమ్యమవుతుంది.

మరోవైపు, సువిశాల భారతీయ మార్కెట్‌లోకి న్యూజిలాండ్ నుంచి వచ్చే ఉన్ని, బొగ్గు, కలప, అవకాడో, బ్లూబెర్రీస్, పెర్సిమోన్ పండ్లపై సుంకాలను భారీగా తగ్గిస్తారు. కివి, ఆపిల్ పండ్లపై కోటాలవారీగా సుంకాల తగ్గింపు ఉంటుంది. ఆపిల్ పండ్ల విషయంలో భారత్ నుంచి రాయితీ పొందుతున్న ఏకైక దేశం న్యూజిలాండే. ఫైనాన్స్, విద్య, పర్యాటకం, భవన, మౌలిక వసతుల నిర్మాణం, వృత్తి సేవలతో పాటు 100 సర్వీసు రంగాల్లో న్యూజిలాండ్ కంపెనీలకు ప్రవేశ సౌలభ్యం లభిస్తుంది. న్యూజిలాండ్‌కు జమ్మూకశ్మీర్ నుంచి పష్మినా ఉన్ని, హస్తకళా వస్తువులు, కుంకుమ పువ్వు ఎగుమతులు పెరుగుతాయి. పంజాబ్ నుంచి క్రీడావస్తువులు, వస్త్రాలు, బాస్మతి బియ్యం, గుజరాత్ నుంచి వజ్రాలు, పింగాణి, ప్రాసెస్ చేసిన ఆహారానికి అవకాశాలు అధికమవుతాయి. పశ్చిమ బెంగాల్ నుంచి డార్జిలింగ్ టీ, వస్త్రాలు, జనపనార వస్తువులు, కేరళ నుంచి మసాలా ద్రవ్యాలు, ఎలక్ట్రానిక్స్, కొబ్బరి పీచు ఉత్పత్తులు, ఒడిశా నుంచి వస్త్రాలు, హస్తకళా వస్తువులు, తమిళనాడు నుంచి వస్త్రాలూ ఆటో విడిభాగాల ఎగుమతులు ఊపందుకుంటాయి.

గరిష్ఠ ప్రయోజనాలు...

మోదీ సర్కారు హయాములో భారత్ 2021 నుంచి మారిషస్, యూఏఈ, ఆస్ట్రేలియా, ఎఫ్టా దేశాలైన స్విట్జర్లాండ్, ఐస్‌లాండ్, నార్వే, లీచ్టెన్‌స్టీన్, బ్రిటన్, ఒమన్‌లతో ఎఫ్‌టీఏలు కుదుర్చుకుంది. తాజాగా న్యూజిలాండ్‌తో ఏడో ఎఫ్‌టీఏ కుదిరింది. ఆయా దేశాల నుంచి పాలు, పాల ఉత్పత్తులు, కొన్నిరకాల వ్యవసాయ సరకులను దిగుమతి చేసుకుంటే భారతీయ రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయి. అందుకని, ఎఫ్‌టీఏల నుంచి వాటిని మినహాయించింది. పశ్చిమాసియా, ఐరోపా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మార్కెట్లలో భారతీయ ఎగుమతులకు ప్రాధాన్య ప్రాతిపదికన ప్రవేశ సౌలభ్యం పొందింది. అమెరికా, కెనడా, ఐరోపా సమాఖ్యలతో వాణిజ్య చర్చలు కొనసాగిస్తోంది. అయితే, ఎఫ్‌టీఏ భాగస్వాముల నుంచి కొన్ని రకాల ఉత్పత్తులు భారతీయ మార్కెట్‌ను ముంచెత్తే ప్రమాదం ఉంది. మరోవైపు, ఎఫ్‌టీఏల ద్వారా లభించే ప్రయోజనాలను భారతీయ ఎంఎస్ఎంఈలు మెరుగ్గా వాడుకోవాల్సి ఉంది. ఎఫ్‌టీఏల ప్రయోజనాలను సమర్థంగా వాడుకోవాలని రాష్ట్రాలకు, కంపెనీలకు కేంద్ర వాణిజ్య శాఖ సూచించాలి. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు కంపెనీల కోసం ఎఫ్‌టీఏ హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేసి ఎగుమతిదారులను ప్రోత్సహించాలి. ఎఫ్‌టీఏ భాగస్వామ్య దేశాలకు వ్యవసాయ, సముద్ర ఉత్పత్తులను, ఫార్మా, ఐటీ ఉత్పత్తులను విరివిగా ఎగుమతి చేయడానికి సన్నద్ధం కావాలి. పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక మండళ్లను మమేకం చేయాలి. రేవులు, రోడ్డు రవాణా సంస్థలు, నౌకా రవాణా సంస్థలు, శీతల గిడ్డంగులను ఎగుమతి గొలుసు వ్యవస్థల్లో భాగస్వాములుగా మార్చాలి. ఇలాంటి చర్యల ద్వారా ఎఫ్‌టీఏలతో గరిష్ఠ ప్రయోజనాలు పొందాలి.

తెలుగు రాష్ట్రాలకు మేలు

తెలంగాణ నుంచి, ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల నుంచి ఔషధాలు, వైద్యసాధనాలు, ఇంజినీరింగ్ వస్తువులు, ప్లాస్టిక్, రబ్బరు ఉత్పత్తులు, బియ్యం, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు చాలా తక్కువ సుంకాలతో న్యూజిలాండ్‌లో ప్రవేశించగలుగుతాయి. ఐటీ, డిజిటల్ సేవలు, సైబర్ భద్రత, ఫిన్‌టెక్, హెల్త్‌టెక్ సేవలకూ గిరాకీ పెరుగుతుంది. ఏపీ నుంచి చేపలు, రొయ్యలు, బియ్యం, మసాలా దినుసులు, ప్రాసెస్ చేసిన ఆహారం, దుస్తులు, జౌళి ఎగుమతులకు సానుకూలత ఏర్పడుతుంది. విశాఖపట్నం, కృష్ణపట్నం రేవుల నుంచి భారీగా ఎగుమతులు చేపట్టవచ్చు.



డాక్టర్ వీబీఎస్ఎస్ కోటేశ్వరరావు

ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్- ఇండియా చాప్టర్ ఈసీ మాజీ సభ్యులు



మాట్లాడుకోవాలి!

ఒకప్పుడు ఒంటరిగా నడచిన మనిషి చక్రం వచ్చాక గుంపులో ప్రయాణం మొదలుపెట్టాడు. కథలు చెప్పుకొన్నాడు. కబుర్లు పంచుకున్నాడు. బస్సులూ రైళ్లూ వచ్చాయి. ప్రయాణం నేటి జీవన విధానమైంది.

కొన్నాళ్ల క్రితం దాకా ప్రయాణాల్లో మనుషులు ఒకరినొకరు పలకరించుకునే వాళ్లు. పక్క ప్రయాణికుడితో మంచీ చెడూ మాట్లాడేవాళ్లు. ఇప్పుడు కూడా ప్రయాణికులతో బస్సులు, రైళ్లు నిండిపోతున్నాయి. కానీ, ఎటుచూసినా నిశ్శబ్దం. తలెత్తి చూసేది లేదు, నోరు తెరిచి మాట్లాడేది లేదు. గతంలో ఒకరి చేతిలో పేపరుంటే అది కంపార్ట్‌మెంట్‌లో ఉన్నవాళ్లందరి చేతులు మారేది. ఇప్పుడు చేతుల్లోకి ఫోన్ వచ్చింది. చెవుల్లోకి ఇయర్ ఫోన్స్ వచ్చాయి. తమలో తామే నవ్వుకుంటున్న మనుషులు కనిపిస్తారు. వారికి చుట్టుపక్కల జరిగేదేదీ కనిపించదు, వినిపించదు. ఒకప్పుడు పరిచయాల ప్రవాహంలా సాగిన ప్రయాణాలు ఇప్పుడు మంచులా గడ్డకడుతున్నాయి.

ఆమధ్య రైల్లో నా ఎదురుగా డెబ్బయ్యేళ్ల పెద్దాయన కూర్చున్నాడు. ఏ ఊరని అడిగాడు. నేను చెప్పాక ఫలానా వ్యక్తి తెలుసా అన్నాడు. 'ఆయన మా నాన్న' అన్నాను. నన్ను హత్తుకున్నాడు. మా నాన్నతో ఉన్న చాలా జ్ఞాపకాలను పంచుకున్నాడు. నాన్న లోకాన్ని వదిలి వెళ్లిపోయారని చెబితే చాలా బాధపడ్డాడు. నాన్న గురించి నాకు తెలియని ఎన్నో విషయాలను ఆ పెద్దాయన చెప్పాడు. అలా చెప్తున్నప్పుడు ఆయన చాలా ఉత్సాహంగా కనిపించాడు. కళ్లలో కాంతి కనిపించింది. ఆయనను చూసి నాకూ ఆనందం కలిగింది. మరోసారి, మా ఫ్రెండ్ వాళ్ల నాన్నకి తీవ్రమైన చర్మ సమస్య వచ్చింది. చాలామంది డాక్టర్లను కలిశారు. ఒకసారి రైలులో పరిచయమైన వ్యక్తి, చిత్తూరు జిల్లాలో ఒక ఆయుర్వేద వైద్యుణ్ని కలవమని సూచించాడు. నా స్నేహితుడు తండ్రిని అక్కడికి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. కొద్దిరోజుల్లోనే ఆయన కోలుకున్నారు. ఇలాంటివే కాదు, ప్రయాణాల్లోనే పెళ్లి సంబంధాలు కుదిరిన సందర్భాలున్నాయి. ఇక జీవితంలో ఎప్పుడూ చూడమేమో, కలవలేమేమో అనుకున్న వ్యక్తులు కలిసిన సందర్భాలున్నాయి.

ప్రయాణమైనా, మరో చోటైనా... మన ముందో, వెనకో, పక్కనో... మనుషులంటూ ఉంటే వాళ్లతో హాయిగా మాట్లాడాలి. మాట్లాడటం మనిషికి మాత్రమే లభించిన వరం. వ్యక్తుల్ని గమనించండి. సంతోషంగా కనిపిస్తే ఆ సంతోషాన్ని మీరూ పంచుకోండి. విచారంగా ఉంటే మనసు మళ్లించే నాలుగు మంచి మాటలు చెప్పండి. మన మాటల్లో వారికి సాంత్వన దొరకవచ్చు. వారి మాటలు వినడం ద్వారా మన లోనూ ఉత్సాహం కలగొచ్చు. మంచి మిత్రులు దొరకవచ్చు. వర్చువల్ స్నేహాలు ఎన్ని ఉన్నా, ఆ స్నేహితులను ప్రత్యక్షంగా కలిస్తే లభించే ఆనందం వేరు. అది అనుభవిస్తేనే తెలుస్తుంది. అనుబంధాలు లతల్లాంటివి. వాటికి చిరునవ్వు, మాటలనే ఆధారాలు దొరికితే చాలు అల్లుకుపోతాయి. అందుకే ఒక చిరునవ్వు, ఒక పలకరింపు... పెదాలపై సిద్ధంగా ఉంచుకోండి. దానివల్ల పోయేదేమీ లేదు. మిగిలేది మాత్రం అందమైన జ్ఞాపకాలు!

– డాక్టర్ సుంకర గోపాలయ్య



రక్షణ ఖరీదు!

ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారుతున్న భౌగోళిక రాజకీయాల నేపథ్యంలో చాలా దేశాలు తమ సైనిక పాటవాన్ని పెంచుకోవడంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నాయి. ఈ క్రమంలో రక్షణ సామగ్రి కొనుగోళ్లు, వాటి రూపకల్పన, బలగాల ఆధునికీకరణ, పరిశోధన-అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ), మౌలిక వసతుల కల్పన వంటి వాటిపై ఖర్చును పెంచుతున్నాయి. 2024లో ఆయా దేశాల జీడీపీలో సైనిక వ్యయం...

(శాతాల్లో)

ఉక్రెయిన్	34.5
ఇజ్రాయెల్	8.8
సౌదీ అరేబియా	7.3
రష్యా	7.1
అమెరికా	3.4
యూకే	2.3
ఇండియా	2.3
జర్మనీ	1.9
చైనా	1.7

(ఆధారం: సిప్రి నివేదిక 2025)


ప్రాచీన భారత వైజ్ఞానిక పాటవమిది!

చరిత్ర అనగానే రాజులు, యుద్ధాలు, విప్లవాలు వంటివాటి ప్రస్తావనే ఉంటుంది. కానీ, ఆ బాహ్య పరిణామాల వెనక చింతనలో, మేధస్సులో జరిగే పరిణామాలు కూడా బలమైన ప్రభావం కలిగి ఉంటాయి. అందుకని, ఆయా దేశాల రాజకీయ చరిత్ర ఎంత ముఖ్యమో, వాటి వైజ్ఞానిక-మేధోచరిత్ర కూడా అంతే ముఖ్యం.

ఆధునిక భౌతిక శాస్త్ర చరిత్ర పుస్తకాల్లో ఓ ఘట్టం తరచూ ప్రస్తావనకు వస్తుంటుంది. గెలీలియో గెలీలీ అనే ఇటాలియన్ శాస్త్రవేత్త పీసా నగరంలోని వాలు సౌధం మీదికి ఎక్కి అక్కడి నుంచి రెండు రాళ్లు (ఒకటి పెద్దది, మరోటి చిన్నది) కింద పడేసి రెండూ ఒకేసారి నేలను చేరుకుంటున్నాయని చూపించారు. ఇది 16వ శతాబ్దం ఆఖర్లో జరిగింది. బరువుతో నిమిత్తం లేకుండా వస్తువులు గురుత్వాకర్షణ శక్తిని బట్టి ఒకేలా పడతాయని ఇప్పుడు ఆరో తరగతి పిల్లలకూ తెలుసు. మరి, గెలీలియో ప్రయోగానికి ప్రాధాన్యం ఏముంది? క్రీ.పూ. 4వ శతాబ్దానికి చెందిన అరిస్టాటిల్ అనే గ్రీకు తాత్వికుడు ప్రకృతిలో ఎన్నో పరిణామాల మీద వ్యాఖ్యానించారు. (వాటిలో చాలా వరకు తప్పని ఇప్పుడు మనకు తెలుసు!) ఆ క్రమంలో బరువైన వస్తువులు తేలికైన వస్తువులకన్నా వేగంగా పడతాయన్నారు అరిస్టాటిల్. ఆ తప్పును గెలీలియో ప్రయోగాత్మకంగా ఎత్తిచూపారు. ఈ ఘట్టాన్ని నేటి భౌతికశాస్త్ర చరిత్ర పుస్తకాలు గొప్పగా వివరిస్తాయి.

అద్భుత పరిణామాలు

వెయ్యేళ్లపాటు మతం గుప్పిట్లో నలిగి, మేధస్సు చచ్చుబడిన ఐరోపా, ఒక్కసారిగా గెలీలియో ప్రయోగాలతో మేలుకున్నట్లు పుస్తకాలు రాస్తాయి. కానీ, 1900 ఏళ్ల కాలంలో రెండు రాళ్లు ఎత్తిపడేసి ఏది ముందు పడుతుందో తేల్చుకోవాలనే కుతూహలం, ఇంగితం ఐరోపా ఖండంలోనే ఎవరికీ లేకపోయిందా? అయినప్పటికీ మనం గెలీలియోను ఆధునిక భౌతిక శాస్త్ర పితామహుడిగా గౌరవిస్తాం, సుమారు వెయ్యిన్నరేళ్ల పాటు మానసిక తమస్సులో జోగిన ఐరోపాను మన్నిస్తాం. ఆ కాలానికి 'మధ్య యుగం' వంటి అందమైన పేర్లు పెట్టి చరిత్రలో గౌరవ స్థానాన్ని కల్పిస్తాం. అయితే, ఆ ఒకటిన్నర సహస్రాబ్ద కాలంలోనే భారతావనిలో వైజ్ఞానిక రంగంలో అద్భుతమైన పరిణామాలు జరిగాయి. క్రీ.శ. 475-550 కాలంలో జీవించిన ఆర్యభట్టు భూమి తన అక్షం మీద తాను పరిభ్రమిస్తుందని ప్రతిపాదించారు. ఖగోళశాస్త్ర గణనాలకు సంబంధించిన పలు స్థిరాంకాలను కచ్చితంగా లెక్కించే విధానాలను కనిపెట్టారు. త్రికోణమితిలో 'సైన్' తదితర ప్రమేయాలను కచ్చితంగా లెక్కించే



పద్ధతులను వెలుగులోకి తెచ్చారు. రమారమి క్రీ.శ. 920-1000 కాలంలో జీవించిన రెండో ఆర్యభట్టు అనే మరో గణితవేత్త ఉన్నారు. ఖగోళ, గణిత శాస్త్రాల మీద 'మహా సిద్ధాంతం' లేదా 'ఆర్య సిద్ధాంతం' అనే పుస్తకం రాశారు. అందులో అక్షరాలు, పద్యాలలో సంఖ్యలను వ్యక్తం చెయ్యడానికి 'కటపయాది' అనే పద్ధతి సూచించారు. దాని ప్రకారం 'పై' విలువ ''గోపీ భాగ్య మధువ్రాత...'' అనే శ్లోకంలో పొందుపరిచి ఉంది. క్రీ.శ. 598-668 కాలంలో జీవించిన బ్రహ్మగుప్తుడు అంకగణితంలో సున్నాను, రుణసంఖ్యలను ప్రవేశపెట్టారు. చరిత్రలో మొదటిసారిగా సున్నాను ప్రత్యేక సంఖ్యలా పరిగణిస్తూ- సున్నా, ఇతర సంఖ్యలకు మధ్య వివిధ గణిత చర్యలు జరిపితే ఏం జరుగుతుందనేది నిర్దేశిస్తూ సూత్రాలు నిర్వచించారు. అలా బీజగణితానికి పునాదులు వేశారు. ఆ పద్ధతులన్నీ 'బ్రహ్మస్ఫుట సిద్ధాంత' అనే గ్రంథంలో విశదీకరించారు. భౌతిక శాస్త్రంలో గురుత్వాకర్షణ అనే భావనను ప్రతిపాదించారు. దానివల్లే పైకి విసిరిన వస్తువు కింద పడుతుందని, భూమికి అన్ని పక్కలా మనుషులు ఒకే విధంగా నిటారుగా నిలుచుంటారని వివరించారు. ఇదంతా మనదేశంలో వెయ్యిన్నర ఏళ్ల నాటి మాట. మరోవైపు, ఐరోపాలో అయిదు వందల ఏళ్ల క్రితం కూడా చాలామంది భూమి బల్లపరుపుగా ఉందని నమ్మేవాళ్లు. అందుకే ఆ రోజుల్లో అక్కడి నావికులు తీరానికి మరీ దూరంగా ఓడలను నడిపేవారు కాదు. అలా దూరంగాపోతే తమ ఓడలు భూమి అంచుకు చేరి అగాధంలో పడిపోతాయనేది వాళ్ల భయం!

పరిశోధనలోనూ ఆత్మనిర్భరత

క్యాల్కులస్‌ను కనిపెట్టింది ఐసాక్ న్యూటన్ (క్రీ.శ. 1643-1721) అని చదువుకున్నాం. కేరళలో సంగమ గ్రామానికి చెందిన మాధవుడు (క్రీ.శ. 1340-1425) అనే గణితవేత్త క్యాల్కులస్‌కు మూలకర్త అని ఇటీవలి కాలంలో గణిత సమాజం అంగీకరిస్తోంది. క్యాల్కులస్‌కు మూలస్తంభాలైన అవకలన, వ్యవకలనాలను నిర్వచించి వాటిని ఎలా ప్రయోగించాలో వర్ణించారు. అందుకే టేలర్ సిరీస్‌ను ఇంటర్మీడియెట్ గణిత పుస్తకాల్లో ఇప్పుడు మాధవ-టేలర్ సిరీస్ అని పిలుస్తున్నారు. ఒక్క గణితంలోనే కాకుండా, ఖగోళ, లోహవిజ్ఞానం, భాషా శాస్త్రం, జీవ, వైద్య శాస్త్రాల్లో సైతం ప్రాచీన భారతీయులు సాధించిన పురోగతిని చరిత్రకారులు జనసామాన్యంలో ప్రచారం చెయ్యాలి. సుదీర్ఘ విజ్ఞాన శాస్త్ర చరిత్రలో భారతీయులకు సముచిత స్థానాన్ని కల్పిస్తూ, అంతర్జాతీయ వైజ్ఞానిక చరిత్ర పుస్తకాలను రాయాలి. కేవలం ఉత్పత్తుల రంగంలోనే కాకుండా, పరిశోధనా రంగంలోనూ ఆత్మనిర్భరత సాధించడానికి ఇలాంటి సాహిత్యం స్ఫూర్తిని కల్పిస్తుంది.




ప్రొఫెసర్ వి.శ్రీనివాస చక్రవర్తి

ఐఐటీ మద్రాస్‌లో ఆచార్యులు

బాతు పాట.. కొంగ తెలివి!

ఒక చెరువులో తల్లి బాతు, పిల్ల బాతు చేపల కోసం వెతుకుతున్నాయి. ఇంతలోనే ఒక కొంగ వచ్చి చేపలు వెతికే పనిలోనే పడింది. అప్పుడే చెట్టు మీదున్న కోయిల కూసింది. దాంతో కొంగ.. 'తియ్యని గొంతు!' అంది. అది పిల్లబాతుకు నచ్చలేదు. 'మిత్రమా! తన కంటే నేను చాలా బాగా పాడగలను. కావాలంటే విను' అంటూ పాడటం మొదలుపెట్టింది. కాసేపటికి పాడటం ఆపి.. 'ఎలా ఉంది?' అని అడిగింది. అప్పుడు కొంగ.. 'నీ ముక్కు బాగుంది!' అంది. అది సరైన సమాధానం కాకపోయినా, పొగడ్త కావడంతో నవ్వేసింది పిల్లబాతు. తరవాత.. 'ఇంతకీ నా పాట గురించి ఏం చెప్పలేదేంటి?' అని మళ్లీ అడిగింది. 'నువ్వు అచ్చు హంసలా ఉన్నావు తెలుసా!' అంది ఈసారి కొంగ. అది కూడా పొగడ్త కావడంతో మళ్లీ నవ్వేసింది పిల్లబాతు. అప్పటికీ కొంగ తన రాగాన్ని గుర్తించలేదనుకుని,



స్వరం పెంచింది. దాంతో వెంటనే కొంగ అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఎందుకు వెళ్లిపోయిందో అర్థంకాని పిల్లబాతు 'అమ్మా! కొంగకు ఏమీ తెలిసినట్లు లేదు. నేను అడిగిందేమిటి? అది చెప్పిందేమిటి? నా గొప్పతనాన్ని అంగీకరించలేక పారిపోయింది కదా!' అని తల్లికి చెప్పింది. 'ఆ కొంగ తెలివైనది!' అంది తల్లిబాతు. 'నిజంగా తెలివైనవాళ్లు అడిగినదానికి మాత్రమే సమాధానం చెబుతారు. కానీ కొంగ అలా చేయలేదే?' అంది పిల్లబాతు. 'నిన్ను చిన్నబుచ్చకుండా నీ పాట గురించి తప్ప మిగతా విషయాల్లో పొగిడిందంటే పాట బాగోలేదని చెప్పకనే చెప్పింది. ఎప్పుడు ఏం చేయాలో తెలుసుకుని చేయాలి. అదే సమయంలో ఇతరులను నొప్పించకుండా కూడా ఉండాలి. అదీ తెలివితేటలంటే! నీ పాట వల్ల మన ఉనికి తెలిసిన చేపలు దూరంగా వెళ్లిపోవడం గమనించింది కొంగ. ఇక్కడ ఉంటే కడుపు నిండదని మరో చోటుకు వెళ్లిపోయింది. మనం కూడా ఇప్పుడు ఇంకో చోటుకు వెళ్తేనే ఆహారం దొరుకుతుంది' అంది తల్లిబాతు. అప్పుడు విషయం అర్థం చేసుకున్న పిల్లబాతు తల్లి వెంట వెళ్లింది.

– బి.వి.పట్నాయక్

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. సరైన వాటిని కలిపి రాయండి చూద్దాం.

చిగురు	విల్లు	ఆరోగ్య	పత్రం
కాకి	ముద్ద	పిల్ల	అరటి
లడ్డు	హరి	గోల	కుక్క
బీమా	వెన్న	గెల	పంచ
హామీ	దార	చింత	రవ్వ

సైబర్ మోసాలా.. అవగాహన పెంచుకోండిలా..!

★ డీసీపీ కె.కృష్ణ ప్రసన్నతో ఫోన్ ఇన్ నేడు



ఈనాడు మీతోడు

సైబర్ నేరాలు నిత్యకృత్యమయ్యాయి. ఏ లింక్ క్లిక్ చేస్తే ఏమవుతుందో? బ్యాంకు ఖాతా ఎప్పుడు ఖాళీ అవుతుందో అని అందరూ బెంబేలెత్తిపోతున్నారు. పెట్టుబడులు, పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజల కష్టార్జితాన్ని దోచేస్తున్నారు. డబ్బులు పోతే తిరిగి వస్తాయన్న నమ్మకం పూర్తిగా పోయింది. వీటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కావాల్సిన సాయం తదితర అంశాలపై 'ఈనాడు' సైబర్ క్రైం డీసీపీ కె.కృష్ణ ప్రసన్నతో ఫోన్ ఇన్ కార్యక్రమం చేపట్టింది. ప్రజలు తమకున్న సందేహాలనూ నివృత్తి చేసుకోవచ్చు. మీరు చేయాల్సిందల్లా నిర్ణీత సమయంలో దిగువ నంబరుకు ఫోన్ చేయడమే. - ఈనాడు, అమరావతి

80085 74651 | 30.12.25 మంగళవారం | ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

రేషన్ అక్రమాలపై జేసీ గరంగరం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ తీరుపై జేసీ ఎస్.ఇలక్కియా ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ డీలర్లు, పౌరసరఫరాల శాఖ అధికారుల్లో మార్పు రాకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్టు సమాచారం. ఓ ఏఎస్‌వో, మరో తనిఖీ అధికారి తీరును తప్పుబట్టారు. సస్పెన్షన్ చేయడానికి వెనుకాడే ప్రసక్తే లేదన్నారు. ఇటీవల ఆమె అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో రేషన్ దుకాణాల ఆకస్మిక తనిఖీకి వెళ్లారు. వాంబేకాలనీ, ఎల్.బి.ఎస్.నగర్, కండ్రిక తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అదే సమయంలో రెండు రేషన్ దుకాణాలకు తాళాలు వేసి ఉన్నాయి. తర్వాత ఓ డివిజనల్ స్థాయి అధికారిని తనిఖీలకు పంపారు. అక్రమాలు గుర్తించినట్టు సమాచారం. రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు సరఫరా చేయకుండా, ముందుగానే విక్రయిస్తున్నట్టు ఆమెకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇలాంటి అక్రమాలు చెల్లవని, పేదలకు బియ్యాన్ని సరఫరా చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. రేషన్ డీలర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సోమవారం అంతర్గత సమావేశం నిర్వహించారు. పీడీ యాక్టు, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై నిత్యం తనిఖీలు ఉంటాయని, అక్రమాలను గుర్తిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.



90 ఏళ్లుగా... అతిథులకు విడిది

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

భారతీయుల ఉసురు తీసిన ఆంగ్లేయులు దివిసీమ ప్రజలకు అపురూపమైన కట్టడాలను అందించారు. దివిసీమ ముఖద్వారమైన పులిగడ్డలో 1936లో నిర్మించిన అతిథి గృహం ఈ కోవకు చెందినదే. శత వసంతాలకు చేరువలో ఉన్న దీనికి కొద్దిపాటి మరమ్మతులు చేస్తే మరి కొన్నేళ్లు వినియోగపడుతుంది. కృష్ణానదిపై బహుళ ప్రయోజనకరమైన అక్విడెక్టు నిర్మాణం చేపట్టిన సమయంలో ఆ పనులన్నీ పర్యవేక్షించేందుకు వచ్చే ఇంజినీర్లు, బ్రిటిష్ అధికారుల విశ్రాంతి కోసం దీన్ని రూపొందించారు. నాటి నుంచి నేటి వరకు అతిథులకు స్వాగతం పలుకుతూ.. వారి సేద తీర్చే విడిదిగా ఈ కట్టడం వినియోగపడుతోంది. ప్రస్తుతం జలవనరుల శాఖ అధీనంలో ఉంది. దీన్ని భావితరాలకు అందించడం కోసం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చిన్నపాటి మరమ్మతులు చేయిస్తూ సంరక్షిస్తున్నారు. ఇప్పటికీ చెక్కుచెదరక అపురూపమైన కట్టడంగా దివిసీమ చరిత్ర పుటల్లో నిలుస్తోంది. ★ ఈ అతిథిగృహ ప్రాంగణంలో 100 ఏళ్లనాటి ఊడల మర్రి, మద్ది వృక్షాలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నాయి. ఉసిరి వనాలు, సంపెంగ సువాసనలు వెదజల్లుతున్నాయి.



ఎనిమిదేళ్లుగా.. కడుతూనే ఉన్నారు!

గర్భిణులు, బాలింతల కష్టాలూ పట్టవు

ఈనాడు, అమరావతి

విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో ఒకే ఒక్క భవనం.. అదీ రెండంతస్తుల్లో నిర్మించడానికి ఏకంగా ఎనిమిదేళ్లకు పైగా పట్టింది. 2017లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వచ్చి మంచాల కొరతతో గర్భిణులు ఎదుర్కొంటున్న బాధలు చూసి చలించిపోయి.. వెంటనే రూ.18 కోట్లు మంజూరు చేసిన భవనమిది. దీని నిర్మాణం విషయంలో వైద్యారోగ్యశాఖ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో చెప్పడానికి ఈ ఎనిమిదేళ్ల తాత్సారమే నిదర్శనం. పునాదుల దశ వరకూ వచ్చిన సమయంలో వైకాపా సర్కారు గద్దెనెక్కడంతో అక్కడితో ఐదేళ్లు ఆ నిర్మాణానికి మంగళం పాడారు. మళ్లీ 2023 డిసెంబరులో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.23.75కోట్లతో అవే పునాదులపై కొత్తగా క్రిటికల్ కేర్ బ్లాక్ పేరుతో శంకుస్థాపన చేసి నిర్మాణం ఆరంభించారు. ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు.. రెండేళ్లయినా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు.



పాతాసుపత్రిలో నిర్మించిన రెండంతస్తుల క్రిటికల్ కేర్ బ్లాక్

ఎన్నాళ్లు బాధలు పడాలి..

ఆసుపత్రిని పదేళ్ల నుంచే మంచాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ పదేళ్లలో ప్రసవాల కోసం వచ్చే గర్భిణుల సంఖ్య రెట్టింపు అయ్యింది. వారికి మంచాలను కేటాయించలేక వైద్య సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఒకే మంచంపై ఇద్దరేసి బాలింతలు, వారి బిడ్డలను పెట్టుకుని పడుకోవాల్సిన దయనీయమైన పరిస్థితి.

మార్చికే పూర్తయిన భవనం..

క్రిటికల్ కేర్ బ్లాక్ భవన నిర్మాణం గత మార్చి నాటికే పూర్తయిపోయింది. ఏప్రిల్‌లో తుది దశ పనులు పూర్తి చేసి భవనం ప్రారంభిస్తామని చెప్పారు. ఇప్పటికి ఏడు నెలలు గడిచిపోయింది. గర్భిణులు, బాలింతలకు అత్యవసరమని తెలిసినా ఇంత జాప్యం చేస్తున్నారు.

క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఆరంభిస్తే తప్ప ఈ బాధలు తీరవు. భవనం అందుబాటులోకి వస్తే రెండు అంతస్తుల్లో కలిపి ఆక్సిజన్ పైప్‌లైన్‌తో అనుసంధానించిన 125 అధునాతన మంచాలు, నాలుగు ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్ రూం, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీకి ఐసీయూలొస్తాయి.

ఏప్రిల్ నుంచి సాగదీత.. సర్కారు నుంచి బిల్లుల సమస్య ఉందని ఏప్రిల్ తర్వాత నుంచి పనులు నెలల తరబడి సాగలేదు. తాజాగా భవనం తుది దశ పనులు సైతం పూర్తి చేశారు. ముందువైపు ర్యాంప్ కూడా సిద్ధమైంది. ప్రస్తుతం భవనంలో లిఫ్టులు, మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ల పనులు చేపట్టాలి. ఇవి పూర్తయ్యాక ఆరంభిస్తామని వైద్యారోగ్యశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. అవి ఎప్పటికి పూర్తిచేస్తారో.. ఎప్పుడు భవనం అందుబాటులోకి తీసుకొస్తారనేదానికి సమాధానం లేదు.

ఏముందీ.. ఐడియా!

సమాధానాలు ఇస్తేనే నగదు బదలాయింపు

✦ 'నా పేరు మీద నాన్ బెయిలబుల్ కేసు నమోదైందని, అరెస్టు వారెంట్ జారీ అయిందని నన్ను ఎవరూ భయపెట్టలేదు' ✦ డిజిటల్ అరెస్టు లేదని నాకు తెలుసు. సీబీఐ, కస్టమ్స్, ఈడీ, పోలీస్ అని ఎవరూ వీడియో కాల్ చేసి భయపెట్టలేదు.' ఇలా... చరవాణిలో వరుసగా వచ్చే ప్రశ్నలకు సంతృప్తికర సమాధానాలు ఇస్తేనే. . మీ బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు బదిలీ అవుతుంది. ✪ సైబర్ నేరాల నియంత్రణకు



ఏఐ ఆధారిత టూల్‌ను పరిశీలిస్తున్న బ్యాంకర్లు

ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ 'సైబర్ సురక్ష' పేరుతో వినూత్న కార్యక్రమం చేపట్టింది. డిజిటల్ అరెస్టు పేరుతో ప్రజలను భయపెట్టి, వారి నుంచి నేరగాళ్లు రూ.లక్షలు కొట్టేస్తున్నారు. రకరకాలుగా మభ్యపెట్టి.. భయపెట్టి బ్యాంకులకు పంపించి.. వారి ఖాతాల నుంచి డబ్బులు తమ ఖాతాలకు బదలాయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఖాతాదారులకు అవగాహన కలిగించేందుకు విజయవాడ పోలీసులు 'సైబర్ సురక్ష' అనే ఏఐ ఆధారిత టూల్‌ను రూపొందించారు. ఖాతాదారుల చరవాణిలో ఈ టూల్ సాయంతో 'సైబర్ సురక్ష' నుంచి సమాధానాలు తెలుసుకుంటున్నారు. ✪ ముందు గూగుల్ బ్రౌజర్‌లో ntrpolice.in అనే దానిలోకి లాగిన్ అవ్వాలి. 'డిజిటల్ కన్‌సెంట్ ఫర్ బ్యాంక్ కస్టమర్స్' క్లిక్ చేయాలి. ఇంగ్లిషు/తెలుగు ఎంపిక చేసుకోవాలి. మీ పేరు, చరవాణి నంబరుతో రిజిస్టరైతే.. మీకు వరుసగా 5 ప్రశ్నలు వస్తాయి. వాటిని గట్టిగా చదివి.. సమాధానాలు ఇవ్వాలి. వాటిని ఏఐ నమోదు చేసి సక్రమంగా ఉంటే ఒక కోడ్ వస్తుంది. దానిని బ్యాంకర్లకు చూపిస్తేనే మీ డబ్బులు బదలాయిస్తారు.

- విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

బీడీఎస్ సీట్ల భర్తీకి స్పెషల్ స్ట్రే రౌండు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని దంత వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి స్పెషల్ స్ట్రే వేకెన్సీ రౌండు నిర్వహిస్తున్నట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేర్కొంది. నీట్ యూజీ రాసిన అభ్యర్థులు ఈనెల 30వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి జనవరి ఒకటో తేదీ సాయంత్రం 6 గంటల్లోగా ఐచ్ఛికాలు ఇచ్చుకోవాలని సూచించారు. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 43 బీడీఎస్ సీట్లు, ఎస్వీయూ పరిధిలో 20 సీట్లు అందుబాటులో ఉంచారు. ★ బీడీఎస్ యాజమాన్య కోటా సీట్ల స్ట్రే వేకెన్సీ రెండో రౌండు కౌన్సెలింగ్‌లో 13 సీట్లు భర్తీ కాగా, సీట్లు పొందిన విద్యార్థులు డిసెంబరు 31వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఆయా దంత వైద్య కళాశాలల్లో చేరాలని వర్సిటీ పేర్కొంది.

యూరియా పక్కదారి పడితే సస్పెన్షన్ వేటే

'ఈనాడు' కథనానికి కలెక్టర్ లక్ష్మీశ స్పందన

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో యూరియా పక్కదారి పడితే సంబంధిత అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తామని, నిబంధనలను ఉల్లంఘిస్తే డీలర్ల లైసెన్స్‌లను రద్దు చేస్తామని కలెక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. 'యూరియా దందా.. అంతే లేదయా' శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. కలెక్టరేట్ నుంచి రెవెన్యూ, వ్యవసాయ, పోలీసు తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. యూరియా అక్రమ రవాణా, నిల్వలు, పక్కదారి పట్టించడం వంటివి అరికట్టేందుకు అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పటిష్ఠ నిఘా అమలు చేస్తున్నట్టు తెలిపారు. సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంటుందన్నారు. సమన్వయ శాఖలు క్రియాశీలంగా వ్యవహరించాలన్నారు. అక్టోబరు ఒకటి నుంచి ఈ నెల 28వ తేదీ వరకు జిల్లాలో మొత్తం 17,707 టన్నుల యూరియా విక్రయాలు జరిగినట్టు చెప్పారు. రానున్న మూడు రోజులకు 339 టన్నుల యూరియా అవసరం కాగా, ప్రస్తుతం 5,236 టన్నులు సొసైటీలు, మార్క్‌ఫెడ్ గోదాములు, రిటైల్/హోల్ సేల్ తదితరాల చోట్ల అందుబాటులో ఉందన్నారు. అన్నదాతలు ఎరువులు కొనుగోలు చేసి, రసీదులు పొందాలని సూచించారు. రైతులకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. డీఏవో విజయకుమారి, ఆర్డీవోలు, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఈ ఉద్యానం.. పంచదు ఆహ్లాదం

వాంబేకాలనీలో ఉన్న పాతడంపింగ్ యార్డును మోడల్ పార్కుగా మార్చేందుకు 2020 వైకాపా హయాంలో రూ.10కోట్లతో పనులు మొదలుపెట్టి ప్రారంభ దశలోనే ఆపేశారు. కంపచెట్లు పెరిగి, విద్యుత్తు స్తంభాలు పడిపోయి, ఆటవస్తువులు విరిగిపోయి నిరుపయోగంగా మారాయి. రాత్రి వేళలో ఈ ప్రదేశం అసాంఘిక శక్తులు, నేరగాళ్లకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. – ఈనాడు, అమరావతి

ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం


కరెన్సీనగర్, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జులైలో జరిగే ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ -2026 ప్రవేశ పరీక్షకు ఎన్టీఆర్ జిల్లాలో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రభుత్వ ఐటీఐలో రూ.500 చెల్లించి దరఖాస్తు పొందాలని చెప్పారు. ఐటీఐ స్టేట్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో 2019 నుంచి ప్రవేశాలు పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హత పొందిన అభ్యర్థులు జనవరి 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ప్రభుత్వ ఐటీఐలో పూరించిన దరఖాస్తులను అందించాలని పేర్కొన్నారు. వివరాలకు 94906-39639లో సంప్రదించవచ్చని చెప్పారు.

సంక్రాంతి కత్తులకు పదును

★ ఆర్డర్లపై రహస్యంగా తయారీ ★ జిల్లాలో ఆరుచోట్ల పోలీసుల దాడులు

ఈనాడు, అమరావతి

సంక్రాంతి సమీపిస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల రహస్యంగా కత్తులు తయారవుతున్నాయి. బరుల్లో పందేలకు దిగే కోళ్లకు వీటిని కడతారు. కత్తులకు పదును పెట్టేందుకు చాలా చోట్ల గదులు అద్దెకు తీసుకుని యంత్రాలతో పనిచేస్తున్నారు. పెద్ద సంఖ్యలో వీటి కోసం ఆర్డర్లు వస్తున్నాయి. ఇటువంటి కేంద్రాలపై ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు బృందాలుగా విడిపోయి ఆరుచోట్ల దాడులు చేసి కత్తులు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసుల నమోదుకు స్థానిక పోలీసు స్టేషన్లలో నిందితులను అప్పగించారు.



కోడి కత్తుల తయారీ యంత్రాలు

మూడు వేలకుపైగా స్వాధీనం

★ విస్సన్నపేటలో నడకుదురు సర్వేశ్వరరావు ఓ గదిని అద్దెకు తీసుకుని ఐదు యంత్రాలతో సంక్రాంతి కత్తులకు పదును పెడుతున్నాడు. పోలీసులు ఇతడిని అదుపులోకి తీసుకుని 1,600 కత్తులు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అతని నుంచి 47,530 నగదును సీజ్ చేశారు. రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని అంపాపురంలో విజయబాబు నుంచి 600 కత్తులు, ఓ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ★ మైలవరంలో సుంకర కిశోర్ నుంచి 350 కత్తులు, ఒక యంత్రాన్ని, సుంకర నరేంద్ర నిరంజన్‌రావు నుంచి 70 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రహీంపట్నంలో వల్లభాపురం నాగరాజు నుంచి 300 కత్తులు, జి.కొండూరు మండలం చెవిటికల్లులో వెంకటనాగాచారి నుంచి 164 కత్తులు, ఒక యంత్రాన్ని దాడుల్లో సీజ్ చేశారు.

నూజివీడు, విస్సన్నపేటలో...

★ కత్తులకు పదును పెడుతున్న వీరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా.. ఏలూరు నూజివీడుతో పాటు ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో ఇవి తయారవుతున్నట్లు తేలింది. వీటిని ఆర్డర్ల మేరకు నిందితులు కొనుగోలు చేసి పదును పెట్టి అమ్ముతుంటారు. లేనిపక్షంలో ఎవరైనా కొనుగోలు చేసి తీసుకొస్తే పదును పెట్టి ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో తయారీ కేంద్రాలపై పోలీసులు నిఘా పెట్టారు. త్వరలో వీటిపై దాడులు చేసే అవకాశం ఉంది.

అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు..

భూ సేకరణకు ప్రతిపాదనలు

11 గ్రామాల్లో 1972.70 ఎకరాలు గుర్తింపు

రాజధాని అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూముల సేకరణకు తొలి దశ ప్రతిపాదనలు పంపించారు. నందిగామ డివిజన్‌లో కంచికచర్ల, వీరులపాడు మండలాల మీదుగా ఓఆర్ఆర్ రోడ్డు నిర్మాణం జరగనుంది. దీని కోసం ఈ రెండు మండలాల్లో 11 గ్రామాల పరిధిలో 1972.70 ఎకరాలు గుర్తించారు. అనంతరం మూడు(ఏ) నోటిఫికేషన్‌కు కలెక్టర్ ద్వారా నేషనల్ హైవే అథారిటీ సంస్థకు ప్రతిపాదనలు పంపించారు. దీనిలో భాగంగా ఓఆర్ఆర్ నిర్మించేందుకు అవసరమైన భూములు వాటి సర్వే నంబర్లు, విస్తీర్ణం వివరాలను నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి కె.బాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు సేకరించారు. దీని ప్రకారం 79,83,248.53 చదరపు మీటర్ల భూమి సేకరించాలని నిర్ణయించారు. దీనిని హైవే అథారిటీ సంస్థ పరిశీలించి ఓకే చేశాక భూ సేకరణకు 3డీ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. దీనిలో రైతుల పేర్లు, భూమి విస్తీర్ణం, రెవెన్యూ గ్రామం తదితర వివరాలు సమగ్రంగా ఉంటాయి. దీనిపై రైతులకు ఏమైనా అభ్యంతరాలుంటే అధికారులు స్వీకరించి పరిశీలన చేస్తారు. దీనిపై ఆర్డీవో కె.బాలకృష్ణ మాట్లాడుతూ ఓఆర్ఆర్ భూసేకరణకు అవసరమైన భూములు గుర్తించినట్లు తెలిపారు. దీనిపై ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపినట్లు వెల్లడించారు.

సేకరించనున్న భూములు..

గ్రామం	ఎకరాలు
కంచికచర్ల	570.80
పేరకలపాడు	60.13
మున్నలూరు	150.44
మోగులూరు	267.54
కునికినపాడు	1.18
పొన్నవరం	162.19
జగన్నాథపురం	33.64
చెన్నారావుపాలెం	173.38
గూడెం మాధవరం	41.01
జుజ్జూరు	297.39
తిమ్మాపురం	214.99

- నందిగామ, కంచికచర్ల, న్యూస్‌టుడే



తాకితే రాలుతోంది.. అదిరితే కూలుతోంది..

నగరంలోని పూర్ణానందపేట ఏలూరు లాకుల వద్ద ఉన్న రెండో వంతెన రక్షణ గోడలు శిథిలావస్థకు చేరాయి. పాదచారులు ఫుట్‌పాత్‌పై వెళ్తూ ముట్టుకుంటే పెచ్చులు రాలిపడుతోంది. పెద్ద వాహనాలు వచ్చినప్పుడు వంతెన కాస్తంత అదిరినా రక్షణ గోడ కొద్దికొద్దిగా కూలిపోతోంది. -ఈనాడు, అమరావతి

విద్యుత్తుశాఖ, దుర్గగుడి అధికారుల చర్చలు

పరిష్కారానికి సీఎండీ వద్ద సమాలోచనలు

సూర్యారావుపేట: విద్యుత్తుశాఖ, దుర్గగుడి మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించుకునేందుకు ఇరు విభాగాల అధికారుల మధ్య సోమవారం చర్చలు జరిగాయి. విద్యుత్తు సీఎండీ పుల్లారెడ్డి ఎదుట సమావేశమయ్యారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఏం చేయాలనే అంశంపైనే ప్రధానంగా చర్చించారు. దుర్గగుడికి విద్యుత్తును రెండు రోజుల కిందట నిలిపేయడాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం తీవ్రంగా పరిగణించింది. వెంటనే సమస్యను పరిష్కరించుకోవాలంటూ.. ఇరుశాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. విద్యుత్తు, దేవాదాయశాఖ.. ఇద్దరు మంత్రులు జోక్యం చేసుకుని.. సమస్యకు సరైన పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఇరు శాఖల అధికారులు ఎవరి వాదన వాళ్లు వినిపించుకున్నారు.

విద్యుత్తుశాఖ అధికారుల వాదన : రాష్ట్రంలోని ప్రముఖ దేవస్థానం కావడంతో.. తాత్కాలికంగా మాత్రమే సౌర విద్యుత్తు ప్లాంట్ నుంచి వచ్చే విద్యుత్తును గ్రిడ్‌కు తీసుకునేందుకు అనుమతి ఇచ్చాం. అందుకే రెండు రకాల విధానాల్లో ఏదో ఒకటి దేవస్థానం ఎంపిక చేసుకుంటే.. ఆ ప్రకారం శాశ్వతంగా విద్యుత్తును తీసుకునే ఏర్పాటు చేస్తాం. ఒకటోది. . ఓపెన్ యాక్సెస్‌లో ఇవ్వడం, రెండోది నెట్ మీటరింగ్ ద్వారా గ్రిడ్‌కు పంపించడం.. వీటిలో ఏదో ఒకటి ఎంపిక చేసుకోవాలని సూచించారు. ✪ **దుర్గగుడి అధికారుల వాదన :** తాము రూ.5కోట్లతో ఏర్పాటు చేసిన ప్లాంట్ ద్వారా.. ఉత్పత్తి అయ్యే విద్యుత్తుకు సరైన లెక్కలు చూపించాలి. మిగతా బ్యాలెన్స్ ఏమైనా కట్టాల్సి వస్తే.. దానిని కడతాం. విద్యుత్తు అధికారులు సూచించిన రెండు విధానాల్లో ఏదో ఒకటి ఎంపిక చేసుకుంటాం.

నేడు మంత్రి వద్ద పంచాయితీ.. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు.. ఇరుశాఖల అధికారులు విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి ఎదుట మంగళవారం సమావేశం కానున్నారు. తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం జరగబోతోంది.

నిందితుల మధ్య.. వందల కాల్స్

పిల్లల విక్రయాల కేసులో కీలక ఆధారాలు

ఈనాడు, అమరావతి

పిల్లల రవాణా, విక్రయాల్లో కింది స్థాయి నుంచి దిల్లీ వరకు పలు దశల్లో నిందితుల మధ్య సంభాషణలు నడిచాయి. వందల కాల్స్ మాట్లాడుకున్నారు. రెగ్యులర్ కాల్స్‌తో పాటు వాట్సప్‌లోనూ తరచూ మాట్లాడుకున్న ఆధారాలు లభించాయి. విజయవాడకు పిల్లల్ని తెప్పించేందుకు ఉత్తరాది ముఠాలతో డీల్ కుదుర్చుకునేందుకు ప్రధాన నిందితురాలు ఫోన్ నుంచి కాల్స్ వెళ్లినట్లు గుర్తించారు. దిల్లీ, ముంబయి నుంచి కూడా సరోజినికి చాలా కాల్స్ ఉన్నాయి. సాంకేతిక విశ్లేషణలో పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి.

గ్రూప్ కాల్స్‌లో సంభాషణలు: ఇప్పటి వరకు పోలీసులు ముంబయి, దిల్లీ ముఠాల మధ్య సంబంధాలు ఉండకపోవచ్చని భావించారు. అయితే ముఠాలోని వారి కాల్ డేటా విశ్లేషణలో పలు కీలకమైన విషయాలు బయటకు వచ్చాయి. రెండు గ్యాంగులకు సంబంధాలు ఉన్నట్లు వెల్లడైంది. ఈ రెండు ముఠాల్లోని కిరణ్ శర్మ, ప్రియాంక, భర్తి, సతీష్, అనిల్, కవిత, నూరి, కాజల్ తరచూ ఫోన్లలో మాట్లాడుకున్నారని వెలుగు చూసింది. వీరందరి మధ్య వందల కాల్స్ నడిచాయి. బలగం సరోజిని నుంచి వీరి నడుమ కూడా పెద్ద సంఖ్యలో కాల్స్ ఉన్నాయి. అహ్మదాబాద్, దిల్లీ, విజయవాడలో ఉండి. . వీరు గ్రూప్ కాల్స్‌లో ఒకరికొకరు సంభాషించుకున్నారు. పలుసార్లు వాట్సప్ కాల్స్ కూడా నమోదయ్యాయి. వీటి ద్వారా కూడా కాన్ఫరెన్స్ కాల్స్ చేసుకుని పిల్లల విక్రయాల గురించి తరచూ చర్చించుకునే వారని తెలిసింది. సరోజిని ఫోన్ నుంచి కింది స్థాయిలో బ్లెస్సీ, నందిని, విజయలక్ష్మి, ఫరీనాతోనూ ఎక్కువగా కాల్స్ ఉన్నాయి.

నేరచరిత్రపై వివరాల సేకరణ: విజయవాడలో నమోదైన నాలుగు కేసుల్లో అరెస్టు అయిన నిందితుల వేలిముద్రల ఆధారంగా దేశవ్యాప్తంగా ఇంకా ఏయే స్టేషన్లలో వీరిపై కేసులు ఉన్నాయన్నది పరిశీలిస్తున్నారు. సరోజినిపై ఏడు, అనిల్‌పై ఒకటి, కవితపై రెండు, విజయలక్ష్మిపై ఆరు, కిరణ్ శర్మ, ఫరీనాలపై నాలుగేసి కేసులున్నాయి. విజయవాడకు చెందిన శారదపై దేశవ్యాప్తంగా పలు కోర్టుల్లో చాలా పీటీ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈమెను యూపీలోని హర్దోయి జైలు నుంచి తెచ్చి విజయవాడ కోర్టులో హాజరుపర్చారు. అనంతరం తిరిగి యూపీకి పంపించారు.

కస్టడీలో విచారిస్తే..

నిందితులుగా భావిస్తున్న కిరణ్‌శర్మ, భర్తి, బలగం సరోజినిలను కస్టడీకి తీసుకుని విచారిస్తే కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మహిళా స్టేషన్, కొత్తపేట, భవానీపురం, నున్న పోలీసులు వీరిపై ఇప్పటికే పీటీ వారెంట్లు వేశారు. అనంతరం కస్టడీ పిటిషన్లు కూడా వేశారు. ఇంకా అరెస్టు కావాల్సిన వారి కోసం ప్రత్యేక బృందాలు రెండు రోజుల్లో వెళ్లనున్నాయి.



ఆట ప్రారంభం

విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి కృష్ణా జిల్లా 28వ అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల ప్రాంతీయ స్పోర్ట్స్ మీట్–2025 ఘనంగా ప్రారంభమైంది. దీన్ని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు ప్రారంభించారు.



రుణమొస్తే మామూళ్లు.. ప్రశ్నిస్తే చిక్కుముళ్లు

☛ వెలుగు రుణాల్లో బుక్ కీపర్లు, సీసీల దందా
☛ ఒక్కో గ్రూపు నుంచి రూ.4వేలకు పైగా వసూళ్లు

ఈనాడు, అమరావతి

డ్వాక్రా రుణాల ద్వారా మహిళలకు ఆర్థిక దన్నుగా నిలవాలన్న ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. వెలుగు సంఘాలకు రుణమొస్తే చాలు మామూళ్ల పేరిట బుక్‌కీపర్లు, సీసీలు దోచేస్తున్నారు. ప్రశ్నించిన వారికి రుణాలు రాకుండా కొర్రీలు వేస్తున్నారు. దీంతో చేసేది లేక సంఘాల సభ్యులు సైతం అడిగింది ఇచ్చి మిన్నకుంటున్నారు.

జిల్లాలో 24వేల సంఘాలున్నాయి. 2,52,000 మంది సభ్యులున్నారు. ఈ ఏడాది రూ.591కోట్లు రుణాలిచ్చారు. ఒక్కో సంఘానికి అవసరాన్ని బట్టి రూ.20లక్షల వరకు రుణం ఇస్తారు.

రూ.20లక్షల వరకు...

మా రూటే..సపరేటు...

★ రుణం మంజూరై ఖాతాలో ఎప్పుడు జమవుతుందా అని చాలా మంది బుక్‌కీపర్లు, సీసీ ఎదురుచూస్తున్నారు. జమ అయితే వసూళ్ల దందా మొదలు పెడుతున్నారు. ★ ఏ.కొండూరు మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల రూ.18లక్షల రుణం మంజూరైంది. మొత్తం 12 మంది సభ్యులు కాగా గ్రూపు అధ్యక్షురాలు ఒక్కొక్కరి నుంచి రూ.500 చొప్పున రూ.6వేలు కోత వేశారు. ఇదేమిటని అడిగితే మనకు రుణం ఇప్పించిన బుక్ కీపర్, నుంచి సీసీ, ఏపీఎంకి ఇవ్వాలని బదులిచ్చారు. ★ తిరువూరు మండలంలోని మరో గ్రామంలో 10 మంది సభ్యుల వెలుగు సంఘానికి రూ.20లక్షల రుణం మంజూరైంది. సంఘం కార్యదర్శి రూ.4వేలు వసూలు చేసి బుక్‌కీపర్, సీసీకి ముట్టజెప్పారు. రూ.20లక్షల రుణం మిస్తే కనీసం రూ.5వేలు కూడా ఇవ్వలేరా అంటూ బుక్‌కీపర్ దబాయించడం గమనార్హం.

అధికారులకు తెలిసినా నిర్లక్ష్యమే..

★ వెలుగు సంఘాలు రుణం మంజూరైనప్పుడు బుక్‌కీపర్లు, సీసీలకు నచ్చింది ఇవ్వడంతో మొదలైన ఈ వ్యవహారం చిలికి చిలికి గాలి వానలా మారింది. ప్రస్తుతం డిమాండ్ చేసి మరీ వసూలు చేసే పరిస్థితికి వచ్చింది. ఒక్కో సంఘం నుంచి రుణంలో రూ.4వేల నుంచి రూ.6వేల వరకు వసూలు చేస్తున్నారు. ★ ఇదంతా అధికారులకు తెలిసినా ప్రారంభంలో నిర్లక్ష్యం చేశారు. దీంతో బుక్‌కీపర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మామూళ్ల బేరం ముందే తెగ్గొట్టిన తర్వాతనే రుణ ప్రక్రియ చేస్తున్నారు. ఫిర్యాదు చేసినప్పుడు హెచ్చరించడం తప్ప కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ★ డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు మాట్లాడుతూ..సభ్యులు ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. అక్రమంగా వసూళ్లు చేసే వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.

భక్తులను బంధువుల్లా ఆత్మీయంగా చూడాలి

ఈనాడు, అమరావతి: ఇంద్రకీలాద్రికి వచ్చే ప్రతి భక్తుడిని బంధువుల్లా చూసి వారికి ఆత్మీయంగా సేవలందించాలని దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సూచించారు. భక్తులు సంతృప్తిగా అమ్మవారి దర్శనం చేసుకుని, ప్రసాదం స్వీకరించి వెళ్లినప్పుడే ఆలయ ప్రతిష్ఠ పెరుగుతుందన్నారు. దుర్గగుడిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు అందిస్తున్న సేవలను ఆయన సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు.. దర్శనాలు, ప్రసాదం, పూజలు సహా అన్ని సేవల టిక్కెట్లు ఆన్‌లైన్‌లోనే తీసుకునేలా పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనికోసం అదనపు ఆన్‌లైన్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూలైన్లు, ఆలయ పరిసరాల్లో నిరంతరం పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తూ శుభ్రంగా ఉంచాలన్నారు. వినియోగంలో లేని సామగ్రి ఎక్కడైనా ఉంటే వెంటనే గుర్తించి అక్కడి నుంచి తొలగించాలని ఆదేశించారు. ఆలయంలోని అన్నదానం, ప్రసాదంపోటు సహా జరుగుతున్న అన్ని ఇంజినీరింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రసాదాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని సూచించారు. భక్తుల సంతృప్తి స్థాయి పెరిగేలా అన్ని కోణాల్లోనూ పరిశీలించి సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు (కిలో జీ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267. **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

ముక్కోటి ఏకాదశి వేళ అప్రమత్తం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : భక్తుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. చిన్న అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా చూడాలన్నారు. సంయుక్త బృందాలు.. తనిఖీలు/పర్యవేక్షణలు చేయాలని పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వెంకటేశ్వరస్వామి ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. ముఖ్యంగా రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం, ప్రసాదాల పంపిణీ, వైద్య సేవలు తదితరాలపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు కంట్రోల్ రూమ్‌లను సిద్ధంగా ఉంచాలన్నారు. క్యూలైన్లు, బారికేడింగ్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్నపాటి తప్పిదం పెద్ద ప్రమాదానికి దారితీస్తుందనే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పని చేయాలని సూచించారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎన్.షణ్ముగం, ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకటన/పోయినది

మా క్లయింట్ అయిన క్యానం హరిచంద్రప్రవీణ్, S/o. భగవాన్ దాస్, వయస్సు : 54 సం॥లు., నివాసం డోరు నెం. 23-1-4/ఎ, దాట్లవారివీధి, బి.ఆర్.టి.ఎస్. రోడ్డు, సత్యనారాయణపురం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ వాస్తవ్యులు గారి సంజాయిషీ పొంది తెలియజేయునది..

మా క్లయింట్ క్యానం హరిచంద్రప్రవీణ్ గారి తండ్రి గారు అయిన క్యానం భగవాన్ దాస్ గారు ది. 15/03/1994 తేదీన వెలిశెట్టి సుభద్రమ్మ గారి చేత సీతారాంపురంలో రెవెన్యూ వార్డు 11, డోరు నెం. 33-5-56 దాఖలా 49.6 చ.గ. స్థలమును గిఫ్ట్‌గా పొంది దానిని విజయవాడ సబ్ రిజిస్ట్రారు కార్యాలయం నందు డాక్యుమెంట్ నెం. 911/1994గా స్థిరాస్తి దఖలు దస్తావేజును రిజిస్టర్ చేయించుకొనియున్నారు.

సదరు భగవాన్ దాస్ గారు ది. 8/12/2002వ తేదీన పరమపదించారు. దర్మిలా నాక్లయింట్ అయిన క్యానం హరిచంద్రప్రవీణ్ సదరు ఆస్తి ఒరిజినల్ దస్తావేజులను తీసుకుని ది. 20/12/2025, 12.30 గం॥లకు మధురానగర్ ఫుడ్ కోర్టు నుండి బయలుదేరి గుణదల పడవల రేవు సెంటర్‌కు వెళ్ళి చూడగా సదరు డాక్యుమెంట్ కలిగిన బ్యాగ్ కనబడలేదు. నాక్లయింట్ వెంటనే గుణదల పడవల రేవు సెంటర్ నుండి మధురానగర్ ఫుడ్ కోర్టు వరకు వెతికిననూ పైన తెలిపిన డాక్యుమెంట్‌తో కూడిన బ్యాగ్ కనబడివుండలేదు. అవి మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. కావున దయవుంచి ఎవరికైనా సదరు డాక్యుమెంట్ కలిగిన బ్యాగ్ దొరికినచో ఈక్రింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు. ఒకవేళ ఎవరైన సదరు నా క్లయింట్‌కు సంబంధించి పైన తెలిపిన ఒరిజినల్ దస్తావేజును ఉపయోగించి ఏవిధమైన లావాదేవీలు జరిపినచో నా క్లయింట్ తీసుకునే సివిల్ మరియు క్రిమినల్ కేసులకు బాధ్యులగుదురు.

ఇట్లు: **సి.హెచ్. వీర్రాజు,** అడ్వకేట్

24-11/2-31, భవానీపేట, 3వ లైన్, దోనేపూడివారివీధి, విజయవాడ-3. ఫోన్ నెం: 98491 39522, 95058 19363

అట్లప్రగడలో మైనింగ్ లీజు బదలాయింపు

ఈనాడు, అమరావతి: ఎ.కొండూరు మండలం అట్లప్రగడ గ్రామంలోని సర్వే నంబర్లు 84/14, 15లో మొత్తం 1.725 హెక్టార్ల విస్తీర్ణంలో క్వార్ట్జ్, మైకా ఖనిజాల మైనింగ్‌కు శ్రీదుర్గా మైన్స్‌కు అనుమతి ఇస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రామిశెట్టి కిరణ్‌కుమార్ పేరుతో 2042 ఏడాది వరకు ఉన్న లీజు అనుమతిని.. శ్రీదుర్గామైన్స్‌కు గతంలోనే బదలాయించారు. దీనికి తాజాగా బదిలీ లీజ్ డీడ్ అమలు చేసేందుకు గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

GOVERNMENT OF ANDHRA PRADESH
THE ANDHRA PRADESH SHILPARAMAM ARTS, CRAFTS AND CULTURAL SOCIETY
Plot No.56, Door no.54-16-1/18C, Road No.2, Central Excise Colony, Loyola College Road, Vijayawada-520008

SHORT TENDER NOTICE

Tender Notice No.393/AP Shilparamam/DC(HL)/ Crafts Mela/UH/VSKP/2025-26, dated: 29-12-2025

SLEALED TENDERS are invited for Superstructure,erection of octonum stalls 100 nos for "All-India Crafts Mela" sponsored by O/o DC(HL), MoT, GoI, New Delhi to be conducted at Shilparamam,Visakhapatnam from 08.01.2026 to 22.01.2026. The details of Tender documents are available with the O/o CEO, The APSACCS, Vijayawada on payment of Rs.1,000/- by way of DD in favour of CEO, The APSACCS, Vijayawada. Issue of Tender documents from 30.12.2025@10am to 02.01.2026@1.00pm.Last date for submission of Tenders on 02.01.2026@2.00pm at Office of the CEO, AP SACCS, Vijayawada Tenders will be opened on the same day at 3.00pm.For details, Website: www.https://shilparamam.ap.gov.in, please contact this no: 88866 52012.

Sd/- Chief Executive Officer

OFFICE OF THE EXECUTIVE ENGINEER
AP EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION, NTR DISTRICT, VIJAYAWADA

'E' Procurement Short Tender Notice

Short Tender Notice No.06/DB/EE/APEWIDC/NTR/2025-26, Dated 29-12-2025.

Tenders are invited for Repairs to Disabled Hostel building and Repairs to SC Shopping Complex at NTR District work of 2 Nos. **(Vide NIT. Nos. 16 to 17)** of APEWIDC., Division in NTR District on e-procurement platform of Government of Andhra Pradesh. Further Details are can be viewed 'E' Procurement market place i.e., **www.apeprocurement.gov.in.**

Bid Document Downloading Start Date from: 30-12-2025.
Bid Document Downloading End Date: 06-01-2026 up to 3.00 PM.
Bid Submission Closing Date : 06-01-2026 up to 4.00 PM.
Bid Opening Date : 06-01-2026 @ 4.30 PM.

Note: Tender Published through online Executive Engineer, APEWIDC, Krishna, Machilipatnam

Sd/- Executive Engineer, APEWIDC, NTR, Vijayawada

ప్రకటన

నా క్లయింటు, మెస్సర్స్ ఉద్యాన్ ప్రాజెక్ట్స్, విజయవాడ, భాగస్వామ్య సంస్థ రిజిస్టర్ నెం. 193/2023, తరపున మేనేజింగ్ పార్టనర్ శ్రీ నర్రా శ్రీకాంత్‌బాబు, తండ్రి (లేటు) నర్రా రామమోహనరావు, నిడమానూరు గ్రామ వాస్తవ్యుల నుండి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా,

నాక్లయింటు, ఈదిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి సంబంధించిన స్థల యజమానులైన 1) శ్రీ కొప్పురావూరి జయశివరామ్, తండ్రి అమరనాధం, శ్రీ కొప్పురావూరి శ్రీకృష్ణ [illegible]

Dr. ధారా సత్యనారాయణ, Advocate,
డోర్ నెం. 36-12-13/3, [illegible], విజయవాడ. Cell No. 94403 20435. Phone No. 0866 - 2573736.
విజయవాడ, ది. 27-12-2025.

న్యూస్‌టుడే- విజయవాడ క్రీడలు

కొనూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025 ఉత్సాహంగా సాగుతోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో సీనియర్స్ విభాగంలో పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల, వాసవి ఇంజినీరింగ్ కళాశాల జట్లు, జూనియర్స్ విభాగంలో విశ్వశాంతి జూనియర్ కళాశాల జట్టు సెమీఫైనల్స్‌లో ప్రవేశించాయి.

సెమీఫైనల్స్‌కు సీనియర్, జూనియర్ జట్లు

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Regional Sponsor: Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Digital Partner: ETV BHARAT, ఈనాడు.నెట్ | FM Partner: Mee FM | TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Organised by ఈనాడు

KAMINENI HOSPITALS VIJAYAWADA

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..



పి.ప్రభు



టి.ఇస్సాకు



కె.వరుణ్‌రెడ్డి



10 పరుగుల ఆధిక్యంతో విజయం

తొలి మ్యాచ్‌లో పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 పరుగుల తేడాతో కేబీఎన్ డిగ్రీ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన కేబీఎన్ జట్టు బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన పొట్టి శ్రీరాములు కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. పి.ప్రభు 43 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ ఎం.కార్తీక్ ఎనిమిది పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన కేబీఎన్ కళాశాల జట్టు ఆరు వికెట్ల నష్టానికి 66 పరుగులు మాత్రమే చేసింది. మహేంద్ర 40 పరుగులు చేశాడు. ప్రత్యర్థి బౌలర్ వి.జోయ్ శ్యామ్ ఏడు పరుగులు ఇచ్చి రెండు, పి.నిఖిల్ అయిదు పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా పి.ప్రభు ఎంపికయ్యాడు.

ఆరు వికెట్ల తేడాతో గెలుపు

రెండో మ్యాచ్‌లో వాసవి ఇంజినీరింగ్ కళాశాల జట్టు ఆరు వికెట్ల తేడాతో ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన లయోలా జట్టు నిర్ణీత పది ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసింది. ఎస్.లక్ష్మీనరసింహ 33 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. వై.అరవింద్ 18 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ సీహెచ్ వంశీ మూడు పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన వాసవి కళాశాల జట్టు 8.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. టి.ఇస్సాకు 30 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ఎస్కే రికిబ్ 12 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ కె.రోహిత్ 16 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా టి.ఇస్సాకు నిలిచాడు.



సెంచరీ దాటిన పరుగులు

మూడో మ్యాచ్‌లో విశ్వశాంతి జూనియర్ కళాశాల జట్టు 45 పరుగుల తేడాతో దీక్ష జూనియర్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన దీక్ష జట్టు బౌలింగ్ తీసుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన విశ్వశాంతి జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. కె.వరుణ్‌రెడ్డి 28, వరుణ్ కిండో 25 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ కె.అజేయుడు 14 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీశాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన దీక్ష జట్టు అయిదు వికెట్లు కోల్పోయి 58 పరుగులకే పరిమితమైంది. ఎస్కే గౌస్ 16 పరుగులు చేశాడు. ప్రత్యర్థి బౌలర్ ఎండీ సిద్దిక్ మూడు పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కె.వరుణ్‌రెడ్డి ఎంపికయ్యాడు.



నేటి మ్యాచ్‌ల వివరాలు

- ★ పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల × వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల (మొదటి మ్యాచ్)
- ★ శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల × నలంద డిగ్రీ కళాశాల (రెండో మ్యాచ్)
- ★ విశ్వశాంతి జూనియర్ కళాశాల × ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల (మూడో మ్యాచ్)

రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే ఉమ్మడి కృష్ణా జిల్లా 28వ అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల రీజనల్ స్పోర్ట్స్ మీట్-2025ని వారు ప్రారంభించారు. బెలూన్లు, కపోతాలు ఎగురవేశారు. ఎంపీ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించేలా సీఎం చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల మైదానాలు కేశినేని ఫౌండేషన్ ద్వారా తన సొంత నిధులతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించడంలో సీఎం చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్య ప్రాంతీయ సంచాలకుడు జీవీ రామచంద్రరావు, ప్రిన్సిపల్ ఎం.విజయసారథి, డిపార్ట్‌మెంట్ అధికారి సుధాకర్ రెడ్డి, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న బాలికలు

● చెస్ బాలుర విభాగంలో డీవీఆర్ అండ్ డాక్టర్ హెచ్ఎస్ఎంఐసీ కళాశాల (కంచికచర్ల) ప్రథమ, ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ ఎస్ఆర్ (గుడ్లవల్లేరు) ద్వితీయ, బాలికల విభాగంలో శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాల (కలవపాముల) ప్రథమ, ఎంవీఆర్ కళాశాల (పరిటాల) ద్వితీయ, బ్యాడ్మింటన్ బాలురు సింగిల్స్‌లో వీకేఆర్ అండ్ వీఎన్‌బీ (గుడివాడ) ప్రథమ, ఎంబీసీ కళాశాల (కంచికచర్ల) ద్వితీయ, డబుల్స్‌లో ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ ఎస్ఆర్ (గుడ్లవల్లేరు) ప్రథమ, నూజివీడు పాలిటెక్నిక్ కళాశాల (నూజివీడు) ద్వితీయ, టేబుల్ టెన్నిస్ బాలురు సింగిల్స్, డబుల్స్‌లో ఎంవీఆర్ (పరిటాల) ప్రథమ, ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ (గుడ్లవల్లేరు) ద్వితీయ, బాలికల సింగిల్స్, డబుల్స్‌లో ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ (గుడ్లవల్లేరు) ప్రథమ, శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాల (కలవపాముల) ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రారంభం

ఆటోనగర్, న్యూస్‌టుడే: అనుభవం కలిగిన డైరెక్టర్ల సారథ్యంలో ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ రూ.5 వేల కోట్ల టర్నోవర్ సాధించిందని ఎండీ ఎం.నరేంద్ర కుమార్ తెలిపారు. సోమవారం ఆటోనగర్‌లో సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ 44వ శాఖను మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు ప్రారంభించారు. మానం మాట్లాడుతూ 1997లో ప్రారంభించిన సొసైటీ... ఆదాయం పొందే విషయంలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఎండీ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో మరో రెండు శాఖలు ప్రారంభిస్తామని ప్రకటించారు. లక్షా పది వేల మంది సభ్యులతో రూ.2500 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని తెలిపారు. గత సంవత్సరం రూ.100 కోట్ల నికర లాభం వచ్చిందని వెల్లడించారు. ఎఫ్‌డీలపై నెలవారీ వడ్డీలతో పాటు తనఖా, బంగారంపై రుణ సౌకర్యం ఉందని అన్నారు. మాజీ ఐపీఎస్ అధికారి ఎ.రవిచంద్ర, విశ్రాంత ఆంధ్రాబ్యాంకు జనరల్ మేనేజర్ బి.రామబ్రహ్మం మాట్లాడుతూ.. సహకార రంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ బ్యాంకును మరింత వృద్ధిలోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. వైస్ ఛైర్మన్ వీపీఎస్ రాజు, సలహాదారు వెంకట సుబ్బయ్య, ఆటోనగర్ బ్రాంచ్ మేనేజర్ స్రవంతి, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానం ఆంజనేయులు



ఉద్యోగ సంఘ కాలమానిని ఆవిష్కరణ

ఏపీ జలవనరులు, ఆర్అండ్‌బీ, ప్రజారోగ్యం, పీఆర్, మున్సిపల్ ఉద్యోగుల రాష్ట్ర అసోసియేషన్ రూపొందించిన 2026 సంవత్సర కాలమానిని, దైనందినులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సచివాలయంలో సోమవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.కలంధర్, ప్రధాన కార్యదర్శి వి.జి.నాయుడు, గౌరవాధ్యక్షుడు డి.జి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎ.ధర్మారావు పాల్గొన్నారు. **- ఎన్టీఆర్ కలెక్టరేట్**

ధర వరలు

వంకాయలు-20/24, టమాటా-47, బెండ-34, పచ్చిమిర్చి-40, కాకర-50, బీర-34/40, క్యాలీ ఫ్లవర్-30/25, క్యాబేజి-22, క్యారెట్-32, దొండ-36, బంగాళదుంప-24, ఉల్లిపాయలు-30, గోరుచిక్కుళ్లు-40, దోస-32/40, సొర-18/20, పొట్ల-35, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-76, మునగ-14/15, కీరదోస-34, బీన్స్-76, క్యాప్సికమ్-56 , కొత్తిమీర-6/12 (నిన్నటివి). **- ఎన్టీఆర్ కలెక్టరేట్**



ప్రణాళికాబద్ధంగా ఉర్దూ భాషాభివృద్ధి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ప్రణాళికబద్ధంగా ఉర్దూ భాషను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకొని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. భారతీయ భాషల్లో ఉర్దూకు ఘన చరిత్ర, అధిక ప్రాధాన్యం ఉందన్నారు. ఉర్దూ నుంచి ఉద్భవించిన కవితలు, గేయాలు, పద్యాలు బాహ్య ప్రపంచంలో విస్తరించాయని చెప్పారు. మహ్మద్ ఇక్బాల్, గాలిబ్ వంటి ప్రముఖుల కవితలు స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపాయన్నారు. సిక్కులు, హిందువులు సైతం ఉర్దూను ప్రేమించేవారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయంలోనే కర్నూల్‌లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్ మీరా ఉర్దూ భాషా విశిష్టత గురించి వివరించారు. ఈసందర్భంగా ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫరూక్ షుబ్లీ పర్యవేక్షణలో నిర్వహించిన క్రికెట్ పోటీలో విజేతలకు మంత్రి ఫరూక్, ఎంపీ శివనాథ్ ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్ అహ్మద్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ గౌస్ పీర్ పాల్గొన్నారు.



వేదికపై మంత్రి ఫరూక్, ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, బోడే ప్రసాద్, కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా తదితరులు

పీజీఆర్ఎస్‌లో జిల్లాను ప్రథమంగా నిలబెడదాం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా అధికారులను కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ఆయా సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా పని చేసి, పీజీఆర్ఎస్‌లో జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందు వరుసలో నిలబెట్టాలని సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ.. భూములు, తాగునీరు, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మొత్తం 202 అర్జీలు స్వీకరించారు. వీటిలో అధికంగా రెవెన్యూ శాఖకు 49, పురపాలక/పట్టణాభివృద్ధి 40, వైద్య.. ఆరోగ్య శాఖ 23, డీఆర్డీఏ 15, పోలీస్ 12, విద్యుత్తు 9, మిగతావి ఇతర విభాగాలకు చెందినవి. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ పీడీ నాంచారరావు, జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా

తిరువూరు

• తిరువూరు • మైలవరం

2 నుంచి రెవెన్యూ గ్రామ సభలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు నియోజకవర్గంలో భూములు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జనవరి 2 నుంచి 9 వరకు నిర్వహించనున్న రెవెన్యూ గ్రామసభల వివరాలను తహసీల్దార్లు సోమవారం తెలిపారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో 2025 నాటికి 12 గ్రామాల్లో రీసర్వే పూర్తి కాగా, రైతులకు ఇచ్చేందుకు 9,747 కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను అధికారులు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో వీటిని పంపిణీ చేసేందుకు ఆయా గ్రామాల్లో షెడ్యూల్ మేరకు గ్రామ సభలు నిర్వహిస్తారు. సోమవారం జిల్లా రెవెన్యూ కార్యాలయం నుంచి కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు మండల కేంద్రాల్లోని రెవెన్యూ కార్యాలయాలకు చేరాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? తాతకుంట్ల గ్రామంలోని పలు కాలనీల్లో వీధుల వెంట పిచ్చిచెట్లు పెరిగాయి. **- స్థానికులు** ✔ పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం. **- గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, తాతకుంట్ల** – న్యూస్‌టుడే, విస్సన్నపేట

? మునగపాడులోని పాలకేంద్రం సమీపంలో కృష్ణా జలాల పైపులైన్ లీకై నీరంతా గ్రామంలోని సీసీ రోడ్డుపై వృథాగా పోతుంది. **- చిట్టెం వెంకటేశ్వరరావు, గ్రామస్థుడు**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికడతాం. **- దయానంద్ సీపీడబ్ల్యూఎస్ స్కీం సహాయక ఇంజినీరు** – న్యూస్‌టుడే, జి.కొండూరు

? ఎన్టీటీపీఎస్ పాత గేటు వద్ద రక్షిత నీటి పైపులైన్ లీకైంది. కొన్ని రోజుల నుంచి నీరు పోతున్నాయి. ఈ విషయాన్ని నీటి సరఫరా సిబ్బందికి తెలియజేసినా స్పందన లేదు. **- షరీఫ్, స్థానికుడు**

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- వాసు, తాగునీటి సరఫరా పర్యవేక్షకుడు**

– న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

రహదారులపై కొత్త ఏడాది వేడుకలొద్దు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకల పేరుతో రహదారులపై, కూడళ్లలో ఎటువంటి కార్యక్రమాలకు అనుమతులు లేవని సీఐ చంద్రశేఖర్ తెలిపారు. విజయవాడ కమిషనరేట్ వ్యాప్తంగా ఇటువంటి వాటిపై ఉన్నతాధికారులు తగు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇబ్రహీంపట్నం స్టేషన్ పరిధిలోని రెండు జాతీయ రహదారులతో పాటు గ్రామాలు, పురపాలికల్లోని ప్రధాన వీధుల్లో ఎక్కడా వేడుకలు నిర్వహించకూడదని చెప్పారు. అటువంటి కార్యక్రమాలు ఎవరైనా తలపెడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రమైన రెడ్డిగూడెంలో మంగళవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ కిరణ్ కుమార్ సోమవారం తెలిపారు. నూతనంగా విద్యుత్తు లైన్ ఏర్పాటు పనుల నిమిత్తం సరఫరాను నిలిపేస్తున్నట్లు ఆయన చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

స్పందించారు.. చర్యలు తీసుకున్నారు

తిరువూరు, గంపలగూడెం: తిరువూరు శివారు పీటీ కొత్తూరు సమీపంలో నుంచి ఆర్అండ్‌బీ రహదారి అంచులో ఉన్న కంప, పిచ్చి చెట్లు తొలగించే పనులను అధికారులు పర్యవేక్షణలో గుత్తేదారు సోమవారం ప్రారంభించారు. 'అంచులో కంపలు.. రాకపోకలకు ఇక్కట్లు' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించి రహదారి అంచులో ఉన్న పిచ్చి చెట్లను పొక్లెయిన్‌తో తొలగిస్తున్నారు. చింతలపాడు వరకు రోడ్డుకు ఇరువైపుల ప్రమాదకరంగా కంప పెరిగింది.

కుళాయి ఏర్పాటు... జి.కొండూరు: స్థానిక హైస్కూల్ రోడ్డులో పోస్టాఫీసు సమీపంలో కృష్ణా జలాల పంపు విరిగిపోయి నీరంతా రహదారిపై వృథాగా పోతుంది. దీనిపై 'విలువైన జలాలు.. రహదారి పాలు!' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసవ లింగేశ్వరరావు సిబ్బందితో విరిగిపోయిన కుళాయి ప్రదేశంలో కొత్తది ఏర్పాటు చేయించారు.

రక్షణ పరికరాలు లేక.. విధులు సాగక..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, కొండపల్లి, న్యూస్‌టుడే



చలిలో వీధి శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ప్రస్తుతం ఉష్ణోగ్రతలు రోజు రోజూ పడిపోతున్న తరుణంలో పారిశుద్ధ్య కార్మికులు కోడి కూయక ముందే ఎముకలు కొరికే చలిలో విధులు నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామునే వారికి కేటాయించిన ప్రాంతాలకు వెళ్లి రహదారులను ఊడ్చి చెత్తను తొలగించి మురుగు కాలువలు శుభ్రం చేస్తున్నారు. పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో వీరే కీలకం. అలాంటి వారికి చలి నుంచి రక్షణ పొందేందుకు అవసరమైన సామగ్రిని కొండపల్లి పురపాలికతో పాటు మైలవరం నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీలు అందించడం లేదు. దీంతో వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా చలిలో విధులు నిర్వహించడం వల్ల కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఎక్కువ మంది జలుబు, దగ్గు, గొంతు నొప్పి జ్వరాలతో బాధపడుతున్నారు. తమ కష్టాలను ఎవరూ పట్టించుకోవడం లేదని నియోజకవర్గ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదికి రెండేసీ చొప్పున..

మైలవరం నియోజకవర్గంలో కొండపల్లి పురపాలికతో పాటు 56 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 750 మంది కార్మికులు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. వీరందరూ రోజు 169 కిలో మీటర్ల పొడవునా ఉన్న రోడ్లను శుభ్రం చేయాలి. ఇంటింటా తిరిగి 370 టన్నులకు పైగా చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు, సంపద తయారీ కేంద్రాలకు తరలించాలి. ఈ క్రమంలో వీరికి చలికి తట్టుకోవడానికి స్వెటర్లు, మంచు నుంచి తప్పించుకోవడానికి టోపీలు, కాలి మోకాలి వరకూ బూట్లు, చేతి గౌజులు, మాస్కులు అవసరం. గ్రామ పంచాయతీలు, పురపాలికలు మాస్కులు, చేతికి గౌజులు తప్ప ఇతర సామగ్రి ఇవ్వడం లేదు. అవి కూడా ఏడాదికి రెండేసీ ఇస్తుండగా నెలరోజులకే పాడై పోయి ఉపయోగించడానికి పనికి రాకుండా పోతున్నాయి. ఫలితంగా ఎటువంటి సామగ్రి లేకుండా విధులు నిర్వహించాల్సి వస్తోంది.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను స్థానిక సంస్థల అధికారుల వద్ద ప్రస్తావించగా వారు ఇలా స్పందించారు. కార్మికులు చలికి ఇబ్బందులు పడకుండా స్థానిక సంస్థల పరంగా చొరవ తీసుకుంటామని తెలిపారు. స్వెట్టర్ల కొనుగోలుకు ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని చెప్పారు.

వర్గీకరణతో మాదిగలకు మేలు

మైలవరం: ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం ద్వారా మాదిగలకు మేలు కలుగుతుందని పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఇది మందా కృష్ణమాదిగ నేతృత్వంలో సాకామైందని చెప్పారు. మాదిగల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక తిరువూరు రోడ్డులోని అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరాస్వామి, బెనర్జీ, ఏసు, జమలయ్య పాల్గొన్నారు.

ప్రతిభ చాటారు.. విజేతగా నిలిచారు



బహుమతులు పొందిన వారితో అధ్యాపకులు

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా విద్యార్థులకు జనరల్ నాలెడ్జి అంశంపై క్విజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న వారిలో కె.నందిని, సీహెచ్.రామ్‌చరణ్(హెచ్ఈసీ, ప్రథమ ఏడాది), టి.మయూష్‌సాయి(ఒకేషనల్, మొదటి సంవత్సరం) విద్యార్థులు వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. వీరికి కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కేపీ శ్వేత, అధ్యాపకులు బహుమతులు అందజేసి అభినందించారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పన్ను వసూలు వేగవంతం చేయండి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని తిరువూరు డీడీవో ఎ.వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం రెడ్డిగూడెం మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమై మాట్లాడారు. గ్రామాల వారీగా ఇంటి పన్నులు వసూళ్ల వివరాలు తెలుసుకుని సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో సమీక్షిస్తున్న వెంకటరమణ

అన్నదాతలకు విస్తృత సేవలందిస్తాం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రెడ్డిగూడెం పీఏసీఎస్ పరిధిలో రైతులకు సకాలంలో రుణాలు అందించడం, ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అమలులో ఆదర్శంగా నిలవడం, సిబ్బంది పనితీరు తదితర అంశాల్లో రాష్ట్ర స్థాయిలో రెండు స్థానం సాధించింది. అవార్డు పొందడం హర్షణీయమని పీఏసీఎస్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్సీడీసీ) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీఎస్‌కు రూ.25 వేలు చెక్కుతో పాటు అవార్డు అందజేసినట్లు ఆయన చెప్పారు. రాబోయే రోజుల్లో అన్నదాత ఆర్థికాభివృద్ధి, సాంకేతిక సాయంతో రుణాల మంజూరీ, సంక్షేమ పథకాలు అమలులో మరింత వేగం పెంచుతామన్నారు.



అవార్డు అందుకుంటున్న రెడ్డిగూడెం పీఏసీఎస్ సిబ్బంది

షాబుఖారీ దర్గా ఉరుసు ప్రారంభం

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి సయ్యద్ షాబుఖారీ దర్గా ఉరుసు మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. మొదటి రోజు జరిగిన ఉరుసు మహోత్సవానికి జిల్లాలో తర ... ఆవరణలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ... మేళతాళాలు హోరెత్తించాయి. అంతకు ముందు ఏడీసీపీ రామకృష్ణ దర్గా వద్దకు చేరుకుని ఉరుసు కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. లంగర్ ఖానా ఆవరణలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తెదేపా నాయకుడు జంపాల సీతారామయ్య ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలను ఉరుసు, దర్గా అభివృద్ధి కమిటీలు, ముజావర్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పర్యవేక్షించారు.



కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న ఏడీసీపీ రామకృష్ణ

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ధనుర్మాస సందర్భంగా తిరువూరు, గంపలగూడెం మండలాల్లోని వైష్ణవాలయాల్లో సోమవారం అర్చకుల ఆధ్వర్యంలో గోదారంగ నాయక స్వామికి పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో మూలవిరాట్లను అలంకరించారు. భక్తులు గోదాదేవి తిరుప్పావై పాశురాలు పఠించారు.



ఊటుకూరు రామాలయంలో గోదాదేవికి పూజ చేస్తున్న అర్చకుడు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని శివ క్షేత్రాల్లో సోమవారం అర్చకులు శివలింగాలకు పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. కొత్తపల్లి గుడిలో కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఉమాగౌరీశంకరునికి పూజలు జరిపారు. ఎ.కొండూరు మండలం కంభంపాడు శివాలయంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

గంపలగూడెం: తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని వైష్ణవాలయాల్లో వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని భావించి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచే ఉత్తర ద్వారంలో ఉత్సవమూర్తుల దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.



గోసవీడు: అలంకరణలో శ్రీకృష్ణపరమాత్మ

మైలవరం, న్యూస్‌టుడే : ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్ ఎస్వీ.సుధాకరరావు నేతృత్వంలో నిర్వహించే వేడుకల్లో భాగంగా ప్రతి ఏటా తెల్లవారుజాము 4 గంటల నుంచే దర్శన అవకాశాలను కల్పిస్తున్నారు. దాంతో పాటు స్థానిక కోదండ రామాలయం, వినాయకుడి గుడి, శిర్డీ సాయిబాబా మందిరాల్లోనూ ఏర్పాట్లు జరిగాయి.

కొండపల్లి: కొండపల్లి చెన్నకేశవ, రామాలయం, ఇబ్రహీంపట్నం వెంకటేశ్వర స్వామి ఆలయాల ప్రాంగణంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశామని అర్చకులు తెలిపారు.

వ్యవసాయ విద్యుత్తుకు వినతి

ఎన్టీఆర్ కలెక్టరేట్: వ్యవసాయ భూముల్లో విద్యుత్తు సౌకర్యం పొందడానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరుతూ మైలవరం మండలం పుల్లూరుకు చెందిన పలువురు గిరిజనులు విజయవాడ కలెక్టరేట్‌లో సోమవారం వినతి పత్రాలు అందజేశారు. తమకు అటవీ భూముల హక్కు పత్రాలు మంజూరయ్యాయని, బోర్లు వేసినా.. విద్యుత్తు కనెక్షన్లు లేవని వివరించారు.



అర్జీలు పూరిస్తున్న గిరిజనులు

ప్రజా.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే

రెవెన్యూ కార్యాలయం	అర్జీలు	పరిష్కారం
డివిజనల్ రెవెన్యూ	377	321
ఎ.కొండూరు	196	181
గంపలగూడెం	535	512
రెడ్డిగూడెం	177	170
తిరువూరు	604	583
విస్సన్నపేట	361	348

తిరువూరు డివిజన్‌లోని రెవెన్యూ కార్యాలయాల్లో ఈ సంవత్సర కాలంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ఈ నెల 22 వరకు ప్రజల నుంచి 2,250 వినతులు అందగా వాటిలో 2,115 సమస్యలు పరిష్కరించారు. మిగిలిన 135 దరఖాస్తులను కూడా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకున్నట్లు ఆమె చెప్పారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కూడా ఆర్డీవో కార్యాలయం, తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం రెవెన్యూ కార్యాలయాలకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో మొత్తం 20 అర్జీలు అందాయని వెల్లడించారు. రెవెన్యూ, పౌర సరఫరా శాఖలకు సంబంధించిన అర్జీలు అధికంగా వచ్చాయన్నారు. ఇవన్నీ సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించినట్లు ఆర్డీవో తెలిపారు.



ఆర్డీవో మాధురికి దరఖాస్తు అందజేస్తున్న ఫిర్యాదుదారు

వాగా.. డంపింగ్ యార్డా?



రెడ్డిగూడెం పంచాయతీలోని కోతుల వాగులో కొందరు చెత్త, వ్యర్థాలు పడవేయడంతో డంపింగ్ యార్డుగా మారుతుంది. ప్రస్తుతం వాగులో నీటి ప్రవాహం లేకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని వాగు సమీపంలోని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యర్థాలను కుక్కలు రహదారిపైకి తీసుకురావడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

కోతలు.. తరచూ ప్రమాదాలు



మండలంలోని గణపవరం నుంచి అడవినెక్కలం అడ్డరోడ్డు వరకు వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. దాదాపు ఆరు కిలో మీటర్ల పొడవున ఉన్న రోడ్డు అంచులు దీర్ఘకాలంగా కోతకు గురయ్యాయి. దీంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లాల్సి వస్తే పూర్తిగా నిలిచిపోవాల్సి వస్తోంది. ఆగకుండా ముందుకు వెళ్తే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ఒక యువకుడు ప్రాణాలు సైతం కోల్పోవడానికి కోతకు గురైన అంచులే కారణమని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కనీసం గ్రావెల్‌తో అయినా రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

యూరియా కొంటే బిల్లులు తీసుకోవడం తప్పనిసరి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరులోని ఏఎంసీ ఆవరణలో గుంటూరు డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వారి కార్యాలయం నుంచి వచ్చిన ప్రత్యేక అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు విక్రయిస్తున్నారా లేదా అని రికార్డులు పరిశీలించారు. లైసెన్స్‌లో స్టోర్ ప్రదేశ పత్రం లేని దుకాణదారులకు షోకాజ్ నోటీసులు అందించారు. 6,840 టన్నుల యూరియా అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అన్నదాతలు యూరియా కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. స్థానిక వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారిణి పాల్గొన్నారు.

గంపలగూడెం: మండలం నుంచి సరిహద్దులో ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలకు యూరియా అక్రమంగా తరలించకుండా 14 చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు వ్యవసాయాధికారి వి.హరీష్ కుమార్ సోమవారం తెలిపారు. మండలంలో ఈ ఏడాది రబీలో సాగు చేసిన పంటలకు కావాల్సిన 520 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచామన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని ఎరువుల దుకాణాల్లో తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఏవో డి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు చేపట్టారు. యూరియా నిల్వలు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు. ఎవరైనా యూరియాను ఎక్కువ ధరకు విక్రయిస్తే వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : జి.కొండూరు మండల వ్యాప్తంగా యూరియా నిల్వలు 147 టన్నులు ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి సూరిబాబు తెలిపారు. సొసైటీల్లో 88, గ్రోమోర్ 40, ప్రైవేటు దుకాణాల్లో 19 టన్నుల చొప్పున అందుబాటులో ఉంచామని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



తిరువూరు: దస్త్రాలు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



రెడ్డిగూడెం: తహసీల్దార్ సుశీలాదేవి, ఏవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు

కార్మికులకు అండగా సీఐటీయూ

మైలవరం, న్యూస్‌టుడే : దేశవ్యాప్తంగా అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.సుధాకర్ పేర్కొన్నారు. ఈ నెల 31 నుంచి విశాఖపట్నంలో నిర్వహించనున్న సంఘం మహాసభల్లో పాల్గొనే కార్మికులకు సోమవారం గుర్తింపు కార్డులు అందించారు. వీటికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కొండపల్లిలో ద్విచక్ర వాహన ర్యాలీ

విస్సన్నపేట : సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచార జాతను సంఘ విస్సన్నపేట మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు విస్సంపల్లి నాగరాజు, మేకల జ్ఞానరత్నం, మర్రిబోయిన అప్పారావు, పోతురాజు శ్రీనివాసరావు, గంజిన బోయిన రాము తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి: సీఐటీయూ మహాసభల నేపథ్యంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కొండపల్లి పారిశ్రామిక వాడలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్, గోపాలకృష్ణ, రంగబాబు, బాలరాంబాబు, భాస్కర్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విస్సన్నపేట : ప్రచార జాతను ప్రారంభిస్తున్న సీఐటీయూ, ప్రజా సంఘాల శ్రేణులు



మైలవరం : గుర్తింపు కార్డులు అందిస్తున్న సుధాకర్ తదితరులు

మైలవరం విద్యార్థి ప్రతిభ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని 'డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా సమర్థవంతమైన, త్వరితగత పరిష్కారం', వినియోగదారుల హక్కులు, వారి ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో సాంకేతికత పాత్ర అంశంపై ఇటీవల విద్యార్థులకు వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో మైలవరం ఎస్.ఆర్.ఎస్.వి.ఆర్. జి.ఎన్.ఆర్. జిల్లా పరిషత్తు 9వ తరగతి విద్యార్థి షేక్ నాగుల్ షరీఫ్ డిబేటింగ్‌లో మూడో స్థానంలో నిలిచాడు. నగరంలోని కలెక్టరేట్‌లో జేసీ ఎస్.ఇలక్కియా సోమవారం బాలుడికి రూ.2,000 నగదు అవార్డు అందజేశారు. ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. డీఈవో చంద్రకళ, డీఎస్‌వో పాపారావు, ప్రధానోపాధ్యాయుడు ఎస్.సతీష్, గైడ్ టీచర్ గోపాల రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



జేసీ ఇలక్కియా నుంచి బహుమతి స్వీకరిస్తున్న షరీఫ్, పక్కనే డీఈవో చంద్రకళ, హెచ్ఎం.సతీష్, డీఎస్‌వో పాపారావు

బహిరంగ ప్రకటన

నా క్లయింటు యన్.టి.ఆర్. జిల్లా, మైలవరం మండలం, మైలవరం గ్రామం కాపురస్తురాలైన షేక్ షహీదాబేగం, W/o రబ్బాని, తండ్రి సయ్యద్ అబ్దుల్ ఖాదర్ తెలుపుకొను బహిరంగ ప్రకటన.

నా క్లయింటు మైలవరం గ్రామంలో ది. 1-2-1994వ తేదీన షేక్ శిలార్ సాహెబ్ కుమారుడు షేక్ ఆదాం వద్ద ది. 1-2-1994 1వ వార్డు ఖాళీ నివేశన స్థలం కొనుగోలు చేసి మైలవరం సబ్ రిజిస్ట్రారు ఆఫీసు నందు దస్తావేజు నెం. 466/1994గా విక్రయ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. స్థలం విస్తీర్ణం 135 గజాలు. దానిలో నా క్లయింటు ఇల్లు కట్టుకొని నివశిస్తున్నారు. నా క్లయింటుకు షేక్ రఫీ, షేక్ షఫీ అను కుమార్లు, జుబీదా సుల్తానా అనే కుమార్తె కలరు. వారికి వివాహాలు జరిపించినారు. అయితే ఈ ఆస్తిపై నా క్లయింటు ముగ్గురు సంతానమునకు ఎటువంటి సంబంధం లేదు. అదే విధంగా వారి యొక్క అప్పులతో కూడా నా క్లయింటుకు ఎటువంటి సంబంధం లేదు. ఒక వేళ నా క్లయింటుకు తెలియకుండా ఈ ఆస్తిని నా క్లయింటు సంతానము అమ్మిన యెడల, తాకట్టుపెట్టిన నా క్లయింటుకు ఎటువంటి సంబంధం లేదని తెలియచేయుచూ ఇది పూర్తిగా నా క్లయింటు స్వంత ఆస్తి అయి ఉన్నది. కొనుగోలు చేసిన నా క్లయింటుకు ఎటువంటి సంబంధం లేదని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

షెడ్యూలు: యన్.టి.ఆర్. జిల్లా, మైలవరం మండలం, మైలవరం గ్రామంలోని మైలవరం స॥రి॥ ఆఫీసు ఇలాకా డోర్ నెం. 1-170కు **హద్దులు: తూర్పు:** షేక్ ఆదాం స్థలం, **దక్షిణం:** పెందోట సర్వేశ్వరరావు గారి స్థలం, **పడమర:** ఆదాం గారి ప్లాటు, **ఉత్తరం:** రాకపోకల బజారు. ఈ హద్దుల మధ్య 135 చ॥గజాలు స్థలం, దానిలో గల RCC డాబా.

V.T. KISHORE, Advocate
D.No. 14-76, Mylavaram,
NTR Dist. 521230
మైలవరం, 29-12-2025

వెల్వడంలో కార్డన్ సెర్చ్

మైలవరం: మండలంలోని వెల్వడంలో సోమవారం తెల్లవారుజాము నుంచి సీఐ దాడి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సోదాల్లో రికార్డులు సరిగా లేని 45 ద్విచక్ర వాహనాలను స్వాధీన పర్చుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాల తయారీ నిబంధనలకు విరుద్ధంగా నడిపే వాటిని సీజ్ చేస్తామన్నారు. సరైన పత్రాలు లేకపోయినా, మోత మోగేలా సైలెన్సర్లను ఏర్పాటు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై కె.సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలు పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్, ఎస్సైలు

వృద్ధురాలి నేత్రదానం

గంపలగూడెం : మండల కేంద్రానికి చెందిన టంగుటూరి నారాయణమ్మ(90) అనారోగ్యం కారణంగా ఆదివారం రాత్రి మృతి చెందారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి గోగిరెడ్డి కృష్ణారెడ్డి చొరవతో కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించడంతో ఆమె నేత్రాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. సోమవారం నేత్ర నిధి నుంచి నిపుణులు గంపలగూడెం వచ్చి మృతి చెందిన మహిళ కళ్లలోని కార్నియాను సేకరించి తీసుకెళ్లారు.



నారాయణమ్మ (పాత చిత్రం)

పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలని రూరల్ జోన్ డీసీపీ లక్ష్మీనారాయణ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌ను ఏసీపీ ప్రసాదరావు, సీఐ చంద్రశేఖర్‌లతో కలిసి ఆయన తనిఖీ చేశారు. పలు దస్త్రాలు పరిశీలించి కేసుల పురోగతిపై సిబ్బందితో సమీక్షించారు. స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సై శ్రీను తదితరులు పాల్గొన్నారు.



దస్త్రాలు తనిఖీ చేస్తున్న డీసీపీ లక్ష్మీనారాయణ, పక్కన ఏసీపీ ప్రసాదరావు, సీఐ చంద్రశేఖర్

నమూనా పరీక్షా పత్రాల పంపిణీ

మైలవరం: మండలంలోని చంద్రాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన జూలూరు చంద్రశేఖర్ జ్ఞాపకార్థం, ఆయన కుమారుడు రాము వితరణతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నమూనా ప్రశ్నాపత్రాలతో ముద్రించిన పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వరదా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైలవరం: మండలంలోని చిలుకూరివారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పది విద్యార్థులకు, గతంలో ఆ పాఠశాలలో హెచ్ఎంగా పదవీ విరమణ పొంది, ఇటీవల మృతి చెందిన బీవీకే రామారావు జ్ఞాపకార్థం, ఆయన కుమారుడు బండి బాబు వితరణతో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాల హెచ్.ఎం కుసుమ కుమారి, యూటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చంద్రాల : పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించి, కోడి పందేల కోసం భారీ స్థాయిలో సిద్ధం చేస్తున్న 2,000 కోడి కత్తులను, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని తిరువూరు సీఐ గిరిబాబు, విస్సన్నపేట ఎస్సై జి.రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వారు చెప్పారు.



నిందితులు, స్వాధీనం చేసుకున్న కోడి కత్తులతో సీఐ గిరిబాబు, ఎస్సై రామకృష్ణ

యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) డైరీ, క్యాలెండర్లను ఎంపీడీవో చేకు చిన్న రాట్నాలు, ఎంఈవో సుధాకర్ సోమవారం ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.సి.హెచ్.వి సూర్యనారాయణ, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్. చంటిబాబు, ఏ.మరళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు మనదవ్వాలంటే!



నా భవిష్యత్తు ఎలా ఉంటుందో?...
- యువతరం సంశయం

వేగంగా దూసుకొస్తున్న ఏఐ, మాయమవుతున్న కొలువులు, పుట్టుకొస్తున్న కొత్త కోర్సులు, ఆరోగ్య, ఆర్థిక ఒత్తిళ్లు, యుద్ధాలు, మారుతున్న భౌగోళిక రాజకీయ స్వరూపాలు...


ఇవన్నీ ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా, కుటుంబపరంగా భవిష్యత్ సవాళ్లకు సన్నద్ధం కావాలని చెబుతున్న సంకేతాలే!

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సా (ఏఐ)... అగ్రరాజ్యాల అధికార యావా... కారణాలు ఏవైనా అనిశ్చితి ఖాయమనే విషయాన్ని 2025 స్పష్టం చేసింది. అలాగని భవిష్యత్తు భయపడాల్సింది కాదు సిద్ధపడాల్సింది.

మా పిల్లలు నిలదొక్కుకుంటారా?...
- తల్లిదండ్రుల ఆందోళన

యోగ క్షేమం వహామ్యహమ్ అంటే...
రేపటికి సిద్ధంగా ఉండడమే!
ఏడాది మారుతోందంటే కేవలం కేలండర్ మార్పు మాత్రమే కాదు. మన కొలువులు, ఆదాయం, ఆరోగ్యం, కుటుంబం, మనసు... ఇలా అన్నింటినీ పరీక్షించుకునే, సమీక్షించుకునే సమయం కూడా!
2026 మనకు ఏమిస్తుందనేది, మనం ఎంత సన్నద్ధంగా ఉన్నామనే దానిపై ఆధారపడి ఉంటుంది. సంసిద్ధత సవాళ్లను తొలగించకపోవచ్చు. కానీ వాటిని జయించే శక్తినిస్తుంది.
మరి సరికొత్త ఏడాదికి మన జీవితం... మనం ఎంత సన్నద్ధంగా ఉన్నాం?





భద్రత... నాలుగు స్తంభాలాట!

ఒకప్పుడు కుటుంబ భద్రత అంటే...
ఇల్లు, స్థిర ఉద్యోగం, కొంత పొదుపు!
రోజురోజుకూ వేగంగా మారుతున్న టెక్నాలజీ...
రాజకీయ, ఆర్థిక అనిశ్చిత ప్రపంచంలో భద్రతకు అర్థం మారుతోంది.
మార్పులకు భయపడకుండా వాటిని ఎదుర్కొనే సామర్థ్యం సంపాదించుకోవటమే భద్రమైన కుటుంబానికి అర్థం. కేవలం డబ్బుంటే సరిపోదు. భవిష్యత్తు భద్రత నాలుగు స్తంభాలపై నిలబడుతుంది.
డబ్బు, ఆరోగ్యం, నైపుణ్యం, సంబంధాలు... ఇవన్నీ సమపాళ్లలో ఉన్న కుటుంబమే సుభిక్షంగా ఉంటుంది.

3

రాహుల్, హైదరాబాద్‌లో మూడేళ్లుగా కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఏఐ టూల్స్ రావడంతో ఆయనున్న టీంలో ఐదుగురిని తొలగించారు. రాహుల్ మాత్రం సేఫ్.

ఎందుకు?

అతను భవిష్యత్తును ఊహించి డేటా ఎనలిటిక్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ముందే నేర్చుకున్నాడు.

- డిగ్రీలు ఒకప్పుడు ఉద్యోగ తలుపులు తెరిచే తాళంచెవిలాంటివి! కానీ ఇప్పుడు అదొక్కటే సరిపోవటం లేదు. డిగ్రీ ఉద్యోగాన్నిచ్చినా... దాన్ని నిలబెట్టేది మాత్రం నైపుణ్యమే. ఆ స్కిల్లింగ్ ఆగిపోయినా, పాతబడినా... ఆదాయం కూడా ఆగే ప్రమాదం ఉంది. కాబట్టి భవిష్యత్తులో కుటుంబాన్ని నిలబెట్టేది సంపద ఒక్కటే కాదు నైపుణ్యం కూడా!
- ఇంతదాకా ఏం చదివారు అని అడుగుతున్నవారే... ఇప్పుడు ఏం చేయగలగరని అడుగుతున్నారు... ఒకప్పుడు ఇంజినీరింగ్, ఎంబీఏలు జీవితానికి, జీతానికి గ్యారెంటీలుగా కనిపించేవి. కానీ ఇప్పుడు డిగ్రీలు మామూలైపోయాయి. నైపుణ్యం మనల్ని ఆ మామూలు నుంచి వేరు చేస్తోంది.
- ఉద్యోగం అంటే ఆరామ్ కుర్చీ కాదు. నిరంతర ప్రయాణం! ముమ్ముందు ఉద్యోగాలు ఇలాగే ఉండకపోవచ్చు. కొలువులు కొన్ని మాయం కావొచ్చు. కానీ ఒక్కటి మాత్రం కచ్చితంగా ఉంటుంది. అది... పని! అది చేయడం రావాలి. రావాలంటే నైపుణ్యం కావాలి.
- చిన్నప్పటి నుంచే పిల్లల చదువుల తీరు మారాలి. సమాధానాలు సరిగ్గా రాయటమే కాదు... సరైన ప్రశ్న అడగటాన్నీ ప్రోత్సహించాలి. మార్కులు ఎన్ని వచ్చాయనేది కాదు... సమస్యనెలా పరిష్కరిస్తున్నారనేది కీలకం. అదే భవిష్యత్తులో ఏఐ, ఆటోమేషన్ల మధ్య బతుకు మంత్రం అవుతుంది.
- అలాగని ఒకే స్కిల్ మీద ఆధారపడితే కూడా ప్రమాదమే. ఒకదాంట్లో పూర్తి పట్టు.... ఇతరాలపై అవగాహన అవసరం. ఉదాహరణకు- ఓ అకౌంటెంట్‌కు డాటా ఎనలిటిక్స్... మేనేజర్‌కు టెక్నాలజీ పరిజ్ఞానం, టెక్నీషియన్‌కు కమ్యూనికేషన్ స్కిల్! ఉద్యోగంలో భద్రత అంటే ఉద్యోగం మారినా... ఆదాయం ఆగని స్థితి. 40 ఏళ్ల వయసులో ఏం నేర్చుకుంటాం అనుకోవద్దు... నేర్చుకునే మనసుంటే అదే అసలు యవ్వనం!
- నిశితంగా చూస్తే ప్రపంచంలో అనిశ్చితితో పాటు అవకాశాలూ పెరుగుతున్నాయి. అందుకే పరిస్థితులను చూసి భయపడడం కాదు... వాటిపై స్పష్టత తెచ్చుకోవాలి. తప్పుచేసినా నేర్చుకునే ధైర్యం నేటి అవసరం. ఇతరులతో పోలిక కాదు... తనతో తనకు పోటీ... నిన్నటి తనకు... ఇవాల్టి తనకు పోలిక! ఏమైనా మెరుగయ్యామా అనే కొలబద్ద! అలా స్వీయాభివృద్ధికి బాటలు వేసుకునేవారిదే విజయం.

2026 మీకు కొలువునివ్వొచ్చు. ఇవ్వకపోచ్చు. కానీ ఉపయోగపడే మనిషిగా ఉంటే మాత్రం తప్పకుండా నిలబెడుతుంది. అందుకు సిద్ధంగా ఉండటమే మనం చేయాల్సింది.



చెక్ కరో..!

- కొత్త సాంకేతికత, డిజిటల్ అక్షరాస్యతలో మీ స్థానం?
- ఏఐ ఏజెంట్‌లో నైపుణ్యం పెంచుకుంటున్నారా?
- ప్రాంప్ట్ ఇంజినీరింగ్‌పై అవగాహన ఉందా?
- కోడింగ్ లాంగ్వేజ్‌లు, కొన్ని నాన్ కోడింగ్ నైపుణాలపై దృష్టి పెడుతున్నారా?
- ఏఐ ఎథిక్స్ తెలుసా?
- 20-20-20, ఎల్‌బో రూల్స్‌పై అవగాహన ఎంత?
- సైబర్ సెక్యూరిటీ విధానాలు తెలుసుకుంటున్నారా?
- డీప్‌ఫేక్‌పై అప్రమత్తంగా ఉంటున్నారా?
- నో కోడ్ ఆటోమేషన్ వినియోగిస్తున్నారా?
- వివిధ సోర్సుల్లో లభించే కంటెంట్‌ను నిశితంగా పరిశీలిస్తున్నారా?
- డిజిటల్ మర్యాదలు పాటిస్తున్నారా?
- నైపుణ్యాలను పెంపొందించుకునేలా వివిధ కోర్సులు చేస్తున్నారా?



ఇతరులను చూసో, ఇతరులు చెప్పారనో, ఉద్వేగంలోనో తీసుకునే నిర్ణయాలు, చేసుకునే తీర్మానాలు నిలవవు!
అవసరాలు, ప్రయోజనాల ఆధారంగా, వ్యక్తిగత మెరుగుదలకు ఉపయోగపడే వాటినే కొనసాగించాలి.
నిన్నటి కంటే ఈరోజు... ఈరోజుకంటే రేపు మిమ్మల్ని మరింత మెరుగ్గా చేసేవాటినే తీర్మానాల జాబితాలో ఉంచుకోవాలి.

4

సుధీర్ వయసు 41
మంచి ఆదాయం ఉంది. కానీ తీవ్రమైన ఒత్తిడీ ఉంది.
చుట్టూ అందరూ ఉన్నారు... కానీ ఆనందంలేదు.

కారణం?

ఒకే ఇంట్లో ఉంటారు కానీ మాట్లాడుకునేది వాట్సప్‌లో

- ఇళ్లలో టీవీల సైజ్‌లు పెద్దవయ్యాయి. ఫోన్లు స్మార్ట్ అయ్యాయి. పరస్పర సంభాషణలు చిన్నబోతున్నాయి. కమ్యూనికేషన్ పెరిగింది... కానీ కనెక్టివిటీ తగ్గింది!
- ఒంటరితనం అతిపెద్ద సమస్యగానే కాదు కొత్త వ్యాధిగా మారుతోంది. కుటుంబం ఉన్నా మనసు ఒంటరిగా ఉంటే ప్రమాదమేకదా!
- ఒకవైపు తల్లిదండ్రులు... వృద్ధాప్యంలోకి అడుగుపెడుతుంటే... పిల్లలు డిజిటల్ ప్రపంచంలో పెరుగుతున్నారు. ఈ రెండు తరాల మధ్య వారధి నిర్మించాల్సిందే.
- సిప్‌లు, షేర్‌మార్కెట్లే కాదు... సంబంధాలు కూడా పెట్టుబడులే. సమయం పెడితే లాభం... నిర్లక్ష్యం చేస్తే నష్టం. ఒకే ఇంట్లో ఉండి మాట్లాడుకోలేని సంబంధాలను మించిన ఘోరం మరోటి లేదు.
- మనవారికి సమయం ఇస్తే బంధాలు అవే బలపడతాయి. బలమైన సంబంధాలు ఆరోగ్యాన్ని కాపాడతాయి.

మనసే మనకు మొదటి పెట్టుబడి... దాన్ని రక్షించుకుంటే... ప్రశాంతంగా ఉంచుకుంటే భవిష్యత్తు ఎలా ఉన్నా భయపెట్టదు.
ఉద్యోగాలు మారవచ్చు... కొలువులు పోవచ్చు... ఆదాయాలు తగ్గవచ్చు.... ప్లాన్‌లు దెబ్బతినవచ్చు... ఇలాంటి అనిశ్చిత ప్రపంచంలో మనల్ని నిలబెట్టగలిగే అత్యంత ముఖ్యమైన నైపుణ్యం మానసిక స్థిరత్వం! అది కుటుంబ భద్రత నుంచి వస్తుంది. కుటుంబ భద్రత అంటే... ఎప్పుడైనా మాట్లాడగలిగే వాతావరణం ఉండటం. మావాళ్లున్నారని ధైర్యాన్నిచ్చే వాతావరణం ఉండటం. వారానికో రెండుసార్లు కలిసి భోజనం చేయటం... రోజూ 10 నిమిషాలు అంతా కలసి మాట్లాడుకోవడం! ఇవే నిజమైన రక్షణ గోడలు. అవే మానసిక స్థిరత్వాన్నిస్తాయి. ధైర్యాన్నిస్తాయి. వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. కుటుంబం మన మొదటి రక్షణచత్రం.

కుటుంబ భద్రతంటే సమస్యలు లేకపోవటం కాదు... ఉన్నప్పుడూ స్పష్టంగా ఉండగలగడం. ధైర్యంగా నిలబడటం.



చెక్ కరో..!

- వారంలో ఒక రోజును కుటుంబం కోసం కేటాయించుకుంటున్నారా?
- ఇంట్లోవారి మనోగతం తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారా?
- విభేదాలను సున్నితంగా పరిష్కరించుకుంటున్నారా?
- నిద్రకు ముందు కనీసం 5 నిమిషాలైనా భాగస్వామితో మాట్లాడుకుంటున్నారా?
- ఇద్దరి ప్రేమను, భాషను అప్పుడప్పుడు సమీక్షించుకుంటున్నారా?
- తినేటప్పుడు, నిద్రకు ముందు, లేచిన తర్వాత నో ఫోన్ జోన్ పాటిస్తున్నారా?
- ఆర్థిక అంశాలు కలిసి చర్చిస్తున్నారా?
- ఇతరుల వ్యక్తిగత సమయం, అభిరుచులను గౌరవిస్తున్నారా?
- భార్యాభర్తలు కలిసి చేయాలనుకున్న అంశాలు ఆచరణలో ఉన్నాయా?

1

గొడుగు వర్షాన్ని ఆపలేకపోవచ్చు. కానీ తడవకుండా నిలువరిస్తుంది. పొదుపు - మదుపు కూడా మనల్ని ఆపదలో ఆదుకునే నేస్తాలవుతాయి. అనిశ్చితిని ఎదుర్కొనే సామర్థ్యాన్నిస్తాయి.

చిత్తూరుకు చెందిన శాంతి దంపతుల నెల ఆదాయం రూ.45 వేలు.
అందరి ఇళ్లలోలాగానే పిల్లల స్కూల్ ఫీజులు, పెద్దవాళ్ల ఆరోగ్యం కోసం ఖర్చులు వాళ్లకూ ఉన్నాయి. ఇటీవల వారి వృత్తిజీవితంలో ఒడుదొడుకులొచ్చాయి. ఆదాయం ఆగిపోయింది. కానీ వాళ్ల జీవితం మాత్రం ప్రభావితం కాలేదు.

ఎలా సాధ్యమైంది?

6 నెలల ఎమర్జెన్సీ ఫండ్ చేతిలో ఉంది.
కుటుంబానికి హెల్త్ ఇన్సూరెన్స్ ముందే ఉంది.



- ఇంటి గోడలు, తలుపులు బలంగా ఉన్నాయా అని చూసుకున్నట్లే... కుటుంబానికి రక్షణ సక్రమంగా ఉందో లేదో కూడా చూసుకోవాలి. చాలామంది ప్రతినెలా సంపాదిస్తారు. కానీ ఒక్క నెల జీతం ఆగితే అంతా అల్లకల్లోలం! ఆర్థిక భద్రత అంటే... ఎక్కువ సంపాదన కాదు. తక్కువ అవసరాలు... అనిశ్చితిని తట్టుకునే శక్తి! అందుకే ఎంత ఎక్కువ జీతం వస్తుందని కాకుండా... ఆరునెలలు జీతం రాకున్నా నిలబడగలుగుతామా అనేది ప్రధానం! ఎమర్జెన్సీ ఫండ్.... అన్నిరకాల బీమాలే ఈ కాలపు రక్షణ గోడలు! అత్యవసర నిధి, బీమాలు, అనవసర ఈఎంఐలు తగ్గించుకోవటం అనేవి లగ్జరీలు కావు. జీవన రక్షణ పరికరాలు.
- మధ్యతరగతికి డబ్బు ఉన్నా టెన్షనే... లేకున్నా టెన్షనే! అంటే డబ్బు సమస్య అనేది జీతం తక్కువ ఉండటం వల్ల వచ్చేది కాదు.. ప్లానింగ్ లేకపోవటం వల్ల వచ్చేది. అందుకే సంవత్సరమంతా ఎంత సంపాదించాలని కాదు... ఎంత నిలబెట్టుకోవాలని ఆలోచించాలి. 20లలో ఏం చేయాలో, 30లలో ఏం చేయాలో, 40లలో ఏం చేయాలో ముందుగా ఆలోచించుకొని ఆచరణలో పెడితే నిశ్చింతగా ఉండొచ్చు.
- నిజానికి మనలో చాలా మంది ఆర్థిక అక్షరాస్యులం కాదు. ఆర్థిక ప్రణాళిక ఎలా రూపొందించుకోవాలో? ఎలా తెలివిగా మదుపు చేయాలో, పెట్టుబడి పెట్టాలో తెలిసినవారు చాలా తక్కువ మంది. ఆర్థిక ప్రణాళిక అంటే చాలామంది డబ్బులు దాచుకోవటం అనుకుంటారు. కేవలం దాచుకుంటేనే సరిపోదు. దాచుకున్నదాన్ని సరిగ్గా ఇన్వెస్ట్ చేయాలి. అలా చేయటంలో లాభం ఏంటి? రిస్క్ ఏంటో తెలియాలి.
- ఆదాయం ఎంత, ఖర్చు ఎంత, పొదుపు- మదుపు ఏమిటి? అనూహ్యమైన పరిస్థితులు ఎదురైతే ఎలా తట్టుకోవాలి? అనే అంచనాలతో అవసరమైన అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. కొవిడ్ తగ్గినా దాని ప్రభావం మన ఆరోగ్యాలపై, కుటుంబాలపై ఇంకా ఉంది. ఉపద్రవాల నుంచి రక్షణ కోసం ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా, టర్మ్ ఇన్సూరెన్స్ ఉండాలి.
- కుటుంబ ఆర్థిక భద్రత అనేది ఒక్కరి భుజస్కందాలపైనే కాదు... కుటుంబంలోని అందరి అవగాహనపై ఆధారపడి ఉంటుంది. అందుకే పిల్లలతో కలసి సేవింగ్స్, ఖర్చులు... బీమాల గురించి మాట్లాడుతుండాలి. అదే నిజమైన ఫైనాన్షియల్ లిటరసీ!

చెక్ కరో..!

- వార్షిక వ్యయాన్ని సమీక్షిస్తున్నారా?
- అత్యవసర నిధి ఏర్పాటు చేశారా?
- నామినీ వివరాలు అప్‌డేట్ చేసుకున్నారా?
- పన్ను పొదుపు విషయాలకు ప్రణాళిక ఉందా?
- ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకున్నారా?
- క్రెడిట్, సిబిల్ నివేదికలను తనిఖీ చేస్తున్నారా?
- అప్పులను తనిఖీ చేసి క్లియర్ చేసుకుంటున్నారా?
- దీర్ఘకాల పొదుపు, మదుపు చేస్తున్నారా?
- బీమా సొమ్మును సమీక్షిస్తున్నారా?
- మీ ఆస్తులను లక్ష్యాలకు అనుగుణంగా మారుస్తున్నారా?

మన లక్ష్యాలు చిన్నవా, పెద్దవా అనే విషయాన్ని ప్రకృతి పట్టించుకోదు. చిన్న లక్ష్యాలను ఏర్పరచుకుంటే మనలోని అంతర్గత శక్తి వాటిని సాధించేందుకు తోడ్పడుతుంది. పెద్ద లక్ష్యాలను కోరుకుంటే అందుకు తగ్గట్టు సామర్థ్యం రెట్టింపవుతుంది.

2

అనిల్ వయసు 34 ఏళ్లు.
రోజుకు 10 గంటలు లాప్‌టాప్ పైనే పని.
ఇటీవలే బీపీ, షుగర్ మొదలయ్యాయి.

డాక్టర్ చెప్పిన మాట

సమస్య నీది కాదు... నీ జీవన శైలిది.

- యుక్త వయసులో ఉన్నప్పుడు నిద్రలేకుండా... ఆహారం పట్టించుకోకుండా... ఎంజాయ్ చేస్తున్నాం. పిల్లలు కూడా జంక్‌ఫుడ్‌లకు అలవాటు పడుతున్నారు. మొబైల్‌పై చూపించే శ్రద్ధ శరీరంపై చూపించట్లేదు. రీల్స్‌కు ఇస్తున్న సమయం మనసుకు ఇవ్వట్లేదు. ఫలితంగా బీపీ, షుగర్, డిప్రెషన్‌లు ఇప్పుడు వయసును అడగటం మానేశాయి. అందరినీ అలుముకుంటున్నాయి. మూడు పదులు రాకముందే జుట్టు నెరుస్తోంది.
- కడుపు నిండితే సరిపోదు.... శరీరానికి కావాల్సిన పోషకాలు అందాలి. రోజుకు ఏది.. ఎంత తీసుకుంటున్నామో తెలుసుకోవాలి. డైట్ లిటరసీ కూడా కావాలి. ఈరోజు పిల్లల ఆహారం... రేపటి వారి శరీరం... మెదడు... రోగనిరోధక శక్తి! అంటే మనం పెట్టే తిండే భవిష్యత్ పౌరులను, దేశాన్ని తయారుచేస్తుంది.
- వ్యాధులు చెప్పిరావు. వయసెంతనీ అడగవు... మంచి జీవనశైలే నిజమైన ఔషధం. ఆరోగ్యంగా ఉండాలన్నా, ఆయుష్షు పెరగాలన్నా శారీరకంగా, మానసికంగా బలంగా ఉండాల్సిందే. వ్యాధి లేకపోవటమే ఆరోగ్యంగా ఉన్నట్లు కాదు... శక్తి, నిద్ర, చురుకుదనం ఉంటేనే నిజమైన ఆరోగ్యం. ఇంట్లో అంతా బిజీ... కానీ ప్రతి ఆదివారం... కలిసి నడక... ఇంటి భోజనం, ఫోన్ ఫ్రీ టైమ్... ఇలాంటి చిన్న అలవాట్లు పెద్ద ప్రభావం చూపుతాయి. ఆరోగ్యాన్ని పెంచుతాయి. మితిమీరిన స్క్రీన్‌టైమ్ శరీరాన్ని త్వరగా వృద్ధాప్యంవైపు నడిపిస్తుంది.
- అందుకే ఆరోగ్య భద్రతంటే... జిమ్‌లో మెంబర్‌షిప్, డైట్ కంట్రోల్ కాదు. జీవితంలో క్రమశిక్షణ. రోజూ నడక... సరైన నిద్ర, ఫోన్‌కు కొంత దూరం... ఆత్మీయ సంభాషణలు..... ఇవే మన భవిష్యత్తుకు బీమాలు...ధీమాలు! ఆరోగ్యాన్ని తర్వాత చూసుకుందాం అన్నామంటే... భవిష్యత్తును అప్పు పెట్టడమన్నట్లే!



మన ఆరోగ్యం మందులు, ఆసుపత్రులతో కాదు రోజువారీ అలవాట్లపై ఆధారపడి ఉంటుంది. ఏళ్లుగా మనం నిర్లక్ష్యం చేసిన అలవాట్ల వల్ల వ్యాధులు మొలకెత్తుతున్నాయి. వాటికి నారు నీరు పోసి పెంచేది మనమే.

చెక్ కరో..!

- ఏటా ఒక్కసారైనా ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారా?
- అవసరమైన వ్యాక్సిన్ల గురించి తెలుసుకుంటున్నారా?
- వైద్యుల సూచనల మేరకు కనీసం రెండేళ్లకు ఒకసారైనా దంతాలు శుభ్రం చేయించుకుంటున్నారా?
- తరచూ కంటి పరీక్షలకు వెళ్తున్నారా?
- ఆందోళన, మానసిక కుంగుబాటు, ఒత్తిడిని తగ్గించే జాగ్రత్తలు తీసుకుంటున్నారా?
- దినచర్య, నిద్ర సమయాలకు సరైన ప్రణాళిక పాటిస్తున్నారా?
- పౌష్టికాహారం, రోజులో కనీసం 60 నిమిషాలు శారీరక శ్రమకు కేటాయిస్తున్నారా?
- ఆరోగ్య బీమా తీసుకున్నారా?

ఇల్లు ఇటుకలతో కాదు...విలువలతో నిలబడుతుంది. అలాగే మంచి భవిష్యత్తు కేవలం అదృష్టంతో కాదు... సంసిద్ధతతో సాధ్యమవుతుంది!

రేపు ఏం జరుగుతుందో తెలుసుకోవటం కాదు. ఏం జరిగినా ఎదుర్కొనే సన్నద్ధత ముఖ్యం! సన్నద్ధత భవిష్యత్తుపై భయంతో కాదు. సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుకోవడం కోసం!

డబ్బు రావచ్చు పోవచ్చు... ఉద్యోగం మారొచ్చు... టెక్నాలజీ పాతది పోయి కొత్తది రావొచ్చు. కానీ నేర్చుకునే మనసు... మాట్లాడుకునే కుటుంబం... మారటానికి సిద్ధంగా ఉండే ఆలోచన...
ఉంటే ఏ కుటుంబమైనా భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్నట్లే!
కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వేళ మీరెంత సన్నద్ధం... చెక్ యువర్‌సెల్ఫ్!

- ఈనాడు ప్రత్యేక విభాగం

నాయిక 2025

వసుంధర

vasundhara@eenadu.in



రక్షణే లక్ష్యంగా...

ధైర్యం, తెగువ, దేశభక్తిలో పురుషులతో సమానంగా రాణించే మనోబలం ఉన్నా... త్రివిధ దళాల్లో నిర్ణీత పదవులకే మహిళల సేవలు పరిమితమయ్యాయి. ఈ వివక్షను రూపుమాపి నాయకత్వ స్థానాల్లో మహిళలకు చోటివ్వాలని ఎన్నో పోరాటాలు జరిగాయి. ఫలితం... ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది సైనిక, నౌకా, వైమానిక దళాల్లో చెరగని ముద్ర వేశారు మహిళా అధికారులు. నేటి తరాలకు స్ఫూర్తిగా మారిన ఆ ధీరల గురించి...

వీళ్ల విజయంతో మొదలై...

రక్షణ రంగంలో... మొదటి మెట్టు శిక్షణ. శక్తిసామర్థ్యాల ప్రదర్శనలో ఇదో మైలురాయి. అలా ఈ ఏడాది చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఓటీఏ)లో శిక్షణ పొంది... పురుషులతో పోటీపడి ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో బంగారు పతకాన్ని సాధించారు లెఫ్టినెంట్ **ప్రగతి ఠాకూర్**. అలానే 'స్వోర్డ్ ఆఫ్ ఆనర్', రజత పతకాన్ని దక్కించుకున్నదీ మహిళే. పేరు లెఫ్టినెంట్ **మాన్యా కుమార్**. ఈ విజయ పరంపరను కొనసాగించారు లెఫ్టినెంట్ **పారుల్ ధద్వాల్.** పంజాబ్‌లోని జవాన్ల నిలయమైన జనౌరీ గ్రామంలో పుట్టిపెరిగారీమె. ఐదుతరాలుగా పారుల్ కుటుంబం రక్షణ రంగంలో సేవలందిస్తోంది. దాంతో పారుల్ కూడా దేశ రక్షణలో భాగం కావాలని కలలు కన్నారు. కానీ, 'ఆడపిల్లవి నీకెందుకు ఇదంతా' అన్న వాళ్లే ఎక్కువ. అయినా పట్టుబట్టి ఓటీఏలో చేరారీమె. అలా లక్ష్య సాధనలో మొదటి అడుగు వేశారు. అదే నిబద్ధతతో శిక్షణలోనూ ప్రతిభ కనబరిచారు. దాని ఫలితంగా ఇటీవల జరిగిన పాసింగ్ పరేడ్‌లో బంగారు పతకాన్ని అందుకున్నారీమె.


పారుల్

ప్రతి కదలికా ఈమె వ్యూహం...

దేశరక్షణలో భాగం కావడం అంటే సరిహద్దు భద్రతే కాదు... రక్షణ రహస్యాల్ని కాపాడటం కూడా. రక్షిస్తున్న వాళ్లకి వెన్నంటే ఉండటమూ ఈ కోవలోకే వస్తుంది. అలా రాష్ట్రపతికీ ప్రభుత్వ విభాగాలకూ మధ్య సమన్వయ కర్తగా వ్యవహరించే కీలక బాధ్యతలు చేపట్టారు లెఫ్టినెంట్ కమాండర్ **యశస్వీ సోలంకి**. ఎయిడ్-డి-క్యాంప్(ఏడీసీ)గా నియమితులయ్యారీమె. హరియాణలోని చర్ఖీ దాద్రి జిల్లాలో పుట్టిపెరిగారు. చిన్నప్పట్నుంచీ సాయుధ దళాల్లో చేరాలని కలలు కనేవారట యశస్వి. అనుకున్నట్లుగానే 2012లో షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) పరీక్షలు రాసి, శిక్షణకు ఎంపికయ్యారు. అనంతరం భారత నావికాదళంలో లాజిస్టిక్స్ విభాగంలో మొదటి పోస్టింగ్. ఈ విభాగంలో రాణించాలంటే... కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమయానుకూలంగా స్పందించడం, ఎప్పటికప్పుడు పనులను షెడ్యూల్ చేసుకోవడం చాలా అవసరం. ఇవన్నీ అనతి కాలంలోనే అందిపుచ్చుకున్నారు యశస్వి. ఆమె కృషి, క్రమశిక్షణ, నాయకత్వ సామర్థ్యాలను మెచ్చిన అధికారులు... ఏడీసీగా పదోన్నతిని కల్పించారు. దాంతో గవర్నర్లకు ఏడీసీగా పనిచేశారీమె. ఈ ఏడాది రాష్ట్రపతికి ఏడీసీగా ఉండే బాధ్యతల్ని అందుకున్నారు. సమావేశాలు, పర్యటనలు వంటివి షెడ్యూల్ చేయడం, వ్యక్తిగత, భద్రతా సిబ్బందితో సమన్వయం, రహస్య డాక్యుమెంట్ల నిర్వహణ... వంటివన్నీ యశస్వి ఆధ్వర్యంలో ఉంటాయి. ఒక రకంగా రాష్ట్రపతి నిర్వహణ, పాలన వ్యవహారాల్లో వేసే ప్రతి కదలికని ఈమె ముందుగానే ప్లాన్ చేస్తారు. అన్నట్లు ఈ పదవి అందుకొన్న మొదటి మహిళ కూడా యశస్వినే.


యశస్వి


రహదారిని నిర్మించి...

కల్నల్ **పొనుంగ్ డోమింగ్**... ఈమెది అరుణాచల్‌ప్రదేశ్‌లోని పాసిఘాట్. వాల్‌చంద్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సివిల్ ఇంజినీరింగ్ చదువుకున్నారు. 2008లో ఎస్ఎస్‌సీ పరీక్ష రాసి శిక్షణకు ఎంపికయ్యారు. బాధ్యతల్లో చేరిన అనతి కాలంలోనే లద్దాఖ్‌లోని డెమ్‌చోక్ సెక్టార్‌లో ఎత్తైన రహదారి నిర్మాణ బాధ్యతలు అప్పగించారీమెకు. ఈ క్రమంలో మహిళా అధికారిణిగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారట. కానీ 'సంకల్ప బలం ఉంటే చాలు. అదే సవాళ్లను అధిగమించే ధైర్యం ఇస్తుంది' అంటారీమె. ఈ ఏడాది భారత్-చైనా సరిహద్దు రేఖ గుండా రహదారిని నిర్మించి వార్తల్లో నిలిచారు. గడ్డకట్టే చలి, మంచు కప్పేసిన రోడ్డును బాగుచేస్తూ రోజులో 9, 10 గంటలు పనిచేశారట. ఆ సేవల్ని మెచ్చిన ప్రభుత్వం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సేనా మెడల్‌ను బహూకరించింది.


పొనుంగ్

మరికొందరు...

- ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకల్లో... మోటార్ సైకిల్‌పై 12 అడుగుల నిచ్చెనపై నిల్చొని, వేగాన్ని నియంత్రిస్తూ రాష్ట్రపతికి గౌరవ వందనం చేశారు కెప్టెన్ **డింపుల్ సింగ్ భాటి.** డేర్‌డెవిల్స్ బృందానికి చెందినవారీమె. ఈ టీమ్‌లోకి అడుగుపెట్టిన మొదటి మహిళ కూడా.
- సరిహద్దు వెంబడి చొరబాటుదార్లను నియంత్రించడానికి ఉపయోగించే జాగిలాల హ్యాండ్లర్‌గా ఎంపికయ్యారు **పి.వి శ్రీలక్ష్మి**. అడ్వాన్స్‌డ్ కోర్సులన్నీ పూర్తిచేసి అసోం రైఫిల్స్‌లో భాగమయ్యారీమె. ఈ పదవిని అందుకొన్న తొలి మహిళ.
- ఆపరేషన్ సిందూర్... పహల్గాం దాడుల తర్వాత భారత ప్రభుత్వం దాయాదుల దేశంపై విరుచుకుపడిన మిలిటరీ ఆపరేషన్. దీనికి మీడియా బ్రీఫింగ్ ఇచ్చి వార్తల్లో నిలిచారు కల్నల్ **సోఫియా ఖురేషి**, వింగ్ కమాండర్ **వ్యోమికా సింగ్**.
- నేవీ ఏవియేషన్‌లో తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా నిలిచి చరిత్ర సృష్టించారు **ఆస్థా పూనియా**.
- ఈ ఏడాది వైమానిక దళానికి అత్యంత ముఖ్యమైన మిగ్-21 యుద్ధ విమానాలకు వీడ్కోలు పలికే బృందంలో ఒకరిగా నిలిచారు స్క్వాడ్రన్ లీడర్ **ప్రియా శర్మ**.



జనం మెచ్చిన కలెక్టరమ్మలు!


చేతిలో అధికారం ఉంటే పెత్తనం చలాయించే వాళ్లు కొందరైతే, దాన్ని ప్రజాసేవకు మళ్లించే వాళ్లు ఇంకొందరు. రెండో కోవకు చెందుతారు ఈ యువ ఐఏఎస్ అధికారిణులు!

ప్రపంచంలోనే అత్యుత్తమం...



తమిళనాడు, తంజావూరు ప్రజలు 'మా కలెక్టర్ ప్రపంచంలోనే అత్యుత్తమం' అంటూ **ప్రియాంక బాలసుబ్రమణ్యన్‌**ను పొగిడేస్తున్నారు. ఆమె అధికారిణిగా కాకుండా సాటి మనిషిగా అందరికీ సాయపడుతుండటమే దీనికి కారణం. తన దగ్గరకు వచ్చే వాళ్లందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ, వాళ్ల సమస్యల్ని తెలుసుకుని, పరిష్కారానికి తక్షణమే ఆదేశిస్తారు. తమిళనాడు గిండీ కాలేజ్ నుంచి ఇంజినీరింగ్, ఐఐఎమ్ బెంగళూరు నుంచి ఎంబీఏ పూర్తిచేశారు ప్రియాంక. కార్పొరేట్ కెరియర్ కాదనుకుని సివిల్ సర్వెంట్‌గా మారారు. విద్యా రంగానికి చాలా ప్రాధాన్యం ఇస్తారు. తరచూ స్కూళ్ల తనిఖీలకు వెళ్తారు. పోషకాహారం, నైపుణ్యాల విషయంలో రాజీ లేని బాట ఆమెది. అధికార దర్పం ఆమెలో ఇసుమంతైనా కనిపించదు.

ఏఐతో లెక్క తేల్చేశారు...



డాక్టర్ సౌమ్య ఝా... రాజస్థాన్‌లోని టోంక్ జిల్లా కలెక్టర్. పదో తరగతి విద్యార్థుల్లో 90 శాతం తాము సైన్స్ రంగంలో అడుగుపెడతామని చెప్పేవారు. కానీ నిజంగా ఆ గ్రూపుల్లో చేరేవాళ్లు మాత్రం కేవలం 12 శాతమే ఉండేవారు. కారణం ఎక్కువమంది గణితం అంటే భయపడటమే. దీని వెనక కారణాలు టీచర్ల కొరత, ఉన్నవాళ్లకీ సబ్జెక్టులో లోతైన పరిజ్ఞానం లేకపోడం, టీచర్లు, విద్యార్థుల గైర్హాజరీ... ఇవన్నీ వచ్చాయి. ముఖ్యంగా హిందీ మీడియం చదివేవాళ్లలో ఈ లోపాలు కనిపించేవి. పరిష్కారంగా ఏఐని ఉపయోగించాలనుకున్నారు. 'పఢాయీవిత్ఏఐ.ఇన్' పేరుతో వెబ్‌సైట్ ప్రారంభమైంది ఈ వెబ్‌సైట్‌లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేవారు. వాళ్లు జవాబు రాయని ప్రశ్నలేంటో తెలిసేవి. రివ్యూ చేసినప్పుడు అలాంటి ప్రశ్నలకు జవాబులు వివరించేలా చేశారు. దీంతో గణితంలో ఉత్తీర్ణత శాతం మూడు పాయింట్లు పెరిగింది. పిల్లలు సాధించిన మార్కులూ పెరిగాయి.

వరదల్లోనూ బెదరకుండా...



ఈ ఏడాది ఆగస్టు-సెప్టెంబరులో పంజాబ్‌లో వరదలు వచ్చాయి. అజ్నాలా జిల్లాలో 20 గ్రామాల్లో వరద తీవ్రత ఎక్కువగా ఉంది. అప్పటికి డెప్యూటీ కమిషనర్ ఆఫ్ అమృత్‌సర్‌గా ఉన్న **సాక్షి సాహ్నాయ్**... ప్రత్యేక అధికారిగా క్షేత్రస్థాయిలో పనిచేశారు. వందల సంఖ్యలో రంగంలోకి దిగిన ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, రెడ్ క్రాస్‌కు చెందిన దళాల్ని సమన్వయ పరుస్తూ సహాయ కార్యక్రమాల్ని చేపట్టారు. తానుగా మోకాలి లోతువరకూ నీరున్న చోటా వరద ప్రాంతాల్లో పర్యటించారు. వేలమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తర్వాత వాళ్లు తలదాచుకున్న ఇళ్లు, పాఠశాలలు, హాస్పిటల్స్‌ను పర్యవేక్షించారు. ప్రస్తుతం గ్రేటర్ మొహాలీ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి చీఫ్ అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్నారు సాక్షి.

హీరో పక్కన హీరోయిన్! నాన్న పక్కన అమ్మ... ఇంతేనా అమ్మాయిల పాత్ర! ఆమెకంటూ కథలుండవా? వాటిని విస్మరిస్తే సగం ప్రపంచాన్నే చూసినట్లవ్వదా? ఈ తీరునే మార్చాలనుకున్నారు వీళ్లు. 'ఆమె' ఆలోచనలు, సమస్యలు, చూసే కోణం... ఇలాంటివెన్నో తెర మీద ఆవిష్కరిస్తూ ప్రపంచాన్ని ఆకర్షించారు. ఈ ఏడాది అంతర్జాతీయ పురస్కారాలనీ అందుకున్నారు.



ఆమె కథలతో...

వాళ్ల స్ఫూర్తితో...

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, అనుకోకుండా సినిమాతో ప్రేమలో పడ్డారు. దానికోసం ఆరేళ్ల రూపాయి రూపాయి పోగేసి మరీ షార్ట్ ఫిల్మ్ రూపంలో ఆ కల నెరవేర్చుకున్నారు... **అనుపర్ణ రాయ్**. ఈమెది పశ్చిమ బెంగాల్‌లోని ఓ గిరిజన గ్రామం. దిల్లీలో ఉద్యోగం చేసే క్రమంలో సినిమాలపై అవగాహన పెంచుకున్నారు. ఆపై ముంబయి చేరుకుని, తొలి సినిమా 'సాంగ్స్ ఆఫ్ ఫర్‌గాటెన్ ట్రీస్' తీశారు. దీనికి తన నానమ్మ కథే స్ఫూర్తి. 'నానమ్మకి బాల్యంలోనే పెళ్లైంది. తాతకి 30 ఏళ్లు. అప్పటికే పెళ్లై, ఓ కూతురు కూడా. ఆమె వయసూ నానమ్మ వయసూ ఒకటే కావడంతో ఇద్దరూ స్నేహితులయ్యారు. తాత చనిపోయాక ఇద్దరూ ఉద్యోగాలు చేస్తూ కుటుంబాన్ని నడిపించారు' అని గుర్తుచేసుకుంటారు అనుపర్ణ. వాళ్లిద్దరి స్ఫూర్తితో ముంబయికి వలస వెళ్లిన ఇద్దరు మహిళలు, భావోద్వేగాలు, సమస్యలు, ఒంటరితనం వంటివి వాళ్లు ఎదుర్కొనే తీరునే చిత్రంగా తీసుకొచ్చారు. వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఒరిజొంటి కేటగిరీలో అవార్డు అందుకున్నారు అనుపర్ణ. దీన్ని అందుకున్న తొలి భారతీయ డైరెక్టర్ ఈమె.

గుర్తింపు ఎక్కువే!

భర్తకు దూరంగా నివసించే ఓ నర్సు... వ్యక్తిగత స్వేచ్ఛకీ కుటుంబ నియంత్రణకీ మధ్య నలిగే ఓ అమ్మాయి... సొంత గూడు కోల్పోతానేమోనని భయపడే ఓ వృద్ధురాలు... ఈ మూడు జీవితాల నడుమ సాగే కథే 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్'. దీన్ని అందరి ముందుకూ తీసుకొచ్చారు దర్శకురాలు **పాయల్ కపాడియా**. గత ఏడాది ఈ ఫీచర్ ఫిల్మ్‌కి గానూ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గ్రాండ్ ప్రిక్స్ అవార్డును అందుకున్న ఆమె... ఈ ఏడాదీ ఆ పరంపరను కొనసాగించారు. ఫ్రెంచ్ ప్రభుత్వం నుంచి 'ఆఫీసర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్' గౌరవాన్ని అందుకున్నారు. ఏషియన్ ఫిల్మ్స్ అవార్డ్స్ నుంచి బెస్ట్ ఫిల్మ్ అవార్డుని దక్కించుకున్నారు. గోల్డెన్ గ్లోబ్ నామినేషన్స్‌లోకీ తన సినిమా వెళ్లింది. 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి జ్యూరీ మెంబర్‌గానూ ఎంపికయ్యారు పాయల్. ముంబయికి చెందిన ఈమె స్క్రీన్ రైటర్‌గా, దర్శకురాలిగా ప్రపంచ సినీ రంగంలో తనదైన ముద్ర వేశారు. ఈ క్రమంలో ఆమె దాటిన సవాళ్లెన్నో. పాయల్ కథలన్నీ స్త్రీల సమస్యలు, కట్టుబాట్లు, మనోభావాల్ని ప్రపంచానికి తెలియజేసేలా ఉంటాయి. అయితే అవన్నీ అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకర్షించడమే కాదు, కొత్తతరం దర్శకులు, రచయితలకు స్ఫూర్తిగానూ నిలుస్తున్నాయి.

గ్రామం నుంచి వచ్చి...

సిక్కింలోని నాందోక్ అనే గ్రామం **త్రివేణి రాయ్**‌ది. చిన్నప్పట్నుంచీ కథలంటే ఇష్టం. అదే తనను సినిమాలవైపు నడిపిందంటారామె. అయితే ఆమె కథలకు మూలం మాత్రం మహిళలు, వారిపై ఉండే సామాజిక అంచనాల ఒత్తిడే! సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ నుంచి డైరెక్షన్, స్క్రీన్‌ప్లే రైటింగ్‌ల్లో డిగ్రీ చేశారు. షార్ట్‌ఫిల్మ్స్, డాక్యుమెంటరీలెన్నో తీశాక... తొలిసినిమా 'షేప్ ఆఫ్ మోమో' తీశారు త్రివేణి. పర్వత ప్రాంతాల్లో సంప్రదాయాలు, కుటుంబ అంచనాల మధ్య నలిగిపోయే ఓ అమ్మాయి కథని ఈ సినిమాగా తీసుకొచ్చారు. ఇది కేన్స్ సహా పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమైంది. బూసాన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రెండు, హాంకాంగ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఒకటి చొప్పున అవార్డులను అందుకుంది. త్రివేణికి సొంత ప్రొడక్షన్ హౌజ్ కూడా ఉంది. దీని ద్వారా సినిమాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు వర్క్‌షాప్‌లనీ నిర్వహిస్తుంటారీమె.

ప్రతి రూపాయి పోగేసి...

ప్రముఖ నటుడు ఆయుష్మాన్ ఖురానా భార్యగా కంటే రచయిత్రి, దర్శకురాలు, మోటివేషనల్ స్పీకర్, వెల్‌నెస్ అడ్వొకేట్‌గానే ఎక్కువ గుర్తింపు తెచ్చుకున్నారు **తాహిరా కశ్యప్**. మాస్ కమ్యూనికేషన్ చదివిన ఈమె మొదట రేడియో జాకీగా, రైటర్‌గా కెరియర్ ప్రారంభించారు. తరవాత సినిమాల్లోకి వచ్చారు. రొమ్ము క్యాన్సర్‌ని ఎదుర్కొన్నారు తాహిరా. తన ప్రయాణాన్ని అందరికీ చెప్పి మరీ క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తుంటారు. భావోద్వేగాలు, అనుబంధాలు, స్వీయ ప్రాముఖ్యం వంటి అంశాల చుట్టూనే ఆమె కథలు ఉంటాయి. సున్నితమైన కథలు... హృద్యంగా చెబుతారన్న పేరు తెచ్చుకున్నారు తాహిరా. అలా ఆమె రచించి, తీసిన తొలి ఫీచర్ ఫిల్మ్ 'శర్మాజీ కీ బేటీ' కంటెంట్ ఏషియా అవార్డ్స్‌లో 'బెస్ట్ ఏషియన్ ఫీచర్ ఫిల్మ్' పురస్కారాన్ని అందుకుంది.

నాన్న సంపాదనలో నాకు భాగం లేదా?

నాకు 18 ఏళ్లకి పెళ్లి చేసి పంపించారు. అప్పటి ఆర్థిక పరిస్థితులకు తగ్గట్లు కట్నకానుకలు ఇచ్చారు. తర్వాత మా నాన్న వ్యాపారం వృద్ధి చెందింది. పేదరికం నుంచి గట్టెక్కి ఆస్తులు సంపాదించారు. ఇప్పుడు నేను ఆస్తిలో వాటా అడిగితే అన్నలు అడ్డుపడ్డారు. నేను గడప దాటాకే వాళ్లకి కలిసొచ్చిందంటూ మాటలతో బాధపెడుతున్నారు. నాన్న కూడా మాట్లాడటం లేదు. నాకు వాటా వస్తుందా? – ఓ సోదరి


డియర్ వసుంధర


జి. వరలక్ష్మి
న్యాయవాది

మీ నాన్న స్వార్జితం మీది కాదు. ఆయన ఇష్టపూర్వకంగా ఇస్తే తీసుకోవచ్చు. తన తదనంతరం ఎలాంటి విల్లు రాయకుండా మీ తండ్రి చనిపోతే మీకు కూడా ఆస్తిలో వాటా వస్తుంది. ఆయన ఇప్పుడు మగ పిల్లల మీద ఆధారపడి, వారితో కలిసి వ్యాపారం చేస్తూ ఉండవచ్చు. కొడుకులకి ఎదురు చెప్పి ఆ బిజినెస్‌ని పాడు చేసుకోవడం ఇష్టం లేకపోయి ఉండొచ్చు. మీరు మీ బంధాలను చెడగొట్టుకోవద్దు. ఆస్తుల కంటే అనుబంధాలు ముఖ్యం అనుకుంటే ఎప్పటికైనా ఆస్తి వస్తుంది. హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం హిందువు అయిన పురుషుడు ఎటువంటి వీలునామా రాయకుండా చనిపోతే అతని ఆస్తి క్లాస్-1 వారసులకు అంటే... భార్యకీ పిల్లలకీ సమానంగా వస్తుంది. ఈ లోపు మీ అన్నయ్యలు రాయించుకుంటే చెప్పలేం. ఆస్తులు అంటే... ఇల్లు, పొలాలు లాంటివి స్థిరాస్తులు. బంగారం, డిపాజిట్లు... వంటివి చరాస్తులు. ఇల్లు, పొలాలు వంటివి వారు రాయించుకున్నా బంగారం, నగదులో వాటా అడగొచ్చు. తొందరపడకండి.

తల పిన్నులు తళుక్కుమన్నాయి...

నగా నట



కాలచక్రం గిర్రున తిరిగినట్లే ఫ్యాషన్లూ ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి. అలాగని ఎప్పుడూ నయా రకాలే ఆకట్టుకుంటాయి అనుకోవద్దు. పాతవీ, అమ్మమ్మలు, నానమ్మల కాలం నాటివీ కొత్త హంగులద్దుకుని వచ్చేస్తుంటాయి. అలాంటివే ఈ బంగారు తల పిన్నులు కూడా. ఇవి ఈ ఏడాది ఎక్కువగా సందడి చేశాయి. పెళ్లి, ఓణీల ఫంక్షన్, పూజలు... ఇలా సందర్భం ఏదైనా వయసుతో సంబంధం లేకుండా అందరి తలమీదా తళుక్కుమన్నాయి. అయితే, ఒకప్పటిలా ఎక్కువ బంగారంతో కాకుండా పంజాబీల సంప్రదాయమైన సట్లేజ్ హెయిర్‌పిన్నులను పోలి ఉండేలా తక్కువ బరువుతో వీటిని రూపొందించారు. సంప్రదాయంగా మెరిసిపోవాలనుకునే ప్రతి అమ్మాయి వీటిని ఎంచుకుని తెగ మురిసిపోయింది. అలాంటి డిజైన్లలో ఇవి కొన్ని. బాగున్నాయి కదూ!





బంగారం - వెండి



29న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,39,680	1,29,850	2,33,049
విజయవాడ	1,32,855	1,29,900	2,58,100
ప్రొద్దుటూరు	1,42,300	1,30,920	2,46,000
రాజమహేంద్రవరం	1,40,400	1,28,700	2,81,000
విశాఖపట్నం	1,39,970	1,28,300	2,55,000
తమిళనాడు	-----	1,30,200	2,81,000

నా విజయం

ఆన్‌లైన్ నుంచి బ్రాంచ్‌ల దాకా!

నేను పెళ్లయ్యాక జియాలజీలో ఎంఎస్‌సీ చేశా. అందులో ఒక సబ్జెక్టు జెమాలజీ. అలా నాకు జ్యువెలరీపై ఆసక్తి ఏర్పడి ఆ రంగంలోకి వచ్చా. ఆర్టిఫిషియల్ జ్యువెలరీ తయారీ మొదలుపెట్టా. అందరూ నిరుత్సాహపరిచినా నేను మాత్రం ధైర్యంగా కొనసాగించా. మొదట్లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆన్‌లైన్‌లో అమ్మేదాన్ని. నా డిజైన్లు నచ్చి ఫాలోవర్లు పెరిగారు. వ్యాపారమూ పెరిగింది. దీంతో ఈ ఏడాది విజయవాడ, గుంటూరుల్లో బ్రాంచ్‌లు ప్రారంభించా. ఇంటి వద్ద కూడా అమ్మకాలు చేపడుతున్నా. 9 మందికి ఉపాధినీ కల్పిస్తున్నా. ఇంట్లో వాళ్ల ప్రోత్సాహంతోనే నచ్చిన దాంట్లో రాణించగలుగుతున్నా. ఈ ఏడాది మరింత అభివృద్ధి చెందాలి, మరెంతో మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నా.



– నిధి మేఖల

రంగవల్లిక

21 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకూ




కల్లెం లావణ్య
హైదరాబాద్

15 చుక్కలు
1 వచ్చేవరకూ




కరవది రాజేశ్వరి
ఏలూరు




ఎన్. సమీర
హైదరాబాద్

13 చుక్కలు
1 వచ్చే వరకూ

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

చాంపియన్

అగ్రస్థానంలో అర్జున్

- కార్ల్‌సన్‌పై విజయం
- ప్రపంచ బ్లిట్జ్ చెస్


అర్జున్

బల్లను బలంగా కొడుతున్న కార్ల్‌సన్

దోహా: ప్రపంచ ర్యాపిడ్ చెస్‌లో కాంస్యం గెలిచిన భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి.. బ్లిట్జ్‌లోనూ సత్తా చాటుతున్నాడు. 13 రౌండ్లు ముగిసే సరికి 10 పాయింట్లు సాధించిన అతడు.. వాచీర్ లాగ్రేవ్ (10, ఫ్రాన్స్), కరువానా (10, అమెరికా)తో కలిసి అగ్రస్థానంలో ఉన్నాడు. 8 గేముల్లో గెలిచిన అర్జున్.. నాలుగింటిని డ్రాగా ముగించాడు. ఒక గేమ్‌లో ఓడిపోయాడు. అర్జున్ తొమ్మిదో రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)ను ఓడించడం విశేషం. ఓటమి అనంతరం కార్ల్‌సన్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. టేబుల్‌ను గుద్దాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కరువానా చేతిలోనూ ఓడిన కార్ల్‌సన్.. ప్రస్తుతం 9 పాయింట్లతో ఉన్నాడు. నారాయణన్ (9) ఉమ్మడిగా మూడో స్థానంలో ఉన్నాడు. ప్రజ్ఞానంద ఏడు విజయాలు, నాలుగు డ్రాలు, రెండు ఓటములతో 9 పాయింట్లు సాధించాడు. గుకేశ్ 8.5 పాయింట్లతో ఉన్నాడు. టోర్నీలో మరో ఆరు రౌండ్లు మిగిలి ఉన్నాయి. అన్ని రౌండ్లు పూర్తయ్యే సరికి తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన ఆటగాళ్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తారు. మహిళల విభాగంలో 10 రౌండ్లు ముగిసే సరికి ఫ్రాన్స్‌కు చెందిన రోబర్స్ ఎలీన్ 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. దివ్య (6 పాయింట్లు), హంపి (5 పాయింట్లు), హారిక (5.5), వైశాలి (5.5) బాగా వెనుకబడ్డారు. మహిళల విభాగంలో మరో 5 రౌండ్లు ఆడాల్సి వుంది. తర్వాత సెమీఫైనల్స్ ఉంటాయి.


చదరంగం.. అదరంగ


ప్రేక్షకులు ఉర్రూతలూగిపోయేందుకు అది క్రికెట్ కాదు, ఫుట్‌బాలూ కాదు. ఇద్దరు ప్లేయర్లు మౌనంగా చేసే యుద్ధం. అదే ఎత్తుల రణరంగం.. చదరంగం! అలాంటి ఆటలో భారత్ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ఒకప్పుడు ఒక ఆటగాడు మాత్రమే ప్రపంచంపై దండెత్తిన ఈ ఆటలో.. ఇప్పుడు భారత్ నుంచి పెద్ద సైన్యమే పోరాడుతోంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఒక పతకం వస్తే గొప్పగా భావించే రోజుల నుంచి ఇద్దరు క్రీడాకారులు పతకం గెలిచే స్థాయికి చేరుకుంది. తాజా ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్పే ఇందుకు నిదర్శనం. ఓపెన్ విభాగంలో అర్జున్ ఇరిగేశి.. మహిళల్లో కోనేరు హంపి కాంస్య పతకాలతో మెరిసి దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు.

ఈనాడు క్రీడావిభాగం

ప్రపంచ చెస్ టోర్నీలు జరిగితే ఒకప్పుడు భారత్ నుంచి విశ్వనాథన్ ఆనంద్ పేరే వినిపించేది. ఆ తర్వాత ఆ పరిస్థితి మారింది. విషీ బాటలో.. అతడి స్ఫూర్తితో చాలామంది భారత ప్లేయర్లు అంతర్జాతీయ తెరపైకి దూసుకొచ్చారు. ఒకరు విఫలమైనా.. మరొకరు బ్యాటన్ అందుకుంటూ దేశ ప్రాతినిధ్యాన్ని నిలబెడుతున్నారు. దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ అయితే.. మహిళల్లో దివ్య దేశ్‌ముఖ్ ప్రపంచకప్ గెలిచింది. ప్రజ్ఞానంద సంచలన విజయాలు సాధిస్తూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించాడు. తాజాగా ప్రపంచ ర్యాపిడ్ చెస్‌లో హంపి, అర్జున్ సాధించిన విజయాలు చెస్‌లో భారత్ సత్తాకు నిదర్శనం. వీరిద్దరూ భిన్న తరాలకు ప్రతినిధులు. రెండు దశాబ్దాలుగా దేశ మహిళల చెస్‌లో హంపి మార్గదర్శిగా ఉంటే.. అర్జున్ ఈ తరం కుర్రాడు. వీళ్లిద్దరి పయనం యువ క్రీడాకారులకు ఆదర్శం.

ర్యాపిడ్.. పేరులోనే ఉంది వేగం.. ఆ వేగాన్ని అందుకోవాలంటే ఎంత చురుగ్గా ఆలోచించాలి? ఎంత సాహసోపేతంగా ఎత్తులు వేయాలి? వయసు పెరిగితే ఇలాంటి ఫార్మాట్లో సత్తా చాటడం కష్టం. కానీ కోనేరు హంపి ఇందుకు భిన్నం. వయసు పెరిగినా మరింత పదునుగా, మరింత దూకుడుగా ఆడుతుందీ తెలుగమ్మాయి. క్లాస్ శాశ్వతం.. అనే మాటకు ఉదాహరణగా దూసుకెళ్తోంది. 15 ఏళ్లకే మహిళల గ్రాండ్‌మాస్టర్ అయిన హంపి.. సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఘనతలు అందుకుంది. ముఖ్యంగా ర్యాపిడ్‌లో అయిదు ప్రపంచ పతకాలు గెలవడం ఈ ఫార్మాట్లో ఆమెకున్న పట్టుకు నిదర్శనం. 2018 వరకు ఆమె సాధించింది ఒక ఎత్తయితే.. ఆ తర్వాత మరో ఎత్తు. పెళ్లి అయి.. బిడ్డ పుట్టిన తర్వాత పునరాగమనంలో హంపి అదరగొడుతోంది. 2019లో ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి గెలిచిన 38 ఏళ్ల హంపి.. 2024లోనూ ఛాంపియన్ అయింది. ఈ ఏడాది డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగి కాంస్యమే గెలిచినా అది గొప్ప ప్రదర్శనే. 11 రౌండ్లలో ఒక్క గేమ్ కూడా ఓడిపోని హంపి.. చివరి గేమ్‌లో డ్రా చేసుకోవడం వల్ల కొద్దిలో టైటిల్ నిలబెట్టుకునే అవకాశాన్ని చేజార్చుకుంది. సవితతో గేమ్‌లో బిషప్‌ను తప్పుగా జరపడంతో డ్రా అయి హంపి టైటిల్ అవకాశాలను దెబ్బ తిన్నాయి. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలవాలని పట్టుదలగా పోరాడుతున్న హంపి.. ఆ ఘనత అందుకునే దిశగా అడుగులు వేస్తోంది.


హంపి


అర్జున్

దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద.. భారత పురుషుల చెస్‌లో కొన్నేళ్లుగా ఎక్కువగా వినిపిస్తున్న పేర్లివి. వీళ్లకు ఏమాత్రం తీసిపోని ఆటగాడు అర్జున్ ఇరిగేశి. తక్కువ వ్యవధిలో ఈ తెలంగాణ కుర్రాడు ప్రపంచ స్థాయి ప్లేయర్‌గా ఎదిగాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత 2800 ఎలో రేటింగ్ సాధించడం, లైవ్ రేటింగ్‌లో భారత నంబర్‌వన్ కావడం అతడి సత్తాకు నిదర్శనం. ఒకవైపు గుకేశ్, ప్రజ్ఞానంద టైటిళ్లు సాధిస్తుంటే.. అర్జున్ ఆచితూచి అడుగులు వేశాడు. గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ కావడం, మరోవైపు ప్రజ్ఞానంద క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించడం అర్జున్‌పై ఒత్తిడి పెంచాయి. టాటా స్టీల్ చెస్, క్యాండిడేట్స్ అర్హత టోర్నీల్లో విఫలమైన అర్జున్.. ఆ తర్వాత పుంజుకునే ప్రయత్నం చేశాడు. పెద్ద టోర్నీల్లో రాణించలేడనే ముద్రను చెరిపేసే దిశగా అడుగులు వేశాడు. కీలక సమయాల్లో తడబడే బలహీనతను విడిచిపెట్టి.. ప్రపంచ ర్యాపిడ్ టోర్నీలో అదరగొట్టాడు. ఒక దశలో అతడు టైటిల్‌కు ఫేవరెట్‌గా నిలిచాడు. మాగ్నస్ కార్ల్‌సన్ లాంటి ఉద్ధండుడు బరిలో ఉన్నా కూడా.. అర్జున్ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. ఆఖరి రౌండ్ దాకా టైటిల్ వేటలో నిలిచాడు. 11వ రౌండ్లో పెద్దగా పేరు లేని యగిజ్ ఖాన్ చేతిలో ఓటమి అతడిని దెబ్బ తీసింది. అయినా కోలుకుని చివరి రెండు రౌండ్లలో విజయాలు సాధించాడు. మొత్తంగా 9.5 పాయింట్లతో వ్లాదిస్లావ్, పెరీజ్, నీమన్‌తో సమానంగా నిలిచినా.. ఉత్తమ టైబ్రేక్ స్కోరుతో అర్జున్ కంచు గెలిచాడు. ఇది పతకం మాత్రమే కాదు అతడి ఆత్మవిశ్వాసం ఎన్నో రెట్లు పెంచే ప్రేరకం. పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా.. ఒత్తిడికి గురి కాకుండా 22 ఏళ్ల అర్జున్ ఆడిన తీరును మెచ్చుకోవాల్సిందే.

దశాబ్దకాలంలో భారత చెస్ వ్యక్తిగత విజయాల నుంచి సమష్టి ఆధిపత్యం వైపు మళ్లింది. భారత క్రీడాకారులు క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్ ఇలా చెస్‌లో అన్ని ఫార్మాట్లలో శాసించే స్థితికి చేరుకున్నారు. భవిష్యత్‌లో భారత్ చెస్ శక్తిగా ఎదగడం ఖాయం.

హంపి, అర్జున్‌లకు ప్రధాని మోదీ అభినందన


నరేంద్ర మోదీ

దిల్లీ: ఫిడే ప్రపంచ ర్యాపిడ్ చెస్‌లో కాంస్య పతకాలు గెలిచిన భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, అర్జున్ ఇరిగేశిలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. "ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ ర్యాపిడ్ విభాగంలో కాంస్య పతకం గెలిచిన కోనేరు హంపికి అభినందనలు. ఆట పట్ల ఆమె అంకితభావం మెచ్చదగింది. ఇక ముందు కూడా హంపి విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా" అని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. "ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఓపెన్ విభాగంలో కాంస్యం గెలిచిన అర్జున్‌ను చూసి గర్విస్తున్నా. ఎంతో దృఢ సంకల్పంతో ఆడాడు. భవిష్యత్తు ప్రయత్నాల్లో అతడు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా" అని ప్రధాని అన్నారు.



బెంగాల్ టైగర్స్ శుభారంభం

రాంచి: మహిళల హాకీ ఇండియా లీగ్ సీజన్-2లో సారాచి బెంగాల్ టైగర్స్ శుభారంభం చేసింది. సోమవారం తన తొలి మ్యాచ్‌లో 1-0తో జేఎస్‌డబ్ల్యూ సూర్మా హాకీ క్లబ్‌పై గెలిచింది. 11వ నిమిషంలో అగస్టిమా చేసిన గోల్‌తో బెంగాల్ ఆధిక్యంలోకి వెళ్లింది. అక్కడ నుంచి ప్రత్యర్థిని మరో గోల్ కొట్టనీయకుండా అడ్డుకున్న టైగర్స్ విజయాన్ని అందుకుంది. టోర్నీ తొలి మ్యాచ్‌లో ఎస్‌జీ పైపర్స్ 2-0తో రాంచి రాయల్స్‌ను ఓడించింది. నాలుగు జట్లు మాత్రమే ఈ లీగ్‌లో ఆడుతున్నాయి.

రాత్రి 7 నుంచి

ఊడ్చేస్తారా?

- క్లీన్‌స్వీప్‌పై భారత అమ్మాయిల కన్ను
- శ్రీలంకతో చివరి టీ20 నేడే


స్మృతి

తిరువనంతపురం: శ్రీలంకతో టీ20 సిరీస్‌లో జైత్రయాత్ర సాగిస్తున్న భారత మహిళల జట్టు.. క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. అయిదు టీ20ల సిరీస్‌లో వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచిన హర్మన్‌ప్రీత్ సేన.. మంగళవారం చివరి పోరుకు సిద్ధమైంది. మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచి 2025ను చిరస్మరణీయం చేసుకున్న మహిళల జట్టు.. ఈ ఏడాదిని విజయంతో ముగించాలని చూస్తోంది. మూడు, నాలుగు టీ20లకు ఆతిథ్యమిచ్చిన తిరువనంతపురంలోనే ఈ మ్యాచ్ కూడా జరగనుంది. తొలి మూడు మ్యాచ్‌ల్లో టాస్ గెలిచి బౌలింగ్ చేసిన భారత్.. నాలుగో టీ20లో టాస్ ఓడి బ్యాటింగ్ చేసింది. అయినా ఫలితమేమీ మారలేదు. టీ20ల్లో తన అత్యధిక స్కోరు సాధించి, సులువుగా ప్రత్యర్థిని ఓడించింది. అయితే గత మ్యాచ్‌లో శ్రీలంక బ్యాటింగ్ ఎంతో మెరుగుపడింది. 191 పరుగులతో టీ20ల్లో ఆ జట్టు కూడా అత్యధిక స్కోరును అందుకుంది. మరి సిరీస్‌లో ఒక్క మ్యాచ్ అయినా గెలవాలని చూస్తున్న లంక.. చివరి పోరులో అయినా ఫలితం మారుస్తుందేమో చూడాలి. ప్రపంచకప్ ఫైనల్లో సంచలన ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన షెఫాలి.. ఈ సిరీస్‌లోనూ చెలరేగిపోతోంది. వరుసగా మూడో మ్యాచ్‌లో విధ్వంసక అర్ధశతకం సాధించింది. కొంచెం ఆలస్యంగా ఫామ్ అందుకున్న స్మృతి మంధాన కూడా నాలుగో టీ20లో మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. మిగతా బ్యాటర్లు కూడా ఫామ్‌లోనే ఉన్నారు. జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ ఒక్కో మ్యాచ్‌లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. గత మ్యాచ్‌లో బౌలర్లు కొంచెం తడబడ్డప్పటికీ.. మొత్తంగా సిరీస్‌లో మెరుగైన ప్రదర్శనే చేస్తున్నారు. కొత్త స్పిన్నర్ వైష్ణవి శర్మ ప్రతిభ చాటుకుంటోంది. రేణుక సింగ్, క్రాంతి గౌడ్, దీప్తి శర్మ, శ్రీచరణి, స్నేహ్ రాణా.. ఇలా అందరూ లయలో ఉన్నారు. బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా సత్తా చాటితే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం కష్టమేమీ కాదు. మరోవైపు శ్రీలంక జట్టు కెప్టెన్ చమరి ఆటపట్టుతో పాటు హాసిని పెరీరా, హర్షిత సమరవిక్రమ, ఇమేషా దులాని, కవిష దుల్హరిలపై ఆశలు పెట్టుకుంది.

హైదరాబాద్ ఓటముల హ్యాట్రిక్

విజయ్ హజారే ట్రోఫీ

అసోం: విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ ఓటముల హ్యాట్రిక్ కొట్టింది. సోమవారం ఎలైట్ గ్రూప్-బి మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో అసోం చేతిలో ఓడింది. మొదట హైదరాబాద్ 8 వికెట్లకు 310 పరుగులు చేసింది. రాహుల్ సింగ్ (79; 71 బంతుల్లో 14×4), అభిరథ్ రెడ్డి (54; 66 బంతుల్లో 6×4), నితేష్ రెడ్డి (53; 25 బంతుల్లో 4×4, 3×6), వరుణ్ గౌడ్ (42; 46 బంతుల్లో 2×4, 1×6) రాణించారు. అబ్దుల్ ఖురేషి (3/71), స్వరూపమ్ (2/60), శిబ్ శంకర్ (2/26) హైదరాబాద్‌ను కట్టడి చేశారు. శిబ్ శంకర్ (112; 109 బంతుల్లో 11×4, 1×6) సెంచరీ సాధించడంతో అసోం 49.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. సౌరవ్ దింగియా (91; 112 బంతుల్లో 9×4, 1×6), దినేశ్ దాస్ (54; 46 బంతుల్లో 7×4) విజయంలో కీలకపాత్ర పోషించారు. హైదరాబాద్ బౌలర్లలో మిలింద్ (3/68) మాత్రమే రాణించాడు.


జురెల్

ఆంధ్ర ఓటమి బాట: ఆంధ్రకు పరాజయం ఎదురైంది. ఆలూర్‌లో జరిగిన గ్రూప్-డి పోరులో 6 వికెట్ల తేడాతో ఒడిశా చేతిలో ఓడింది. మొదట ఆంధ్ర 49.2 ఓవర్లలో 221 పరుగులకే పరిమితమైంది. ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (66; 64 బంతుల్లో 6×4, 2×6) టాప్ స్కోరర్. సౌరభ్ కుమార్ (47), శ్రీకర్ భరత్ (32) రాణించారు. నితీశ్ కుమార్‌రెడ్డి (6) విఫలమయ్యాడు. సమంత్రే (3/36), గోవింద (3/36) ఆంధ్రకు కళ్లెం వేశారు. ఓం ముండే (91; 111 బంతుల్లో 7×4), గోవింద (89; 105 బంతుల్లో 9×4) సత్తా చాటడంతో ఒడిశా 43.4 ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. సత్యనారాయణ రాజు (2/49), నితీశ్ (1/37) మెరుగ్గానే బౌలింగ్ చేసినా.. ఆంధ్రను గెలిపించలేకపోయారు. మూడు మ్యాచ్‌ల్లో ఆంధ్రకు ఇది రెండో ఓటమి.

జురెల్ మెరుపు శతకం: ధ్రువ్ జురెల్ (160 నాటౌట్; 101 బంతుల్లో 15×4, 8×6) అజేయ సెంచరీతో అదరగొట్టాడు. రాజ్‌కోట్‌లో బరోడాపై ఎలైట్ గ్రూప్-బి మ్యాచ్‌లో జురెల్ సత్తా చాటడంతో ఉత్తర్‌ప్రదేశ్ 54 పరుగుల తేడాతో బరోడాను ఓడించింది. మొదట ఉత్తర్‌ప్రదేశ్ 7 వికెట్లకు 369 పరుగులు చేసింది. కెప్టెన్ రింకు సింగ్ (63; 67 బంతుల్లో 2×4, 3×6), అభిషేక్ గోస్వామి (51; 51 బంతుల్లో 7×4, 2×6) రాణించారు. ఛేదనలో బరోడా పోరాడినా.. 315 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ కృనాల్ పాండ్య (82; 77 బంతుల్లో 10×4, 2×6), విష్ణు సోలంకి (43; 39 బంతుల్లో 5×4, 1×6), అతీత్ సేథ్ (46; 28 బంతుల్లో 4×4, 3×6) సత్తా చాటినా.. జట్టును గెలిపించలేకపోయారు. జీషన్ అన్సారి (3/53), విప్రాజ్ నిగమ్ (2/57) బరోడాను కట్టడి చేశారు. శామ్స్ ములాని (5/31), శార్దూల్ ఠాకూర్ (4/13) విజృంభించడంతో గ్రూప్-సి మ్యాచ్‌లో ముంబయి 9 వికెట్ల తేడాతో చత్తీస్‌గఢ్‌ను చిత్తు చేసింది. మొదట చత్తీస్‌గఢ్ 38.1 ఓవర్లలో 142 పరుగులకే ఆలౌటైంది. అమన్‌దీప్ (63) టాప్ స్కోరర్. బదులుగా ముంబయి 24 ఓవర్లలో ఒక వికెటే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. రఘువంశీ (68 నాటౌట్), సిద్దేశ్ లాడ్ (48 నాటౌట్) జట్టు విజయంలో ప్రధానపాత్ర పోషించారు.

అబ్బాయే గెలిచాడు

సబలెంకాపై కిర్గియోస్ పైచేయి


నిక్ కిర్గియోస్, సబలెంకా

దుబాయ్: ప్రొఫెషనల్ టెన్నిస్‌లో అబ్బాయి, అమ్మాయి కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో బరిలోకి దిగుతారు కానీ.. ఒక పురుషుడు, మహిళ ప్రత్యర్థులుగా తలపడడం మాత్రం ఎప్పుడూ చూసి ఉండరు! దుబాయ్ ఈ అరుదైన పోరుకు వేదికగా నిలిచింది. ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు నిక్ కిర్గియోస్‌తో మహిళల నంబర్‌వన్, బెలారస్ భామ అరియానా సబలెంకా తలపడింది. ఈ పోరులో 6-3, 6-3తో కిర్గియోసే విజేతగా నిలిచాడు. అయితే మ్యాచ్‌లో సబలెంకా గట్టి పోటీనే ఇచ్చింది. రెండో సెట్లో ఆమె ఒక దశలో 3-1తో ఆధిక్యంలో నిలవడం విశేషం. కానీ నిక్ పుంజుకుని సెట్‌ను, మ్యాచ్‌ను గెలుచుకున్నాడు.

కోహ్లి.. ఆ మ్యాచ్‌లో


కోహ్లి

దిల్లీ: విజయ్ హజారే ట్రోఫీలో దిల్లీ తరపున ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ఆడాడు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి. తొలి మ్యాచ్‌లో 131, రెండో మ్యాచ్‌లో 77 పరుగులు చేశాడు. జనవరి 11న న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ఆరంభం కానున్న నేపథ్యంలో విజయ్ హజారే ట్రోఫీలో విరాట్ మరో మ్యాచ్ ఆడబోతున్నాడు. జనవరి 6న రైల్వేస్‌తో పోరులో అతడు బరిలోకి దిగుతాడు. "విజయ్ హజారే ట్రోఫీలో మూడు మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటానని కోహ్లి చెప్పాడు. అతడు జనవరి 6న రైల్వేస్‌పై ఆడతాడు" అని దిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ చెప్పాడు.

ఎంసీజీ పిచ్ ప్చ్..

అయోగ్యతా పాయింట్ ఇచ్చిన ఐసీసీ

దుబాయ్: ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య నాలుగో టెస్టుకు ఉపయోగించిన పిచ్‌పై ఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. పిచ్ బౌలర్లకు మరీ ఎక్కువగా అనుకూలంగా ఉందని మ్యాచ్ రిఫరీ నివేదిక సమర్పించిన నేపథ్యంలో.. మ్యాచ్ వేదిక ఎంసీజీకి ఒక అయోగ్యతా పాయింట్ ఇచ్చింది. బాగా సహకరించిన పిచ్‌పై నాలుగో టెస్టు తొలి రోజు ఏకంగా 20 వికెట్లు కూలాయి. రెండు రోజుల్లోనే ముగిసిన టెస్టులో ఇంగ్లాండ్ 4 వికెట్ల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. "ఎంసీజీలో పిచ్ అసంతృప్తికరంగా ఉన్నట్లు తేల్చాం. వేదికకు ఒక అయోగ్యత పాయింట్ ఇచ్చాం" అని ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. ఆరు అయోగ్యత పాయింట్లు పొందిన వేదికపై 12 నెలల నిషేధం పడుతుంది. నాలుగో టెస్టు త్వరగా ముగియడంతో ఎంసీజీ తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. ఇలాంటి పిచ్ ఆటకు మంచిది కాదని ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అన్నాడు. యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా ప్రస్తుతం 3-1తో ఆధిక్యంలో ఉంది. చివరిదైన అయిదో టెస్టు జనవరి 4న మొదలవుతుంది.


టీ20 మ్యాచ్‌లో 8 వికెట్లు

భూటాన్ స్పిన్నర్ సోనమ్ యేషే ప్రపంచ రికార్డు


సోనమ్ యేషే

దిల్లీ: అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లో 8 వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్‌గా సోనమ్ యేషే ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. భూటాన్‌కు చెందిన ఈ ఎడమ చేతి వాటం స్పిన్నర్ మయన్మార్‌తో మ్యాచ్‌లో 7 పరుగులే ఇచ్చి 8 వికెట్లు పడగొట్టాడు. మొదట భూటాన్ 9 వికెట్లకు 127 పరుగులు చేయగా.. అనంతరం సోనమ్ ధాటికి మయన్మార్ 45 పరుగులకే కుప్పకూలింది. 2023లో మలేసియా పేసర్ శ్యార్జుల్ ఇద్రుస్ చైనాపై 7/8తో నెలకొల్పిన గణాంకాలే అంతర్జాతీయ టీ20ల్లో ఇప్పటిదాకా ఉత్తమ ప్రదర్శన.

1000పై రొనాల్డో గురి


రొనాల్డో

దుబాయ్: ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాడిగా కొనసాగుతున్న పోర్చుగల్ సూపర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో.. తన కెరీర్లో చివరి లక్ష్యమేంటో వెల్లడించాడు. కెరీర్ ముగిసేలోపు 1000 గోల్స్ సాధించాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. తాజాగా సౌదీ ప్రొ లీగ్‌లో అల్ నాసర్ తరపున రెండుసార్లు స్కోర్ చేసిన రొనాల్డో.. తన గోల్స్ సంఖ్యను 956కు పెంచుకున్నాడు. అర్జెంటీనా దిగ్గజ ఆటగాడు లియోనల్ మెస్సి 896 గోల్స్‌తో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో కూడా అత్యధిక గోల్స్ (143) సాధించిన ఘనత క్రిస్టియానో సొంతం. అందులోనూ మెస్సి (115) రెండో స్థానంలో ఉన్నాడు. "ఆటలో కొనసాగేందుకు అవసరమైన ప్రేరణను పొందుతున్నాను. నేను ఐరోపాలో ఆడినా, మధ్య ప్రాచ్య దేశాల్లో ఆడినా.. ఫుట్‌బాల్‌ను ఆస్వాదిస్తూనే ఉంటా. గోల్స్ కొట్టడం, మ్యాచ్‌లు గెలిపించడం మీదే నా దృష్టి ఉంటుంది. అంతిమంగా నేను చేరుకోవాలనుకున్న సంఖ్య గురించి అందరికీ తెలుసు" అని క్రిస్టియానో పేర్కొన్నాడు.

ఇల్లే నందనవనం



బిహార్‌లోని ఛపరాకు చెందిన నరేంద్ర సింగ్ ఇంటినే నందనవనంగా మార్చారు. ఇంటి పైకప్పుపై, వరండాలో ఆయన ఏకంగా 2,500 మొక్కలను పెంచుతున్నారు. అందులో పండ్లు, కూరగాయలు, పూల మొక్కలున్నాయి. మొక్కలపై తనకు చిన్నప్పటి నుంచీ ఉన్న ప్రేమను 55ఏళ్ల వయసులోనూ ఆయన కొనసాగిస్తున్నారు. సరణ్ జిల్లాలోని అమీ గ్రామానికి చెందిన నరేంద్ర సింగ్.. 'పేడ్ వాలే బాబా'గానూ ప్రసిద్ధుడు. ఆయన కంపోస్టును ఇంట్లోనే తయారు చేస్తారు. ఎటువంటి రసాయన ఎరువులను, పురుగు మందులను వాడకుండా మొక్కలను పెంచుతున్నారు. 10 ఏళ్ల వయసు నుంచి ఆయన మొక్కల ప్రేమికుడిగా ఉన్నారు. 5 కుండీలతో ప్రారంభమైన ఆయన హాబీ ఇప్పుడు 2,500 కుండీలకు విస్తరించింది. తన మామిడి, జామ, ఆరెంజ్, నారింజ, తులసి, రావి, మర్రి, వేప, యాపిల్, బెర్రీ, లిచీ, బొప్పాయి, నిమ్మ, పైనాపిల్, ద్రాక్ష తదితర అనేక మొక్కలను పెంచుతున్నానని నరేంద్ర సింగ్ 'ఈటీవీ భారత్'కు తెలిపారు. తన గార్డెన్‌లో బ్రోకెన్ హార్ట్, బ్లీడింగ్ హార్ట్ మొక్కలూ ఉన్నాయని వివరించారు. మనం ఎప్పుడూ వినని బెహాయా, ఝుంకా వంటి మొక్కలూ ఉన్నాయని పేర్కొన్నారు.

ఈటీవీ భారత్

చిన్నారుల స్కేటింగ్ సాహస యాత్ర

ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన ఇద్దరు చిన్నారులు స్కేటింగ్ సాహస యాత్రకు శ్రీకారం చుట్టారు. వారు 700 కిలోమీటర్లు ప్రయాణించి అయోధ్యకు చేరుకోనున్నారు. సోమవారం గాజియాబాద్‌లో 10 ఏళ్ల నందిని, 12 ఏళ్ల యుగ్‌లు తమ సాహస యాత్రను ప్రారంభించారు. 7 రోజుల్లో వారు లక్ష్యాన్ని చేరుకుంటారు. గతంలో వారిద్దరూ హరిద్వార్ నుంచి గాజియాబాద్ ఇలాగే 3 రోజుల్లో ప్రయాణించారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న నందిని.. ఏడేళ్ల వయసు నుంచి స్కేటింగ్ చేస్తున్నారు. పలు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అనేక పతకాలను సాధించారు. నందినితోపాటు యాత్రలో పాల్గొంటున్న యుగ్ ఆమె సోదరుడే. వారికి తండ్రే కోచ్‌గా ఉన్నారు. వారు రోజుకు 120 కిలోమీటర్లు స్కేటింగ్ చేయనున్నారు.





పతంగులకు ఎల్‌ఈడీ సొబగు

కొత్త సంవత్సరం లోహ్రీ, వసంత పంచమి సందర్భంగా పంజాబ్‌లో పతంగులను ఎగురవేస్తారు. వాటిని అనేక రూపాల్లో తయారు చేస్తుంటారు. ఈసారి మరో అడుగు ముందుకేసి పతంగులకు ఎల్‌ఈడీ లైట్లను అమర్చారు. లుధియానాలోని మార్కెట్లో ఈ పతంగులు అమ్ముతున్నారు. దీంతో వీటిని రాత్రి వేళల్లోనూ ఎగురువేయడానికి అవకాశం కలుగుతోంది. ఎల్‌ఈడీ పతంగుల్లో బ్యాటరీలు రెండు గంటల వరకూ పనిచేస్తాయి.

– ఈటీవీ భారత్




మధుమేహ నియంత్రణకు పరిష్కారం

- ✦ కదలకుండా, మెదలకుండా కూర్చునే లేదా నడుం వాల్చి ఉండే జీవనశైలిని వదిలిపెట్టాలి.
- ✦ బరువులెత్తడం లేదా జిమ్ చేయాలి.
- ✦ అధిక కొవ్వు పదార్థాలను తగ్గించాలి.
- ✦ రోజూ 20 నిమిషాలు నడవాలి.
- ✦ రోజూ 8 గంటలు గాఢ నిద్రపోవాలి.
- ✦ జంక్, అతిగా శుద్ధి చేసిన ప్యాకేజ్డ్ ఆహారాన్ని దూరం పెట్టాలి.

నిలకడగా ఈ నియమాలను పాటిస్తే మధుమేహం తిరుగుముఖం పట్టే అవకాశం ఉంది.

– శ్రేయా షా, పౌష్టికాహార నిపుణురాలు

ఆరావళి నిర్వచనంపై తీర్పు నిలిపివేత



● తీవ్ర వివాదం నేపథ్యంలో సుమోటోగా సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

దిల్లీ: పర్యావరణం, జీవ వైవిధ్య పరిరక్షణలో ఎంతో ప్రాధాన్యం ఉన్న ఆరావళి పర్వత శ్రేణులకు ఇటీవల కొత్త నిర్వచనం ఇవ్వడంపై తీవ్ర దుమారం రేగుతున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక నిర్ణయం వెలువరించింది. ఈ పర్వత శ్రేణులకు నిపుణుల కమిటీ ఇచ్చిన ఏకరూప నిర్వచనాన్ని ఆమోదిస్తూ గత నెలలో వెలువరించిన తీర్పును సోమవారం తనకు తాను (సుమోటో)గా నిలిపివేసింది. నవంబరు 20నాటి ఆదేశాల్లోని సంక్లిష్టమైన అస్పష్టతలనూ పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. కమిటీ నివేదికపై దర్యాప్తునకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామనడంతో పాటు కేంద్ర ప్రభుత్వం, దిల్లీ, హరియాణా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. కొత్త కమిటీ ఏర్పాటయ్యే వరకు నిలుపుదల ఉత్తర్వు అమల్లో ఉంటుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ ఆగస్టిన్ జార్జి మసీహ్ ఈ ధర్మాసనంలో సభ్యులుగా ఉన్నారు. తదుపరి విచారణను జనవరి 21కి వాయిదా పడింది.

ఏమిటీ వివాదం?

దేశంలోనే పురాతన పర్వత శ్రేణి ఆరావళి. పర్యావరణపరంగా పలు రాష్ట్రాలకు రక్షణ కవచం. దిల్లీ నుంచి హరియాణా, రాజస్థాన్, గుజరాత్‌ల వరకూ ఈ పర్వతాలు విస్తరించి ఉన్నాయి. అక్రమ మైనింగ్ జరుగుతోందన్న ఆందోళనల నేపథ్యంలో ఆరావళి పర్వతాలపై కేంద్రం నియమించిన కమిటీ ఇచ్చిన కొత్త నిర్వచనానికి సుప్రీంకోర్టు గత నెలలో ఆమోదం తెలిపింది. కొత్త నిర్వచనం ప్రకారం.. ఆరావళి పరిధి జిల్లాలుగా గుర్తించిన ప్రాంతాల్లో 100 మీటర్లు, అంతకుమించి ఎత్తైన కొండలు, వాటి సమీపంలోని ఎత్తుపల్లాల భూములు ఆరావళి పర్వతాల నిర్వచనం పరిధిలోకి వస్తాయి. ఒకదానికొకటి 500 మీటర్ల దూరంతో రెండు, అంతకంటే ఎక్కువ సంఖ్యలో ఉండే కొండలను ఆరావళి శ్రేణికి చెందినవిగా పరిగణిస్తారు. పర్యావరణ కార్యకర్తలు, శాస్త్రవేత్తలు ఈ కొత్త నిర్వచనాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.



సుప్రీం జోక్యం ఎందుకంటే

ఆరావళిపై కొత్త నిర్వచనానికి తాను ఆమోదం తెలిపిన పర్యవసానంగా తలెత్తిన తీవ్ర దుమారంపై సుప్రీంకోర్టు సుమోటోగా స్పందించింది. గత కమిటీ నివేదిక, దాని ఆధారంగా వెలువడిన తీర్పు...పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన క్లిష్టమైన అంశాల్లో స్పష్టత నివ్వలేదని, దీంతో అపార్థాలు తలెత్తాయని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. పర్యావరణ సమగ్రతను కాపాడటానికి, నియంత్రణ చర్యల్లో అంతరాలను తొలగించడానికి మళ్లీ దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

రూ.79 వేల కోట్ల ఆయుధ కొనుగోళ్లకు రక్షణ శాఖ ఆమోదం

దిల్లీ: మిలిటరీ పోరాట సామర్థ్యాలను మరింత పెంచేలా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోలుకు రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం ఆమోదం తెలిపింది. ఇందులో దీర్ఘశ్రేణి రాకెట్లు, క్షిపణులు, రాడార్ వ్యవస్థల వంటివి ఉన్నాయి. తాజా ప్రతిపాదనల్లో భాగంగా సైన్యంలోని ఆర్టిలరీ రెజిమెంట్ల కోసం లాయిటర్ మ్యూనిషన్ సిస్టమ్స్‌ను కొనుగోలు చేస్తారు. తక్కువ స్థాయి తేలికైన రాడార్లు, పినాక రాకెట్ వ్యవస్థ కోసం దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ అమ్యూనిషన్ వంటివి సమీకరిస్తారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన భేటీ అయిన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఈ ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేసింది.

కుక్క కాటుతో గేదె మృతి..

దాని పెరుగు తిన్న 200 మందికి వ్యాక్సిన్

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బదాయూన్ జిల్లా పిప్రౌలి గ్రామంలో ఓ వింత ఘటన చోటుచేసుకుంది. కుక్కకాటుకు గురైన గేదె పెరుగు తిన్నామని తెలుసుకున్న గ్రామస్థులు హుటాహుటిన వ్యాక్సిన్లు వేయించుకున్నారు. డిసెంబరు 23న గ్రామంలో జరిగిన ఓ అంత్యక్రియల కార్యక్రమంలో దాదాపు 200 మంది రైతా తిన్నారు. అంతకు కొన్ని రోజుల ముందే ఆ గేదెను కుక్క కరిచిందని గ్రామస్థులకు తెలిసింది. డిసెంబరు 26న ఆ గేదె మృతిచెందింది. దీంతో వారంతా బెంబేలెత్తిపోయి.. ముందు జాగ్రత్త చర్యగా రేబిస్ టీకాలు వేయించుకున్నారు. రేబిస్ వల్లే గేదె మృతిచెందిందని స్థానిక డాక్టర్ కూడా ధ్రువీకరించారు.

అపూర్వ ప్రేమ

ఐఐటీ కాన్పుర్‌కు రూ.100 కోట్ల విరాళం



కాన్పుర్: ఐఐటీ కాన్పుర్‌లో చదువుకున్న 2000 సంవత్సరం విద్యార్థులు తమ మాతృ విద్యాసంస్థకు రూ.100 కోట్ల విరాళం ప్రకటించారు. విద్యాసంస్థ ప్రాంగణంలో జరిగిన రజతోత్సవ ఆత్మీయ సమ్మేళనంలో వారు ఈ ప్రకటన చేశారు. మిలేనియం బ్యాచ్‌గా ప్రసిద్ధులైన 2000 సంవత్సరం విద్యార్థులు తమ కృతజ్ఞతా భావాన్ని దీనిద్వారా చాటుకున్నారు. పూర్వ విద్యార్థులు ఇంత పెద్దమొత్తంలో మాతృ విద్యాసంస్థకు విరాళం ప్రకటించడం దేశంలోనే మొదటిసారి. ఈ విరాళాన్ని 'మిలేనియం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సొసైటీ' ఏర్పాటుకు ఉపయోగించాల్సిందిగా యాజమాన్యాన్ని వారు కోరారు. ఈ సమ్మేళనంలో పాల్గొనేందుకు ప్రపంచం నలుమూలల నుంచీ పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. మాతృ విద్యాసంస్థకు, పూర్వ విద్యార్థులకు మధ్య బలమైన బంధాన్ని ఇది సూచిస్తోందని ఐఐటీ-కె డైరెక్టర్ మణీంద్ర అగర్వాల్ పేర్కొన్నారు.

తైవాన్ జలసంధిలో ఉద్రిక్తత

● భారీగా చైనా సైనిక విన్యాసాలు

బీజింగ్: తైవాన్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. చైనా భారీస్థాయిలో 'జస్టిస్ మిషన్-2025' పేరుతో తైవాన్‌ను చుట్టుముడుతూ సైనిక విన్యాసాలు ప్రారంభించింది. ఇందులో 89 యుద్ధ విమానాలు, 28 యుద్ధనౌకలు పాల్గొన్నాయి. కీలక తైవాన్ ఓడరేవులైన కీలుంగ్, కావోషియుంగ్‌లను డ్రాగన్ దిగ్బంధనం చేసింది. సముద్రం, భూమిపై లైవ్ ఫైర్ డ్రిల్స్ నిర్వహించింది. తైవాన్‌లోని స్వతంత్రవాద శక్తులకు, ఈ అంశంలో జోక్యం చేసుకుంటున్న విదేశీ శక్తులకు ఈ విన్యాసాలు హెచ్చరిక అని చైనా తూర్పు థియేటర్ కమాండ్ పేర్కొంది. ఇటీవల తైవాన్ విషయంలో చైనా, జపాన్ మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. గత నెల పార్లమెంటులో జపాన్ ప్రధాని తకాయిచి మాట్లాడుతూ.. తైవాన్‌పై చైనా బలప్రయోగం చేస్తే అది జపాన్ మనుగడకు సమస్య అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు చైనాకు ఆగ్రహం తెప్పించాయి. తొలి నుంచీ తైవాన్ తమ దేశ భూభాగమని డ్రాగన్ పేర్కొంటోంది. దీనికి తోడు ఇటీవల తైవాన్‌కు దాదాపు 11.1 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాల ప్యాకేజీ ఇవ్వాలని అమెరికా నిర్ణయించింది. ఈ రెండు అంశాలే ఈ సైనిక విన్యాసాలకు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

అదిగదిగో శాంతి ఒప్పందం!

● యుద్ధ విరమణకు చేరువలో రష్యా, ఉక్రెయిన్: ట్రంప్



విలేకరుల సమావేశంలో జెలెన్‌స్కీ, ట్రంప్

పామ్ బీచ్: నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధానికి తెరదించేలా శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు రష్యా, ఉక్రెయిన్ ప్రస్తుతం మునుపెన్నడూ లేనంత చేరువగా వచ్చాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అయితే డాన్‌బాస్ ప్రాంతం వంటి కొన్ని అంశాలపై సంప్రదింపులు సంక్లిష్టంగా ఉన్నాయని.. చర్చలు విఫలమయ్యే అవకాశాలను ఇప్పటికీ కొట్టిపారేయలేమని పేర్కొన్నారు. ఫ్లోరిడాలో ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆదివారం (అమెరికా కాలమానం ప్రకారం) భేటీ అయ్యారు. 20 పాయింట్ల శాంతి ప్రణాళికపై చర్చించారు. అనంతరం ఇద్దరూ కలిసి విలేకర్లతో మాట్లాడారు. యుద్ధం ముగింపునకు సంబంధించిన చర్చల్లో ఇప్పటికీ కొన్ని విషయాలు ఇబ్బందికరంగా ఉన్న మాట వాస్తవమేనని వారు అంగీకరించారు. రష్యా నియంత్రణలో ఉన్న ఉక్రెయిన్ భూభాగాలను ఆ దేశ ఆధీనంలోనే ఉంచడం, భవిష్యత్తులో మాస్కో మళ్లీ ఆక్రమణకు దిగకుండా ఉక్రెయిన్‌కు భద్రతా హామీలు ఇవ్వడం, రష్యా ఆక్రమించిన జపోరీజియా అణు విద్యుత్కేంద్రం భవిష్యత్తు వంటి అంశాలను ఉదహరించారు. శాంతి ఒప్పందం కుదురుతుందో లేదో మరికొన్ని వారాల్లో తెలుస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. యుద్ధం ముగింపు కోసం కృషి చేస్తున్నందుకు ట్రంప్‌నకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలియజేశారు. శాంతికి ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని ప్రకటించారు.

దీర్ఘశ్రేణి పినాక రాకెట్ పరీక్ష విజయవంతం



దిల్లీ: దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ 'పినాక' తొలి ప్రయోగం విజయవంతమైంది. ఒడిశాలోని చాందీపుర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో ఈ పరీక్ష జరిగింది. రాకెట్ 120 కిలోమీటర్ల దూరాన్ని ప్రయాణించి, పూర్తి సత్తాను చాటింది. నిర్దేశించిన రీతిలో గాల్లో విన్యాసాలూ చేసింది. పినాకను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థకు చెందిన ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ల్యాబ్ తయారుచేసింది. హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ ల్యాబ్, హైదరాబాద్‌లోని డీఆర్‌డీఎల్, రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ)లు తోడ్పాటు అందించాయి.

భారతీయుల వర్క్ పర్మిట్లు రద్దు చేయాలి

● విషం కక్కిన బంగ్లాదేశ్ ఇంకిలాబ్ మోంచా



బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాలో జాతీయ హిందూ కౌన్సిల్ సభ్యుల ఆందోళన

ఢాకా: విద్యార్థి నాయకుడు, ఇంకిలాబ్ మోంచా నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యతో బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. హాదీ హత్య నేపథ్యంలో తాత్కాలిక ప్రభుత్వంపై మండిపడుతోన్న ఇంకిలాబ్ మోంచా తాజాగా భారతీయులపై విషం కక్కింది. బంగ్లాలో ఉన్న భారతీయుల వర్క్ పర్మిట్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు యూనస్ ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వడం గమనార్హం. తమ నాయకుడి మరణానికి కారణమైన నిందితులు, వారికి సహకరించిన వారిని 24 గంటల్లో అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. షేక్ హసీనాను అప్పగించేందుకు భారత్ నిరాకరిస్తే.. ఆ దేశంపై అంతర్జాతీయ న్యాయస్థానంలో కేసు వేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు తమ ఫేస్‌బుక్ ఖాతాలో దీనిపై పోస్ట్ చేసింది. ఈ సందర్భంగా సోమవారం భారీఎత్తున ఆందోళనలకు పిలుపునిచ్చింది.

జమాత్‌తో జతకట్టిన ఎన్సీపీ: బంగ్లాదేశ్ ఎన్నికల్లో మతతత్వ పార్టీ జమాతే ఇస్లామీతో విద్యార్థుల పార్టీ నేషనల్ సిటిజన్ పార్టీ(ఎన్సీపీ) జత కట్టింది. ఈ రెండు..మరి కొన్ని పార్టీలతో కలిసి ఫిబ్రవరిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల బరిలో దిగనున్నాయి. జమాత్‌తో పొత్తును ఎన్సీపీలో సీనియర్ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్సీపీ పార్టీకి గురువుగా అందరూ భావించే మహఫూజ్ ఆలమ్ కీలక ప్రకటన చేశారు. తాను ఎన్సీపీలో భాగస్వామ్యం కావడం లేదని ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. మరో 30 మంది సీనియర్ ఎన్సీపీ నేతలు కూడా పొత్తుకు వ్యతిరేకమని ప్రకటించారు. ఈ మేరకు ఒక మెమోరాండంపై సంతకం చేశారు. ఆలమ్.. గతేడాది హసీనాకు వ్యతిరేకంగా జరిగిన విద్యార్థుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఈయనే సూత్రధారి అంటారు. ఆ తర్వాత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంలో కూడా ఆలం సమాచార ప్రసార విభాగ సలహాదారుగా పని చేశారు. ఈ నెల 11న ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసిన తర్వాత తన పదవికి ఆలం రాజీనామా చేశారు.

అన్ని మతాలపై సమగౌరవం: మమత

కోల్‌కతా: తాను బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నానంటూ కొందరు చేస్తున్న ఆరోపణల్ని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం ఖండించారు. ఎలాంటి వివక్షకూ తావులేకుండా అన్ని మతాల కార్యక్రమాల్లో పాల్గొంటానని, తాను అసలైన లౌకికవాదినని స్పష్టం చేశారు. 'మేం అన్ని మతాలను, కులాలను అభిమానిస్తాం. మానవత్వమే మా భావజాలం' అని వెల్లడించారు. కోల్‌కతాలోని న్యూటౌన్‌లో దుర్గామాతకు అంకితమైన 'దుర్గా ఆంగన్' భవన నిర్మాణానికి పునాదిరాయి వేసే కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ప్రజల్ని అనవసరంగా వేధిస్తున్నారని మమత ఆరోపించారు. ఈ కసరత్తులో ఎందరో ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఎస్ఐఆర్ కారణంగా 50 మంది ఆత్మహత్య చేసుకోవడమో.. ఒత్తిడికి గురై మరణించడమో జరిగిందని తెలిపారు.

కువైట్‌లో వీసా, రెసిడెన్సీ అనుమతుల కోసం ఇ-సర్వీస్ ప్రారంభం




ఇంటర్నెట్ డెస్క్: విదేశీ కార్మికులకు వీసా, రెసిడెన్సీ విధానాలను సరళీకృతం చేయడానికి కువైట్ కొత్త ఎలక్ట్రానిక్ సేవలను ప్రారంభించింది. విదేశీ ఉద్యోగులకు త్వరిత, మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నట్లు ఆ దేశ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇకపై వీసా పునరుద్ధరణ, పనికి సంబంధించిన రెసిడెన్సీ పర్మిట్ల బదిలీ వంటి సేవల కోసం విదేశీయులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా.. అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖకు చెందిన అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే పొందవచ్చని తెలియజేసింది. జనరల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెసిడెన్సీ సమన్వయంతో ఈ సేవలను అభివృద్ధి చేసినట్లు జనరల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ అధికారులు పేర్కొన్నారు. ఈ నూతన సంస్కరణలను కువైట్ ఇమిగ్రేషన్ వ్యవస్థ పరిశీలిస్తోందన్నారు. ఈ మార్పులు కువైట్ పౌర, ప్రైవేట్ రంగాలలో పని చేస్తున్న విదేశీ కార్మికులకు ప్రయోజనం చేకూరుస్తాయని.. వీసా పునరుద్ధరణ, ఉద్యోగ, నివాస మార్పుల సమయంలో వారు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు తగ్గుతాయన్నారు. ఇప్పటివరకు విదేశీ కార్మికులు తమ నివాసాలను మార్చాలంటే అధికారుల ఆమోదం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి ఉండేదని.. ఇకపై ఆ సమస్య ఉండదని తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం విదేశీయులు, సందర్శకులకు ఆరోగ్య బీమా తప్పనిసరి చేస్తున్నట్లు వెల్లడించారు.

మకరవిళక్కు పూజలకు సిద్ధమైన శబరిమల

నేడు తెరుచుకోనున్న అయ్యప్పస్వామి ఆలయం

శబరిమల: పవిత్రమైన మకరవిళక్కు పూజల కోసం శబరిమల అయ్యప్ప స్వామి ఆలయాన్ని మంగళవారం సాయంత్రం తిరిగి తెరవనున్నట్లు ఆలయ బోర్డు(టీడీబీ) సోమవారం తెలిపింది. ఆలయ తంత్రి మహేశ్ మోహనారు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు శాస్త్రోక్తంగా ఆలయ తలుపులు తెరవనున్నట్లు పేర్కొంది. పవిత్రమైన దీపాన్ని వెలిగించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు వెల్లడించింది. ఏటా నిర్వహించే మకరవిళక్కు పూజల నేపథ్యంలో అయ్యప్ప దర్శనానికి దేశవ్యాప్తంగా లక్షల మంది భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. 41 రోజుల మండల పూజల అనంతరం ఈ నెల 27న రాత్రి 10 గంటలకు ఆలయాన్ని మూసివేసిన విషయం తెలిసిందే.


పలాయనం వ్యాఖ్యలపై భారత్‌కు లలిత్ మోదీ క్షమాపణలు



లండన్: మనీలాండరింగ్ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ బ్రిటన్‌కు పరారైన ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ భారత ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పారు. పరారీలో ఉన్న మరో ప్రముఖుడు విజయ్ మాల్యా 70వ జన్మదిన సందర్భంగా ఆయనతో కలిసి పార్టీ చేసుకున్న లలిత్ మోదీ 'అతిపెద్ద పలాయన పరాయణులు'' అన్న వ్యంగ్య వ్యాఖ్యను జతచేసి అందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టుచేసిన సంగతి తెలిసిందే. దీంతో లలిత్‌మోదీ, విజయ్ మాల్యా దేశాన్ని మోసం చేసి, పారిపోవడమే కాకుండా విదేశాల్లో భారత్‌ను బహిరంగంగా అపహాస్యం చేస్తున్నారని నెటిజన్లు మండిపడ్డారు. దీనిపై లలిత్ మోదీ స్పందిస్తూ.. తాను ఎవరి మనోభావాలను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదన్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని.. తనకు భారత ప్రభుత్వం అంటే చాలా గౌరవం ఉందని పేర్కొన్నారు. మరోవైపు లలిత్ మోదీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. దేశం నుంచి పారిపోయిన ఇద్దరు నిందితులను భారత్‌కు తిరిగి తీసుకురావడానికి బ్రిటన్ ప్రభుత్వంతో దౌత్యపరమైన చర్చలు జరుపుతున్నామని తెలిపింది.

చొరబాటుదారుల్ని ఏరివేసే వారినే ఎన్నుకోండి

● అస్సాం ప్రజలకు అమిత్‌షా విజ్ఞప్తి



గువాహటి: చొరబాటుదారుల్ని ఏరివేసే ప్రభుత్వాన్నే ఎన్నుకోవాలని అస్సాం ప్రజలకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లలో అస్సాంలో జరగబోయే శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ మేరకు పిలుపునిచ్చారు. గువాహటిలో, నాగావ్ జిల్లాలో పలు అభివృద్ధి పనుల్ని సోమవారం ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. బోర్దువాలో జరిగిన మరో సభలో మాట్లాడారు. పదేళ్ల భాజపా పాలనలో అస్సాం అభివృద్ధి చెందిందని, మరో ఐదేళ్లు కూడా అధికారమిస్తే చొరబాటుదారుల్లో ప్రతి ఒక్కరినీ గుర్తించి వెనక్కి పంపిస్తామని చెప్పారు. చొరబాటుదారుల సమస్యకు కాంగ్రెసే కారణమని ఆరోపించారు. ఓటుబ్యాంకు కోసం చొరబాట్లను కాంగ్రెస్ ప్రోత్సహించిందని, అది ఇప్పుడు అస్సాం అస్తిత్వానికి ముప్పుగా మారిందన్నారు. అస్సాం ప్రజల్ని, ఇక్కడి సంస్కృతిని, గుర్తింపును భ్రష్టుపట్టించేలా బంగ్లాదేశీ చొరబాటుదారులు తయారయ్యారని విమర్శించారు. అస్సాంలోనే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లో పాగావేసిన చొరబాటుదారుల్నీ గుర్తించి తరిమేస్తామని ప్రకటించారు. అక్రమ శరణార్థుల కోసం 1983లో చేసిన చట్టంతో చొరబాటుదారులకు చట్టపరమైన రక్షణ లభించిందని, తర్వాత దానిని సుప్రీంకోర్టు కొట్టివేసిందని చెప్పారు. అక్రమ వలసదారుల వ్యతిరేక పోరాటంలో ప్రాణాలు కోల్పోయినవారికి 'శహీద్ స్మారక్ క్షేత్ర' వద్ద ఆయన నివాళులర్పించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను అస్సాం నుంచి రాజ్యసభకు రెండుసార్లు పంపినా ఆయన ఏడుసార్లే రాష్ట్రానికి వచ్చారని, మోదీ మాత్రం ఇప్పటివరకు 36సార్లు వచ్చారని తెలిపారు.

భాజపా పాలనలో విద్వేషం పరిపాటిగా మారింది

రాహుల్ గాంధీ విమర్శ



మృతుడు ఏంజెల్ చక్మా

దిల్లీ: ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో త్రిపుర విద్యార్థి హత్యోదంతం తీవ్రమైన విద్వేష నేరమని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అభివర్ణించారు. భాజపా పరిపాలన విద్వేషాన్ని పరిపాటిగా మార్చేసిందని విమర్శించారు. త్రిపురకు చెందిన ఏంజెల్ చక్మా (24)పై ఈనెల 9న ఆరుగురు మూకదాడికి పాల్పడ్డారు. జాతి సూచకమైన పరుష పదజాలంతో తనను అవమానించడంపై అభ్యంతరం తెలియజేసిన బాధితుణ్ని నిందితులు తీవ్రంగా కొట్టారు. దాంతో చక్మా ఈనెల 26న ఆస్పత్రిలో ప్రాణాలు వదిలాడు. ఇలాంటి విద్వేషం రాత్రికిరాత్రి వచ్చి పడదని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. "మన యువతలో ఏళ్లుగా విద్వేష భావాలు పెంచి పోషించడం వల్లే ఇది జరిగింది. విషతుల్యమైన అంశాలకు ప్రచారం కల్పించడం, బాధ్యతారహిత విశ్లేషణల కారణంగానే ఇలా జరుగుతోంది" అని చెప్పారు. గౌరవం, సమైక్యతలు పునాదిగా భారత్ నిర్మితమైందే తప్ప, భయం.. అవమానాల ప్రాతిపదికన కాదని ఆయన అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విద్వేష నేరాలపై ప్రకటన చేయాలని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ డిమాండ్ చేశారు. త్రిపుర విద్యార్థి హత్య సమ్మతం కాదని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అన్నారు. పలు పార్టీల నాయకులు ఈ హత్యను ముక్తకంఠంతో ఖండించారు. మరోవైపు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి బాధిత యువకుని తండ్రితో ఫోన్‌లో మాట్లాడారు. నిందితుల్ని కఠినంగా శిక్షిస్తామని ఆయన హామీ ఇచ్చారు. తొలివిడత పరిహారంగా రూ 4.12 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి పంపినట్టు ఉత్తరాఖండ్ అధికార వర్గాలు తెలిపాయి.



ఇటలీలోని సిసిలీలో విస్ఫోటనం అనంతరం మౌంట్ ఎట్నా అగ్ని పర్వతం నుంచి ఎగసిపడుతున్న లావా

ఇండోనేసియా నర్సింగ్ హోమ్‌లో అగ్ని ప్రమాదం

16 మంది వృద్ధుల మృతి

జకార్తా: ఇండోనేసియాలోని ఓ నర్సింగ్‌హోమ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 16 మంది మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఉత్తర సులవేసి ప్రావిన్స్ రాజధాని మనడో నగరంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వృద్ధులు మంటల్లో చిక్కుకుని బయటకు రాలేక సజీవ దహనమయ్యారు. ఈ ఘటనలో 12 మందిని కాపాడినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేతులు కలిపిన పవార్ కుటుంబం

పుణెలో ఎన్సీపీ, ఎన్సీపీ (ఎస్పీ) కలిసి పోటీ

పుణె: మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. ఇటీవల ఠాక్రే సోదరులు చేతులు కలపగా తాజాగా సీనియర్ నేత శరద్ పవార్ కుటుంబం కూడా మళ్లీ ఒక్కటైంది. వచ్చే నెల 15న జరగనున్న పుణె నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ), తన బాబాయ్ శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ)తో కలిసి పోటీ చేయనుంది. కొన్ని సర్దుబాట్ల తర్వాత సీట్ల కేటాయింపు జరిగిందని అజిత్ చెప్పారు. కొత్త కూటమికి శరద్ పవార్ నాయకత్వం వహిస్తారని తెలిపారు. వారం రోజులుగా రెండు ఎన్సీపీ వర్గాల మధ్య పెద్దఎత్తున చర్చలు జరిగాయి.

మెక్సికోలో పట్టాలు తప్పిన రైలు

13 మంది మృతి, 98 మందికి గాయాలు



ప్రమాద స్థలంలో ప్రయాణికులు

మెక్సికో సిటీ: మెక్సికోలోని ఒక్సాకా రాష్ట్రంలో ఇంటర్ ఓషియానిక్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోగా.. 98 మంది గాయపడ్డారు. నిజాండా పట్టణం సమీపంలోని ఒక మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో రైలులో 241 మంది ప్రయాణికులు, 9 మంది సిబ్బంది ఉన్నారు. ప్రమాదంలో బోగీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాకపోకలు నిలిచిపోయాయి. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు ధ్రువీకరించారు.

స్వర్ణ గ్రామం వార్డు

- గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మార్పు
- చట్టసవరణకు ఆర్డినెన్స్ జారీకి అనుమతి
- అమరావతి అభివృద్ధికి రూ.7,387 కోట్ల నాబార్డు రుణం
- రూ.137 కోట్లతో క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్
- ఎస్సీల రుణాలపై రూ.41.61 కోట్ల వడ్డీ మాఫీ
- మంగళగిరి-తాడేపల్లిలో రూ.1,673 కోట్లతో భూగర్భ డ్రైనేజ్

25 అంశాలకు మంత్రివర్గం ఆమోదం

నూజివీడులో ఐఐపీఎం

- ఏలూరు జిల్లా నూజివీడు మండలంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ (ఐఐపీఎం) నిర్మాణానికి 9.96 ఎకరాల్ని 33 ఏళ్ల లీజుకు కేటాయింపు ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం. ఐదేళ్లకొకసారి లీజు 10 శాతం పెంపు
- కోనసీమ జిల్లా కాట్రేనికోన మండల పరిధిలో వేదాంత లిమిటెడ్‌కు ఆన్‌షోర్ డ్రిల్లింగ్ కార్యకలాపాల కోసం 9.88 ఎకరాల లీజును మూడేళ్ల కాలానికి పునరుద్ధరించే ప్రతిపాదనకు ఆమోదం.

స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి 28.37 ఎకరాలు

- తిరుపతిజిల్లా దామినేడులో నేషనల్ స్టాండర్డ్ స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు ఏపీ టూరిజం అథారిటీకి కేటాయించిన 28.37 ఎకరాల్ని స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి ఉచితంగా శాప్‌కు బదిలీ చేసేందుకు ఆమోదం.



సోమవారం సచివాలయంలో నిర్వహించిన కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్

ఈనాడు, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుగా మారనున్నాయి. ఇందుకు సంబంధించి చట్ట సవరణకు ఆర్డినెన్స్ జారీ కోసం చేసిన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అనుమతిచ్చింది. ఆర్యవైశ్య సంఘం విజ్ఞప్తి మేరకు పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ పేరును వాసవీ పెనుగొండగా మార్చేందుకు అనుమతించింది. రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ ప్రాజెక్టుల అమలుకు నాబార్డు, నాబ్‌ఫిడ్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ప్రణాళిక కింద రూ.7,387 కోట్ల రుణం తీసుకునే ప్రతిపాదన సహా మొత్తం 25 అంశాలను ఆమోదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశం వివరాల్ని మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ విలేకరులకు వెల్లడించారు. 'స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో గ్రామ, వార్డు సచివాలయాలు కీలకపాత్ర పోషించనున్నాయి. ఇందుకుగాను కార్యనిర్వాహకుల పాత్రలు, బాధ్యతలు సవరించాల్సిన అవసరముంది. అందుకే సచివాలయాల పేరు మారుస్తున్నాం. జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ కార్యాలయాల పేరు కూడా మారనుంది' అని తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలివీ..

ఎస్సీలకు తీపికబురు

కేంద్ర ప్రాయోజిత పథకాలైన జాతీయ ఎస్సీ ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ), జాతీయ సఫాయి కర్మచారీ ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ) కింద రాయితీ రుణాలు పొందిన 11,479 మందికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వీరు కొన్నేళ్లుగా వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవడంతో పడిన రూ.41.61 కోట్ల వడ్డీని మాఫీ చేసేందుకు ఆమోదం తెలిపింది.

■ తిరుపతిలోని సెట్టిపల్లె గ్రామంలో దశాబ్దాలుగా టైటిల్ లేకుండా ప్రైవేటు ఆక్రమణలో ఉన్న భూముల్ని క్రమబద్ధీకరించేందుకు భూ సమీకరణ పథకాన్ని అమలు చేశారు. దీని కింద 2,206 ప్లాట్ల యజమానులకు, 251 మంది భూ యజమానులకు అభివృద్ధి చేసిన ప్లాట్లను ఉచితంగా రిజిస్టర్ చేయాలని నిర్ణయించారు. వీరికి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపునివ్వడంతో ప్రభుత్వంపై రూ.16.25 కోట్ల భారం పడనుంది.

■ మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌లో రూ.1673.51 కోట్లతో వికేంద్రీకృత భూగర్భ మురుగునీటి వ్యవస్థ, మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణానికి ఆమోదం. ఈ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రెండు దశల్లో అమలు చేయనున్నారు. ఈ వ్యయంలో 40% ప్రభుత్వం, 60% ప్రైవేట్ డెవలపర్ వెచ్చించనున్నారు.

తిరుమల పవిత్రత కోసం తిరుపతిలో లగ్జరీ హోటల్ నిర్మాణంపై వెనక్కి

తిరుపతి జిల్లా పేరూరులోని ప్రభుత్వ భూమిలో హయత్ రీజెన్సీ ఫైవ్‌స్టార్ లగ్జరీ హోటల్ నిర్మాణానికి ఎంఆర్‌కేఆర్ సంస్థతో రాష్ట్ర పర్యాటక సంస్థ చేసుకున్న లీజు ఒప్పంద రద్దుకు మంత్రిమండలి ఆమోదం. తిరుమల పవిత్రత పరిరక్షణ కోసం తితిదే చేసిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

దుగరాజపట్నంలో గ్రీన్ ఫీల్డ్ పోర్టు

● తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ డెవలప్‌మెంట్ పథకం కింద గ్రీన్ ఫీల్డ్ పోర్టు, షిప్ బిల్డింగ్ క్లస్టర్ నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం.

● దగదర్తి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి కోసం నెల్లూరు జిల్లా దామవరం గ్రామంలో 418.14 ఎకరాల్ని సేకరించేందుకు రాష్ట్ర ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అనుమతిచ్చే ప్రతిపాదనకు ఆమోదం. శాశ్వత లీజ్ హోల్డర్లకు ఎకరాకు రూ.13 లక్షల చొప్పున పరిహారం చెల్లింపు.

▼ రాష్ట్రీయ సేవా సమితికి విశాఖ జిల్లా ఆనందపురం మండలం గుడివాడలో 18.57 ఎకరాల ప్రభుత్వ భూమి బదిలీకి ఆమోదం

కొత్త వాహనం కొంటే రహదారి భద్రత సెస్

▼ కొత్త మోటారు వాహనాలపై రవాణాశాఖ వసూలు చేసే జీవిత పన్నులో 10 శాతం చొప్పున 'రహదారి భద్రత సెస్' ప్రవేశపెట్టడానికి ఆర్డినెన్స్ జారీ చేసే ప్రతిపాదనకు ఆమోదం. దీనిద్వారా నెలకు రూ.22.5 కోట్లు, ఏడాదికి రూ.270 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా. కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనాలపై జీఎస్టీని 28% నుంచి 18 శాతానికి తగ్గించడంతో కొనుగోలుదారులకు గణనీయంగా ఆదా అవుతోంది. అందువల్ల ఈ చిన్న సెస్ వాహన యజమానులపై పెద్దగా ఆర్థిక భారం పడదు.

▼ ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు 2024 జనవరి 1 నుంచి డీఏ/డీఆర్ 3.64% పెంపును వర్తింపజేస్తూ ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులకు ఆమోదం.

అమరావతిలో రూ.538 కోట్లతో పనులకు గ్రీన్ సిగ్నల్

■ రాజధానిలో రూ.137 కోట్లతో 'అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్' ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించిన టెండర్‌లో తక్కువ బిడ్ వేసిన ఎల్-1 (ఎల్‌అండ్‌టీ)కి కాంట్రాక్ట్ కేటాయించేందుకు మంత్రిమండలి అనుమతించింది.

■ రాజధానిలో రూ.538.76 కోట్లతో వివిధ పనుల ప్రతిపాదనల్ని ఆమోదించింది. సీఆర్‌డీఏ ప్రాంతంలో వివిధ సంస్థలకు భూకేటాయింపులకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను ఆమోదించింది.

■ రాజధానిలో ఉండవల్లి వద్ద రూ.443.76 కోట్లతో 84,00 క్యూసెక్కుల సామర్థ్యంగల ఫ్లడ్ పంపింగ్ స్టేషన్-2 ఏర్పాటు, నిర్వహణకు సంబంధించిన కాంట్రాక్ట్ ఎల్-1 బిడ్డర్‌కు అప్పగించడానికి ఆమోదం. దీనికోసం ప్రపంచ బ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) ద్వారా సీఆర్‌డీఏ నిధులు సమకూర్చనున్నారు.

■ అమరావతిలో రూ.1,358 కోట్లతో జోన్-8 ప్రాంతంలోని కృష్ణాయపాలెం, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి గ్రామాల్లో పక్కనే ఉన్న జోన్లలోని పెనుమాక లేఅవుట్ రోడ్లు, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, యుటిలిటీ డక్ట్ తదితర పనులకు సంబంధించిన కాంట్రాక్టుల్లో ఎల్-1 బిడ్ ఆమోదించేందుకు అనుమతి

లోతుగా అధ్యయనం చేశాం

- తప్పనిసరి పరిస్థితుల్లోనే అన్నమయ్య జిల్లా కేంద్రం మార్పు
- మంత్రులు సత్యప్రసాద్, మనోహర్, సత్యకుమార్ వెల్లడి



సచివాలయంలో విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: 'జిల్లాల పునర్విభజనకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించి లోతుగా అధ్యయనం చేశాం. పాలనా సౌలభ్యం కోణంలోనే నివేదిక ఇచ్చాం. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదు' అని మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ వివరించారు. సోమవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్ని వారు విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. 'రాజంపేట నియోజకవర్గ ప్రజలు కడప జిల్లాలో కలుస్తామంటున్నారు. రైల్వేకోడూరు వాసులు ఎప్పటినుంచో తిరుపతిలో కలపాలని కోరుతున్నారు. రాయచోటితో కలిసి ఉండాలని కోరుకోవడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లోనే అందరితో చర్చించి అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకు మార్చాల్సి వచ్చింది. సీఎం చంద్రబాబు బాధ్యత తీసుకుని మంత్రి, రాయచోటి ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డితో మాట్లాడారు' అని మంత్రులు తెలిపారు.

అన్నమయ్యకు ఒక ప్రాంతం ఏంటి?: 'ఏడుకొండల స్వామి దగ్గర సేవ చేసిన వ్యక్తి అన్నమయ్య. ఆయనకు ఒక ప్రాంతం ఏంటి?' అని మంత్రి సత్యప్రసాద్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లె ఏర్పాటుపై విలేకరుల అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 'కృష్ణా జిల్లాలో ఎన్టీఆర్ జన్మించారు. విజయవాడ కేంద్రంగా ఉన్న జిల్లాకు ఆయన పేరు పెట్టారు' అని వివరించారు. ఒక లోక్‌సభ పరిధిలో ఒక జిల్లా అనే విధానాన్ని గత ప్రభుత్వం అమలు చేయలేదని చెప్పారు. 'ఒంగోలుకు దగ్గరున్న కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో, గూడూరును తిరుపతిలో కలిపారు. మదనపల్లి దగ్గరున్న పుంగనూరును చిత్తూరులో కలిపారు. కూటమి ప్రభుత్వంలో వాటన్నింటినీ సరిచేస్తున్నాం' అని వివరించారు. వైకాపా హయాంలో అడ్డగోలుగా జిల్లాల విభజన జరిగిందని.. నాటి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందని ధ్వజమెత్తారు.

త్వరలో పోలవరం రెవెన్యూ డివిజన్ : పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలనే ఆలోచనతోనే ఆ పేరుతో జిల్లా ఏర్పాటు చేస్తున్నామని మంత్రులు పేర్కొన్నారు. 'పోలవరం గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం. రాబోయే రోజుల్లో రెవెన్యూ డివిజన్ చేస్తాం' అని చెప్పారు.

గ్రేటర్ ఆదోని ఏర్పాటే లక్ష్యం: 'ఆదోని మండలాన్ని మూడు, నాలుగు మండలాలుగా విభజించాలనే ప్రతిపాదనలు వచ్చాయి. అయితే ప్రస్తుతం రెండు మండలాలుగా మార్చాం. ఆదోని 1, ఆదోని 2 మండలాలుగా విభజించాం' అని సత్యప్రసాద్ వివరించారు. 'గ్రేటర్ విజయవాడ, తిరుపతి ప్రతిపాదన ఉంది. గ్రేటర్ ఆదోని లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచిస్తున్నారు' అని తెలిపారు.

క్యాబినెట్‌లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కన్నీరు

- జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకు మార్చడంపై భావోద్వేగం
- సముదాయించిన సీఎం.. రాయచోటి అభివృద్ధికి హామీ
- వైద్య కళాశాల ఏర్పాటు చేస్తామని వెల్లడి



భావోద్వేగానికి గురైన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చడంపై రాయచోటి ఎమ్మెల్యే, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. సోమవారం మంత్రివర్గ సమావేశంలో జిల్లాల విభజనపై అధికారులు ప్రజంటేషన్ ఇస్తున్న సమయంలో ఆయన కన్నీరు పెట్టుకున్నారు. దాంతో సమావేశంలో గంభీరమైన వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి ఆయనను సముదాయించారు. ఎందుకు ఆ నిర్ణయం తీసుకోవలసి వచ్చిందో వివరించారు. రైల్వేకోడూరు ప్రజలు తమను తిరుపతి జిల్లాలో చేర్చాలని, రాజంపేట ప్రజలు వైఎస్సార్ కడప జిల్లాలో చేర్చాలని గట్టిగా పట్టుబట్టారని ఆయన పేర్కొన్నారు. ఇక రాయచోటి ఒక్కటే మిగులుతోందని, దాన్ని ఒక్కదాన్నే జిల్లాగా కొనసాగించలేమని పేర్కొన్నారు. రాయచోటినే జిల్లా కేంద్రంగా కొనసాగించాలని మండిపల్లి గట్టిగా పోరాడినా ప్రజల ఆకాంక్షల మేరకు తప్పనిసరి పరిస్థితుల్లో నిర్ణయం తీసుకోవలసి వచ్చిందని తెలిపారు. రాయచోటిని జిల్లా కేంద్రం స్థాయిలో అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. సహచర మంత్రులూ మండిపల్లిని సముదాయించారు. మంత్రివర్గ సమావేశం ముగిశాక మరో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి మండిపల్లి బయటకు వచ్చారు. మీడియా ప్రతినిధులు ఆయన చుట్టూ చేరినా మాట్లాడేందుకు నిరాకరించారు. ఆ సందర్భంగా ఆయన మరోసారి కన్నీళ్లు పెట్టుకున్నారు. జనార్దన్‌రెడ్డి ఆయనను తన కారులో తీసుకుని వెళ్లిపోయారు. కాసేపటికే రాంప్రసాద్‌రెడ్డిని సీఎం మళ్లీ సచివాలయానికి పిలిపించి మాట్లాడారు. ఆ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

మండిపల్లి రాజకీయ భవితపై సీఎం భరోసా : రాయచోటిని అన్నివిధాలా అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని సీఎం హామీ ఇచ్చారు. అక్కడ వైద్య కళాశాల, యూనివర్సిటీ పీజీ సెంటర్ ఏర్పాటు చేస్తామని సీఎం తెలిపారు. రాయచోటి అభివృద్ధికి ఏం కావాలో చెప్పాలని మంత్రిని అడిగారు. 'దీన్ని ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేయండి. మీ రాజకీయ భవిష్యత్తుకు నాదీ భరోసా. మరో 20 ఏళ్లు రాజకీయాల్లో ఉంటారు' అని ఆయనకు తెలిపారు. రాయచోటితో తనకున్న అనుబంధాన్ని సీఎం గుర్తు చేశారు. 'గతంలో రూపొందించిన ప్రణాళికల ప్రకారమే రాయచోటిలో అన్ని మౌలిక సదుపాయాలు, పరిపాలన వసతులు కల్పిద్దాం' అని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కూడా మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో సీఎం 40 నిమిషాలు భేటీ అయ్యారు. మదనపల్లెను జిల్లా కేంద్రంగా ఎందుకు చేయాల్సి వచ్చిందో వివరించారు. విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్ కూడా మంత్రితో ఫోన్‌లో మాట్లాడారు.



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో మాట్లాడుతున్నసీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు

అత్యధిక మండలాలు కడప జిల్లాలోనే

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అత్యధిక మండలాలు కలిగిన జిల్లాగా కడప గుర్తింపు పొందనుంది. ఈ జిల్లాలో ఇప్పటి వరకు 36 మండలాలు ఉండగా.. ఆ సంఖ్య 40కి పెరగనుంది. జనాభాపరంగా తిరుపతి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవనుంది. రంపచోడవరం కేంద్రంగా కొత్తగా ఏర్పాటు కానున్న పోలవరం అతి తక్కువ జనాభా కలిగిన జిల్లా కానుంది. కొత్త జిల్లాల ఏర్పాటు, మార్పులు, చేర్పులకు మంత్రివర్గం సోమవారం ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల భౌగోళిక స్వరూపాలు మారనున్నాయి.

ఆయుష్‌లో 140 పోస్టుల భర్తీకి ఓకే

ఈనాడు, అమరావతి: ఆయుష్ శాఖ దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ఖాళీల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపింది. రాష్ట్రంలోని నాలుగు హోమియో, ఆయుర్వేద వైద్యకళాశాలల్లో ఖాళీగా ఉన్న 140 బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీల భర్తీకి అనుమతి ఇస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఖాళీలన్నీ ఒకేసారి భర్తీ చేయడానికి అనుమతి ఇవ్వడం ఇదే తొలిసారని ఆ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు.


ఎస్సీల సంక్షేమం అంటే చిన్నచూపా?

సమావేశానికి గైర్హాజరైన హెచ్‌వోడీలపై మంత్రి డోలా ఆగ్రహం

ఈనాడు, అమరావతి: ఎస్సీ ఉపప్రణాళిక నిధుల వినియోగంపై ఏర్పాటు చేసిన నోడల్ ఏజెన్సీ సమావేశానికి పలు శాఖల హెచ్‌వోడీలు గైర్హాజరవడంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీల సంక్షేమం అంటే అంత చిన్నచూపా అని ప్రశ్నించారు. ఈ ధోరణి పేద, బలహీనవర్గాల ప్రజల పట్ల మీకున్న నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోందన్నారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన నోడల్ ఏజెన్సీ సమావేశంలో మంత్రి మాట్లాడారు. 'ఉపప్రణాళిక నిధుల వినియోగంలో అలసత్వం వహిస్తే సహించేది లేదు. నోడల్ ఏజెన్సీ సమావేశానికి అన్ని శాఖల హెచ్‌వోడీలూ తప్పనిసరిగా హాజరు కావాల్సిందే. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా.. కొన్ని శాఖలు ఉపప్రణాళిక నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం లేదు. ఈ నిధులను వంద శాతం ఖర్చు చేయాల్సిందే. ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాలపై మరింత దృష్టి సారించాలి' అని ఆదేశించారు.

తిరుపతి జిల్లాలో దుగరాజపట్నం పోర్టు

- అక్కడే నౌకా నిర్మాణ కేంద్రం
- పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఓడరేవు నిర్మిద్దాం
- నాలుగు విమానాశ్రయాల నిర్మాణం వేగవంతం చేయాలి
- దొనకొండ, నాగార్జునసాగర్, బొబ్బిలి ఎయిర్‌స్ట్రిప్‌లు అభివృద్ధి చేద్దాం
- మంత్రివర్గ సమావేశంలో సీఎం ఆదేశం



ఈనాడు, అమరావతి: తిరుపతి జిల్లాలో దుగరాజపట్నం వద్ద ఓడరేవు నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అక్కడ నౌకా నిర్మాణ కేంద్రం కూడా వస్తుందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోనూ ఓడరేవు ఏర్పాటుకు అనువైన ప్రదేశం అన్వేషించాలని ఆదేశించారు. పోర్టు ఏర్పాటుకు నరసాపురం వద్ద అనువుగా ఉంటుందేమో చూడాలని సూచించారు. అక్కడ ఓడరేవు నిర్మాణానికి తగినంత భూములు లేవని రోడ్లు, భవనాలు, రవాణా, ఐఅండ్ఐ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ కాకపోతే పోర్టు నిర్మాణానికి అనువైన ప్రదేశం ఎక్కడుందో చూడాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి ముఖ్యమంత్రి సూచించారు. సోమవారం మంత్రివర్గ సమావేశంలో రాష్ట్రంలో కొత్త ఓడరేవులు, విమానాశ్రయాల అభివృద్ధి అవసరాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో సుదీర్ఘ సముద్ర తీరం ఉన్నందున పోర్టు ఆధారిత ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసి, ఎయిర్ కనెక్టివిటీ పెంపొందిస్తే పరిశ్రమలు వస్తాయని ఆయన తెలిపారు. ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, పన్నుల రూపంలో ఆదాయం వస్తుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాల్ని మరింత మెరుగ్గా అమలు చేసేందుకు ఆస్కారం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నం పోర్టు ఉందని, తిరుపతి జిల్లాలో దుగరాజపట్నం, ప్రకాశం జిల్లాలో రామాయపట్నం పోర్టులు వస్తే ఆ ప్రాంతం మొత్తం ఒక కారిడార్‌లా అభివృద్ధి చెందుతుందన్నారు. దగదర్తి, కుప్పం, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం విమానాశ్రయాల నిర్మాణానికి అవసరమైన ప్రక్రియల్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. వాటితో పాటు దొనకొండ, నాగార్జునసాగర్, బొబ్బిలిల్లోని ఎయిర్‌స్ట్రిప్‌లను అభివృద్ధి చేద్దామని చెప్పారు. ఒంగోలులో విమానాశ్రయ నిర్మాణం గురించి మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ప్రస్తావించగా తదుపరి దశలో చేపడదామని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడికైనా గంట ప్రయాణంలో చేరుకోగలిగేలా కనెక్టివిటీ పెరిగితే పరిశ్రమలు వస్తాయని ఆయన అన్నారు.

2026లో ఇంకా బాగా పనిచేద్దాం

2025లో చాలా బాగా పనిచేశామని, ఎన్నికల హామీలన్నీ నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని అమలు చేశామని సీఎం గుర్తుచేశారు. రూ.50 వేల కోట్లకు పైగా పింఛన్లు అందజేశామన్నారు. యోగాంధ్ర, విశాఖలో భాగస్వామ్య సదస్సు వంటివి విజయవంతంగా నిర్వహించామన్నారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకొచ్చామని, విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రావడం అతి పెద్ద విజయమని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి, పోలవరం ప్రాజెక్టుల్ని వేగంగా ముందుకు తీసుకెళుతున్నామని, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని గాడిన పెట్టామని, విశాఖ రైల్వే జోన్ ఆచరణలోకి వస్తోందని చెప్పారు. 2026 కూడా ఆశాజనకంగా ఉంటుందని, అభివృద్ధి ఫలాల్ని ప్రజలకు అందేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. 2025లో మంత్రులు బాగా పనిచేశారని ఆయన కితాబిచ్చారు. వచ్చే సంవత్సరం మరింత చురుగ్గా పనిచేయాలని, 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్'లో క్రియాశీలకంగా వ్యవహరించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

కేబినెట్ సమావేశం మొదలయ్యేసరికే అధికారులంతా సిద్ధంగా ఉండాలి

మంత్రివర్గ సమావేశం మొదలయ్యేసరికే ఎజెండాలోని అంశాలకు సంబంధించిన శాఖల కార్యదర్శులు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సోమవారం మంత్రివర్గ సమావేశానికి పురపాలకశాఖ మంత్రి నారాయణ కొంత ఆలస్యంగా వచ్చారు. అప్పటికి ఆ శాఖ అధికారులూ సిద్ధంగా లేకపోవడంతో రెవెన్యూ అంశాన్ని చర్చకు తీసుకున్నారు. ఒక శాఖకు సంబంధించిన అంశం ఎజెండాలో మొదట్లో ఉన్నా, చివర్లో ఉన్నా అధికారులు మాత్రం సమావేశం మొదలయ్యేసరికే సిద్ధంగా ఉండాలని, ఆ మేరకు అధికారులందరికీ ఆదేశాలు జారీ చేయాలని ఇన్‌ఛార్జి సీఎస్ అజయ్‌జైన్‌కు సీఎం సూచించారు.

మహాత్ముల పేర్లు పెట్టడం వారికిచ్చే గౌరవం

అన్నమయ్య స్వగ్రామం రాజంపేట నియోజకవర్గం పరిధిలో ఉంది. ఇప్పుడా నియోజకవర్గం కడప జిల్లాలో కలుస్తున్నా, మదనపల్లె కేంద్రంగా ఏర్పాటయ్యే జిల్లాకు అన్నమయ్య పేరునే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. మహాత్ముల్ని గౌరవించేందుకు జిల్లాలకు వారి పేర్లు పెడుతున్నామని, వారు జన్మించిన ఊరు అదే జిల్లాలో ఉండాలన్న నిబంధనేదీ లేదని సీఎం తెలిపారు. ఎన్టీఆర్ జన్మస్థలం కృష్ణా జిల్లాలో ఉండగా, దానికి బదులు కొత్తగా ఏర్పడిన జిల్లాకు... ఎన్టీఆర్ పేరు పెట్టడాన్ని గుర్తుచేశారు. పోలవరం గ్రామం లేకుండా కొత్తగా ఏర్పడ్డ జిల్లాకు పోలవరం పేరు పెట్టడంపై చర్చ జరుగుతోందని మంత్రి దుర్గేష్ ప్రస్తావించారు. పోలవరం ఊరు ఆ జిల్లాలో లేకపోయినా.. ప్రాజెక్టు ముంపు గ్రామాలన్నీ కొత్త జిల్లా పరిధిలోకే వస్తున్నాయని, ప్రాజెక్టు అక్కడే ఉంది కాబట్టి ఆ పేరు పెట్టడమే సముచితమన్న అభిప్రాయం వ్యక్తమైంది. కర్నూలు జిల్లాలోని ఆదోనిని మూడు మండలాలు చేయాలన్న చర్చ జరిగింది. కానీ చివరకు రెండు మండలాలతోనే సరిపెట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. నెల్లూరు జిల్లాలో వెంకటగిరి నియోజకవర్గం పరిధిలోని సైదాపురం, రాపూరు మండలాల్ని కూడా ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తేవాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కోరారు.

3.25 కోట్ల మందికి ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం

- 4 కోట్ల మందికి అన్నక్యాంటీన్ భోజనాలు
- 'తల్లికి వందనం'గా రూ.10 వేల కోట్లు
- అన్నదాత సుఖీభవ కింద రూ.6,310 కోట్లు
- పింఛన్లకే రూ.50 వేల కోట్లు
- 2025లో అందించిన సంక్షేమంపై వివరించిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి ప్రారంభమైన స్త్రీశక్తి పథకం ద్వారా 3.25 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సుల్లో ప్రయాణించారు. దీనికి రూ.1,144 కోట్లు ఖర్చయింది. 204 అన్న క్యాంటీన్ల ద్వారా 4 కోట్ల భోజనాలు అందాయి. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా ఇప్పటికే రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేశాం. కూటమి ప్రభుత్వం 2025 సంవత్సరంలో అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్‌గా నిలిచాయి' అని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 'విశాఖలో ఐటీ హబ్, గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు.. టీసీఎస్ ప్రారంభం, కాగ్నిజెంట్‌కు శంకుస్థాపన, క్వాంటమ్ వ్యాలీకి తొలిఅడుగు, అమరావతి పనుల వేగవంతం తదితరాలన్నీ కూటమి విజయాలే' అని తెలిపింది. తల్లికి వందనం పథకం కింద 67.27లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్లు చెల్లించాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. 5,757 కానిస్టేబుళ్ల నియామకం పూర్తి చేశాం. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 75 లక్షల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశాం. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నాం. సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్ అందించాం. పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలు నిర్వహించాం. విద్యావ్యవస్థలో పెనుమార్పులకు నాంది పలికాం. మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగులు నిర్వహించాం' అని ప్రభుత్వం తన ప్రకటనలో వివరించింది. 'రాష్ట్రమంతా ఒకే రోజు 13,326 గ్రామసభలు నిర్వహించి 3 వేల పనులకు శ్రీకారం చుట్టాం. తండాలకు రోడ్లు నిర్మిస్తున్నాం. శివారు గ్రామాలకు 4జీ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తున్నాం. కుంకీ ఏనుగులు రాష్ట్రానికి తీసుకొచ్చాం. అమరజీవి జలధార పేరుతో 1.21 కోట్ల మందికి దాహార్తి తీర్చేలా ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు రూ.3,050 కోట్లతో ప్రాజెక్టు రూపొందిస్తున్నాం' అని తెలిపింది.



అన్నదాతలకు అండగా..


'అన్నదాత సుఖీభవ కింద 46లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,310 కోట్లు జమ చేశాం. మార్కెట్ జోక్యం ద్వారా పొగాకు, మామిడి, కోకో, ఉల్లి సహా పలు పంటలను కొనుగోలు చేశాం. రికార్డుస్థాయిలో రూ.8,120 కోట్లతో 34.23 లక్షల టన్నుల ధాన్యం సేకరించాం.. 24 గంటల్లో నగదు జమ చేస్తున్నాం. దీపం పథకం కింద రూ.2,684 కోట్లతో 2 కోట్ల ఉచిత సిలిండర్లు పంపిణీ చేశాం. మత్స్యకార భరోసా ద్వారా ఏడాదికి రూ.20 వేల చొప్పున 1.25 లక్షల మందికి 250 కోట్లు, ఆటోడ్రైవర్ల సేవలో ఏడాదికి రూ.15 వేల చొప్పున 2.90 లక్షల మందికి రూ.436 కోట్లు అందించాం. నేతన్నలకు ఉచిత విద్యుత్తు పథకం కింద మరమగ్గాలకు నెలకు 500 యూనిట్లు, మగ్గాలకు 200 యూనిట్లను ఉచితంగా సరఫరా చేస్తున్నాం. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు చేశాం. రూ.1,000 కోట్లతో రహదారులకు మరమ్మతులు చేశాం.రాష్ట్రంలో నేరాల రేటు తగ్గింది. గంజాయి, మాదకద్రవ్యాల సరఫరా అరికట్టాం' అని ఆ ప్రకటనలో పేర్కొంది.

ఈ నెల 31, జనవరి 1 తేదీల్లో

అర్ధరాత్రి 12 వరకు మద్యం దుకాణాలు తెరిచేందుకు అనుమతి

ఈనాడు, అమరావతి: నూతన సంవత్సర స్వాగత వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 31, 2026 జనవరి 1 తేదీల్లో అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం దుకాణాలు, అర్ధరాత్రి 1 గంట వరకు బార్లు తెరుచుకోనున్నాయి. ఇన్-హౌస్, ఈవెంట్ పర్మిట్ లైసెన్సులు కలిగిన వారు కూడా రాత్రి 1 గంట వరకు మద్యం విక్రయించుకోవచ్చు. ఈ మేరకు ప్రత్యేక అనుమతులిస్తూ ఎక్సైజ్‌శాఖ ఉత్తర్వులిచ్చింది.

EENADU Vol: 52, Issue: 140 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



కమొడిటీలు శాంతించాయా!

- భారీగా తగ్గిన పసిడి, వెండి, రాగి ఫ్యూచర్స్ ధరలు
- అధిక స్థాయిల వద్ద మదుపర్ల లాభాల స్వీకరణ
- రష్యా- ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గొచ్చనే అంచనాల ప్రభావం

జీవనకాల గరిష్ఠాల నుంచి కిందకు..

ఏడాది కాలంగా పెరుగుదలలో అప్రతిహత జోరు కనబర్చిన పసిడి, వెండి, రాగి ధరల్లో సోమవారం గణనీయ దిద్దుబాటు ఏర్పడింది. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయనే అంచనాలు, వెండిపై చైనా ఎగుమతి ఆంక్షల నేపథ్యంలో, అంతర్జాతీయంగా కమొడిటీ ఎక్స్ఛేంజీల్లో ఈ లోహాల కాంట్రాక్టుల్లో మదుపర్లు లాభాలు స్వీకరించడమే ఇందుకు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. గత వారంలోనూ బంగారం, వెండి ధరలు అనూహ్యంగా పెరగ్గా, అమెరికా – ఉక్రెయిన్ అధ్యక్షుల మధ్య చర్చల ఆరంభంతోనే, దిగి రావడం గమనార్హం. - ఈనాడు వాణిజ్య విభాగం

● పసిడి 2026 ఫిబ్రవరి ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధర సోమవారం 0.04% నష్టపోయి రూ.1,34,887 (10 గ్రాములకు) వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.1,40,444 వద్ద గరిష్ఠాన్ని; రూ.1,34,300 వద్ద కనిష్ఠాన్ని నమోదుచేసింది.

✦ హైదరాబాద్ బులియన్ విపణిలో 24 క్యారెట్ల బంగారం ధర శనివారం రూ.1.43 లక్షలుగా ఉండగా, సోమవారం రాత్రి రూ.1.37 లక్షలకు దిగి వచ్చింది.

● వెండి మార్చి ఫ్యూచర్స్ కాంట్రాక్టు సోమవారం రూ.2,54,174 (1 కిలోకి) వద్ద తాజా జీవన కాల గరిష్ఠాన్ని తాకింది. అక్కడ నుంచి భారీగా పతనమై రూ.2,22,502కు చేరినా, చివరకు రూ.2,24,855 వద్ద స్థిరపడింది.

✦ హైదరాబాద్ బులియన్ విపణిలో కిలో వెండి ధర శనివారం రూ.2.44 లక్షలు కాగా, సోమవారం రూ.2.28 లక్షలకు పతనమైంది.

● రాగి జనవరి కాంట్రాక్టు ధర సోమవారం రూ.1,392.95 (1 కిలోకి) వద్ద తాజా జీవన కాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకొని రూ.1,201 వద్ద కనిష్ఠానికి చేరి, చివరకు రూ.1231.70 వద్ద ముగిసింది.

ఎందుకు పడ్డాయంటే..

పసిడి, వెండి, రాగి కాంట్రాక్టులు సోమవారం జీవన కాల గరిష్ఠాల నుంచి, భారీగా నష్టపోవడానికి వివిధ అంశాలు కారణమయ్యాయని విశ్లేషకులు చెబుతున్నారు.

లాభాల స్వీకరణ: విలువైన లోహాల కాంటాక్టుల్లో మదుపర్లు లాభాలు స్వీకరించడం ప్రధాన కారణం. '2025లో ఈ లోహాలు భారీ ప్రతిఫలాలను పంచాయి. సాంకేతికంగా చూస్తే 2026లో ఈ స్థాయిలో లాభాలు ఉండకపోవచ్చని మేం అంచనా వేస్తున్నామ'ని జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ వైస్‌ప్రెసిడెంట్ (కమొడిటీ, కరెన్సీ పరిశోధన) ప్రణవ్ మెర్ తెలిపారు. 'పసిడి ధరలు చాలా అధిక స్థాయిల్లో ట్రేడవుతున్నాయి. ఏవేని ప్రతికూల పరిణామాలు చోటుచేసుకుంటే, ఈ లోహ ధరలు బాగా దిద్దుబాటు అయ్యే అవకాశాలు ఉంటాయి. ఒకవేళ అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠిన విధాన వైఖరి వైపు మొగ్గుచూపితే, పసిడి ఈటీఎఫ్‌ల నుంచి భారీగా పెట్టుబడులు తరలిపోయే ముప్పు కూడా ఉంద'ని యూబీఎస్ విశ్లేషకులు చెబుతున్నారు.

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల తగ్గుముఖం: రష్యాతో యుద్ధాన్ని ముగించేందుకు శాంతి ప్రణాళికలపై చర్చలు దాదాపు పూర్తి కావొచ్చాయంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించడంతో.. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టొచ్చన్న అంచనాలు పెరిగాయి. ఈ ఉద్రిక్తతల వల్లే సురక్షితమని భావిస్తూ, బంగారం, వెండిపైకి పెట్టుబడులు వస్తున్నాయి. ఉద్రిక్తతలు ఉపశమిస్తే, ఈ లోహాల ధరలూ తగ్గుతాయన్నది అంచనా.

చైనా ఎగుమతి ఆంక్షలు: వెండి ఎగుమతులపై వచ్చే ఏడాది మొత్తం ఆంక్షలు విధించనున్నట్లు చైనా ప్రకటించింది. వెండి ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్) వంటి పథకాల్లోకి ఎంతగా పెట్టుబడులు వస్తే, ఆ మేర లోహాన్ని సంబంధిత సంస్థలు కొనుగోలు చేయాలి. ఇదే ధరను పెంచుతోంది. జనవరి 1 నుంచి చైనా కనుక వెండి ఎగుమతిని అంగీకరించకపోతే, ఆన్‌లైన్‌లో విక్రయాలు జరిపిన సంస్థలు, డెలివరీ ఇవ్వాల్సిన కమొడిటీ ఎక్స్ఛేంజీలకూ కష్టమే. ఈ నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తమయ్యారు.

సీఎంఈ మార్జిన్ పెంపు: అమెరికాకు చెందిన సీఎంఈ గ్రూపు, వెండి కాంట్రాక్టుల ట్రేడింగ్‌కు మార్జిన్‌ను పెంచడమూ, వెండి ధరలు పడిపోవడానికి కారణమైంది. సీఎంఈ, కామెక్స్, సీబాట్, ఎన్‌వైఎంఈఎక్స్ లాంటి డెరివేటివ్స్ ఎక్స్ఛేంజీలను సీఎంఈ నిర్వహిస్తోంది. వెండి డెరివేటివ్స్ 2026 మార్చి కాంట్రాక్టుకు ప్రారంభ మార్జిన్‌ను 20,000 డాలర్ల నుంచి 25,000 డాలర్లకు పెంచుతున్నట్లు శుక్రవారం ప్రకటించింది. మార్జిన్ పెంపునకు తగ్గట్లుగా, మదుపర్ల ఖాతాల్లో సరిపడా డబ్బులు లేకుంటే.. వాళ్ల పొజిషన్లు లిక్విడేట్ అయ్యే అవకాశం ఉంటుంది. ఇది ట్రేడర్ల సెంటిమెంటుపై ప్రతికూల ప్రభావం చూపింది.

ఈనాడు బిజినెస్

గ్రాన్యూల్స్ ఇండియా ప్రిఫరెన్షియల్ ఇష్యూ

రూ.1762.5 కోట్ల సమీకరణ

ఈనాడు, హైదరాబాద్: ఔషధ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా, రూ.1762.5 కోట్ల నిధులు సమీకరించనుంది. ప్రమోటర్లు ఇతరులకు ఈక్విటీ షేర్లు/ వారెంట్లు జారీ చేసి నిధులు సమీకరించడానికి ఇటీవల జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం ఆమోదం తెలిపింది. దీని ప్రకారం 2.5 కోట్ల కన్వర్టబుల్ వారెంట్లు, 51,28,205 ఈక్విటీ షేర్లు జారీ చేస్తారు. ఒక్కో షేరు/ వారెంటుకు రూ.585 జారీ ధర నిర్ణయించారు. కన్వర్టబుల్ వారెంట్ల జారీతో రూ.1,462.5 కోట్లు, ఈక్విటీ షేర్ల జారీ వల్ల రూ.300 కోట్లు కంపెనీకి లభిస్తాయి. దీనికి వాటాదార్ల అనుమతి తీసుకునేందుకు, వచ్చే నెల 22న అసాధారణ సమావేశం (ఈజీఎం) నిర్వహిస్తారు. ప్రధానంగా కంపెనీ ప్రమోటర్లు వారెంట్లు తీసుకుంటున్నారు. ఈక్విటీ షేర్లు తీసుకుంటున్న సంస్థల్లో 360 వన్ వైప్ ఫండ్, మరి కొన్ని ఫండ్లు ఉన్నాయి.

మన జీడీపీ కంటే మనదగ్గరున్న బంగారం విలువే ఎక్కువ!

దేశంలో ప్రజల వద్ద దాదాపు 34,000-35,000 టన్నుల బంగారం నిల్వ ఉందని అంచనా. అంతర్జాతీయంగా కిలో బంగారం ధర 1,46,000 డాలర్లకు చేరింది. అంటే టన్ను (1,000 కిలోల) విలువ 14,60,00,000 డాలర్లకు చేరింది. 34,000 టన్నుల బంగారం ధర చూసినా 4.96 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. మన దేశ జీడీపీ 4 లక్షల కోట్ల డాలర్లుగా ఉందని అంచనా. అంటే ఈ లెక్కన మన దేశ ప్రజల వద్ద ఉన్న బంగారం విలువ, జీడీపీ విలువను మించిందనే విశ్లేషణలు వెలువడుతున్నాయి.

ఐవీఎఫ్ చికిత్సల్లో సూది లేని ఇంజెక్షన్ !



ఇంటెగ్రిమెడికల్‌తో ఇంటాస్ ఒప్పందం

ఐవీఎఫ్, గైనకాలజీ చికిత్సల్లో సూది లేని ఇంజెక్షన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఇంటెగ్రిమెడికల్ అనే సంస్థతో ఇంటాస్ ఫార్మాస్యూటికల్స్ ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా మన దేశంలో ఈ తరహా నూతన చికిత్సను అందించే ఏకైక సంస్థగా ఇంటాస్ ఫార్మాకు గుర్తింపు లభిస్తుంది. ఇది కేవలం ఒక కొత్త విధానాన్ని ఆవిష్కరించడమే కాదని, ఎంతో మంది రోగులకు మేలు చేసినట్లు అవుతుందని ఇంటాస్ ఫార్మా ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు దుర్గా పి. సతపతి అన్నారు. ఐవీఎఫ్, గైనకాలజీ చికిత్సల్లో సులువైన, భద్రతతో కూడిన, గౌరవప్రదమైన విధానాలు తీసుకురావటం తమ లక్ష్యమని వివరించారు.

మనదేశంలో ఐవీఎఫ్ మార్కెట్లో ఎంతో అధిక వృద్ధి నమోదవుతోంది. ప్రస్తుతం ఏటా 3- 5 లక్షల ఐవీఎఫ్ సైకిల్స్ నమోదవుతున్నాయి. 2027 నాటికి ఈ సంఖ్య 5-6 లక్షల సైకిల్స్‌కు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అందువల్ల సూది లేని ఇంజెక్షన్ విధానాన్ని అమలు చేయడం ద్వారా, లక్షల మందికి మేలు జరుగుతుందని ఆయన వివరించారు. సూది లేని ఇంజెక్షన్ విధానం (ఎన్-ఎఫ్ఐఎస్) లో ఒక అధిక పీడనం గల జెట్ ద్వారా, మందును స్ప్రే చేసినట్లుగా చర్మం నుంచి ఒక మైక్రో-అరిఫిస్ ద్వారా శరీరంలోకి పంపిస్తారు. తద్వారా సూది వల్ల కలిగే నొప్పిని తప్పించుకున్నట్లు అవుతుంది.

ఎల్ అండ్ టీకి హైదరాబాద్ రతన్ టాటా రోడ్డు పనులు

రెండో దశలో భాగంగా 22.3 కిమీ నిర్మాణం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి కొత్తగా నిర్మించబోతున్న రేడియల్ రోడ్డుకు సంబంధించిన కీలక ప్రాజెక్టును మౌలిక సదుపాయాల సంస్థ లార్సన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ) దక్కించుకుంది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 13 (రావిర్యాల) నుంచి ఆమనగల్లు వరకు 41.5 కిలోమీటర్ల మేర కొత్త రోడ్డును తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనికి రతన్ టాటా రోడ్డుగా నామకరణం చేసింది. ఈ ప్రాజెక్టులో తొలి దశ 19.2 కిలోమీటర్ల రోడ్డును రిత్విక్ ప్రాజెక్ట్స్ చేపట్టనుంది. రెండో దశలో భాగంగా, మీర్‌ఖాన్‌పేట నుంచి రీజినల్ రింగ్ రోడ్డు ఆమనగల్లు వరకు 22.3 కిలోమీటర్ల ఆరు వరుసల రహదారి పనులు తమకు లభించినట్లు సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో ఎల్అండ్‌టీ వెల్లడించింది. ఈ పనులను కంపెనీ 'సిగ్నిఫికెంట్' విభాగం కింద వర్గీకరించింది. సుమారు రూ.1,000 కోట్ల నుంచి రూ.2,500 కోట్ల పనులు ఈ విభాగం కింద ఉంటాయి. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా 3.6 కిలోమీటర్ల పొడవైన వయాడక్ట్, చిన్న వంతెనలు, అండర్‌పాస్‌లు, కల్వర్టులు ఉంటాయి. ఇరువైపులా సర్వీసు రోడ్లు, వర్షపు నీటి నిర్వహణ, పటిష్ఠమైన డ్రైనేజీ, సైకిల్ ట్రాక్‌ల వంటివీ నిర్మిస్తారు. ఐటీ కారిడార్లు, ఎలక్ట్రానిక్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి కీలక ప్రాజెక్టులకు ఈ రోడ్డు ఉపయోగపడనుంది.

వైస్రాయ్ హోటల్స్ చేతికి మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్

విలువ రూ.206 కోట్లు



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఆతిథ్య సేవల సంస్థ వైస్రాయ్ హోటల్స్ లిమిటెడ్, తన వ్యాపార విస్తరణలో భాగంగా మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్‌ను కొనుగోలు చేయనుంది. గచ్చిబౌలిలోని ఐటీ కారిడార్‌లో ఉన్న ఈ అపార్ట్‌మెంట్స్, ఎస్ఎల్ఎన్ టెర్మినస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ యాజమాన్యంలో ఉన్నాయి. వీటి కోసం రూ.206 కోట్లు చెల్లించేందుకు వైస్రాయ్ హోటల్స్ సిద్ధమైంది. ఇందుకు వాటాదారుల అనుమతి లభించినట్లు వైస్రాయ్ వెల్లడించింది. మొత్తం రూ.206 కోట్లలో దాదాపు రూ.105.66 కోట్లను భూమికోసం, రూ.40.67 కోట్లను కార్పొరేట్ రుణాల చెల్లింపు, రూ.59.67 కోట్లను షేర్ల కొనుగోలుకు కేటాయించింది. అవసరమైన అనుమతులు, తనిఖీలు పూర్తయిన తర్వాత, ఎస్ఎల్ఎన్ టెర్మినస్ సంస్థ వైస్రాయ్ హోటల్స్‌కు పూర్తిస్థాయి అనుబంధ సంస్థగా మారనుంది. మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్‌లో 75 ఎగ్జిక్యూటివ్ గదులు, సుమారు 1.65 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థ రూ.43.45 కోట్ల ఆదాయాన్ని, రూ.5.98 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2030 నాటికి 1,000 గదుల లక్ష్యానికి చేరుకోవడంలో ఇదొక వ్యూహాత్మక అడుగు అని వైస్రాయ్ తెలిపింది. ఈ లక్ష్యంలో భాగంగా మాదాపూర్‌లో కొత్తగా 200 గదులతో కూడిన కోర్ట్‌యార్డ్ బై మారియట్ నిర్మాణాన్ని చేపట్టింది. ప్రస్తుతం సంస్థకు 470 గదులున్నాయి.

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఆఫర్లు



ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ 'పేడే సేల్' ఆఫర్ల బుకింగ్‌లు సోమవారం మొదలయ్యాయి. జనవరి 1 వరకు ఈ టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చు. దేశీయ ప్రయాణానికి రూ.1,950 నుంచి, విదేశీ ప్రయాణాలకు రూ.5,590 నుంచి టికెట్లు అందుబాటు ఉంచామని.. చెక్ ఇన్ బ్యాగేజీ లేనివారికి ఈ ధరలు రూ.1,850, రూ.5,335 నుంచి ప్రారంభమవుతాయని సంస్థ తెలిపింది. సంస్థ వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ యాప్, ప్రధాన బుకింగ్ ఛానళ్లలోనూ ఈ టికెట్లు బుక్ చేసుకోవచ్చు. దేశీయంగా 2026 జనవరి 12 నుంచి అక్టోబరు 10 మధ్య ప్రయాణానికి, విదేశీ మార్గాల్లో అయితే జనవరి 12 నుంచి అక్టోబరు 31 వరకు ప్రయాణించడానికి ఈ టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చు.

✦ సంస్థ మొబైల్ యాప్ - వెబ్‌సైట్‌లో బుక్ చేసుకునేందుకు కన్వీనియెన్స్ రుసుమూ లేదని తెలిపింది. విద్యార్థులు, వయోవృద్ధులు, సాయుధ బలగాల సభ్యులకు, వారిపైన ఆధారపడినవారికి రాయితీ ఇస్తోంది. లాయల్టీ సభ్యులకు మరిన్ని ఆఫర్లున్నాయి.

లగేజీ ఆఫర్లు: దేశీయంగా 15 కిలోల లగేజీకి రూ.1,500, విదేశీ ప్రయాణికులకు 20 కిలోల లగేజీకి రూ.2,500 రుసుమును వసూలు చేస్తోంది.

కోడి గుడ్లు

30న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	650
వరంగల్	652
విజయవాడ	680
తూ/ప గోదావరి	665
విశాఖపట్నం	660
చిత్తూరు	703

రూ.2.7 లక్షల కోట్ల పరిహారం ఇవ్వండి!

- గ్యాస్ వివాదంలో రిలయన్స్, బీపీని కోరుతున్న కేంద్రం
- తప్పుడు సమాచారమన్న రిలయన్స్



దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్, దాని భాగస్వామ్య బ్రిటిష్ సంస్థ బీపీ నుంచి 30 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2.7 లక్షల కోట్ల)కు పైగా పరిహారాన్ని భారత ప్రభుత్వం కోరుతోందని తెలుస్తోంది. చమురు-గ్యాస్ వెలికి తీసేందుకు కేజీ-డీ6 క్షేత్రాల్లో ఈ భాగస్వామ్య కంపెనీలు అవసరమైన దానికంటే భారీ ప్లాంట్లు నిర్మించాయని, అయినా సహజ వాయువు ఉత్పత్తి లక్ష్యాలను చేరడంలో విఫలమయ్యాయని ప్రభుత్వం ఆరోపించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నవంబరు 7న త్రిసభ్య మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్ ముందు కేంద్ర ప్రభుత్వం ఆ మేరకు కోరినట్లు తెలుస్తోంది. 14 ఏళ్ల నాటి ఈ వివాదానికి సంబంధించిన వాదనలు అదే రోజున ముగిశాయి. కొత్త ఏడాదిలో ట్రైబ్యునల్ తన తీర్పు ఇవ్వొచ్చు. ఈ వివాదంలో ఓడిపోయిన వర్గం, సుప్రీం కోర్టుకు వెళ్లే అవకాశం ఉందనీ సమాచారం. ఉత్పత్తి చేయని గ్యాస్ విలువతో పాటు; ఇన్‌స్టలేషన్, ఇంధన మార్కెటింగ్‌పై చేసిన వ్యయాలు, వాటిపై వడ్డీలనూ పరిహారం కింద కేంద్రం కోరిందని, ఈ మొత్తం విలువ 30 బి. డాలర్లపైనే ఉందని ఆ వర్గాలు తెలిపాయి.

పరిహారం కోరలేదు: రిలయన్స్

ఈ అంశంపై రిలయన్స్ స్పందిస్తూ 'రిలయన్స్, బీపీలను 30 బి. డాలర్ల పరిహారం ఎవరూ కోరలేదు. అది తప్పుడు సమాచారం. అన్ని అంశాలూ ప్రస్తుతం చట్టపరిధిలో ఉన్నాయి. దేశ న్యాయ వ్యవస్థపై రిలయన్స్‌కు పూర్తి నమ్మకం ఉంది. మేం అన్ని కాంట్రాక్టు, చట్టపర నిబంధనలు పాటించాం. నివేదికలోని అంశాలను వక్రీకరించార'ని పేర్కొంది.

మురిసిన పారిశ్రామికం

- రెండేళ్ల గరిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి వృద్ధి



దిల్లీ: దేశీయ పారిశ్రామికోత్పత్తి వృద్ధి నవంబరులో 6.7 శాతంగా నమోదైంది. ఇది రెండేళ్ల గరిష్ఠ స్థాయి. జీఎస్‌టీ రేట్ల కోత అనంతరం, వినియోగం అధికమై, వస్తువులకు ఆర్డర్లు పెరగడంతో గనులు, తయారీ రంగాలు ఆకర్షణీయ పనితీరు కనబర్చడం ఇందుకు కారణం. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐపీఓ) ఆధారంగా పారిశ్రామికోత్పత్తి వృద్ధిని లెక్కిస్తారు. 2024 నవంబరులో ఐఐపీ సూచీ 5% వద్ద ఉండగా.. ఈ నవంబరులో 6.7 శాతంగా నమోదైంది. 2023 నవంబరులో నమోదైన 11.9% తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన వివరాల ప్రకారం..

✦ నవంబరులో తయారీ రంగ ఉత్పత్తిలో వృద్ధి 8 శాతానికి చేరింది. 2024 నవంబరులో ఇది 5.5 శాతమే. గనుల రంగ ఉత్పత్తి వృద్ధి 1.9% నుంచి 5.4 శాతానికి పెరిగింది. విద్యుదుత్పత్తి 1.5% క్షీణించింది. తయారీ రంగంలోని 23 పారిశ్రామిక విభాగాల్లో 20 విభాగాలు సానుకూల వృద్ధిని కనబర్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- నవంబరులో పారిశ్రామికోత్పత్తి వృద్ధి 3.3 శాతానికి తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో పారిశ్రామికోత్పత్తి వృద్ధి 4.1 శాతంగా ఉంది.

మెడి అసిస్ట్‌లో పారామౌంట్ టీపీఏ విలీనం

మెడి అసిస్ట్ హెల్త్‌కేర్ సర్వీసెస్ తన అనుబంధ సంస్థ పారామౌంట్ హెల్త్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ టీపీఏ సర్వీసెస్‌ను తన ఆధ్వర్యంలోని మరో సంస్థ మెడి అసిస్ట్ ఇన్సూరెన్స్ టీపీఏలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఇరు సంస్థల బోర్డు సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నట్లు స్టాక్ మార్కెట్లకు ఇచ్చిన సమాచారంలో వెల్లడించింది. ఈ ప్రతిపాదిత విలీనం ఎలాంటి నగదు చెల్లింపులు లేకుండా ఉంటుంది. ఈ రెండు సంస్థలూ బీమా సంస్థల ఆరోగ్య బీమా పాలసీలకు థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్ (టీపీఏ) గా సేవలు అందిస్తున్నాయి. వీటిని ఏకీకరణ చేయడం ద్వారా నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు, వాటాదారుల విలువ పెరుగుతుందని కంపెనీ వివరించింది.

బ్యాంకుల పనితీరు భేష్



- దశాబ్దాల కనిష్ఠానికి మొండి బకాయిలు
- 2024-25పై ఆర్‌బీఐ నివేదిక

ముంబయి: వాణిజ్య బ్యాంకులు బలమైన పనితీరు నమోదు చేశాయని, మొండి బకాయిలు దశాబ్దాల కనిష్ఠానికి చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) వెల్లడించింది. సోమవారం ఆర్‌బీఐ విడుదల చేసిన 'ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ ఇండియా 2024-25' నివేదిక ఈ విషయాలను వెల్లడించింది. అందులోని ముఖ్యాంశాలు..

'2024-25లో బ్యాంకింగ్ రంగం మెరుగ్గా పనిచేసింది. బలమైన బ్యాలెన్స్‌షీట్లు, లాభదాయకత, ఆస్తుల నాణ్యత వంటివి మద్దతు పలికాయి. రుణ, డిపాజిట్ వృద్ధి రెండంకెల్లో కొనసాగింది. మూలధన నిల్వలు కానీ, ద్రవ్యలభ్యత కానీ నియంత్రణపరమైన అవసరాల కంటే అధికంగానే నమోదయ్యాయి. బలమైన బ్యాంకింగ్ రంగ మూలాల కారణంగానే ఇది సాధ్యమైంది.

✦ బ్యాంకుల నికర లాభాలు 2023-24తో పోలిస్తే కాస్త నెమ్మదించాయి. 2024-25లో అన్ని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు (ఎస్‌సీబీ)ల నికర లాభం 14.8% వృద్ధితో రూ.4.01 లక్షల కోట్లకు చేరింది. 2023-24లో 32.8% వార్షిక వృద్ధితో రూ.3.5 లక్షల కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో లాభదాయకత బాగుంది. ఆస్తులపై ప్రతిఫలం(ఆర్‌ఓఏ) 1.4% కాగా, ఈక్విటీపై ప్రతిఫలం 23.5 శాతంగా నమోదైంది. స్థూల నిరర్థక ఆస్తులు 2025 మార్చి చివరకు 2.2 శాతానికి; 2025 సెప్టెంబరు నాటికి 2.1 శాతానికి పరిమితమయ్యాయి.

✦ పట్టణ సహకార బ్యాంకులు సైతం వార్షికం వారీగా రికార్డు వృద్ధి స్థాయిని నమోదు చేశాయి. ఆస్తుల నాణ్యత వరుసగా నాలుగో ఏడాదీ మెరుగైంది.

ఊబకాయం ఔషధంపై చైనా కంపెనీతో లుపిన్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: జీఎల్‌పీ-1 రిసెప్టర్ అగొనిస్ట్ ఔషధమైన బొపాన్‌గ్లుటైడ్ ఇంజెక్షన్ పంపిణీ కోసం మనదేశానికి చెందిన లుపిన్ లిమిటెడ్, చైనా సంస్థ గాన్ అండ్ లీ ఫార్మాస్యూటికల్స్‌తో లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఇంజెక్షన్‌ను ఊబకాయం, మధుమేహ వ్యాధికి చికిత్సలో వినియోగిస్తున్నారు. బాధితులు రెండు వారాలకు ఒక ఇంజెక్షన్ తీసుకోవాలి. ఇతర జీఎల్‌పీ-1 ఔషధాలతో సమానంగా ఈ మందు పనిచేస్తుందని, అదే సమయంలో రెండు వారాలకు ఒక ఇంజెక్షన్ సరిపోతుందని లుపిన్ లిమిటెడ్ అధ్యక్షుడు రాజీవ్ సిబాల్ వివరించారు. చైనా కంపెనీతో కుదిరిన ఒప్పందం ప్రకారం మనదేశంలో ఈ ఇంజెక్షన్ పంపిణీ హక్కులు లుపిన్‌కు లభిస్తాయి.

తగ్గిన ఏటీఎమ్‌ల సంఖ్య

ముంబయి: డిజిటల్ చెల్లింపులు పెరగడంతో, ప్రజలు నగదు విత్‌డ్రా చేసుకునేందుకు ఉపకరించే ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్స్ (ఏటీఎమ్‌లు) సంఖ్య తగ్గిందని ఆర్‌బీఐ పేర్కొంది. 2025 మార్చి 31 నాటికి మొత్తం ఏటీఎమ్‌ల సంఖ్య 2,51,057కు తగ్గింది. 2024 మార్చి చివరికి 2,53,417 ఏటీఎంలు దేశంలో ఉన్నాయి. అంటే ఏడాది వ్యవధిలో 2,360 ఏటీఎమ్‌లు తొలగించారు. ప్రైవేటు రంగ బ్యాంకుల ఏటీఎమ్‌లు 79,884 నుంచి 77,117కు; ప్రభుత్వ రంగ బ్యాంకుల ఏటీఎమ్‌లు 1,34,694 నుంచి 1,33,544కు తగ్గాయి. ఏ బ్యాంకు ఖాతాదారు అయినా నగదు తీసుకునేందుకు ఉపయోగపడే వైట్ లేబుల్ ఏటీఎమ్‌లు మాత్రం 34,602 నుంచి 36,216కు పెరిగాయి. ఇదే సమయంలో బ్యాంకుల శాఖల సంఖ్య 2.8% పెరిగి 1.64 లక్షలుగా నమోదైంది.

'తప్పుడు' విక్రయాలపై ఆర్‌బీఐ కొరడా

ఆర్థిక పథకాలు, సేవల అమ్మకాలకు త్వరలో మార్గదర్శకాలు



ముంబయి: తప్పుడు/అసమగ్ర సమాచారంతో వినియోగదార్లను తప్పుదారి పట్టిస్తూ.. వేర్వేరు ఆర్థిక పథకాలు, సేవలను విక్రయిస్తుండటాన్ని నివారించడంపై రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) దృష్టిసారించింది. ఇందుకోసం వ్యాపార ప్రకటనలు, మార్కెటింగ్-విక్రయాలకు సంబంధించి ఆయా సంస్థలకు విస్తృత స్థాయి నిబంధనలను ఆర్‌బీఐ జారీ చేయనుంది. కొంతమంది ఇలా 'తప్పుడు మార్గాల్లో ఆయా ఉత్పత్తులు విక్రయించడం (మిస్‌సెల్లింగ్) వల్ల వినియోగదార్లపై, ఆర్థిక రంగంపైనా ప్రభావం పడుతోందని ఆర్‌బీఐ వివరించింది. రికవరీ ఏజెంట్లు, రుణ రికవరీ వంటి అంశాలకు సంబంధించిన నిబంధనలను సమీక్షించి, సవరించనున్నట్లు తెలిపింది.

✦ డిజిటల్ మోసాలను అరికట్టేందుకు హోం వ్యవహారాల శాఖ సహా పలు వర్గాలతో కలిసి పనిచేయనున్నట్లు వివరించింది. డిజిటల్, సైబర్ మోసాలను అదుపు చేసేందుకు పలు చర్యలను చేపట్టనున్నట్లూ పేర్కొంది.

✦ ఆర్థిక సంస్థలు అంతర్గతంగా బలమైన చర్యలు చేపట్టాలని, అన్ని స్థాయుల్లో ఫిర్యాదు పరిష్కార అధికారులు తగిన సంఖ్యలో ఉండేలా చూసుకోవాలని, డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతనూ పెంచాలని సూచించింది.

✦ మ్యూల్ ఖాతాల ద్వారా జరుగుతున్న మోసాలను నిలువరించేందుకు ఆర్‌బీఐ మ్యూల్‌హంటర్.ఏఐని అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే.

లెనోవో ఇండియా యాజమాన్యంలో మార్పులు

అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం లెనోవో తమ భారత విభాగ యాజమాన్యంలో కీలక మార్పులు చేపట్టింది. వన్ లెనోవో కమర్షియల్ లీడర్‌గా అమిత్ లూత్రా, కన్జూమర్ వ్యాపారం డైరెక్టర్‌గా కమన్ చావ్లాను నియమించింది. లెనోవో ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సొల్యూషన్స్ గ్రూప్ ఎండీగా శ్రీనివాసరావుకు పదోన్నతి కల్పించింది.

నాలుగో రోజూ నష్టాలే

సెన్సెక్స్ ▼346 84696 | నిఫ్టీ ▼100 25942



26,000 పాయింట్ల దిగువకు నిఫ్టీ

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.2760 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.2644 కోట్లు

ఐటీ, బ్లూచిప్ షేర్లలో అమ్మకాల ఫలితంగా, వరుసగా నాలుగో రోజూ దేశీయ సూచీలు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ మళ్లీ 26,000 పాయింట్ల దిగువకు చేరింది. ఏడాది చివర్లో ట్రేడింగ్ పరిమాణం స్వల్పంగా ఉండటం, విదేశీ అమ్మకాలు ఇందుకు తోడయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 8 పైసలు తగ్గి 89.98 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.70% లాభంతో 61.67 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా సూచీలు బలహీనంగా ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.1.82 లక్షల కోట్లు తగ్గి, రూ.472.15 లక్షల కోట్లు (5.25 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 37 పాయింట్ల (క్రితం ముగింపు 85,041.45) నష్టంతో 85,004.75 వద్ద ప్రారంభమైంది. ఆరంభ ట్రేడింగ్‌లో 85,250 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ, అమ్మకాలతో నష్టాల్లోకి జారుకుంది. ఒకదశలో 84,637.86 వద్ద కనిష్ఠాన్ని నమోదుచేసింది. చివరకు 345.91 పాయింట్ల నష్టంతో 84,695.54 వద్ద ముగిసింది. నిఫ్టీ 100.20 పాయింట్లు కోల్పోయి 25,942.10 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,920.30- 26,106.80 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 22 నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ 2.22%, హెచ్‌సీఎల్ టెక్ 1.86%, పవర్‌గ్రిడ్ 1.85%, ట్రెంట్ 1.36%, బీఈఎల్ 1.26%, భారతీ ఎయిర్‌టెల్ 1.14%, రిలయన్స్ 0.88% డీలాపడ్డాయి. టాటా స్టీల్ 1.83%, ఏషియన్ పెయింట్స్ 1.05%, ఎటర్నల్ 0.48%, ఎన్‌టీపీసీ 0.45% రాణించాయి. రంగాల వారీ సూచీల్లో.. యుటిలిటీస్ 0.91%, విద్యుత్ 0.86%, ఐటీ 0.80%, ఫోకస్డ్ ఐటీ 0.79%, స్థిరాస్తి 0.76%, యంత్ర పరికరాలు 0.71% పడ్డాయి. టెలికాం, చమురు-గ్యాస్, ఎఫ్ఎమ్‌సీజీ మెరిశాయి. బీఎస్ఈలో 2831 షేర్లు నష్టపోగా, 1495 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 195 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

✦ అరవింద్ యూత్ బ్రాండ్స్‌లో ఫ్లిప్‌కార్ట్ గ్రూప్‌నకు ఉన్న 31.25% వాటాను రూ.135 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు అరవింద్ ఫ్యాషన్స్ ప్రకటించింది.

✦ యాక్సిస్ బ్యాంక్‌తో రూ.70 కోట్ల రుణానికి సంబంధించి, ఏక కాల సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది.

✦ భూటాన్‌లో టాటా గ్రూప్ సంస్థ ఇండియన్ హోటల్స్ కంపెనీ అడుగుపెట్టింది. సీజీ హాస్పిటాలిటీ భాగస్వామ్యంలో 45 గదులతో తాజ్ పారో రిసార్ట్ అండ్ స్పా హోటల్‌ను ప్రారంభించినట్లు కంపెనీ వెల్లడించింది.

4 కంపెనీల ఐపీఓలకు సెబీ అనుమతి

టైల్స్, బాత్‌వేర్ సంస్థ వర్మోరా గ్రానిటో, బెహరి లాల్ ఇంజినీరింగ్, క్నాక్ ప్యాకేజింగ్, శివాలయ కన్‌స్ట్రక్షన్ కంపెనీల తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రతిపాదనలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదించింది. ఈ కంపెనీలన్నీ కలిపి రూ.1400 కోట్లకు పైగా సమీకరించనున్నాయి. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరుల్లో సెబీ వద్ద ఈ 4 కంపెనీలు ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి. కాన్ఫిడెన్షియల్ మార్గంలో ముసాయిదా పత్రాలు దాఖలు చేసిన ఇన్నీ ఫ్రెష్ ఫుడ్స్, ముసాయిదా పత్రాలను వెనక్కి తీసుకుంది.

✦ ఐపీఓ ద్వారా రూ.600 కోట్లు సమీకరించేందుకు సెబీ వద్ద ఆటోమోటివ్ లైటింగ్ ఉత్పత్తుల తయారీ సంస్థ నియోలైట్ జడ్‌కేడబ్ల్యూ లైటింగ్స్ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది.

✦ ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు సెబీ వద్ద డబ్ల్యూటీజీ టెక్నాలజీస్ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ.375 కోట్ల తాజా షేర్లను కంపెనీ విక్రయించనుంది.

✦ ఐపీఓ ద్వారా రూ.2600 కోట్లు సమీకరించేందుకు బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు కలిగిన హొరిజన్ ఇండస్ట్రియల్ పార్క్స్ ముసాయిదా పత్రాలు సమర్పించింది. ప్రస్తుతం ఈ కంపెనీలో బ్లాక్‌స్టోన్‌కు 89% వాటా ఉంది.

ఈనాడు సినిమా



ఇది రాజాసాబ్ టైమ్

“మన టైమ్ మొదలైంది..” అంటున్నారు కథానాయకుడు ప్రభాస్. ఇప్పుడాయన సంక్రాంతి బరిలో 'ది రాజాసాబ్' సినిమాతో సందడి చేయనున్న సంగతి తెలిసిందే. మారుతి దర్శకత్వం వహించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్ దత్, బొమన్ ఇరానీ, జరీనా వహాబ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో సోమవారం ఈ చిత్ర కొత్త ట్రైలర్‌ను విడుదల చేశారు. “నానమ్మ.. నీకు ఈ ప్రపంచంలో అన్నీ మర్చిపోయే రోగం ఉన్నా ఆయన్ని మాత్రం అస్సలు మర్చిపోలేవ్” అంటూ ప్రభాస్ డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం చక్కటి హారర్ ఫాంటసీ విజువల్స్‌తో ఆసక్తి రేకెత్తిస్తూ సాగింది. గతంలో విడుదల చేసిన ట్రైలర్‌లో ఈ చిత్ర ప్రపంచాన్ని చూపించిన చిత్ర బృందం.. ఈ కొత్త ట్రైలర్‌లో కథేంటో దాన్ని తెరపై ఎలా చూపించనున్నారు అన్నది స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేసింది. ఇదొక మయసభ లాంటి రాజమహల్‌లో జరిగే కథ. అది ఎన్నో ఏళ్లుగా సంజయ్ దత్ ఆత్మ ఆధీనంలో ఉంటుంది. ఆ పురాతన ప్యాలెస్‌లోని ఖజానా.. దాంట్లోని ప్రతి వస్తువు తన అతీత శక్తులతో హిప్నటైజ్ చేయబడి ఉంటుంది. ఆ సంపదనంతటినీ ఆ శక్తిమంతమైన ఆత్మ నుంచి విడిపించుకోవాలన్నా.. దానితో పోరాడాలన్నా వేరే ప్రపంచాన్ని సృష్టించుకుని పోరాడాల్సిందే. మరి ఆ దేవనగర సంస్థానం కోసం రాజాసాబ్ తన తాత ఆత్మతో ఎలాంటి పోరాటం చేశాడన్నది ఆసక్తికరం. ట్రైలర్‌లో కనిపించిన హారర్ షాట్స్.. ఫాంటసీ విజువల్స్.. యాక్షన్ సన్నివేశాలు ఈ సినిమాపై అంచనాలు పెంచేలా ఉన్నాయి. ఆఖర్లో ప్రభాస్ జోకర్ క్యారెక్టర్ గెటప్‌లో కనిపించడం ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రానికి తమన్ సంగీతమందించారు.. కార్తీక్ పళని ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.

సీజన్ 2లో ఆ ప్రశ్నలకు సమాధానం



“సింహం, చిరుత.. ఇలాంటి మృగాలు ఎన్ని చేసినా.. ఆ జింక బెదరలేదు. ఎందుకంటే అది జింకే కాదు” అంటూ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న సిరీస్ 'కానిస్టేబుల్ కనకం'. వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో ప్రశాంత్ కుమార్ దిమ్మల తెరకెక్కించారు. ఇటీవలే ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో విడుదలై సినీప్రియుల్ని విశేషంగా అలరించింది సిరీస్. రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల, మేఘలేఖ కీలక పాత్రలు పోషించారు. ఇప్పుడీ సిరీస్‌కు కొనసాగింపుగా సీజన్ 2 రాబోతున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల తేదీని ప్రకటించింది ఈటీవీ విన్. “మొదట్లో ఎన్నో ప్రశ్నలు.. సీజన్ 2లో అన్నీ సమాధానాలు ఉంటాయి. అన్ని ప్రశ్నలు ఒకే నిజానికి దారి తీస్తాయి. చంద్రిక ఎక్కడ అంటూ 'కానిస్టేబుల్ కనకం సీజన్ 2' జనవరి 8న రాబోతోంది” అనే వ్యాఖ్యల్ని జోడించింది.

ఓటీటీలో ఈ వారం

2025కు వీడ్కోలు చెప్పే కథలు.. కొత్త ఏడాదికి స్వాగతం పలికే చిత్రాల కోసమే కదా ప్రేక్షకుల ఎదురుచూపులు. ఓటీటీలు కూడా 2026కి వెల్‌కమ్ చెప్తూ.. సినీప్రియులకు ఈ వారాంతం నాన్‌స్టాప్‌గా వినోదాలు పంచడానికి కొత్త కంటెంట్‌తో సిద్ధంగా ఉన్నాయి.

లవ్ బియాండ్ వికెట్ (సిరీస్)	గురువారం	జియోహాట్‌స్టార్
రన్ అవే (సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
లవ్ ఫ్రమ్ 9టూ 5(సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
ఫాలో మై వాయిస్(సినిమా)	శుక్రవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో

మోగ్లీ ప్రేమకథ



తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతివాడు హీరోనే.. అంటూ ఇటీవలే 'మోగ్లీ 2025' చిత్రంతో తెరపై సందడి చేశారు రోషన్ కనకాల. ఆయన ప్రధాన పాత్రలో సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రమిది. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సాక్షి మడోల్కర్ కథానాయిక. అడవి నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథలో మోగ్లీ పాత్రలో తనదైన నటనతో మెప్పించాడు రోషన్. కర్మఫలం, పురాణాలు లాంటి అంశాలతో రూపొంది థియేటర్లలో అలరించిన ఈ సినిమా ఇప్పుడు మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. గురువారం నుంచి ప్రముఖ ఓటీటీ ఈటీవీ విన్ వేదికగా అలరించనుంది. మరి 'ప్రతి హీరో నగరంలోనే పుట్టడు.. కొంత మంది అడవి నుంచి పుట్టుకొస్తారు' అంటూ సినీప్రియుల్ని ఆకట్టుకున్న ఈ సినిమా కథేంటో మీరూ చూడండి.

అడవుల్లో చాలా రహస్యాలు



అడవిలోని రహస్యాలు.. మనుషులు, వన్యప్రాణుల మధ్య ఉండే సున్నితమైన అంతుచిక్కని బంధం చుట్టూ రూపొందిన చిత్రం 'ఎకో'. ఈ మలయాళ చిత్రంలో సందీప్ ప్రదీప్ ప్రధాన పాత్రలో నటించారు. దింజిత్ అయ్యతన్ దర్శకత్వం వహించారు. గత నెల థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా 'అడవులలో చాలా రహస్యాలు దాగి ఉన్నాయి. సమాధానాలు కూడా అక్కడే ఉంటాయా?' అంటూ ఆసక్తికర మలుపులు, సంభాషణలతో ఆకట్టుకుంది. సినీప్రియుల్ని సీటు అంచున కూర్చోబెట్టిన ఈ సినిమా బుధవారం నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా అలరించనుంది. వినీత్, నరైన్, సౌరభ్ సచ్‌దేవ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

ఈసారికి సారీ... 2026లోనే వస్తాం మరి..!

● ఈ ఏడాది తెరపై కనిపించని బాలీవుడ్ భామలు

● కొత్త సంవత్సరంపైనే ఆశలు



2026 కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. సినిమా లెక్కలకూ సమయమైంది. మరి అందులో బాలీవుడ్ భామల వాటా ఎంతుందో చూద్దామా! జయాపజయాలతో సంబంధం లేకుండా అవకాశాలను అందుకుంటూ తెరపై సందడి చేసే బాలీవుడ్ సోయగాల మెరుపులు ఈ ఏడాది ఎక్కువగా కనిపించనేలేదు. కియారా అద్వాణీ, జాన్వీ కపూర్, అనన్య పాండే లాంటి కొంత మంది నాయికలు తెరపై మెరిసినా.. ఆ చిత్ర విజయాలు అంతంత మాత్రమే. అయితే కథల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తూ.. ఆలస్యమైనా సరే.. అదిరిపోయే హిట్ ఇవ్వాలని వచ్చే ఏడాదికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు ఈ భామలు.

హాలీవుడ్ సినిమాలతో తీరిక లేకుండా గడుపుతోంది ప్రియాంక చోప్రా. శక్తిమంతమైన పాత్రలతో ప్రయాణిస్తోన్న ఈమె సందడి తెరపై కనిపించక రెండేళ్లు కావొస్తుంది. 2023లో 'లవ్ అగైన్' అనే ఇంగ్లిష్ సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించి.. ఈ సంవత్సరం 'హెడ్స్ ఆఫ్ స్టేట్' అనే ఓటీటీ చిత్రంతోనే సరిపెట్టుకుంది. మరి కొద్దిరోజుల్లో 2025కి సెండాఫ్ చెప్పే సమయమైనా.. ఆమె సందడి లేదంటూ అభిమానులు నిరాశపడుతున్నారు. కానీ ఈ రెండేళ్ల విరామాన్ని వచ్చే సంవత్సరం రాబోయే ప్రాజెక్టులతో భర్తీ చేయడానికి సన్నద్ధమవుతోంది ప్రియాంక. 'ది బ్లఫ్', 'జడ్జిమెంట్ డే' లాంటి పలు హాలీవుడ్ చిత్రాలతో మరోసారి మ్యాజిక్ చేయబోతుందామె. వీటితో పాటు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు సరసన 'వారణాసి' చిత్రంలో నటిస్తుంది. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమా 2027 వేసవికి రానుంది.

రీల్ రివైండ్ 2025

మాతృత్వపు ఆనందంలో దీపిక

హీరోలకు దీటుగా యాక్షన్ సన్నివేశాలతో అదరగొట్టే దీపిక.. 2025లో ఖాతా తెరవని కథానాయికల్లో ఒకరు. గతేడాది ప్రభాస్ సరసన 'కల్కి 2898ఏడీ' చిత్రంలో కనిపించి తెలుగు ప్రేక్షకుల్ని పలకరించిందీమె. అయితే 2024 ప్రారంభంలోనే తల్లి అవుతున్నట్లు ప్రకటించిన దీపిక.. ప్రస్తుతం మాతృత్వపు దశను ఆస్వాదిస్తుంది. దీంతో సినిమాలకు కాస్త విరామం ఇచ్చినా.. కథల ఎంపికలతో ఈ ఏడాది కూడా బిజీగానే గడిపింది. ఈ మధ్యకాలంలో భారీ ప్రాజెక్టుల్లో ఆమె పేరు ఎక్కువగా వినిపిస్తోంది. ఇటీవలే షారుక్ ఖాన్‌తో కలిసి 'కింగ్'లో నటిస్తున్నట్లు ప్రకటించింది దీపిక. ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోవైపు అల్లు అర్జున్, అట్లీ కలయికలో రూపొందుతున్న చిత్రంలోనూ ఈమె కథానాయిక కావడం విశేషం. దీపికతో పాటు కరీనా కపూర్, తాప్సీ లాంటి పలువురు తారల సందడి ఈ సంవత్సరం కనిపించనే లేదు.

ఆలస్యమైనా వసూళ్లతోనే మెరుపులు

అందరి కథానాయికల్లా వరుస సినిమాలతో అలరించకపోయినా.. కథల ఎంపికలో మాత్రం ప్రత్యేకత ఉంటుంది. తన దగ్గరికి వచ్చిన ప్రతి అవకాశానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోయినా.. ఉన్నట్టుండి.. బాక్సాఫీసు దగ్గర వసూళ్లతోనే మెరిసిపోతుంది. ఆమె.. అందాల తార శ్రద్ధాకపూర్. గతేడాది 'స్త్రీ 2'తో థియేటర్లలో అదరగొట్టి.. భారీ వసూళ్లతో బాలీవుడ్ బాక్సాఫీసుకే కొత్త కళ తీసుకొచ్చింది. ఇందులో దెయ్యంగా కనిపించి ప్రశంసలు అందుకున్న ఈమె.. ఈ ఏడాది ఖాతా కూడా తెరవలేదు. ప్రస్తుతం ప్రాజెక్టుల విషయంలో ఆచితూచి అడుగులేస్తున్న శ్రద్ధ.. ఇటీవలే తన రాబోయే చిత్రాల గురించి ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. “రాహుల్ మోడీతో స్టార్టప్‌ల ప్రపంచం చుట్టూ తిరిగే ఓ సినిమాతో రాబోతున్నా. మరో ప్రాజెక్టు కూడా ఇప్పటికే షూటింగ్ పూర్తయింది. త్వరలో వివరాల్ని ప్రకటిస్తా” అని అంది. మరి ఆలస్యమైనా వసూళ్లతోనే మ్యాజిక్ చేసే ఆమె హంగామా వచ్చే ఏడాదిలో ఎలా ఉంటుందో చూడాలి.

డబుల్ ట్రీట్

ఈ ఏడాది ప్రేక్షకుల్ని పలకరించని తారల్లో అలియా ఒకరు. 2024లో 'జిగ్రా' సినిమాలో సోదరిగా అలరించిన ఆమె... ఈ ఏడాదిలో కూడా తెరపైకి రావాల్సి ఉన్నా.. చిత్రీకరణల ఆలస్యం తదితర కారణాలతో థియేటర్లలో తన సందడి కనిపించలేదు. అలియా, రణ్‌బీర్‌కపూర్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రధారులుగా 'లవ్ అండ్ వార్' సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2025 క్రిస్మస్ సందర్భంగా రావాల్సి ఉండగా.. అనుకోని కారణాలతో వాయిదా పడింది. మరోవైపు యశ్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న 'ఆల్ఫా' సినిమాది కూడా ఇదే పరిస్థితి. ఈ రెండు చిత్రాలు 2026లో ప్రేక్షకుల్ని పలకరించడమే లక్ష్యంగా చకచకగా ముస్తాబవుతున్నాయి. దీన్ని బట్టి చూస్తే అలియా వచ్చే ఏడాది ఈ రెండు సినిమాలతో ఒకేసారి డబుల్ ట్రీట్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది.

తారలు వచ్చినా.. తళుకులు లేవు

2025లో పలువురు బాలీవుడ్ కథానాయికలు ఖాతా తెరవకపోయినా.. మరికొంత మంది వరుస సినిమాలతో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. చిత్రసీమలోకి వచ్చిన తక్కువ కాలంలో అగ్రతారల సరసన నటించే అవకాశాన్ని దక్కించుకున్న యువకథానాయిక జాన్వీ కపూర్. ప్రస్తుతం ఇటు బాలీవుడ్‌తో పాటు తెలుగు ప్రేక్షకుల్ని అలరించే ప్రయత్నం చేస్తుంది. ఈ బాటలో ఈ ఏడాది 'పరమ్ సుందరి', 'హోమ్‌బౌండ్', 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' లాంటి సినిమాలతో తెరపైకి వచ్చినా.. అవి ఆశించిన విజయాన్ని అందుకోలేపోయాయి. మరోవైపు 'గేమ్ ఛేంజర్', 'వార్ 2' లాంటి చిత్రాలతో కియారా తనలోని యాక్షన్ కోణాన్ని ఆవిష్కరించింది. ఈ ఏడాది ప్రారంభంలోనే 'ధూమ్‌ధామ్'తో నవ్వులు పూయించిన యామీ గౌతమ్ ఇటీవలే 'హక్' సినిమాలో శక్తిమంతమైన పాత్రలో మెరిసింది. వీరితో పాటు రకుల్ ప్రీత్ సింగ్ 'మేరే హస్బెండ్ కీ బీవీ', 'దేదే ప్యార్ దే2', అనన్య పాండే 'కేసరి చాప్టర్ 2', 'తూ మేరీ మై తేరా మై తేరా తూ మేరీ' లాంటి చిత్రాలతో నాన్‌స్టాప్‌గా వినోదాలు పంచినా.. వసూళ్ల మెరుపులు మాత్రం కనిపించలేదు. మరి వచ్చే ఏడాదికి ఈ తారలు ఎలాంటి ప్రాజెక్టులతో స్వాగతం పలుకుతారో చూడాలి.

'పెద్ది'లో అప్పలసూరి



'పెద్ది'గా సినీప్రియుల్ని పలకరించనున్నారు కథానాయకుడు రామ్‌చరణ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. జగపతిబాబు ఇందులో అప్పలసూరి అనే కీలక పాత్రలో అలరించనున్నారు. సోమవారం ఆయన పాత్ర ఫస్ట్‌లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. అందులో తను మునుపెన్నడూ చూడని విభిన్నమైన లుక్‌లో ఆసక్తి రేకెత్తించేలా కనిపించారు. ఇక ఈ సినిమాలో బొమన్ ఇరానీ కూడా ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారని.. ఇప్పటికే ఆయన చిత్రీకరణలో పాల్గొన్నారని.. దీంట్లో ప్రతి పాత్రా కథను నడిపించే ప్రధాన శక్తిగానే కనిపిస్తుందని చిత్ర వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతమందిస్తుండగా.. ఆర్ రత్నవేలు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

కథాబలం లేకపోతే ఇద్దరికీ నష్టమే



శ్రీనందు, డి.సురేశ్‌బాబు, యామిని, వరుణ్

'సైక్ సిద్ధార్థ' చిత్రాన్ని దర్శకుడు వరుణ్ రెడ్డి చాలా విభిన్నంగా తెరకెక్కించారని నిర్మాత డి సురేశ్‌బాబు అన్నారు. అందుకే సినిమా చూసిన వెంటనే తాము కొన్నట్లు తెలియజేశారు. దీన్ని రూ. 99 టికెట్ ధరతో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. శ్రీనందు హీరోగా వరుణ్ తెరకెక్కించిన ఈ సినిమాలో యామిని భాస్కర్ కథానాయికగా నటించింది. ఇది జనవరి 1న విడుదల కానున్న నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో శ్రీనందు మాట్లాడుతూ.. “నేను ఈ ఏడాదిని 'దండోరా' లాంటి హిట్‌తో ముగించినందుకు ఆనందంగా ఉంది. 2026 తెలుగు సినిమా 'సైక్ సిద్ధార్థ'తో ప్రారంభం కానుంది” అన్నారు. “థియేటర్స్‌కు వచ్చి.. గట్టిగా కేకలు వేసి సినిమాని ఆస్వాదించే తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రాన్ని అంకితమిస్తున్నాం” అన్నారు దర్శకుడు వరుణ్ రెడ్డి. నిర్మాత సురేశ్‌బాబు మాట్లాడుతూ.. “కథాబలం లేకుండా నిర్మించే చిత్రాల వల్ల సినీ పరిశ్రమే కాదు.. ప్రేక్షకులు కూడా నష్టపోతున్నారు. మంచి కంటెంట్‌తో వస్తే ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని 'రాజు వెడ్స్ రాంబాయి', 'లిటిల్‌హార్ట్స్', 'కోర్ట్' లాంటి చిత్రాలు నిరూపించాయి. ఈ సినిమా కూడా ఆద్యంతం ఆసక్తి రేకెత్తించేలా ఉంటుంది” అన్నారు. ఈ కార్యక్రమంలో యామిని భాస్కర్, స్మరణ సాయి తదితరులు పాల్గొన్నారు.

జనవరి 1న.. సఃకుటుంబానాం

రామ్ కిరణ్, మేఘ ఆకాశ్ జంటగా ఉదయ్ శర్మ తెరకెక్కించిన చిత్రం 'సఃకుటుంబానాం'. హెచ్ మహదేవ గౌడ్ నిర్మించారు. రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మానందం, సత్య తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈనెల 19న రావాల్సిన ఈ సినిమా అనివార్య కారణాల వల్ల వాయిదా పడిన విషయం తెలిసిందే. ఇప్పుడీ చిత్రాన్ని కొత్త ఏడాది సందర్భంగా జనవరి 1న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. “కుటుంబ బంధాల గొప్పదనాన్ని చాటి చెప్పే చిత్రమిది. ప్రేమ, వినోదం, భావోద్వేగాల మేళవింపుగా ఉంటుంది” అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: మణిశర్మ, ఛాయాగ్రహణం: మధు దాసరి.

మార్చిలో అల్లు శిరీష్ పెళ్లి



నటుడు అల్లు శిరీష్ కొత్త ఏడాది వివాహ బంధంలోకి అడుగు పెట్టనున్నారు. ఈ ఏడాది అక్టోబరులో ఆయనకు.. తన ప్రియురాలు నయనికతో నిశ్చితార్థం జరిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ జంట వచ్చే ఏడాది మార్చి 6న పెళ్లి పీటలెక్కనుంది. ఈమేరకు తమ పెళ్లి తేదీని శిరీష్ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించారు. దీనికి సంబంధించి అల్లు అయాన్, అర్హాలతో కలిసి చేసిన ఓ సరదా రీల్‌తో ఆ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. అయితే వివాహ తేదీని ప్రకటించినప్పటికీ.. ఈ వేడుక ఎక్కడ జరుగుతుందన్నది స్పష్టత ఇవ్వలేదు. ఇక అల్లు అర్జున్ - స్నేహారెడ్డి వివాహం కూడా 2011లో మార్చి 6నే జరగడం విశేషం. ఇప్పుడదే తేదీకి శిరీష్ కూడా వివాహం చేసుకోనున్నారు.

ప్రచారానికి నటుల సహకారం లేకపోతే ఎలా?


'వనవీర'

మా సినిమాలో కీలకపాత్రని పోషించిన ఓ నటుడు... ప్రచార కార్యక్రమాల విషయంలో ఏమాత్రం సహకరించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు కథానాయకుడు, దర్శకుడు అవినాశ్ తిరువీధుల. ఆయన కథానాయకుడిగా నటిస్తూ, తెరకెక్కించిన చిత్రమే.. 'వనవీర'. మొదట ఈ సినిమాకి 'వానర' అనే పేరుని అనుకున్నారు. అయితే ఆ పేరుపై సెన్సార్ బృందం అభ్యంతరం చెప్పడంతో 'వనవీర'గా మార్చారు. జనవరి 1న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా అవినాశ్ తిరువీధుల విలేకర్లతో మాట్లాడుతూ “సినిమా పేరును మార్చడం ఒకెత్తైతే, మా చిత్రంలో కీలక పాత్ర పోషించిన నటుడు ప్రచారానికి సహకరించకుండా ఇబ్బంది పెడుతుండటం మరో సమస్య. ఆయన హీరోగా చేసిన సినిమాకి, చిన్న పాత్రను చేసిన మరో చిత్రానికీ ప్రచారం చేస్తున్నారు కానీ, మా సినిమాని కనీసం సామాజిక మాధ్యమాల్లో కూడా ప్రచారం చేయడం లేదు. సినిమాలోని నటులు ప్రచారానికి సహకరించకపోతే ఎలా?” అని ప్రశ్నించారు.

పతంగ్ ఎగిరేవరకూ రాజీ పడలేదు!


ప్రణీత్

ఓ సంక్రాంతి పండుగ రోజున తట్టిన ఆలోచనే 'పతంగ్' రూపొందడానికి కారణమని, సినిమాకి లభిస్తున్న స్పందన ఎంతో తృప్తినిచ్చిందన్నారు ప్రణీత్ పత్తిపాటి. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'పతంగ్' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా ప్రణీత్ సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

● “విదేశాల నుంచి తీసుకొచ్చిన రగ్బీ లాంటి ఆట నేపథ్యంలో సినిమాలు చేస్తున్నాం కానీ, మన మూలాల్లోనే ఉన్న గాలిపటాల నేపథ్యంలో ఎందుకు చేయలేమనే ఆలోచనే 'పతంగ్' కథ రాసుకోవడానికి కారణం. కానీ ఇన్నాళ్లూ ఈ నేపథ్యంలో సినిమా ఎందుకు చేయలేదో విజువల్ ఎఫెక్ట్స్ పనులు జరుగుతున్నప్పుడు అర్థమైంది (నవ్వుతూ). ఆ పనులకే చాలా సమయం పట్టింది. తెరపై పతంగులు నిజంగానే ఎగురుతున్నాయనే భావన కలిగే వరకూ మేం రాజీపడలేదు. అందుకే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రావడానికి ఇంత ఆలస్యమైంది. రెండేళ్లు సీజీలకు సంబంధించిన పనులే జరిగాయి. సినిమా విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి లభిస్తున్న స్పందన ఎంతో తృప్తినిస్తోంది. ముఖ్యంగా పతాక సన్నివేశాలు ఓ స్టేడియంలో నిజమైన మ్యాచ్‌ని చూస్తున్న అనుభూతికి గురిచేస్తున్నాయి. ప్రేక్షకుల అంతగా లీనమై ఆ సన్నివేశాల్ని ఆస్వాదిస్తున్నారు. జనవరి 1న విదేశాల్లో విడుదల చేస్తున్నాం”.

● “సినిమాకి సరైన థియేటర్లు దొరకలేదు. అందుకే మంచి టాక్ వచ్చినా సినిమా అందుబాటులో లేకపోవడంతో చాలామంది చూడలేకపోతున్నారు. చిత్ర పరిశ్రమలో సినిమాని చూసిన ప్రతి ఒక్కరూ మెచ్చుకున్నారు. ఎస్.కె.ఎన్, బెల్లంకొండ సురేశ్, సందీప్‌కిషన్, దిల్‌రాజు తదితరులు సినిమాని బాగా తీశావని అభినందించారు. నేను హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగా. రామానాయుడు ఫిల్మ్ స్కూల్‌లో డీఎఫ్‌టెక్ చేశాను. ఇదివరకు లఘు చిత్రాలు తీసిన అనుభవంతో ఈ సినిమాని తెరకెక్కించా. నాకు వ్యక్తిగతంగా వాణిజ్య ప్రధానమైన సినిమాలంటే ఇష్టం. 'పతంగ్' సినిమాలో నా కామెడీ నచ్చిందంటే, నా తదుపరి సినిమాలో అంతకు పదింతలు కామెడీ ఉంటుంది. అలాంటి స్క్రిప్ట్‌ని సిద్ధం చేస్తున్నా”.

మీ సంవత్సరం మీ ఆరోగ్యం

ఎవరి కాలం వారిదే. అందరికీ ఏడాదికి 365 రోజులే. నిర్దేశించుకున్న లక్ష్యాలను కొందరు సునాయాసంగా చేరుకుంటారు. కొందరికి ఎక్కడ వేసిన పని అక్కడే ఉంటుంది. సమయాన్ని సద్వినియోగం చేసుకోవటంలోనే ఉంది విజయ రహస్యం.

ఎవరి ఆరోగ్యం వారిదే. అందరికీ అవే సూత్రాలు, అవే నియమాలు. స్వభావ రీత్యా జబ్బులు వచ్చే అవకాశమున్నా కొందరిని అవేమీ చేయవు. జన్యుగుణం లేకపోయినా కొందరికి సమస్యలు ముసురుకుంటాయి. జాగ్రత్తగా మసలుకోవటంలోనే ఉంది ఆరోగ్య రహస్యం.

జబ్బుల గురించి తెలుసుకోవటం, ముప్పు కారకాలుంటే అప్రమత్తంగా ఉండటం, అవసరమైన పరీక్షలు చేయించుకోవటం అందరికీ అవసరం. దీర్ఘకాల జబ్బుల విషయంలో ఇవి అత్యంత కీలకం. అప్పుడే ఏ సంవత్సరం లోనైనా మీ ఆరోగ్యం మీ చెంతనే ఉంటుంది. కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతున్న తరుణంలో ముఖ్యమైన కొన్ని జబ్బులకు సంబంధించిన జాగ్రత్తలు ఇవిగో..



మధుమేహానికి మందులు తప్పనిసరి

మధుమేహం దాదాపు 90% మందిలో దుష్ప్రభావాలతోనే బయట పడుతోంది. కాబట్టి 25 ఏళ్లు వచ్చేసరికి ప్రతిఒక్కరూ రక్తంలో గ్లూకోజు పరీక్ష చేయించుకోవాలి. లక్షణాలతో సంబంధం లేదు. అతి మూత్రం, అతి దాహం అనేవి ఒకప్పటి మాట. నిజానికి మధుమేహం మొదలైనా ఎక్కువశాతం మందిలో లక్షణాలేవీ ఉండవు. మధుమేహం బయటపడిన రోజు నుంచే మందులు ఆరంభించాలని కొత్త మార్గదర్శకాలు గట్టిగా సూచిస్తున్నాయి. వీటితో పాటు ఆహార, వ్యాయామాలు పాటించాలి. ఒకసారి మధుమేహం నిర్ధారణ అయిన తర్వాత ఎప్పుడైనా రక్త పరీక్షలో గ్లూకోజు తగ్గినట్టు తేలినా మందులు కొనసాగించాల్సిందే.

● కొందరికి మధుమేహం స్థాయిలో కాకపోయినా రక్తంలో గ్లూకోజు ఎక్కువగా ఉండొచ్చు (ప్రిడయాబిటిస్). వీరికి రక్తపోటు, కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు, బరువు అధికంగా ఉండే అవకాశమూ ఉంది. వీటన్నింటినీ కలిపి దీర్ఘకాలిక లక్షణ సముదాయం అంటారు. ముందస్తు మధుమేహం వచ్చిందంటే వీటిల్లో ఏదో ఒకదాంతో సతమతమవుతున్నారనే అనుకోవాలి. ఏది ఎక్కువున్నా తగ్గించుకునే ప్రయత్నం చేయాలి.

● మధుమేహ చికిత్స అంటే కేవలం గ్లూకోజును తగ్గించుకోవటమే కాదు. అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు, బరువు తగ్గించుకోవటమూ దీనిలోని భాగమేనని గుర్తించాలి.



– డా॥ పి.వి.రావు, మధుమేహ పరిశోధకులు

గుండెను పరీక్షించుకోండి

గుండెజబ్బులకు వయసుతో నిమిత్తం లేని రోజులొచ్చేశాయి. ఒకప్పుడు వృద్ధుల్లో వచ్చే గుండెపోటు ఇప్పుడు 20ల్లోనూ కనిపిస్తోందన్నా అతిశయోక్తి కాదు. ముప్పు కారకాలను ముందే గుర్తించి, జాగ్రత్త పడితే ఇలాంటి పెను ప్రమాదాన్ని చాలావరకూ తప్పించుకోవచ్చు. ఇందుకు గుండె ఆరోగ్యాన్ని పట్టి చూపే పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయి.

ఆరోగ్య పరీక్షలనగానే మనలో చాలామంది వయసు మీద పడినవారికే అనుకుంటారు. చిన్న వయసు నుంచే ఇవి అవసరం. నిజానికి బాల్యం నుంచే గుండె రక్తనాళాల్లో పూడికలు ఏర్పడటం మొదలవుతుంది తెలుసా? కాబట్టి 30 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి ఒక్కరూ కనీసం ఒక్కసారైనా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. వీటిల్లో ముఖ్యమైనవి రక్తపోటు.. రక్తంలో కొలెస్ట్రాల్, గ్లూకోజు పరీక్షలు. బరువు తూచుకోవటమూ కీలకమే. బరువు మామూలుగా ఉన్నప్పటికీ బొజ్జ పెరుగుతుందేమో కూడా చూసుకోవాలి. ఇలాంటివేవీ లేకపోతే యాభై ఏళ్లు వచ్చేవరకూ ఐదేళ్లకోసారి పరీక్షలు చేయించుకుంటే చాలు. యాభై ఏళ్లు దాటిన తర్వాత అయితే ఏడాదికోసారి చేయించుకోవాలి. గుండెజబ్బు ముప్పు కారకాలు ఉన్నవారైతే ఇంకా తరచుగా పరీక్షించుకోవాలి. వయసు మీద పడుతున్నకొద్దీ ఈసీజీ, 2డీ ఎకో, ట్రెడ్‌మిల్ పరీక్షలూ అవసరమవుతాయి. గుండెజబ్బులను తొలిదశలోనే గుర్తించటానికివి తోడ్పడతాయి.

● కొందరిలో వయసు మీద పడుతున్నకొద్దీ ట్రెడ్‌మిల్ పరీక్ష చేయటం కుదరకపోవచ్చు. ఇలాంటివారికి డోబుటమిన్ స్ట్రెస్, ఎడినోసిన్ స్ట్రెస్ థాలియం పరీక్షలు అవసరమవుతాయి. వ్యాయామం, శరీర శ్రమ చేసినప్పటి మాదిరిగా గుండె వేగాన్ని పెంచి, పరీక్షించటం వీటి ప్రత్యేకత. దీంతో గుండె ఎంతమేరకు ఒత్తిడిని తట్టుకుంటోందనేది కచ్చితంగా తెలుస్తుంది.

సీటీ క్యాల్షియం స్కోర్

కూడా: గుండెజబ్బును ముందే పట్టుకోవటానికి సీటీ క్యాల్షియం స్కోర్ పరీక్ష కూడా ఉపయోగపడుతుంది. ముప్పు కారకాలు గలవారు ఈసీజీ, ఎకో పరీక్షల ఫలితాలు నార్మల్‌గా ఉన్నా కూడా ఒకసారి దీన్ని చేయించుకోవాలి. ఈ స్కోర్ సున్నా దాటితే లోపల ఏదో ఒకస్థాయిలో పూడికలు ఏర్పడుతున్నాయనే అర్థం. ఇది 400 దాటిందంటే పెద్ద పూడికలు ఉండే అవకాశమే ఎక్కువ. కాకపోతే క్యాల్షియం స్కోరుకు పూడికల శాతానికి పోలిక అన్నిసార్లూ సరిపోకపోవచ్చు. ఉదాహరణకు- కొందరికి 1000 క్యాల్షియం స్కోర్ ఉన్నా పూడిక స్వల్పంగా ఉండొచ్చు. కొందరికి క్యాల్షియం స్కోర్ 300 ఉన్నా పూడిక తీవ్రంగా ఉండొచ్చు.

● క్యాల్షియం స్కోర్ పెరిగితే కొలెస్ట్రాల్ తగ్గించుకోవటం మీద మరింత గట్టిగా దృష్టి పెట్టాలి. వీరికి రక్తాన్ని పలుచగా చేసే ఆస్ప్రిన్ వంటి మందులూ అవసరమవుతాయి.

నివారణ మీద ప్రత్యేక శ్రద్ధ

● అధిక కొలెస్ట్రాల్‌తో పూడికల ముప్పు పెరుగుతుంది. కాబట్టి దీన్ని అదుపులో ఉంచుకోవటం తప్పనిసరి. కొలెస్ట్రాల్ కొద్దిగా పెరిగితే ఆహార, వ్యాయామ నియమాల వంటి వాటితోనే అదుపులోకి రావొచ్చు. మరీ ఎక్కువగా పెరిగితే మాత్రం మందులు అవసరం. డాక్టర్లు వీటిని సూచిస్తే విధిగా వాడుకోవాలి. లక్షణాలేవీ లేవు కదాని నిర్లక్ష్యం చేయొద్దు. ఎందుకంటే మూడింట రెండొంతుల కొలెస్ట్రాల్‌ను శరీరమే తయారుచేసుకుంటుంది. శరీర స్వభావం, జన్యువులే దీన్ని నిర్దేశిస్తాయి. అంటే మిగతా ఒక వంతు కొలెస్ట్రాల్ మాత్రమే ఆహార, వ్యాయామ, శారీరక శ్రమలతో ముడిపడి ఉంటుందన్న మాట. కాబట్టి మందులు అవసరమైనప్పుడు తప్పనిసరిగా వేసుకోవాలి.

● ఎంత ఎక్కువగా సిగరెట్లు కాలిస్తే అంత ఎక్కువగా గుండెజబ్బు ముప్పు పెరుగుతుంది. అలాగని ఎప్పుడో అప్పుడు కాలిస్తే ఏమీ కాదని అనుకోవద్దు. ఇదీ హానికరమే. సిగరెట్లు, బీడీలు, చుట్టలు మాత్రమే కాదు.. హుక్కా కూడా ప్రమాదమే. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా చేటే. ఇది రక్తనాళాలను దెబ్బతీసి పూడికలు ఏర్పడేలా చేస్తుంది.

● మద్యం తాగకపోవటం ఉత్తమం. అలవాటుంటే మితం పాటించాలి. మద్యం మితిమీరితే రక్తపోటు, కొలెస్ట్రాల్, బరువు పెరుగుతాయి. ఇవన్నీ గుండెకు హాని చేసేవే.

● అధిక రక్తపోటు ఉన్నట్టయితే కచ్చితంగా అదుపులో ఉంచుకోవాలి. బరువు పెరగకుండా చూసుకోవాలి.

● ఆరోగ్యకరమైన ఆహారం తినాలి. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లోని యాంటీఆక్సిడెంట్లు రక్తనాళాలు దెబ్బతినకుండా కాపాడతాయి.



– డా॥ రమేశ్ గూడపాటి, సీనియర్ కార్డియాలజిస్ట్, స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్

కనిపించని కాలేయ కొవ్వు

కాలేయానికి కొవ్వు పట్టటం (ఫ్యాటీ లివర్) అనగానే ఊబకాయం, మధుమేహం, హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్లు, మద్యం తాగటం, అధిక కొలెస్ట్రాల్ వంటి ముప్పు కారకాలే గుర్తుకొస్తుంటాయి. ఇవి ఫ్యాటీ లివర్‌కు దారితీసే మాట నిజమే కావొచ్చు. అలాగని 'సన్నగా ఉన్నాం. మద్యం అలవాటు లేదు. గ్లూకోజు, కొలెస్ట్రాల్ అదుపులోనే ఉన్నాయి. హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్లేవీ లేవు' అని నిశ్చింతగా ఉంటామనుకోవటానికీ లేదు. ఇలాంటి సంప్రదాయ ముప్పు కారకాలు లేకుండానూ ఇప్పుడు కాలేయ కొవ్వు సమస్య ఎక్కువవుతోంది. ఇది ముదిరేంతవరకూ పైకి లక్షణాలు కనిపించకపోవటం వల్ల అనుమానించటం సాధ్యం కావటం లేదు. ముందే గుర్తించటానికి పరీక్షలు లేకపోవటమూ సమస్యాత్మకంగా పరిణమిస్తోంది.

ఊబకాయం లేనివారిలోనూ కాలేయానికి కొవ్వు పట్టటాన్ని 'లీన్ ఫ్యాటీ లివర్‌'గా పిలుచుకుంటున్నాం. దీనికి ప్రధానంగా రెండు కారణాలను చెప్పుకోవచ్చు. ఒకటి- జన్యువులు. పీఎన్‌పీఎల్‌ఏ3, టీఎం6ఎస్‌ఎఫ్2, జీసీకేఆర్ జన్యువులు గలవారికి సన్నగా ఉన్నా సరే కాలేయానికి కొవ్వు పట్టే ముప్పు ఎక్కువ. రెండోది- జీవక్రియలు అస్తవ్యస్తం కావటం. దీన్నే లీన్ మెటబాలిక్ అసోసియేటెడ్ లివర్ డిసీజ్ అంటారు. అంటే పైకి సన్నగా ఉన్నా లోపల కొవ్వు ఎక్కువగా ఉండటం అన్నమాట. వీళ్లు అంతా ఆరోగ్యంగా ఉన్నట్టే కనిపిస్తుంటారు. వ్యాయామం వంటివీ చేస్తుంటారు. కానీ అవయవాల చుట్టూ కొవ్వు పోగుపడటం లోలోపలే హాని కలిగిస్తుంటుంది. బరువు మామూలుగా ఉన్నవారిలోనూ ఇలాంటి కొవ్వు చాలా ఎక్కువగా ఉంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. దీనికి ప్రధానంగా అవయవాల చుట్టూ కొవ్వు పేరుకోవటానికి (విసరల్ ఫ్యాట్) ఆజ్యం పోస్తోంది. ఇది చర్మం కింద ఉండే కొవ్వులాంటిది కాదు. గ్రంథి మాదిరిగా పనిచేస్తూ హార్మోన్లను, సైటోకైన్ల వంటి వాపుకారకాలను విడుదల చేస్తుంది. ఇన్సులిన్ సామర్థ్యం తగ్గటం, కాలేయం పనితీరు అస్తవ్యస్తం కావటం వంటి సమస్యలకు దారితీస్తుంది. ఊబకాయం గలవారితో పోలిస్తే మామూలు బరువుండి, బొజ్జ గల మహిళలకు మరణించే ముప్పు ఎక్కువనీ కొన్ని అధ్యయనాల్లో తేలింది.

అనుమానించలేకుండా..: కాలేయానికి కొవ్వు పట్టినా తొలిదశలో పైకి ఎలాంటి లక్షణాలూ కనిపించవు. ఇవి ఆరంభమయ్యేసరికే జబ్బు ముదిరిపోయి ఉంటుంది. అంటే ఇది చడీ చప్పుడు లేకుండా లోలోపలే దాడిచేస్తుందన్నమాట. చాలామందిలో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నప్పుడు కాలేయ సామర్థ్య పరీక్షల ఫలితాలు అసాధారణంగా ఉన్నప్పుడో, అల్ట్రాసౌండ్ పరీక్షలో అనుమానం వచ్చినప్పుడో బయటపడు తుంటుంది. సమస్య ఇలాగే అదృశ్యంగా ఉన్నట్టయితే మృదువుగా ఉండే కాలేయ కణజాలం తాళ్ల మాదిరిగా అవటం (ఫైబ్రోసిస్) మొదలవుతుంది. చివరికి రాయి మాదిరిగా గట్టిపడుతుంది (సిరోసిస్‌కు). క్యాన్సర్‌కూ కారణమవుతుంది. ఒకప్పుడు హెపటైటిస్ బి, సి ఇన్‌ఫెక్షన్లు గలవారిలో కాలేయ క్యాన్సర్ ఎక్కువగా కనిపించేది. ఇప్పుడు ఫ్యాటీ లివర్ గలవారిలో 20-25% సిరోసిస్, క్యాన్సర్ బారినపడుతుండటం గమనార్హం.

జాగ్రత్త ఇలా

● పిండి పదార్థాలు, కొవ్వు పదార్థాలు, నూనె, నెయ్యి, వేపుళ్లు తగ్గించుకోవాలి. ● ప్రొటీన్ ఎక్కువగా తీసుకోవాలి. ● యాంటీఆక్సిడెంట్లతో కూడిన దానిమ్మ, జామ, అవకాడో, బ్లూబెర్రీ వంటి పండ్లు తీసుకోవాలి. ● విటమిన్ ఇ కూడా కాలేయాన్ని రక్షిస్తుంది. ● క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. గుండె, శ్వాస వేగాన్ని పెంచే నడక, పరుగు, ఈత, సైకిల్ తొక్కటం వంటి ఏరోబిక్ వ్యాయామలే కాకుండా బరువులు ఎత్తటం వంటి ఎనరోబిక్ వ్యాయామాలూ అవసరమే. ఇవి కండను పెంచటం ద్వారా కొవ్వును తగ్గిస్తాయి. ● నిద్రా ముఖ్యమే. కంటి నిండా నిద్రపోతే జీవక్రియలు సరిగా సాగుతాయి. కాలేయ కొవ్వు ముప్పు తగ్గుతుంది.

ముందే గుర్తించగలిగితే..: ఊబకాయం లేనివారిలో కాలేయ కొవ్వును గుర్తించటానికి నడుం, తుంటి నిష్పత్తి కొంతవరకు ఉపయోగపడొచ్చు. ఇది మగవారిలో 90, ఆడవారిలో 80 కన్నా ఎక్కువగా ఉంటే అవయవాల చుట్టూ కొవ్వు పోగుపడి ఉండొచ్చని అనుమానించొచ్చు. వీరిలో కాలేయంలోనూ కొవ్వు ఎక్కువగా ఉండొచ్చు.


● కాలేయానికి కొవ్వు పట్టటాన్ని కొన్నిసార్లు అల్ట్రాసౌండ్ పరీక్షలోనూ కచ్చితంగా నిర్ధారించలేకపోవచ్చు. దీనికి ఫైబ్రోస్కాన్ పరీక్షే ప్రామాణికం. కాకపోతే ఇది ఖరీదైంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే మేం కృత్రిమ మేధ ఆధారిత ఆల్గోరిథమ్‌ను రూపొందించాం. దీంతో హెల్త్‌చెకప్‌లో భాగంగా చేయించుకునే పరీక్షల ఫలితాలతోనే సమస్యను పట్టుకోవచ్చు. ఇది హిమోగ్లోబిన్, ఎల్‌ఎఫ్‌టీ, లిపిడ్ ప్రొఫైల్, హెచ్‌బీఏ1సీ పరీక్షల ఫలితాలు.. శరీర ఎత్తు బరువుల నిష్పత్తి (బీఎంఐ)ని బట్టి కాలేయం ఆరోగ్యాన్ని తెలియజేస్తుంది. కాలేయంలో కొవ్వు మోతాదు (స్టెటోసిస్), కాలేయం గట్టిపడటం (ఫైబ్రోసిస్) రెండింటినీ అంచనా వేస్తుంది. ఇది ఫైబ్రోస్కాన్‌తో సమానంగా ఫలితాలు వెలువరిస్తుండటం గమనార్హం. త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ఆసుపత్రుల్లో దీన్ని ప్రారంభించనున్నాం.



– డా॥ రాకేశ్ కలపాల, గ్యాస్ట్రోఎంటెరాలజిస్ట్, ఏఐజీ హాస్పిటల్స్, హైదరాబాద్

మద్యం కొంచెమైనా చేటే

మద్యానికి సురక్షిత రకం, పరిమితంటూ ఏదీ లేదు. రోజుకు కొద్దిగా బీరు తాగినా నోటి క్యాన్సర్ ముప్పు పెరుగుతున్నట్టు టాటా మెమోరియల్ సెంటర్‌కు చెందిన క్యాన్సర్ విభాగం పరిశోధనలో తేలింది మరి. బీరు అసలే తాగనివారితో పోలిస్తే- రోజుకు సగటున 2 గ్రాముల ఆల్కహాలు లభించేంత బీరు తాగినా నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం 59% ఎక్కువగా ఉంటున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఎంత ఎక్కువగా మద్యం తాగితే అంత ఎక్కువగా నోటి క్యాన్సర్ ముప్పు పెరుగుతుండటం గమనార్హం. బుగ్గల లోపల జిగురుపొరలో తలెత్తే క్యాన్సర్‌కూ మద్యం వాడకానికీ మధ్య సంబంధాన్ని గుర్తించటానికి మనదేశంలో చేపట్టిన అతిపెద్ద అధ్యయనం ఇదే. మనదగ్గర ఏటా కొత్తగా 1.40 లక్షల నోటి క్యాన్సర్ కేసులు నమోదవుతుండగా.. 80వేల మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం కళ్లు తెరవాలని సూచిస్తోంది.



తక్కువ మొత్తంలో మద్యం తాగినా నోటి క్యాన్సర్ ముప్పు పెరుగుతుండటం గమనార్హం. రోజుకు బీరు నుంచి 2 గ్రాములు.. విస్కీ లేదా వోడ్కా నుంచి 9 గ్రాములు (సుమారు ఒక గ్లాసు) ఆల్కహాల్ తీసుకున్నా ప్రమాదం పొంచి ఉంటోంది.

● నియంత్రించని, స్థానికంగా తయారైన మద్య పానీయాల్లో ఇథనాల్ మోతాదు చాలా ఎక్కువగా ఉంటున్నట్టు, వీటితో నోటి క్యాన్సర్ ముప్పు మరింత పెరుగుతున్నట్టూ పరిశోధకులు గుర్తించారు. నియంత్రణలో ఉన్న మద్యం తాగేవారికి 72% ముప్పు పొంచి ఉంటే.. స్థానిక మద్యాలతో ఇది 87 శాతానికి ఎగబాకుతోందని వివరిస్తున్నారు.

● మద్యానికి పొగాకు కూడా కలిస్తే అగ్నికి ఆజ్యం పోసినట్టే. ఎన్నడూ మద్యం తాగని, పొగాకు నమలని వారితో పోలిస్తే రోజుకు ఒక గ్లాసు కన్నా ఎక్కువ ఆల్కహాల్ తీసుకునేవారికి, పొగాకు నమిలేవారికి నోటి క్యాన్సర్ ముప్పు దాదాపు ఐదు రెట్లు అధికం. పొగాకు నమలటం వల్ల 200%, మద్యం తాగటంతో నోటి క్యాన్సర్ ముప్పు 76% ఎక్కువవుతుండగా.. ఇవి రెండూ కలిస్తే 346% వరకూ ముప్పు పెరుగు తుండటం ఆందోళనకరం. మనదేశంలో నమోదయ్యే నోటి క్యాన్సర్లలో 62% కేసులకు ఈ రెండే కారణమవుతున్నాయి. నోటి క్యాన్సర్ ముదిరినవారిలో 57% మంది తొలి ఐదేళ్లలోనే మరణిస్తున్నారు. అందువల్ల దీన్ని నివారించుకోదగిన కారకాలను గుర్తించి, వాటికి దూరంగా ఉండటానికి ప్రాధాన్యం పెరుగుతోంది.

» అరెరె.. మరచిపోయానే! «

'గదిలోకి ఎందుకు వచ్చానబ్బా?'
'బైక్ తాళం చెవి ఇక్కడే పెట్టానే, కనిపించటం లేదేం?'
'ఈ అబ్బాయి పేరేంటో, అడిగితే బాగుండదేమో!'
'ఇప్పటివరకూ నోట్లో నానుతూనే ఉందే, అదేంటో చప్పున గుర్తురాదేం?'

ఇలాంటి అనుభవాలు తరచూ ఎదురయ్యేవే. ఉన్నట్టుండి మెదడు మొద్దుబారటం.. ఉన్నట్టుండి వస్తువులు, మనుషుల పేర్లు మరచిపోవటం మామూలే. వాక్యాలను పూర్తి చేయలేక, పదాలు తట్టక సతమతం కావటం.. దుకాణానికి వెళ్లి ఏం కొనాలో మరచిపోవటం చూస్తూనే ఉంటాం. దీనికి వయసుతో సంబంధం లేదు. అన్ని వయసుల వారిలోనూ కనిపిస్తూనే ఉంటుంది. దీంతో అప్పుడే మతిమరుపు వచ్చేసిందా? డిమెన్షియా, అల్జీమర్స్ దాడి చేస్తున్నాయా? అని కలవరపడుతుంటారు కూడా.

అప్పుడప్పుడూ మరచిపోవటానికి నిద్రలేమి, విశ్రాంతి కొరవడటం, మద్యం తాగటం వంటివి దారితీస్తుంటాయి. హఠాత్తుగా, ఏదైనా కడుపు నిండా తిన్న తర్వాత రక్తసరఫరా మెదడు నుంచి జీర్ణాశయానికి మళ్లటంతోనూ ఇలా జరగొచ్చు. కొన్ని మందులు.. ముఖ్యంగా అలర్జీ తగ్గించేవి, దగ్గు మందులు, కండరాలను వదులు చేసేవి, కొన్ని నొప్పి మాత్రల వంటివీ మరపు తెచ్చిపెట్టొచ్చు.

● మరో ముఖ్యమైన కారణం హార్మోన్ల మార్పులు. శరీరంలోని దాదాపు అన్ని అవయవాలు.. ముఖ్యంగా మెదడు సమర్థంగా పనిచేయటానికి థైరాయిడ్ హార్మోన్లు కీలకం. వీటి లోపం మతిమరుపు తెచ్చిపెట్టొచ్చు. థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోతే బరువు పెరగటం, చర్మం పొడిబారటం, మలబద్ధకం, నిస్సత్తువ వంటి ఇతరత్రా లక్షణాలూ కనిపిస్తాయి.

● మహిళల్లో గర్భం ధరించినప్పుడు, నెలసరి నిలిచినప్పుడు ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్ల మధ్య సమతుల్యత లోపిస్తుంది. ఇలాంటి సమయాల్లో కొద్ది నెలల పాటు మతిమరుపుతో ఇబ్బంది పడుతుంటారు. ఇది తాత్కాలికమే. కొద్దిరోజులకు అదే కుదురుకుంటుంది.

భయపడకుండా, బాధపడకుండా

ఆయా ఘటనలు, సందర్భాలను నిశితంగా పరిశీలిస్తే తాత్కాలిక మతిమరుపు ఎందుకొచ్చిందనేది చాలామంది తమకు తామే గుర్తించగలరు. తలకు దెబ్బలు తగలటం, జబ్బులు రావటం, తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవటం వంటివి దీనికి దారితీస్తున్నట్టు తెలుస్తూనే ఉంటుంది. లక్షణాలు విడవకుండా వేధిస్తున్నా వెంటనే గాబరా పడాల్సిన పనిలేదు. మానసిక సమస్యేమో, అల్జీమర్స్, డిమెన్షియా వచ్చిందేమోనని చింతించటానికి బదులు ముందుగా కొన్ని పరీక్షలు చేయించుకోవటం మంచిది. రక్తంలో ఐరన్, థైరాయిడ్, బి విటమిన్లు.. ముఖ్యంగా బి12 పరీక్షలు చేయించుకోవాలి. లక్షణాలు తీవ్రమవుతున్నా లేదా రోజురోజుకీ ఎక్కువవుతున్నా మెదడు సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరీక్షలు అవసరమవుతాయి.

మెదడు ఆరోగ్యంపై దృష్టి

వయసు మీద పడుతున్నకొద్దీ కొంత మేధాశక్తి తగ్గటం, ఎంతోకొంత మతిమరపు సహజం. కాబట్టి మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి.

● మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి జీవనశైలి జబ్బులను అదుపులో ఉంచుకోవాలి.

● రోజూ పండ్లు, కూరగాయలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారం తినాలి.

● విటమిన్ డి, క్యాల్షియం తగ్గితే భర్తీ చేసుకోవాలి.

● వయసు మీద పడుతున్నకొద్దీ బి విటమిన్లను సంగ్రహించుకునే శక్తి తగ్గుతుంది. మెట్‌ఫార్మిన్ వంటి మందులతోనూ ఇలా జరగొచ్చు. కాబట్టి బి విటమిన్లను తీసుకోవాలి.

● ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలూ మేలు చేస్తాయి.

● రోజుకు కనీసం 40 నిమిషాలు వ్యాయామం, శారీరక శ్రమ చేయాలి. దీంతో మెదడుకు తగినంత రక్తం సరఫరా అవుతుంది. కండరాల నుంచి మేలు చేసే రసాయనాలు విడుదలై, మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి.

● నలుగురితో కలవటం, పుస్తకాలు చదవటం, పజిల్స్ పూరించటం, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవటం వంటి పనులతో మెదడును చురుకుగా ఉంచుకోవాలి.

● రోజుకు 7-8 గంటల సేపు నిద్రించాలి. దీంతో మెదడుకు తగినంత విశ్రాంతి లభించి, పునరుత్తేజితమవుతుంది.

● మానసిక ఒత్తిడి మేధాశక్తిని గణనీయంగా దెబ్బతీస్తుంది. కాబట్టి దీన్ని అదుపులో ఉంచుకోవాలి. మనం మార్చటానికి వీల్లేని పరిస్థితుల గురించి అదేపనిగా ఆలోచించటం, బాధపడటం మానెయ్యాలి. శ్వాస మీద ధ్యాస పెట్టి చేసే ధ్యానం, ప్రాణాయామం మనసు తేలిక పడటానికి తోడ్పడతాయి.



డిమెన్షియా హెచ్చరిస్తుంది

తీవ్ర మతిమరపును తెచ్చిపెట్టే డిమెన్షియా తీరే వేరు. ఇది కొన్ని హెచ్చరిక సంకేతాలు ఇస్తుంటుంది. సాధారణంగా ఇందులో మరపు తీవ్రంగా ఉంటుంది. ముఖ్యంగా తక్షణ విషయాలు, సంఘటనలు గుర్తుండవు. భవిష్యత్తు ప్రణాళికలు వేసుకోలేకపోవటం, అంచెలంచెలుగా ఆలోచించి తేలికగా పరిష్కరించగల సమస్యల విషయంలోనూ ఇబ్బంది పడటం కనిపిస్తుంటాయి. రోజూ చేసే, తెలిసిన పనులను చేయటానికీ కష్టపడుతుంటారు. తేదీలు, సమయం గుర్తించటంలోనూ తికమక పడుతుంటారు. కొందరు నలుగురితో కలవటానికీ వెనకాడటం చూస్తుంటాం. చిరాకు, కోపం, ఆందోళన, నిరాశ, దిగులు వంటివీ తలెత్తొచ్చు. ఇలాంటి లక్షణాలను చాలావరకూ కుటుంబ సభ్యులే పసిగడుతుంటారు. వీటిని గమనిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించటం మంచిది. మతిమరపు రావటానికి సరిదిద్దుకోదగిన కారణం ఉన్నట్టు తేలితే తగు చికిత్స తీసుకుంటే గణనీయమైన ఫలితం కనిపిస్తుంది. లక్షణాలు వెనక్కి మళ్లొచ్చు కూడా.

మచ్చ పడకుండా

మైదానంలో ఆటలాడుతూ కింద పడొచ్చు. చర్మం గీసుకుపోయి, గాయం కావొచ్చు. ఇంట్లో కూరగాయలో, మరేదో కోస్తున్నప్పుడు పొరపాటున గాటు పడొచ్చు. పెద్దగా పట్టించుకో కుండానే ఇవి మానిపోతాయి కూడా. కానీ అక్కడ మచ్చ పడుతుంది. వీటిని నివారించుకోవటం లేదా పెద్దగా కనిపించ కుండా చూసు కోవట మెలా?

గాయమైన తర్వాత మచ్చ పడటానికి కారణం చర్మం లోపలి పొర (డెర్మిస్) చీరుకుపోవటం. అక్కడ చర్మం మరమ్మతు కావటానికి శరీరం కొలాజెన్ పోచలను ఉత్పత్తి చేస్తుంది. ఇవి బాగానే గాయాన్ని మాన్పుతాయి గానీ చర్మం పూర్తిగా మునుపటిలా కుదురుకోదు. అసలు చర్మం కన్నా భిన్నంగానే ఉంటుంది. ఇదే మచ్చలకు దారితీస్తుంది. అయితే గాయమైన తర్వాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నామనేది మచ్చల తీవ్రత మీద ప్రభావం చూపుతుంది. వాపును తగ్గించుకోవటం, మరింత దెబ్బతినకుండా చూసుకోవటం ద్వారా మచ్చను తగ్గించుకునే అవకాశముంది.



గాయాన్ని శుభ్రం చేయటం

గాయాన్ని మృదువైన సబ్బు, నీటితో శుభ్రం చేస్తే బ్యాక్టీరియా తొలగిపోతుంది. దీనికి మచ్చకు ఏంటీ సంబంధం? బ్యాక్టీరియా వాపును ప్రేరేపిస్తుంది. ఇది గాయం మానే ప్రక్రియను అస్తవ్యస్తం చేస్తుంది. ఫలితంగా మరింత గాఢంగా మచ్చ ఏర్పడుతుంది. ఇన్‌ఫెక్షన్ తలెత్తినా గాయం మానటం ఆలస్యమవుతుంది. ఇదీ మచ్చ ఎక్కువయ్యేలా చేస్తుంది. అక్కడ చర్మం పైకి లేచి బుడిపెగానూ మారొచ్చు.

పొడిబారకుండా చూసుకోవటం

గాయాన్ని పొడిగా ఉంచితే త్వరగా మానుతుందని చిన్నప్పటి నుంచీ వింటూనే ఉంటాం. నిజానికి తేమగా ఉంచితేనే మేలు. తేమ మూలంగా గాయం పొడిబారకుండా ఉంటుంది, గట్టి పక్కు ఏర్పడు తుంది. ఇది కణజాలం ఎక్కువగా దెబ్బతినకుండా, మచ్చ గాఢంగా ఏర్పడకుండా కాపాడుతుంది. గాయాన్ని కప్పి ఉంచటం ఇన్‌ఫెక్షన్ తలెత్తకుండా కాపాడుతుంది కూడా.

పక్కును తొలగించొద్దు

గాయం మీద కట్టే పక్కు చర్మానికి సహజ రక్షణగా నిలుస్తుంది. గాయం పూర్తిగా మానిన తర్వాత దానంతటదే ఊడి వస్తుంది. కాబట్టి వేళ్లు అక్కడికి పోనివ్వకుండా చూసుకోవాలి. దురద పెడుతుందనో, మరో కారణంతోనో గోకొద్దు. పక్కును తొలగిస్తే గాయం త్వరగా మానదు. మచ్చ పెద్దగా పడుతుంది.

ఎక్కువగా కదపొద్దు

గాయమైన చోటును కదపకుండా స్థిరంగా ఉంచాలి. అప్పుడు గాయానికి రెండు వైపులా చర్మం అంచులు సరిగ్గా అతుక్కుంటాయి. మచ్చ పెద్దగా పడదు. అదేపనిగా కదిపితే మాత్రం చీలిక పెద్దగా అయ్యి, మందంగా మచ్చ పడే అవకాశముంది.

ఎండ తగలనీయొద్దు

సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాలు వర్ణద్రవ్యాన్ని పెంచటం ద్వారా మచ్చలు స్పష్టంగా కనిపించేలా చేస్తాయి. ఈ కిరణాలు కొలాజెన్‌నూ దెబ్బతీస్తాయి. గాయాలు నయమయ్యే ప్రక్రియ కూడా నెమ్మదిస్తుంది. ఇదీ మచ్చలు తీవ్రం కావటానికి దారితీస్తుంది. మచ్చల మీద సన్‌స్క్రీన్ రాసుకోవటం లేదా ఎండ పడకుండా చూసుకుంటే అవి తక్కువగా కనిపించే అవకాశముంది.

మాయిశ్చరైజర్‌తో మర్దన

మచ్చ పడిన చోట కొద్దిసేపు మాయిశ్చరైజర్‌తో మృదువుగా మర్దన చేసుకోవటమూ మేలే. గాయం పూర్తిగా మానిన ఏడాది లోపు దీంతో మంచి ఫలితం కనిపిస్తుంది. మందంగా మారే అవకాశం గల మచ్చ కణజాలాన్ని ఇది విచ్ఛిన్నం చేస్తుంది.

నిద్రవేళలు మారుతున్నాయా?

తరచూ రాత్రి షిఫ్టుల్లో పనిచేస్తున్నారా? వేర్వేరు టైమ్ జోన్లకు మారుతున్నారా? కాస్త జాగ్రత్త. ఇలా మాటిమాటికీ నిద్రవేళలు మారిపోవటం ప్రమాదకరమని, దీంతో మహిళల్లో తీవ్ర రొమ్ముక్యాన్సర్ ముప్పు పెరుగుతోందని అమెరికా అధ్యయనం చెబుతోంది. నిద్రవేళలు మారితే శరీరంలోని జీవగడియారం అస్తవ్యస్తమవుతుంది. ఇది రొమ్ముల్లోని క్షీరగ్రంథుల ఆకృతిని మారుస్తున్నట్టు, రోగనిరోధక వ్యవస్థ బలహీనమవుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఇది రొమ్ముక్యాన్సర్ ముప్పు పెరిగేలా చేస్తున్నట్టు కనుగొన్నారు.



జీవగడియారం కేవలం నిద్ర వేళలను నియంత్రించటమే కాకుండా హార్మోన్ల విడుదలను సమన్వయం చేయటం, కణజాలాల మరమ్మతు, రోగనిరోధక వ్యవస్థ నిఘాలోనూ సాయం చేస్తుంది. అంటే జీవగడియారం అస్తవ్యస్తమైతే సహజ రక్షణ వ్యవస్థ గతి తప్పుతుందన్నమాట. దీంతో శరీరానికి హాని చేసేవాటిని గుర్తించే సామర్థ్యమూ తగ్గుతుంది. ఫలితంగా తీవ్ర రొమ్ముక్యాన్సర్ ముప్పు పెరుగుతోందని పరిశోధకులు చెబుతున్నారు. నిద్రవేళలు మారటం వల్ల కణితులు త్వరగా వృద్ధి చెందటమే కాకుండా క్యాన్సర్ కణాలు మనుగడ సాగించటానికి, ఇతర భాగాలకు వ్యాపించటానికి అనువైన వాతావరణం ఏర్పడుతోందనీ వివరిస్తున్నారు.

ప్రాక్టీస్ బిట్స్

ఇండియన్ పాలిటీ

1. గాంధీజీ 1947, ఆగస్టు 15న 24 గంటల నిరాహార దీక్ష ఎక్కడ చేశారు?
1) కోల్‌కతా 2) దిల్లీ 3) ముజఫరాబాద్ 4) వార్ధా

2. 1947, అక్టోబరు 26న 'విలీన ఒప్పందం' ద్వారా ఇండియాలో విలీనమైన స్వదేశీ సంస్థానం ఏది?
1) జునాగఢ్, ట్రావెన్‌కోర్ 2) సెంట్రల్ ప్రావిన్సెస్ 3) జమ్ము-కశ్మీర్ 4) గ్వాలియర్

3. లోక్‌సభకు జరిగిన సాధారణ ఎన్నికల అనంతరం లోక్‌సభలో సీనియర్ సభ్యుడిని 'ప్రొటెం స్పీకర్'గా ఎవరు నియమిస్తారు?
1) రాష్ట్రపతి 2) ప్రధానమంత్రి 3) ఛైర్మన్ 4) స్పీకర్


4. మొదటి లోక్‌సభకు ప్రొటెం స్పీకర్‌గా ఎవరు వ్యవహరించారు?
1) జి.వి.మౌలాంకర్ 2) అనంతశయనం అయ్యంగార్ 3) వీరేంద్ర సింగ్ 4) కమల్ మిశ్రా

5. రాష్ట్రపతిని తొలగించే మహాభియోగ తీర్మానాన్ని పార్లమెంటు ఉభయసభలు విడివిడిగా ఏ మెజార్టీతో ఆమోదిస్తే రాష్ట్రపతి పదవీచ్యుతుడు అవుతారు?
1) 1/3వ 2) 2/3వ 3) 1/4వ 4) 3/4వ

6. రాష్ట్రపతి పదవికి జరిగిన ఎన్నికల్లో వివాదాలు ఉంటే ఎన్నికలు ముగిసిన ఎన్నిరోజుల్లోగా 'ఎలక్టోరల్ కాలేజ్'లోని 20 మంది సభ్యులు సుప్రీం కోర్టులో సవాల్ చేయవచ్చు?
1) 15 2) 21 3) 30 4) 45

సమాధానాలు: 1-1; 2-3; 3-1; 4-1; 5-2; 6-3.

భారత్ అంటే పచ్చని పొలాలు, ప్రవహించే నదులే కాదు. ఆ పొలాల్లో రైతులతోపాటు కష్టపడి పనిచేసే పశువులు కూడా ఉంటాయి. ప్రాచీన కాలం నుంచి పశువులు దేశ సంస్కృతిలో భాగంగా మారిపోయాయి. వాటిని కేవలం జంతువులుగా కాకుండా, కుటుంబ సభ్యులుగా, సంపదగా భావిస్తారు. ప్రపంచంలో అత్యధిక పశువులు ఇక్కడే ఉన్నాయి. పాల ఉత్పత్తిలోనూ అగ్రగామిగా దేశం నిలిచింది. పశుసంపద కోట్లాదిమందికి ఉపాధిని, పోషకాహారాన్ని అందిస్తోంది. వ్యవసాయం దెబ్బతిన్నప్పటికీ ఆర్థికంగా రైతు కుంగిపోకుండా కాపాడుతోంది. పారిశ్రామికీకరణ పెద్ద ఎత్తున జరిగినప్పటికీ గ్రామీణ భారతం నేటికీ పశువుల అడుగుజాడల్లోనే ఆర్థిక భవిష్యత్తును వెతుక్కుంటోంది. ఆర్థిక వ్యవస్థలో ప్రకృతి ప్రసాదించిన ఈ జీవసంపద ప్రాధాన్యంపై పోటీ పరీక్షల అభ్యర్థులకు అవగాహన ఉండాలి. వివిధ పశువులు, అందులోని రకరకాల జాతులు, వాటి జనాభా, అవి అందిస్తున్న ప్రయోజనాలను గణాంకాలతో సహా తెలుసుకోవాలి.



పల్లె ప్రగతిని కాపాడే పాడి!

పశు సంపద

దేశ వ్యవసాయ రంగంలో పశుపోషణ ప్రధానమైన భాగంగా ఉంది. పశువుల ద్వారా అందే శక్తి అనాదిగా దేశంలో వాడుకలో ఉంది. దీన్ని ఒక జీవఇంధనం (బయోఎనర్జీ రిసోర్స్)గా చెప్పొచ్చు. గ్రామాల్లో నేటికీ సుమారు 2/3వ వంతు మందికి ఇదే జీవనాధారం. దేశంలో పశువులను మచ్చిక చేసుకుని వ్యక్తిగత అవసరాలు, వ్యవసాయం, రవాణాకు వినియోగిస్తున్నారు. పాలు, మాంసం, ఉన్ని, చర్మాలు లాంటి ఉత్పత్తులను పొందుతున్నారు. ఈ పశుసంపద వ్యక్తిగత అవసరాలను తీర్చడమే కాకుండా దేశ ఆర్థిక శక్తిలోనూ భాగంగా మారింది. దేశ జనాభాలో 9% మందికి ఉపాధి కల్పిస్తోంది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పశుసంపద రంగం వాటా 2014-15లో స్థూల ఆధారిత విలువ (గ్రాస్ వాల్యూ యాడెడ్)లో 24.32% అయితే, 2022-23లో 30.23%గా, దేశ జీవీఏలో 5.5%. దేశంలో పశుసంపద తగిన రీతిలో వృద్ధి చెందితే, గ్రామీణ జీవనోపాధికి వ్యవసాయ రంగ ఆదాయానికి బలమైన పునాది ఏర్పడుతుంది. అవసరమైన పోషకాహారాలైన పాలు, గుడ్లు, మాంసం లభ్యత పెరుగుతుంది. పశుపోషణ అంటే శాస్త్రీయ పద్ధతిలో పశువుల నిర్వహణ. దీనిలో పశువుల (ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, గాడిదలు, కంచర గాడిదలు, చేపలు) పెంపకం, పశువులకు పచ్చిక/దాణా, సంతానోత్పత్తి, అభివృద్ధి, వ్యాధుల నియంత్రణ మొదలైనవి ఉంటాయి. వ్యవసాయం, పాల కోసం అనాదిగా పశువుల పెంపకం సాగుతోంది. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ దేశంలో పశువుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గ్రామీణ భారతంలో దాదాపు ప్రతి రైతు కుటుంబం ఒక జత ఎడ్లను కలిగి ఉంటుంది. దున్నడం, బండ్లు లాగడం, సరకు రవాణాకు అన్నదాతలు పశువులపైనే ఆధారపడతారు. పశువుల వ్యర్థాలను ఎరువుగా సాగుకు వాడుతున్నారు. ప్రపంచంలోనే అత్యధిక పశువులు (33%) భారత్‌లోనే ఉన్నాయి.



దేశ జనాభాకు సరిపడేంత పాలు సరఫరా చేయాలంటే ఎక్కువ దిగుబడిని ఇచ్చే పశువులు కావాలి. వాటిలో గేదెలు ప్రధానమైనవి. ఇవి ఎక్కువ పాలు ఇస్తాయి. దేశం మొత్తం పశువుల్లో ఇవి 17%. మొత్తం పాల ఉత్పత్తిలో 55% వీటి ద్వారానే లభిస్తోంది. దేశ పాడిపరిశ్రమ ఎక్కువగా వీటిపైనే ఆధారపడి ఉంది. ★ ప్రపంచంలోని మొత్తం గేదెల్లో 56% ఇక్కడే ఉన్నాయి. దేశంలోని మేలుజాతి గేదెల్లో ముర్రా, భదావరి, జఫరాబడి, సూర్తి, మెహసానా, నాగపూరి, నీలిరవి, ముర్రా జాతి (హరియాణా) ఉన్నాయి. యూపీకి చెందిన భదావరి దేశీయజాతి ఒక ఈతకు 800-1000 లీటర్ల పాలను ఇస్తుంది.



డియోని జాతి ఆవులను ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల్లో పెంచుతారు. ఇవి ఒకఈతలో 1350 లీటర్ల పాలిస్తాయి. గిర్ జాతి ఈతకు 3 వేల లీ., శాహీవాల్ 3 వేల-4.5 వేల లీ., సింధి 5 వేల లీ. పాలు ఇస్తాయి. ఏపీ, పుంగనూరు ఆవులు ప్రపంచంలోనే పొట్టి జాతికి చెందినవి. ఇవి ఎక్కువపాలదిగుబడి ఇస్తాయి. కేరళలోని వేచూర్ ఆవు కూడా ప్రపంచంలో అతిచిన్న ఆవుజాతి. దేశంలో ఎక్కువ ప్రాచుర్యం పొందిన ఆవులు జెర్సీ హోల్‌స్టెయిన్ జాతులు.

పందులు



అధిక మాంసం ఉత్పత్తి, ఖర్చుతక్కువ కావడం వల్ల పందుల పెంపకానికి ఆదరణ అధికం. ఈశాన్యరాష్ట్రాల్లో వీటి పెంపకం ఎక్కువ. 2019 గణాంకాల ప్రకారం దేశంలోని పందుల సంఖ్య 9.06 మిలియన్లు. వీటిలో దేశీయ జాతులు 79%. సుమారు 90% పందులను గ్రామీణ ప్రాంతాల్లో పెంచుతున్నారు. వీటిలో ముందంజలో ఉన్న రాష్ట్రాలు అస్సాం, ఝార్ఖండ్, మేఘాలయా, పశ్చిమ బెంగాల్.



ప్రపంచ మొత్తం గొర్రెల్లో 4% భారత్‌లో ఉన్నాయి. ఇవి మాంసం, ఉన్ని, చర్మానికి ముఖ్యమైన వనరు. మొత్తం ఉన్ని ఉత్పత్తిలో ముందువరుసలో ఉన్న రాష్ట్రాలు రాజస్థాన్(46%) జమ్ము-కశ్మీర్(25%), గుజరాత్(7%), మహారాష్ట్ర(5%), హిమాచల్‌ప్రదేశ్ (4%). గొర్రెల్లో ముఖ్యమైన జాతుల్లో లోహి, మార్వారి, జైసల్మేరీ, సోనాడి, మల్పురి, మాగ్రా, పుగల్, దక్కన్, నెల్లూరు, బళ్లారి, గురెజ్, కర్నాహ్, బకేర్‌వాల్, గడ్డి మొదలైనవి ఉన్నాయి.



మేకలను పాలు, మాంసం, చర్మం కోసం పెంచుతారు. దేశంలో వినియోగించే మాంసంలో సుమారు 35% వీటి నుంచే లభిస్తోంది. ప్రపంచంలో రెండో అతిపెద్ద మేకల కేంద్రం భారత్. రాజస్థాన్‌ది మొదటి స్థానం. వెస్ట్ బెంగాల్ 2, యూపీ 3, తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, తమిళనాడు, ఝార్ఖండ్, ఒడిశా, కర్ణాటకలున్నాయి. భారత్‌లోని మేకల్లో 90% కంటే ఎక్కువ దేశీయ జాతులు. హిమాచల్‌ప్రదేశ్, కశ్మీర్‌కు చెందిన 'హిమాచలి' దేశంలో ముఖ్యమైన మేక జాతి. ఇవి మృదువైన ఉన్ని, చర్మాన్ని, మాంసాన్ని ఇస్తాయి. రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్‌ల్లోని ప్రధాన జాతులు మార్వాడీ, మెహసాన, కతియవారి, జాలవాడి.

కోళ్ల పెంపకం



మాంసం, గుడ్ల కోసం దేశీయంగా, వాణిజ్యపరంగా పక్షులను పెంచడాన్ని పౌల్ట్రీ అంటారు. కోళ్లు, బాతులు, టర్కీలు, గినియా కోడి, కౌముజులు మొదలైనవి వాటిలో ఉన్నాయి. బాయిలర్, లేయర్ అని కోళ్ల పెంపకం 2 రకాలు. 2019 లెక్కల ప్రకారం దేశంలో మొత్తం కోళ్ల జనాభా 851 మిలియన్లు. 2023-24లో గుడ్లఉత్పత్తి 143 బిలియన్లు. ఏడాదికి తలసరి లభ్యత 103. ప్రపంచంలోనే భారత్ రెండో అతిపెద్ద గుడ్ల ఉత్పత్తిదారు. దేశంలో గుడ్లు ఉత్పతి చేసే ప్రధానరాష్ట్రాలు 1) ఏపీ(18%) 2) తమిళనాడు(16%) 3) తెలంగాణ(13%) 4) వెస్ట్ బెంగాల్(11%) 5) కర్ణాటక(7%). ◆ మాంసం ఉత్పత్తి (2023-24)లో కోళ్ల రంగం వాటా 49%.



ఇందులో చేపలు, రొయ్యలు, షెల్‌ఫిష్ పెంపకం, ముత్యాల వృద్ధి ఉంటాయి. దీన్నే ఆక్వాకల్చర్‌గా వ్యవహరిస్తారు. సముద్రంలో చేపలు పట్టడానికి 75% పశ్చిమ, 25% తూర్పుతీర ప్రాంతాలు అనుకూలం. ప్రపంచ చేపల ఉత్పత్తిలో భారత్‌ది రెండోస్థానం. తమిళనాడు, గుజరాత్, కేరళ, ఏపీ తీరప్రాంతాలు, మున్నార్ సింధుశాఖ చేపల వేటకు అనుకూలం. 2023-24 ప్రకారం భారత్‌లో చేపలఉత్పత్తి 19.5 మి.మె.ట. 2.8 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. దేశజీడీపీలో ఈ రంగం వాటా 1.1%. చేపల ఉత్పత్తిలో ముందున్న రాష్ట్రాలు ఏపీ(26%), వెస్ట్‌బెంగాల్ (10%), కర్ణాటక (5%), ఒడిశా (4.7%), గుజరాత్ (4.5%).



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్



Final Exams-2026 IMPORTANT Q & A

1. What is the role of acid in the stomach?

A: The hydrochloric acid present in our stomach dissolves bits of food and creates an acidic medium. In this acidic medium, enzyme pepsinogen is converted into pepsin, which is a protein digesting enzyme.

2. How is small intestine designed to absorb digested food?

A: The small intestine has millions of tiny finger like projections called villi. These villi increases the surface area for more efficient food absorption. Within these villi, many blood vessels are present that absorb the digested food and carry it into the blood stream. From the blood stream, the absorbed food is delivered to each and every cell of the body.

2 Marks

3. How are water and minerals transported in plants?

A: The components of xylem tissue (tracheids and vessels) of roots, stems and leaves are inter connected to form a continuous system of water-conducting channels that reaches all parts of the plant. Transpiration creates a suction pressure, as a result of which water is forced into the xylem cells of the roots. Then there is a steady movement of water from the root xylem to all the plant parts through the interconnected water-conducting channels.


4. What happens to the rate of breathing during vigorous exercise and why?

A: i) During vigorous exercise, the demand for oxygen increases to release more energy for the work.
ii) So, the rate of breathing increases during vigorous exercise.

5. What food habits do you follow after reading the chapter Nutrition and why?

A: i) I'll take balanced diet which contains proper amounts of carbohydrates, proteins, fats, vitamins and minerals.
ii) I avoid taking food containing high proportion of fat.
iii) I'll not eat rich minerals over several days.
iv) I avoid doing violent exercise soon after eating food.

For more IMP Q & A



Write: M.S.N. Murthy

నైతిక ఉల్లంఘనలతో ఆ దేశ ప్రధాని రాజీనామా!



భారత ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ అకస్మాత్తుగా రాజీనామా చేయడం గత జులైలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అదే నెలలో నైతిక ఉల్లంఘన పేరుతో థాయ్‌లాండ్ ప్రధాని షినవత్ర పదవిని కోల్పోయారు. యునెస్కో నుంచి వైదొలుగుతున్నట్లు అమెరికా ప్రకటించింది. హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్‌తో పాటు ప్రపంచస్థాయి ప్రభావవంతమైన మహిళగా దీపికా పదుకొణె ఎంపికయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వివిధ రంగాలకు చెందిన నలుగురు ప్రతిభావంతులను రాజ్యసభకు నామినేట్ చేయడంతో పాటు అశోక్ గజపతిరాజు సహా ముగ్గురు కొత్త గవర్నర్‌లను నియమించారు. ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు, బహుభాషా నటి బి.సరోజా దేవి మరణించారు. సుదూర లక్ష్యాలను ఛేదించే అస్త్ర క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ ఫలితాల్లో ఏపీకి అయిదు, తెలంగాణకు రెండు పురస్కారాలు లభించాయి. ఇలాంటి ప్రధానాంశాలతో పాటు ప్రధాని మోదీ విదేశీ పర్యటనల విశేషాలు, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను పోటీ పరీక్షార్థులు గుర్తుచేసుకోవాలి.

ముఖ్యాంశాలు

- జులై 1 నాటికి దేశంలో జీఎస్టీ (వస్తు సేవల పన్ను) అమల్లోకి వచ్చి ఎనిమిదేళ్లు పూర్తయింది. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో స్థూల జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో రూ.22.08 లక్షల కోట్లకు చేరుకున్నాయి.
- భారతదేశ క్రీడా సంస్కృతిని పెంపొందించడం, దేశాన్ని ప్రపంచ క్రీడాశక్తి కేంద్రంగా నిలబెట్టే లక్ష్యంతో కేంద్ర మంత్రి వర్గం జులై 1న జాతీయ క్రీడా విధానాన్ని ఆమోదించింది.
- జులై 1న 'రైల్ వన్' యాప్‌ను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆవిష్కరించారు. ప్రయాణికులకు రైల్వే సేవలన్నింటినీ ఒకే చోట అందించే ఈ యాప్‌ను కేంద్రీయ రైల్వే సమాచార వ్యవస్థ (సీఆర్ఐఎస్) ఏర్పాటై 40 ఏళ్లు అయిన సందర్భంగా తీసుకొచ్చారు.
- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంద్రజాలికుడు, రచయిత డాక్టర్ బీవీ పట్టాభిరామ్ (75) జులై 1న హైదరాబాద్‌లో మరణించారు.
- జులై 2 నుంచి 9 వరకు ప్రధాని మోదీ ఐదు దేశాల్లో పర్యటించారు. తొలుత ఘనాలో పర్యటించారు. గత మూడు దశాబ్దాల్లో భారత ప్రధాని ఒకరు ఘనాను సందర్శించడం ఇదే ప్రథమం. ఘనా పార్లమెంటును ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ది ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా'ను మోదీకి దేశాధ్యక్షుడు జాన్ డ్రమానీ మహామా ప్రదానం చేశారు.
- జులై 4న మోదీ ట్రినిడాడ్ అండ్ టొబాగోలో పర్యటించారు. ప్రధాని కమ్లా పెర్సాద్ బిస్సెస్సార్‌తో మోదీ సమావేశమయ్యారు. ఈ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో'ను దేశ అధ్యక్షురాలు క్రిస్టైన్ కర్లా కంగలూ ప్రధాని మోదీకి ప్రదానం చేశారు.
- జులై 5న మోదీ అర్జెంటీనాలో పర్యటించారు. 57 ఏళ్ల తర్వాత భారత ప్రధాని ఆ దేశంలో పర్యటించడం ఇదే తొలిసారి. ఇరుదేశాల మధ్య ఆరు ఒప్పందాలు కుదిరాయి. అధ్యక్షుడు జేవియర్ మిలీతో సమావేశమయ్యారు. రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో 'కీ టు ది సిటీ ఆఫ్ బ్యూనస్ ఎయిర్స్' అనే ప్రత్యేక పురస్కారాన్ని మోదీకి ప్రదానం చేశారు.
- జులై 8న బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులాడ సిల్వాతో మోదీ సమావేశమయ్యారు. బ్రెజిల్ అత్యున్నత పౌర పురస్కారమైన 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదర్న్ క్రాస్'ను అధ్యక్షుడు మోదీకి ప్రదానం చేశారు.
- జులై 9న ప్రధాని మోదీ నమీబియాలో పర్యటించారు. ఆ దేశ పార్లమెంటు సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. దేశ అధ్యక్షురాలు నెటుంబా నాందీ ఎందియాత్వాతో సమావేశమయ్యారు. నమీబియా అత్యున్నత పౌర పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియెంట్ వెల్ విచియా మిరాబిలిస్'ను ప్రధాని మోదీకి ప్రదానం చేశారు. ఇలాంటి అంతర్జాతీయ పురస్కారాన్ని మోదీ అందుకోవడం 27వ సారి.



థాయ్‌లాండ్ ప్రధానమంత్రి పేటోంగ్టార్న్ షినవత్రను రాజ్యాంగ న్యాయస్థానం జులై 1న సస్పెండ్ చేసింది. పొరుగు దేశమైన కాంబోడియా ప్రధాని హున్‌సేన్‌తో జరిపిన చర్చల్లో ఆమె అతి వినయం ప్రదర్శిస్తూ మాట్లాడి, నైతిక ఉల్లంఘనకు పాల్పడ్డారన్న అభియోగంపై కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది.

- అంతరిక్ష పరిశోధన రంగంలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఏపీ స్పేస్ పాలసీ 4.0'ను రూపొందించింది. 2024-29 మధ్య పెట్టుబడులు పెట్టే సంస్థలకు పాలసీ నిబంధనలు వర్తిస్తాయని, రాబోయే పదేళ్లలో 35 వేల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం పేర్కొంది.
- సురినామ్ తొలి మహిళా అధ్యక్షురాలిగా జెన్నిఫర్ గీర్లింగ్స్ - సైమన్స్ ఎన్నికయ్యారు.



బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొణె మోషన్ పిక్చర్స్ విభాగంలో 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026'కు ఎంపికైంది. ఈ గౌరవాన్ని దక్కించుకున్న తొలి భారతీయ నటిగా రికార్డు సృష్టించింది.


- ఐఐటీ గువాహటి విద్యార్థిని సుకన్య సోనోవాల్ కామన్వెల్త్ యూత్ పీస్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. ఈమె 2027 వరకు కామన్వెల్త్ యూత్ పీస్ అంబాసిడర్స్ నెట్‌వర్క్ (సీవైపీఏఎన్)కి కమ్యూనికేషన్స్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ లీడ్‌గా వ్యవహరిస్తుంది.
- పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన కర్నాటి మురళి 'జాతీయ ఉత్తమ నేత వృత్తిదారుడి అవార్డు'కు ఎంపికయ్యారు. చేనేత ఇక్కత్ డిజైన్ కళ భవిష్యత్తు తరాలకు అందాలని ఈయన చేస్తున్న కృషికి ఈ పురస్కారం దక్కింది. దేశవ్యాప్తంగా 19 మందికి అవార్డులు ప్రకటించగా ఏపీ నుంచి ఈయనకు దక్కింది.
- హరియాణా ప్రభుత్వం ఆరావళి కొండల్లో ఆసియాలోనే అతి పెద్ద జంగిల్ సఫారీ నిర్మిస్తామని ప్రకటించింది.
- ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగుగా భావిస్తున్న వత్సల మధ్యప్రదేశ్‌లోని పన్నా టైగర్ రిజర్వులో కన్నుమూసింది. దీని వయసు 100 ఏళ్లకు పైగా ఉంటుందని అంచనా.
- ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధి బ్యాంకు (ఎన్ఏబీఎఫ్ఐడీ)తో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) జులై 11న ఒప్పందం కుదుర్చుకుంది.
- రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా సోనాలీ మిశ్రా నియమితులయ్యారు. ఆర్పీఎఫ్‌నకు ఒక మహిళా అధికారి సారథ్యం వహించడం ఇదే తొలిసారి. 2026, అక్టోబరు 31 వరకు ఈమె పదవిలో కొనసాగుతారు.
- ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు (83) హైదరాబాద్‌లో జులై 13న మరణించారు. 750కి పైగా సినిమాల్లో నటించారు. 1999 నుంచి 2004 వరకు విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా కొనసాగారు.
- బహుభాషా నటి బి.సరోజా దేవి (87) బెంగళూరులో మరణించారు. కన్నడ, తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 200కు పైగా సినిమాల్లో నటించారు.
- ప్రాచీన వైద్య పద్ధతుల సమాచారాన్ని కృత్రిమ మేధతో అనుసంధానించిన తొలిదేశంగా భారత్ అవతరించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రకటించింది.
- వివిధ రంగాలకు చెందిన నలుగురిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యసభకు నామినేట్ చేశారు. వీరిలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగ్లా, ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్, ప్రముఖ చరిత్రకారిణి మీనాక్షి జైన్, కేరళ ఉపాధ్యాయుడు సి.సదానందన్ మాస్టర్ ఉన్నారు.



జులై 6, 7 తేదీల్లో బ్రెజిల్‌లో పర్యటించిన మోదీ రియో డీ జనీరోలో జరిగిన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొని 'బహుళ పక్షవాదం, ఆర్థిక వ్యవహారాలు, కృత్రిమ మేధ'పై ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. 2026లో భారత్‌లో 'ఏఐ ఇంపాక్ట్ సదస్సు' నిర్వహిస్తామని ప్రకటించారు.

- జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నూతన ఛైర్‌పర్సన్‌గా డాక్టర్ అభిజిత్ సేథ్ నియమితులయ్యారు.
- నైజీరియా మాజీ అధ్యక్షుడు మహ్మద్ బుహారీ (82) లండన్‌లో మరణించారు. ఇతడు మూడు సార్లు దేశాధ్యక్షుడిగా వ్యవహరించారు.
- హరియాణా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషిమ్ కుమార్ ఘోష్, గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతి రాజు, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తా నియమితులయ్యారు.
- సిక్కింలోని పాక్యోంగ్ జిల్లాలోని యాక్టెన్ గ్రామాన్ని జులై 15న భారత్‌లో మొదటి డిజిటల్ నోమాడ్ గ్రామంగా ప్రకటించారు. ప్రశాంత హిమాలయ వాతావరణంలో మారుమూల ప్రాంతాలకు చెందిన కార్మికులకు ఆధునిక సౌకర్యాలు అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఇది స్థానిక కుటుంబాలు హోమ్ స్టేల ద్వారా స్థిరమైన ఆదాయం సంపాదించడానికి సహాయపడుతుంది.
- భూమికి 400 కి.మీ. ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో 18 రోజులు గడిపిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా భూమికి చేరుకున్నారు. రోదసిలో అత్యధిక కాలం (ప్రయాణ సమయంతో కలిపి 20 రోజులు) గడిపిన భారత వాసిగా శుక్లా రికార్డు సృష్టించారు.
- నల్లమల అడవుల్లోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో 2024-25 నాటికి 36 పులులు ఉన్నట్లు అటవీశాఖ వెల్లడించింది. వీటిలో 20 ఆడ పులులు కాగా, 13 మగవి. మిగతావి పులి పిల్లలు, గుర్తించనివిగా ఉన్నాయి. 2023-24లో 33 పులులు ఉన్నాయి.
- స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 పురస్కారాల్లో ఏపీకి 5, తెలంగాణకు 2 లభించాయి. 10 లక్షల జనాభా పై పడిన నగరాల సూపర్ స్వచ్ఛ లీగ్ కేటగిరీలో విజయవాడ, 3 - 10 లక్షల జనాభా కేటగిరీలో గుంటూరు, మూడు లక్షల్లోపు జనాభా విభాగంలో తిరుపతి పురస్కారాలు గెలుచుకున్నాయి. ప్రత్యేక కేటగిరీలో జీవీఎంసీ విశాఖపట్నం, ప్రామిసింగ్ స్వచ్ఛ షెహర్ ఆఫ్ ది స్టైట్ కేటగిరీలో రాజమహేంద్రవరం మినిస్టీరియల్ అవార్డును సొంతం చేసుకున్నాయి. స్పెషల్ కేటగిరీలో పరిశుభ్రమైన కంటోన్మెంట్‌గా సికింద్రాబాద్ తొలి స్థానాన్ని దక్కించుకోగా, ప్రామిసింగ్ స్వచ్ఛ షెహర్ ఆఫ్ ది స్టైట్ కేటగిరీలో గ్రేటర్ హైదరాబాద్ అవార్డు సొంతం చేసుకుంది.

బియాండ్ విజువల్ రేంజ్ లక్ష్యాలను ఛేదించే అస్త్ర క్షిపణిని జులై 11న భారత్ విజయవంతంగా పరీక్షించింది. గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ధ్వంసం చేయగల ఈ అస్త్రాన్ని సుఖోయ్ - ఎంకేఐ యుద్ధ విమానం నుంచి ఒడిశా తీరంలో ప్రయోగించారు. దీని పరిధి 100 కి.మీ. పైగా ఉంది.



వింబుల్డన్ గ్రాండ్ స్లామ్- 2025 మహిళల సింగిల్స్ టైటిల్ విజేతగా ఇగా స్వైటెక్ (పోలండ్), రన్నరప్‌గా అమండా అనిసిమోవా (అమెరికా) నిలిచారు. పురుషుల సింగిల్స్ విజేతగా ప్రపంచ నంబర్‌వన్ జానిక్ సినర్ (ఇటలీ), రన్నరప్‌గా కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) నిలిచారు.



- ఆపదలో చిక్కుకునే జలాంతర్గాములను రక్షించడానికి ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించిన 'ఐఎన్ఎస్ నిస్తార్' నౌకను జులై 18న విశాఖ నేవల్ డాక్ యార్డ్‌లో జాతికి అంకితం చేశారు.
- టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అతిపెద్దదిగా ప్రసిద్ధి పొందనున్న భారీ జల విద్యుత్తు ప్రాజెక్టు పనులను చైనా జులై 19న లాంఛనంగా ప్రారంభించింది. 16,708 కోట్ల డాలర్ల (సుమారు రూ.14 లక్షల కోట్లు) వ్యయంతో దీన్ని భారత సరిహద్దుకు అతి సమీపంలో నిర్మిస్తున్నారు.
- తెలంగాణ హైకోర్టు 7వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ జులై 19న ప్రమాణస్వీకారం చేశారు.
- దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో జులై 18 నుంచి 22 వరకు తూర్పు ఆసియా 9వ గణిత విద్యా సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో జరుపుతున్న ఈ సదస్సులో భారత్ తొలిసారిగా పాల్గొంది.
- ఉపరాష్ట్రపతి పదవికి జగ్‌దీప్ ధన్‌ఖడ్ జులై 21న రాజీనామా చేశారు. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో ఉన్న ఈయన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఈయన దేశ 14వ ఉపరాష్ట్రపతిగా 2022, ఆగస్టు 11న బాధ్యతలు చేపట్టారు.
- కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ (101) జులై 21న తిరువనంతపురంలో మరణించారు. ఏడు సార్లు కేరళ అసెంబ్లీకి ఎన్నికైన ఈయన 2006-11 కాలంలో ముఖ్యమంత్రిగా కొనసాగారు.
- ప్రతిష్ఠాత్మక శ్రీదాశరథి కృష్ణమాచార్య అవార్డును 2025 సంవత్సరానికి ప్రముఖ కవి, వ్యాసకర్త అన్నవరం దేవేందర్‌కు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. అవార్డు నగదు బహుమతి రూ.1,01,116.
- యునెస్కో నుంచి వైదొలుగుతున్నట్టు అమెరికా ప్రకటించింది. ప్యారిస్ కేంద్రంగా పనిచేస్తున్న యునెస్కో నుంచి అమెరికా వైదొలగడం ఇది మూడోసారి. ట్రంప్ పాలనలో ఇలా జరగడం రెండోసారి.




రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్

ఉష్ణం - ఉష్ణోగ్రత

ఘన పదార్థాల వ్యాకోచం

పటంలో చూపినట్లు ఒక లోహపు రింగు, దాని నుంచి జారే విధంగా ఒక లోహపు గోళం తీసుకోవాలి. సాధారణ గది ఉష్ణోగ్రత వద్ద గోళం సులభంగా ఇటువైపు నుంచి అవతలి వైపునకు ఆ రింగు ద్వారా జారుతుంది. గోళాన్ని ఒక మంటపై కొన్ని నిమిషాలు వేడిచేసి, రింగు ద్వారా అవతలి వైపునకు పంపే ప్రయత్నం చేసినప్పుడు ఆ గోళం ఆ రింగులో నుంచి వెళ్లలేదు. దీనికి కారణం ఉష్ణం వల్ల లోహపు గోళం వ్యాకోచం చెందటమే. మళ్లీ చల్లారిన తర్వాత ఆ గోళం యథావిధిగా రింగులో నుంచి జారుతుంది.

H - హేండిల్,
R - లోహపు రింగు
M - లోహపు గోళం



ఇలా ఘనపదార్థాల్లో ఉష్ణం కారణంగా వచ్చే వ్యాకోచం 3 రకాలుగా జరుగుతుంది.

1. దైర్ఘ్య వ్యాకోచం (Linear Expansion)
2. క్షేత్రీయ వ్యాకోచం (Ariel/Superficial Expansion)
3. ఘనపరిమాణ వ్యాకోచం (Cubical Expansion)

క్షేత్రీయ వ్యాకోచం

వస్తువు వైశాల్యం దాని మందంతో పోల్చినప్పుడు ఎక్కువగా ఉండి, వేడి చేసినప్పుడు దాని వైశాల్యంలో వ్యాకోచాన్ని గమనించగలిగితే దాన్ని క్షేత్రీయ వ్యాకోచం అంటారు.

ఉదా: గాజు పలక, లోహపు రేకు, లోహ ఫలకం

✦ ఒక వస్తువు క్షేత్రీయ వ్యాకోచం (a) ఆ వస్తువు తొలి వైశాల్యం (A), ఆ వస్తువులోని ఉష్ణోగ్రత వృద్ధి $\Delta\theta$ లపై ఆధారపడి ఉంటుంది.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

$a \propto A$

$a \propto \Delta\theta$

$a \propto A.\Delta\theta$

$a = \beta.A.\Delta\theta$

$\beta = \frac{a}{A.\Delta\theta}$, ఇక్కడ βని క్షేత్రీయ వ్యాకోచ గుణకం అంటారు.

✦ ప్రమాణ వైశాల్యం ఉన్న ఒక వస్తువులో 1°C ఉష్ణోగ్రత వృద్ధికి దాని వైశాల్యంలో కలిగే వృద్ధిని ఆ వస్తువు క్షేత్రీయ వ్యాకోచ గుణకం అంటారు.

✦ ప్రమాణం $°C^{-1}$ లేదా K^{-1}

ఘనపరిమాణ వ్యాకోచం

ఒక వస్తువు పొడవు, వెడల్పు, ఎత్తులు ఒకదానితో మరొకదాన్ని పోల్చగలిగేలా ఉన్నప్పుడు ఆ వస్తువును వేడి చేసినట్లయితే దాని ఘనపరిమాణంలో వ్యాకోచాన్ని చూడొచ్చు. దీన్నే ఘనపరిమాణ వ్యాకోచం అంటారు.

❖ ఒక వస్తువు ఘనపరిమాణ వృద్ధి (v) అనేది ఆ వస్తువు తొలి ఘనపరిమాణం (V), వస్తువులో ఉష్ణోగ్రత వృద్ధి($\Delta\theta$)పై ఆధారపడి ఉంటుంది.

❖ ప్రమాణ ఘనపరిమాణం ఉన్న ఒక వస్తువులో 1°C ఉష్ణోగ్రత వృద్ధికి దాని ఘనపరిమాణంలో కలిగే వృద్ధిని ఆ వస్తువు ఘనపరిమాణ వ్యాకోచ గుణకం అంటారు.

❖ దీనికి ప్రమాణం $°C^{-1}$ లేదా K^{-1}

ఘనపదార్థాల వ్యాకోచం - అనువర్తనాలు

ద్విలోహ పట్టీ: 1) 'వివిధ పదార్థాలకు పలు వ్యాకోచ గుణకాలు ఉంటాయి' అనే నియమం ఆధారంగా ఇది పని చేస్తుంది. సాధారణంగా రాగి, అల్యూమినియం లాంటి లోహాలతో దీన్ని తయారు చేస్తారు. రెండు లోహాలు వేర్వేరుగా వ్యాకోచించడంతో దీన్ని వినియోగించి ఇస్త్రీ పెట్టెలు, ఫ్రిజ్‌లు, ఏసీలు లాంటి పరికరాలను ఆన్, ఆఫ్ అవడం ఆటోమెటిక్‌గా పనిచేసేలా చేయొచ్చు. దీన్ని థర్మోస్టాట్ అని అంటారు.

2) మంటలను పసిగట్టే యంత్రాలు: స్వయం చాలకంగా మంటలను గుర్తించే అలారంలో థర్మోస్టాట్ ద్వారా ఉష్ణోగ్రత పెరుగుదలను గుర్తించవచ్చు.

3) రైలు పట్టాలు వేసే సమయంలో వాటి మధ్య చిన్న ఖాళీలను వదలడం ద్వారా వాతావరణ ఉష్ణోగ్రతలకు పట్టాలు వ్యాకోచించినా ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు.

4) కాంక్రీట్ రోడ్లు నిర్మించేటప్పుడు పగుళ్లు రాకుండా చిన్న ఖాళీలు వదులుతారు.

5) వంతెనల నిర్మాణంలో కడ్డీలు వ్యాకోచించినా, వంతెన పాడవకుండా చిన్న చిన్న ఖాళీలు వదులుతారు.

6) టెలిఫోన్, కరెంటు తీగలు చలికాలం సంకోచించి తెగిపోకుండా వాటిని కాస్త వదులుగా స్తంభాలపై అమర్చుతారు.


ఉష్ణం అనేది ఒక శక్తి స్వరూపం. ఒక వ్యవస్థ పనిచేయడానికి ఉష్ణం సహాయపడుతుంది. ఉష్ణశక్తి ఎల్లప్పుడూ వేడి వస్తువుల నుంచి చల్లని వస్తువులకు ప్రవహిస్తుంది. ఉష్ణ వహనం ఆధారంగా పదార్థాన్ని ఉత్తమ, అధమ వాహకాలుగా విభజించారు. ద్రవ అణువులు ఏ ఉష్ణోగ్రత వద్దనైనా ద్రవ ఉపరితలాన్ని విడిపోయే ప్రక్రియను బాష్పీభవనం అంటారు. ఉష్ణ మాపకాన్ని వేడిగా ఉన్న వస్తువుకు తాకించినప్పుడు థర్మామీటర్‌లోని పాదరస మట్టం పెరుగుతుంది. దీనికి కారణం పాదరసం ఉష్ణాన్ని గ్రహించి వ్యాకోచం చెందడమే.

తీగలు తెగిపోకూడదంటే.. వదులుగా కట్టాల్సిందే!

దైర్ఘ్య వ్యాకోచం

ఘనపదార్థాల పొడవులో వచ్చే వ్యాకోచాన్ని దైర్ఘ్య వ్యాకోచం అంటారు.

C - క్లాంపు; PQRS - అల్యూమినియం రాడ్
W_1, W_2 - బరువులు



W - చెక్కపెట్టె; N - పేపరు పాయింటర్; T - పేపరు స్కేల్; L - దీపం

పటంలో చూపినట్లు L పొడవున్న ఒక అల్యూమినియం కడ్డీని తీసుకొని ఒక క్లాంపు సహాయంతో బిగించాలి. ఒక కొనను స్వేచ్ఛగా ఒక పెన్సిల్‌పై నుంచి కదిలే విధంగా అమర్చాలి.

అల్యూమినియం కడ్డీని క్లాంపు వైపు వేడి చేస్తే కొద్దిసేపటి తర్వాత అది వ్యాకోచం చెంది, పెన్సిల్‌పై నుంచి కొంచెం ముందుకు వెళుతుంది. ఉష్ణం వల్ల వ్యాకోచం అనేది వాటి పొడవులో స్పష్టంగా కనిపిస్తుంది.

▮ L పొడవున్న కడ్డీని θ_1 ఉష్ణోగ్రతలో ఉన్నప్పుడు వేడిచేస్తే θ_2 ఉష్ణోగ్రతకు చేరుతుంది. అప్పుడు దాని పొడవు L^1 అనుకుందాం. కడ్డీలో వచ్చిన దైర్ఘ్య వ్యాకోచం l ($l = L^1 - L$) అనుకుంటే, వ్యాకోచం కింది అంశాలపై ఆధారపడుతుంది.

ఎ) మొదటి పొడవు (L)కు అనులోమానుపాతంలో ఉంటుంది.

బి) ఉష్ణోగ్రతలో పెరుగుదల $\Delta\theta(\Delta\theta = \theta_2 - \theta_1)$కు అనులోమానుపాతంలో ఉంటుంది.

సి) దైర్ఘ్య వ్యాకోచం పదార్థ పరిమాణంపై ఆధారపడుతుంది.

▮ ప్రమాణ పొడవున్న ఒక వస్తువులో, 1°C ఉష్ణోగ్రత వృద్ధికి దాని పొడవులో కలిగే వృద్ధిని ఆ వస్తువు దైర్ఘ్య వ్యాకోచ గుణకం (α) అంటారు.

▮ దీనికి ప్రమాణం $°C^{-1}$ లేదా K^{-1}

ద్రవాల్లో వ్యాకోచం

ద్రవాలకు సొంత ఆకారం ఉండదు. ఏ పాత్రలో నింపితే దాని ఆకారాన్ని కలిగి ఉంటాయి. ద్రవాలను కింది నుంచి వేడి చేసినప్పుడు కొంత ఉష్ణాన్ని ముందుగా పాత్ర గ్రహించి వ్యాకోచిస్తుంది. ఈ కారణంగానే మొదట ద్రవం ఘనపరిమాణం స్వల్పంగా తగ్గినట్లు భ్రమ కలుగుతుంది.

☛ ద్రవాలు రెండు రకాల వ్యాకోచాలను ప్రదర్శిస్తాయి.

1. దృశ్య వ్యాకోచం 2. నిజ వ్యాకోచం

∴ ద్రవ నిజ వ్యాకోచం = పాత్ర వ్యాకోచం + దృశ్య వ్యాకోచం

నీటి వింత ప్రవర్తన

సాధారణంగా అన్ని ద్రవ పదార్థాలు వేడి చేస్తే వ్యాకోచిస్తాయి. కానీ నీరు 0°C నుంచి 4°C వరకు సంకోచం చెంది, ఆ తర్వాత వ్యాకోచిస్తుంది.

ఫలితాలు: జలచరాలు అతిశీతల ప్రాంతాల్లో నీటి ఉపరితలం గడ్డకట్టి ఉన్నా లోపల జీవించి ఉండటానికి కారణం లోపలి నీరు 4°C లో ఉండటం.

▼ అతిశీతల ప్రదేశాల్లో, పర్వత ప్రాంతాల్లో నీటి గొట్టాలు శీతాకాలంలో పగిలిపోతాయి. దీనికి కారణం నీరు గడ్డకట్టి వ్యాకోచించడమే.

▼ అతిశీతలీకరణం కారణంగా కూరగాయలు, పండ్లు పగిలిపోతాయి. కారణం లోపలి నీరు పీడనానికి గురికావడం.

వాయువుల్లో వ్యాకోచం

వేడి చేయడం వల్ల వాయు పదార్థాలు వ్యాకోచిస్తాయి. కానీ వాయువుల్లో వచ్చే వ్యాకోచంతో పోల్చినప్పుడు పాత్ర వ్యాకోచం చాలా తక్కువ. అందుకే ద్రవాల్లో లాగా పాత్ర వ్యాకోచాన్ని పరిగణించకూడదు.

◆ ఒక నిర్దిష్ట ఉష్ణోగ్రత వృద్ధికి అన్ని వాయువులు ఒకే విధంగా వ్యాకోచిస్తాయి. ఈ ధర్మాన్ని ఆధారం చేసకుని వాయు ఉష్ణమాపకాన్ని తయారు చేశారు.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

Word of the Day 876

Scurvy

Telugu meaning: కిరాతక, హేయమైన

English meaning: The word scurvy (స్కర్వీ) is an adjective that describes something morally contemptible, mean, or showing a lack of honour.

Synonyms: Despicable, Dishonourable

Antonyms: Honourable, Respectable

Usage: 1. The journalist exposed the scurvy tactics used by the company to exploit vulnerable consumers.

2. His scurvy behaviour during the crisis destroyed whatever trust people once had in him.

Current Affairs



President Droupadi Murmu undertook a sortie onboard the Indian Navy's indigenous Kalvari class submarine INS Vaghsheer at Karwar Naval Base in Karnataka on 28 December 2025. During over 2 hour long sortie, she interacted with the Submarine crew and witnessed the operational demonstrations. Murmu is the second President to take sortie in a Submarine after President Dr. APJ Abdul Kalam.



IAS officer Anu Garg becomes Odisha's first woman Chief Secretary from January 1, 2026. She is a 1991-batch IAS officer of the Odisha cadre with more than three decades of service. She will succeed Manoj Ahuja, who is set to retire on December 31, 2025.



Coal India Limited has appointed its Chairman cum Managing Director Sairam as the Chief Executive Officer (CEO) of the company. It is aimed at strengthening top-level management at India's largest coal producer, which plays a pivotal role in ensuring the country's energy security. He is a seasoned mining professional with over three decades of experience in India's coal sector.

The Union Government has launched India's first ever national weapon database to strengthen the fight against terrorism, organized crime and extremism. Union Home Minister Amit Shah launched the database prepared by the National Investigation Agency (NIA), India's central anti-terror agency under the Ministry of Home Affairs (MHA). The newly developed database is designed to include detailed records of government-owned weapons that have been looted, stolen, lost, or recovered from state police forces and Central Armed Police Forces (CAPFs).

For more Current Affairs: Scan QR code

అంతర్జాతీయ ద్రవ్య నిధి

స్టడీ జోన్

ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థల్లో అంతర్జాతీయ ద్రవ్య నిధి (International Monetary Fund - IMF) ఒకటి. ప్రపంచ దేశాలు స్థిరమైన వృద్ధి, శ్రేయస్సును సాధించేందుకు అవసరమైన సాయాన్ని ఇది అందిస్తుంది. ఉత్పాదకత, ఉద్యోగ సృష్టి, వృద్ధిని పెంచేందుకు కావాల్సిన ఆర్థిక విధానాలను రూపొందిస్తుంది. సంక్షోభంలో చిక్కుకున్న దేశాలు స్థిరత్వాన్ని సాధించేలా ఇది ఊతమిస్తుంది. రుణాలు ఇవ్వడంతో పాటు సంబంధిత దేశాలు మాంద్యం పరిస్థితి నుంచి బయటపడేలా తగిన ఆర్థిక సంస్కరణలు, విధాన మార్పులను సూచిస్తుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రత్యేక పాత్ర కలిగిన సంస్థగా ఐఎంఎఫ్‌కు పేరుంది. ఆర్థిక మార్గాల ద్వారా ప్రపంచ శ్రేయస్సు, శాంతిని పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. పోటీ పరీక్షల నేపథ్యంలో ఐఎంఎఫ్‌కి సంబంధించిన ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

ఏర్పాటు ఇలా..


1920-30 కాలంలో ప్రపంచవ్యాప్తంగా మహామాంద్యం ఏర్పడింది. అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. మాంద్య పరిస్థితుల వల్ల అంతర్జాతీయ వ్యాపారంపై ప్రతికూల ప్రభావం పడింది. దేశాల ఆర్థిక వ్యవస్థల రక్షణ కోసం ప్రతి దేశం ఎక్కువ మొత్తంలో దిగుమతి సుంకాలు విధించేది. ఫలితంగా అంతర్జాతీయ వ్యాపారం క్షీణించింది.

◆ వీటన్నింటికి పరిష్కార మార్గాలు కనుక్కునేందుకు ప్రపంచ దేశాలు 1944, జులై 22న అమెరికాలోని న్యూహాంప్‌షైర్ రాష్ట్రంలో ఉన్న బ్రెట్టన్ ఉడ్స్ నగరంలో సమావేశమయ్యాయి. 'యూఎన్ మానిటరీ అండ్ ఫైనాన్షియల్ కాన్ఫరెన్స్' అనే పేరుతో జరిగిన సదస్సులో ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలను ఏర్పాటు చేసే ఒప్పందం కుదిరింది. వీటినే బ్రెట్టన్ ఉడ్స్ కవలలు అంటారు.



ఐఎంఎఫ్‌కి నిధులు ఎలా సమకూరుతాయి? అది రూపొందించే ప్రధాన నివేదికలు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబులు తదితర పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ



టాక్సికాలజీ

రసాయనాలు, భౌతిక లేదా జీవ సంబంధ పదార్థాలు పర్యావరణం, ప్రాణులపై కలిగించే హానికర ప్రభావాల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని టాక్సికాలజీ అంటారు. ప్రమాదకర రసాయన చర్యలకు గురికావడాన్ని గుర్తించడంతోపాటు చికిత్సా విధానాన్ని అందించడం కూడా ఇందులో భాగమే. ఇది ప్రధానంగా టాక్సిన్లు (విషాలు), రసాయన ప్రతికూల ప్రభావాలను అధ్యయనం చేయడంపై దృష్టి సారిస్తుంది. అందుకే దీన్ని 'భద్రతాశాస్త్రం' (సైన్స్ ఆఫ్ సేఫ్టీ) అని కూడా అంటారు. టాక్సికాలజీ ప్రాముఖ్యత, ఇందులోని రంగాలు, రసాయనాలకు గురవడం వల్ల కలిగే దుష్ప్రభావాలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

టాక్సికాలజీ - ప్రాముఖ్యత

☛ ప్రజారోగ్యం ☛ వైద్యం
☛ పరిశోధన
☛ న్యాయశాస్త్రం

ముఖ్య రంగాలు

- ఔషధ విషవిజ్ఞానశాస్త్రం
- పారిశ్రామిక విషవిజ్ఞానశాస్త్రం
- పర్యావరణ విషవిజ్ఞానశాస్త్రం
- విశ్లేషణాత్మక విషవిజ్ఞానశాస్త్రం
- ఫోరెన్సిక్ విషవిజ్ఞానశాస్త్రం

రసాయనాలకు గురికావడం వల్ల కలిగే దుష్ప్రభావాలు

రసాయనాలకు గురికావడం వల్ల జీవుల్లో ముఖ్యంగా రెండు రకాల ప్రభావాలు తలెత్తుతాయి. అవి:

1. తీవ్రమైన ప్రభావాలు
2. దీర్ఘకాలిక ప్రభావాలు

▮ ఈ రెండు ప్రభావాలు వ్యక్తి వయసు, ఆరోగ్యం, రసాయన రకం - మోతాదు తదితర అంశాలపై ఆధారపడి ఉంటాయి.

రసాయనాలు, కాలుష్య కారకాలకు గురయ్యే పరిస్థితులు; ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే రసాయనాలు, వాటి వల్ల కలిగే సమస్యలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Senior Resident Jobs

The All India Institute of Medical Sciences (AIIMS Nagpur) is inviting applications for Senior Resident positions on a contractual basis. Total posts is 86. Application fee is 500. Last date for online application is 7 January 2026.

Credit Officer Posts

Bank of India (BOI) has released an official notification for the recruitment of Credit Officers in General Banking Officer (GBO) Stream across different management scales. Total no.of posts is 514. Application fee is Rs.850. Last date for online applications is 5 January 2026.

Industrial Trainee posts

Coal India Limited (CIL) has released for engagement of Industrial Trainees (CA/CMA). Total no.of posts is 125. Last Date for Online Applications is 15 January 2026.

Did You Apply..?

Today (December 30) is the last date for the following Jobs

☛ UPSC Combined Defence Services Examination (CDS-I), 2026. 451 Posts. ***Qualification:*** Degree.

☛ 69 Anganwadi Worker posts in Satya Sai district.

☛ 150 Senior Technical Assistant posts in RITES Limited. **Eligibility:** Diploma Engineering in Mechanical Production/Production.

For more information and other notifications - scan QR code

Bank Exams

Quantitative Aptitude

Circles - I

1. Find the perimeter of a circular garden which occupies an area of $254\frac{4}{7}$ sqm.

A) $56\frac{6}{7}$ m B) $54\frac{6}{7}$ m
C) $56\frac{4}{7}$ m D) $55\frac{4}{7}$ m
E) $58\frac{4}{7}$ m

2. If the perimeter of a circle is equal to that of a square, then what is the ratio between their areas?

A) 13 : 12 B) 14 : 11 C) 12 : 13
D) 11 : 14 E) 7 : 9

3. If the radius of one circle is Nine times the radius of another, how many times does the area of the greater circle contain the area of the smaller circle?

A) 49 B) 7π C) 7
D) 49π E) 11π

4. If the radius of the circle is reduced by $33\frac{1}{3}$%, then its circumference is reduced by:

A) 49% B) 25% C) $66\frac{1}{3}$%
D) $33\frac{1}{3}$% E) None of the above

5. Two smaller parks of diameters 24 m and 32 m are to be replaced by a bigger circular park. What would be the radius of the new park, if the new park occupies the same space as the two small parks?

A) 30 m B) 20 m C) 28 m
D) 25 m E) 33 m

6. The area of a circle is $23\frac{43}{56}$ sq m. The length of an arc of the circle which subtends an angle of 45° at the centre is:

A) $2\frac{9}{56}$ m B) $2\frac{43}{56}$ m C) $3\frac{9}{56}$ m
D) $3\frac{43}{56}$ m E) None of the above

7. The length of the common chord of two intersecting circles is 48 cm. If the diameter of the circles are 52 cm and 60 cm, then the distance between the centres is:

A) 25 cm B) 32 cm C) 28 cm
D) 26 cm E) 15 cm

8. An arc on a circle that is $\frac{17}{3}$ cm long subtends 51° angle at the centre. What is the circumference of the circle?

A) $\frac{80}{3}$ cm B) 51 cm C) $\frac{34}{3}$ cm
D) 40 cm E) 88 cm

9. Two circles having radii 15 cm and 10 cm respectively, touch each other externally. A common tangent is drawn to these circles which touches the circles at A and B respectively. What is the length of AB?

A) $10\sqrt{6}$ cm B) $10\sqrt{3}$ cm
C) 12.5 cm D) 25 cm
E) $9\sqrt{7}$ cm

10. A chord of a circle is equal to its radius of length 13 cm. Find the angle subtended by it in major segment?

A) 45° B) 30° C) 60°
D) 52° E) 65°

11. The area of a sector of a circle of radius $\frac{13}{2}$ cm formed by an arc of length $\frac{9}{2}$ cm is..

A) $14\frac{3}{8}$ sqcm B) $14\frac{7}{8}$ sqcm
C) $14\frac{5}{8}$ sqcm D) $14\frac{1}{8}$ sqcm
E) $14\frac{5}{9}$ sqcm

12. The diameter of a circle is 117 cm less than the circumference. What is the length of the diameter of the circle?

A) $54\frac{9}{15}$ cm B) $54\frac{1}{15}$ cm
C) $54\frac{7}{15}$ cm D) $54\frac{14}{15}$ cm
E) $55\frac{7}{15}$ cm

13. The radius of a wheel of a vehicle is 63 cm. The wheel makes 12 revolutions in 8 seconds. The speed of the vehicle is:

A) 21.834 km/hr B) 21.438 km/hr
C) 21.483 km/hr D) 21.384 km/hr
E) None of the above

14. The area of the circle inscribed in an equilateral triangle of side 32 cm is:

A) $\frac{256}{3}$ sqcm B) $\frac{256}{3}\pi$ sqcm
C) 256π sqcm D) $\frac{256}{\sqrt{3}}\pi$ sqcm
E) None of the above

15. A circular disc of area $1.96\pi\ m^2$ rolls down a length of 5.28 km. The number of revolutions it makes is:

A) 600 B) 528
C) 650 D) 575
E) 720

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas, Subject Expert



విదేశాల్లో ఏ కోర్సులు బాగు?

డిగ్రీ ఆనర్స్ పూర్తి చేశాను. విదేశాల్లో చదవాలనుంది. ఎంఎస్- ఎకనామిక్స్/ ఫైనాన్స్, ఎంబీఏ వీటిలో ఏ కోర్సులో చేరితే ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయి? అలాగే ఉత్తమ విద్యా సంస్థల వివరాలు చెప్పండి. - మహావీర్

■ డిగ్రీ ఆనర్స్ పూర్తి చేసిన తర్వాత విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆలోచన అభినందనీయం. ప్రపంచీకరణ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఫైనాన్షియల్ మార్కెట్ల విస్తరణ నేపథ్యంలో ఎకనామిక్స్, ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగావకాశాలు వేగంగా పెరుగుతున్నాయి. అయితే ఎంఎస్ ఎకనామిక్స్, ఎంఎస్ ఫైనాన్స్, ఎంబీఏల్లో ఏది చదవాలి అనేది మీ అకడమిక్ నేపథ్యం, కెరియర్ లక్ష్యం, వృత్తి అనుభవం మీద ఆధారపడి ఉంటుంది.

✦ ఎంఎస్ ఎకనామిక్స్ విశ్లేషణాత్మక, పరిశోధనాత్మక కోర్సు. ఇందులో మ్యాక్రో ఎకనామిక్స్, మైక్రో ఎకనామిక్స్, ఎకనామెట్రిక్స్, డేటా అనాలిసిస్ లాంటి అంశాలు ఉంటాయి. ఈ కోర్సుతో పాలసీ అనలిస్ట్, ఎకనామిక్ కన్సల్టెంట్, రిసెర్చ్ అసోసియేట్, అంతర్జాతీయ సంస్థల్లో(వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్) అవకాశాలు ఉంటాయి. అలాగే పీహెచ్‌డీ లేదా అకడమిక్ కెరియర్ వైపు వెళ్లాలనుకునేవారికి ఇది చాలా అనుకూలం.

✦ ఎంఎస్ ఫైనాన్స్ విదేశాల్లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో ఒకటి. ఫైనాన్షియల్ అనాలిసిస్, కార్పొరేట్ ఫైనాన్స్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, రిస్క్ మేనేజ్‌మెంట్, ఫిన్‌టెక్ రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా అమెరికా, యూకే, కెనడా లాంటి దేశాల్లో బ్యాంకులు, ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు, కన్సల్టింగ్ కంపెనీలు ఎంఎస్ ఫైనాన్స్ గ్రాడ్యుయేట్లను ఎక్కువగా నియమిస్తున్నాయి. డిగ్రీలో మ్యాథ్స్, ఎకనామిక్స్, కామర్స్ నేపథ్యం ఉన్నవారికి ఈ కోర్సు చాలా అనుకూలం.

✦ ఎంబీఏ బిజినెస్, మేనేజ్‌మెంట్, లీడర్‌షిప్‌లకు సంబంధించిన కోర్సు. మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, హెచ్‌ఆర్, స్ట్రాటజీ లాంటి విభాగాల్లో మేనేజీరియల్ ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తుంది. అయితే, విదేశాల్లో పేరున్న విశ్వవిద్యాలయాల్లో చేయాలంటే సాధారణంగా రెండు లేదా మూడేళ్ల వృత్తి అనుభవం అవసరం. అత్యుత్తమ బిజినెస్ స్కూల్స్ నుంచి ఎంబీఏ చేస్తే మంచి వేతనాలూ అందుతాయి. తాజా గ్రాడ్యుయేట్లకు వెంటనే ఉద్యోగం రావాలంటే ఎంబీఏ కంటే ఎంఎస్ ఫైనాన్స్ కొంచెం మెరుగైన ఎంపిక.

ఎంబీఏకు హార్వర్డ్ బిజినెస్ స్కూల్, స్టాన్‌ఫర్డ్, వార్టన్, ఇన్సీడ్, ఐఈఎస్ఈ బిజినెస్ స్కూళ్లు ప్రధానమైనవి. పైన పేర్కొన్న విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని, సరైన నిర్ణయం తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

> ఎంఎస్ ఎకనామిక్స్ కోర్సుకు హార్వర్డ్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, యూనివర్సిటీ ఆఫ్ షికాగో, యూనివర్సిటీ ఆఫ్ టొరంటో బాగుంటాయి.
>
> ఎంఎస్ ఫైనాన్స్ కోసం న్యూయార్క్ యూనివర్సిటీ, కొలంబియా యూనివర్సిటీ, లండన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్‌లలో ప్రయత్నించవచ్చు.

కొలువుల కోటకు నైపుణ్యాల బాట

ఉద్యోగ ప్రపంచం ఎంతో వేగంగా మార్పు చెందుతోంది. విద్యార్థుల ప్రతిభను అంచనా వేయడానికి అకడమిక్ మార్కులు, సర్టిఫికెట్లు సరిపోవడం లేదు. వీటితో పాటు నైపుణ్యాలు ఉంటేనే కొలువుకు మార్గం సులువవుతోంది. అభ్యర్థుల ఎంపికలో దాదాపు సంస్థలన్నీ ఆలోచనా శక్తి, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్యా పరిష్కార సామర్థ్యాలను ఎక్కువగా పరిశీలిస్తున్నాయి.

తార్కిక ఆలోచన, సృజనాత్మకత, టీమ్ వర్క్, సాంకేతిక పరిజ్ఞానం ఇవన్నీ ఉన్నవారే ఉద్యోగాల్లో రాణించగలరని నిపుణుల అభిప్రాయం. ఎలా ఆలోచిస్తున్నారు, సమస్యలను ఏ విధంగా ఎదుర్కోగలరు అనే అంశాలను ఇంటర్వ్యూల్లో పరిశీలిస్తున్నారు. అకడమిక్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు పొందిన అభ్యర్థి కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోయినా, బృందంతో మమేకం కాలేకపోయినా, ఉద్యోగంలో రాణించడం కష్టమవుతుంది. కొంచెం మార్కులు తగ్గినప్పటికీ మంచి కమ్యూనికేషన్, సమస్యా పరిష్కార నైపుణ్యం, నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నవాళ్లు ఉద్యోగం పొందడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోగలరని నియామక సంస్థలు భావిస్తున్నాయి.

◗ పరిశోధనల ప్రకారం 90 శాతం కంటే ఎక్కువ సంస్థలు భిన్న నైపుణ్యాలు ఉన్నవారిని నియమించుకుంటున్నాయి. కొత్త సాంకేతికతను తొందరగా స్వీకరించగల సామర్థ్యం ఉన్న వారికే అవకాశమిస్తున్నాయి. అందువల్ల వీలైనన్ని కొత్త కోర్సులు నేర్చుకోవడంపై విద్యార్థులు దృష్టి సారించాలి.

◗ తాజా నియామక పరిణామాల నేపథ్యంలో విద్యార్థులు మార్కుల కోసమే చదవకుండా కొలువుల్లో కీలకమైన నైపుణ్యాలనూ అభివృద్ధి చేసుకోవాలి. ప్రాజెక్టులు చేయడం, బృంద చర్చల్లో పాల్గొనడం, పబ్లిక్ స్పీకింగ్, కొత్త టెక్నాలజీలను నేర్చుకోవడం లాంటివన్నీ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయి. అలాగని మార్కులతో ఉపయోగం లేదని కాదు. ఇవి క్రమశిక్షణ, స్థిరత్వం, సిలబస్‌ను పూర్తిచేసే సామర్థ్యాన్ని అందిస్తాయి. కానీ ఉద్యోగంలో ఎలా పని చేయాలో చెప్పడానికి మాత్రం సరిపోవడం లేదని నిపుణులు అంటున్నారు. అందువల్ల మార్కులకు నైపుణ్యాలు తోడైతేనే కొలువు పొందడానికి వీలవుతుంది.

◗ ప్రస్తుతం ప్రారంభ స్థాయి ఉద్యోగాలూ గతంతో పోలిస్తే పూర్తిగా మారిపోయాయి. టెక్నాలజీ, ఆటోమేషన్‌ల కారణంగా నైపుణ్యాల లేమితో పని చేయడం దాదాపు కనుమరుగైంది. వెంటనే మేటి నిర్ణయాలు తీసుకోవడం, పనిని మెరుగ్గా అమలు చేయడం వైపు సంస్థలు దృష్టి సారిస్తున్నాయి. దేన్నైనా సమర్థంగా నిర్వహించగల నైపుణ్యం ఉన్నవారినే తీసుకుంటున్నాయి.

◗ ఉద్యోగంలో చేరిన కొద్ది రోజుల్లోనే అభ్యర్థి అసలు సామర్థ్యం తెలిసిపోతుందని నియామక సంస్థలు అంటున్నాయి. అందువల్ల సమస్యలను పరిష్కరించే నైపుణ్యం, స్పష్టంగా రాయగలగడం, కమ్యూనికేషన్, పనిపై శ్రద్ధ, తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవడం ఇవన్నీ అకడమిక్ మార్కుల శాతం కంటే ఎక్కువ ప్రాధాన్యం పొందుతున్నాయి.

◗ నేటి పోటీ ప్రపంచంలో ఏఐ ప్రభావమూ ఎక్కువవుతోంది. కృత్రిమ మేధ సాధనాలు ఈ మార్పును ఇంకా వేగవంతం చేస్తున్నాయి. ఈ-మెయిల్స్ పంపించడం, రిపోర్టులను సమ్మరైజ్ చేయడం, వివిధ ఎంపికలను సెకన్లలో రూపొందించడం ఇప్పుడు సాధారణమైపోయింది. నాన్ టెక్ ఉద్యోగాలకూ సాంకేతిక నైపుణ్యాలను సంస్థలు కోరుతున్నాయి. అందువల్ల విద్యార్థిగా ఉన్నప్పుడే ఉద్యోగానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్నీ పెంపొందించుకోవాలి.



◗ అభ్యర్థి ఆలోచనా విధానం, నైపుణ్యాలు, నేర్చుకునే సామర్థ్యం మీద సంస్థలు ఎక్కువ దృష్టి పెడుతున్నాయి. అందులో ముఖ్యంగా సమాధానాల్లో స్పష్టత ఉండాలి. సమస్యను అర్థం చేసుకుని విశ్లేషించగలగాలి. డిజిటల్ టూల్స్‌ను ఉపయోగించే సామర్థ్యాన్నీ పరిగణనలోకి తీసుకుంటారు. క్లిష్ట సమయాల్లో సొంతంగా నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉండగలగాలి. అప్పుడే అధిక ఒత్తిడిని తట్టుకొని, పనిని సొంతంగా మేనేజ్ చేయగల సామర్థ్యం పెరుగుతుంది.

కాగ్నిటివ్ స్కిల్స్

తార్కిక ఆలోచన, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన.. ఇవన్నీ సమస్యలను విశ్లేషించి, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఉపయోగపడతాయి. సమాచారాన్ని గ్రహించి, అర్థం చేసుకోవడం, గుర్తుంచుకోవడం, ఆలోచించడం, నిర్ణయాలు తీసుకోవడం కాగ్నిటివ్ నైపుణ్యాల్లో భాగమే. .

✦ స్వీయ నిర్వహణ, సానుభూతి, పరస్పర అవగాహన, ధైర్యం, భావోద్వేగాల నియంత్రణ, నైతికత, నిజాయతీ, బాధ్యతలు.. ఇవన్నీ సంస్థల్లో బృందంతో కలిసి పనిచేయడానికి ఎంతో కీలకం.

జీవన నైపుణ్యాలు

వ్యక్తిగత జీవితం, ఉద్యోగ ప్రపంచం రెండిటిలోనూ విజయవంతంగా ముందుకు సాగాలంటే పుస్తక జ్ఞానం మాత్రమే సరిపోదు. ఆలోచనలు, ప్రవర్తన, పని తీరును తీర్చిదిద్దేవి జీవన నైపుణ్యాలు. వీటిద్వారా వ్యక్తిగత జీవితం, చదువు, వృత్తి ఇలా అన్ని రంగాల్లో సమతుల్యత, బాధ్యతతో, సమర్థంగా వ్యవహరించడం వీలవుతుంది..

నిరంతర సాధన..

విద్యార్థులు నిరంతర సాధనను ప్రేరణగా తీసుకోవాలి. ఖాళీగా ఉండకుండా ఏదో ఒక నైపుణ్యం నేర్చుకోవాలి. డిగ్రీలకు నైపుణ్యాలు తోడైతే భవిష్యత్తులో వచ్చే అవకాశాలు సులువుగా దక్కుతాయి. ఉన్న రంగంలోనూ తగిన గుర్తింపు దక్కుతుంది. అలాగే కొత్త సవాళ్లను స్వీకరించి, వాటిని సాధించే సామర్థ్యాలు పెంపొందించుకోవాలి. పని ప్రదేశంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా కుంగిపోకుండా ఓర్పుతో వ్యవహరించాలి. ఎక్కడ ఉద్యోగం చేస్తున్నప్పటికీ..వివిధ దేశాల సంస్కృతులు, భాషలు, ఆచారాలు, విశ్వాసాలు, జీవన విధానాలను అర్థం చేసుకోవడమూ ముఖ్యమే.

డిజిటల్ పరిజ్ఞానం

ఇంటర్నెట్, మొబైల్, కంప్యూటర్, యాప్‌లు, సోషల్ మీడియా లాంటి డిజిటల్ సాధనాల ద్వారా అవసరమైన సమాచారం గ్రహించి, లాభపడవచ్చు. ఉద్యోగం పొందడంలో డిజిటల్ పరిజ్ఞానం ఎంతో మేలు చేస్తుంది. అందువల్ల డిజిటల్ టూల్స్‌పై పట్టు పెంచుకోవడమూ కీలకమే.



కమ్యూనికేషన్ స్కిల్స్

విద్యా నేపథ్యంతో సంబంధం లేకుండా అందరికీ వెర్బల్, రైటింగ్ కమ్యూనికేషన్ రెండూ ఉండాలి. కార్యాలయాల్లో భిన్న నేపథ్యాలు, సంస్కృతుల నుంచి వచ్చినవారితో కలిసి పనిచేయాలి. భాషపై పట్టు ఉండి, ఇతరులకు అర్థమయ్యేలా మాట్లాడాలి. భావాలను స్పష్టంగా, ఎవరినీ నొప్పించకుండా, సరైన రీతిలో చెప్పగలిగే సామర్థ్యం పెంచుకోవాలి.

ఈఐఎల్‌లో డిప్యూటీ మేనేజర్లు

ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్, న్యూదిల్లీ మేనేజీరియల్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: మేనేజర్-2, డిప్యూటీ మేనేజర్ (కాస్ట్ ఇంజినీరింగ్)-2, డిప్యూటీ మేనేజర్ (మెకానికల్/ మెటలర్జీ ఇంజినీరింగ్)-1 ఉన్నాయి.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ డిగ్రీ (బీఈ/ బీటెక్/ బీఎస్సీ)తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వేతనం: నెలకు మేనేజర్‌కు రూ.80,000 - 2,20,000, డిప్యూటీ మేనేజర్ రూ.70,000.
వయసు: మేనేజర్‌కు 36 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 32 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** విద్యార్హతలు, షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూలతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 09.01.2026.
వెబ్‌సైట్: https://engineersindia.com/Index

సీఎస్ఎల్‌లో ప్రాజెక్ట్ అసిస్టెంట్‌లు

కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
పోస్టులు: ప్రాజెక్ట్ అసిస్టెంట్(మెకానికల్): 01, ఆఫీస్ అటెండెంట్: 01
అర్హత: ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు 60 శాతంతో మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా, ఆఫీస్ అటెండెంట్‌కు ఇంటర్మీడియట్‌తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వేతనం: నెలకు ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.24,400; ఆఫీస్ అటెండెంట్‌కు మొదటి ఏడాది. రూ.20,200; రెండో ఏడాది రూ.20,900; మూడో ఏడాది రూ.21,600. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు ఫీజు: జనరల్ రూ.300; ఎస్సీ/ఎస్టీకి ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.01.2026. **వెబ్‌సైట్:** https://cochinshipyard.in/

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

స్టాక్ ట్రేడింగ్ రిసెర్చ్
సంస్థ: సర్టిఫైజ్‌హబ్
నైపుణ్యాలు: అకౌంటింగ్, ఫైనాన్షియల్ లిటరసీ, స్టాక్ ట్రేడింగ్
స్టైపెండ్: రూ.1,500-2,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/bdz9aa9m

క్రియేటివ్ రైటర్
సంస్థ: రియల్ టైమ్ నెట్‌వర్క్ ప్రై.లి.
నైపుణ్యాలు: కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ డైరెక్షన్, మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.15,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/nvfbmnxx

వర్డ్‌ప్రెస్ డెవలప్‌మెంట్
సంస్థ: గెమా ఎడ్యుకేషన్ టెక్నాలజీ ప్రై.లి.
నైపుణ్యాలు: సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, పీహెచ్‌పీ, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఈఓ), వర్డ్‌ప్రెస్
స్టైపెండ్: రూ.1,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/f3xfd8mb

కార్పొరేట్ రిలేషన్స్
సంస్థ: మిపాస్ నైపుణ్యాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం), ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, లింక్డ్‌ఇన్ మార్కెటింగ్, నెట్‌వర్కింగ్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/5cj2c7tx

యూపీఎస్సీ కంటెంట్ క్యూరేటర్
సంస్థ: లాటెక్
నైపుణ్యాలు: అనలిటికల్ థింకింగ్, కోచింగ్, కంపెనీ లా, కంటెంట్ ఎడిటింగ్, కంటెంట్ మేకింగ్, క్రియేటివిటీ, హిస్టరీ, లీగల్ డ్రాఫ్టింగ్, లీగల్ రిసెర్చ్, లీగల్ రైటింగ్, ప్రూఫ్‌రీడింగ్
స్టైపెండ్: రూ.6,000-8,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/3pc6n4nb

ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్
సంస్థ: ఎస్ఏఎస్ గ్రూప్
నైపుణ్యాలు: కొలాబరేషన్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, జనరేటివ్ ఏఐ టూల్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, టీమ్‌వర్క్
స్టైపెండ్: రూ.12,000-15,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/5n96th9f

ఏరోస్పేస్ ఇంజినీరింగ్
సంస్థ: ప్రక్ర డైనమిక్స్
నైపుణ్యాలు: 3డీ మోడలింగ్, అసెంబ్లీ, ఆటోక్యాడ్, ఆటోడెస్క్ 3డీస్ మ్యాక్స్, ఆటోడెస్క్ ఫ్యూజన్ 360, కేటియా, సిమ్యులేషన్ అండ్ మోడలింగ్, సాలిడ్‌వర్క్స్
స్టైపెండ్: రూ.3,500-4,500
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/mwv47dxm

తీర్మానాలు అమలు కావాలంటే..

నూతన సంవత్సరం అనగానే వెంటనే గుర్తుకొచ్చేవి కొత్త తీర్మానాలే. ఎంతో సంతోషంగా ఎన్నో కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుంటాం. అయితే వీటిని విజయవంతంగా అమలు చేయగలిగితేనే మేలు జరుగుతుంది. మీ తీర్మానాలు ఆచరణలోకి రావాలంటే కొన్ని విషయాలపై దృష్టి సారించాలి.



లక్ష్యాలు ఎన్నయినా ఉండొచ్చు. కానీ నిర్ణీత గడువులోగా సాధించాలనే స్పష్టత తప్పనిసరిగా ఉండాలి. ఇది లేకపోతే కొన్ని రోజులు, నెలలు, సంవత్సరాల పాటు వాయిదాలు పడుతూనే ఉంటాయి. ఉదాహరణకు తెల్లవారు జామునే లేచి చదవాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నార నుకుందాం. దాన్ని ఎప్పటి నుంచి అమలు చేయాలనే విషయంలో స్పష్టత ఉండాలి. రేపటి నుంచి అలారం పెట్టుకుని లేవాలని అనుకుంటే దాన్నే కచ్చితంగా అమలు చేయాలి.

సమయ నిర్వహణ

అందరికీ రోజుకు 24 గంటల సమయమే ఉంటుంది. దీనిపై పట్టు సాధిస్తే సగం విజయం సాధించినట్టే. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రణాళిక ఎంతో ముఖ్యం. ఇది లేకపోతే తీసుకున్న నిర్ణయాలు అమలు చేయలేరు. ఏ సబ్జెక్టుకు ఎంత సమయాన్ని కేటాయించాలి, పునశ్చరణకు ఎంత సమయాన్ని వినియోగించాలి, మధ్యలో ఎంత విరామం తీసుకోవాలి.. ఇలాంటివన్నీ కచ్చితంగా అమలు కావాలంటే ప్రణాళిక ఉండాలి.

లక్ష్య విభజన

ఒకేసారి పెద్ద లక్ష్యాన్ని పెట్టుకుంటే సాధించలేనప్పుడు నిరాశచెందే అవకాశం ఉంటుంది. అందుకే చిన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాన్ని సాధించిన తర్వాత మరో లక్ష్యాన్ని స్వీకరించాలి. ఉదాహరణకు కష్టంగా అనిపించే సబ్జెక్టులో ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలనే లక్ష్యాన్ని భాగాలుగా విభజించుకోవచ్చు. ఆ సబ్జెక్టులో వారానికి ఒక ఛాప్టరు చొప్పున పూర్తి చేయాలని తీర్మానించుకోవచ్చు. దీంతో కొన్ని వారాల్లోనే ఆ సబ్జెక్టుపై పూర్తి అవగాహన పొందవచ్చు. ఫలితాలు ఆశించిన విధంగా లేకపోతే లక్ష్యాన్ని సమీక్షించుకోవాలి. వారంలో పూర్తవడం కష్టంగా ఉంటే దాన్ని పది రోజులకు ఒక ఛాప్టర్‌గా మార్చుకోవచ్చు. ఇలా మీ లక్ష్యాలను వాస్తవికతకు అనుగుణంగా మార్చుకుంటే ఆచరణకు వీలవుతుంది. దీంతో మీరెంతో మెరుగవుతారు. ఆత్మ విశ్వాసమూ పెరుగుతుంది.

ఏకాగ్రత

చదివింది అర్థం కావాలన్నా, సబ్జెక్టు మీద పట్టు సాధించాలన్నా ఏకాగ్రత ఎంతో ముఖ్యం. చదవడానికి కూర్చోగానే స్మార్ట్ ఫోన్‌లో నోటిఫికేషన్లు, మెసేజ్‌లు రావడం మొదలుపెడితే దృష్టి అటువైపు మళ్లుతుంది. ఇలాంటి అవాంతరాలు లేకుండా ఉండాలంటే నిర్ణీత సమయాల్లో కచ్చితంగా ఫోన్‌కు దూరంగా ఉండటాన్ని అలవాటు చేసుకోవాలి.

నమ్మకాన్ని పెంచుకోవాలి

కొత్త తీర్మానాలు చేసుకోగానే వెంటనే వాటిని సక్రమంగా అమలు చేయగలుగుతారో లేదోననే సంశయం కూడా మొదలవుతుంది. అప్పటి వరకూ ఒక పద్ధతికి అలవాటు పడిన తర్వాత కొత్త వాటిని ప్రయత్నించడానికి మనసు అంత త్వరగా అంగీకరించకపోవచ్చు. అలాంటప్పుడు ఆత్మవిశ్వాసంతో సంశయాన్ని అధిగమించడానికి ప్రయత్నించాలి. మిమ్మల్ని మీరు నమ్మినప్పుడే మీ లక్ష్యాన్ని చేరుకోగలరు.

పొరపాట్ల నుంచీ

తీర్మానాల అమలు కోసం కృషిచేసే క్రమంలో కొన్ని పొరపాట్లూ జరుగుతుంటాయి. ఇలాంటివి సాధారణమే. అయితే చేసిన తప్పులే పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అంతేగానీ వీటికి భయపడి ప్రయత్నాలను మొదట్లోనే విరమించకూడదు. కొన్నిసార్లు లక్ష్యాలు సాధించలేకపోతున్నామే అనే అపరాధ భావనా వెంటాడవచ్చు. అయితే కుంగిపోకుండా కనీసం ఇక నుంచైనా ఆచరిద్దాం అని ఎవరికి వారే ప్రేరణ తెచ్చుకోవాలి. లక్ష్యాన్ని సమీక్షించుకుని, ఆచరణకు సాధ్యమయ్యేలా మార్చాలి. దీంతో కొన్నాళ్లు ఆలస్యమైనప్పటికీ మీరు ఆశించినవి విజయవంతంగా పూర్తి చేయడం సాధ్యమవుతుంది.

చివరిగా తీర్మానాల్లో ఏవి ఉన్నా లేకపోయినా.. పుస్తక పఠనం, అభిరుచులు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. పుస్తకాలతో కొత్త విషయాలెన్నో తెలుస్తాయి. ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం అభిరుచులు ఎంతో తోడ్పడతాయి. అందుబాటులో ఉన్న కొద్ది సమయంలోనే వీటిని కొనసాగించడానికి ప్రయత్నించాలి. ఇవి అందించే సాంత్వనతో మరింత ఉత్సాహంగా మీ లక్ష్యాల కోసం కృషి చేయడం వీలవుతుంది. ఏడాది తిరిగే సరికల్లా మీ ఆశయం ఫలిస్తుంది.

హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్

జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ (ఎన్‌టీఏ) నిర్వహించే నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్-2026 ప్రకటన వెలువడింది. ఈ ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంక్‌తో దేశవ్యాప్తంగా ఉన్న నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీకి అనుబంధ సంస్థల్లో బీఎస్సీ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. దేశవ్యాప్తంగా సుమారు 12,000కు పైగా సీట్లు ఉన్నాయి. ఈ స్కోరుతో పలు ఇతర సంస్థల్లో ప్రవేశం లభిస్తుంది.
కోర్సు: బీఎస్సీ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్)
అర్హత: ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా 10+2 (ఇంటర్మీడియట్) లేదా తత్సమాన విద్యార్హత.
దరఖాస్తు ఫీజు: జనరల్‌లకు రూ.1000, ఈడబ్ల్యూఎస్‌కు రూ.700, ఎస్సీ/ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్‌లకు రూ.450.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25-01-2026.
పరీక్ష తేదీ: 25.04.2026.
వెబ్‌సైట్: https://exams.nta.nic.in/nchm-jee/

ట్రేడ్ అప్రెంటిస్‌లు

నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్టీల్ లిమిటెడ్ ఛత్తీస్‌గఢ్ అప్రెంటిస్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. **ఖాళీలు:** కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్: 40, వెల్డర్: 20, మెకానికల్ - ఫిట్టర్: 20, ఎలక్ట్రికల్ - ఎలక్ట్రీషియన్: 20.
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు: 30 సంవత్సరాలు మించకూడదు.
స్టైపెండ్: నెలకు రూ.9,600. **ఎంపిక:** ఇంటర్వ్యూతో **ఇంటర్వ్యూ తేదీలు:** జనవరి 12, 13, 14, 15.
వేదిక: ఎన్ఎండీసీ స్టీల్ లిమిటెడ్, నగర్నార్, జగదల్‌పూర్, బస్తర్ జిల్లా, ఛత్తీస్‌గఢ్ - 494001.
వెబ్‌సైట్: https://nmdcsteel.nmdc.co.in/SteelCareers

సీఎస్ఐఆర్ సంస్థలో

సీఎస్ఐఆర్ - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (ఎన్ఐఓ), ముంబయి అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు కోరుతోంది.
టెక్నీషియన్ అప్రెంటిస్‌షిప్ (డిప్లొమా)-04, గ్రాడ్యుయేట్ (నాన్- ఇంజినీరింగ్) అప్రెంటిస్‌షిప్-10 ఖాళీలు
అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీతో పాటు అనుభవం ఉండాలి.
స్టైపెండ్: నెలకు డిప్లొమా టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.8,000, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9,000.
వయసు: డిప్లొమా టెక్నీషియన్స్‌కు 18 నుంచి 24 ఏళ్లు, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 21 నుంచి 26 ఏళ్లు మించకూడదు.
ఇంటర్వ్యూ తేదీ: 08-01-2026
వేదిక: సీఎస్ఐఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, రీజనల్ సెంటర్, లోఖండ్వాలా రోడ్, అంధేరి వెస్ట్, ముంబయి.
వెబ్‌సైట్: www.nio.res.in

ప్రమాదంలో ప్రఖ్యాత పరికరాల భవిష్యత్తు

ఝార్ఖండ్ సంప్రదాయ జానపద సంగీతానికి రాంచీకి చెందిన శివశంకర్ మహ్లీ, రామ్‌ప్రసాద్ మహ్లీ బృందం అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చి పెట్టింది. పొట్లకాయలు, గుమ్మడి కాయలు, కలప, పట్టు దారాలతో వారు మందార్, భువాంగ్ (వేణువు) వంటి ఈ జానపద సంగీత పరికరాలను తయారు చేశారు. వారు దేశంలోనే కాకుండా అమెరికా, కెనడా, తైవాన్, కువైట్, ఫ్రాన్స్‌లలో ప్రదర్శనలిచ్చారు. వారి ప్రదర్శనను అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కూడా మెచ్చుకున్నారు. అయితే వారు ఉపయోగించే మోహన్ వాసి, మురళి, శంకర్ ఘంట, పంచసిన్హా వంటివి కనుమరుగయ్యే ప్రమాదం ఎదుర్కొంటున్నాయి. వాటిని వినియోగించే కళాకారుల సంఖ్య తగ్గిపోతోంది. కొత్త తరానికి ఈ పరికరాలపై అవగాహన ఉండటం లేదు.





పశ్చిమ బెంగాల్‌లోని ధాల్గుడి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కరీముల్ హక్ బైక్ అంబులెన్సుతో ప్రజలకు సేవలందిస్తుంటారు. ఆయన జీవిత చరిత్ర ఆధారంగా ఓ బెంగాలీ సినిమా రాబోతోంది. అందులో దేవ్ హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా అందిన డబ్బుతో కరీముల్ హక్ మరో మంచి పని చేయనున్నారు. ఆసుపత్రి, అనాథాశ్రమాన్ని

సినిమా ద్వారా వచ్చిన డబ్బుతో ఆసుపత్రి, అనాథాశ్రమం!

నిర్మించాలని ఆయన తలపోస్తున్నారు. 1995లో అంబులెన్సు సౌకర్యం లేక తన తల్లి జఫరున్నీసాకు సకాలంలో చికిత్స చేయించలేకపోయారు. ఆమె ఆసుపత్రికి తరలిస్తుండగానే మరణించారు. అప్పటి నుంచి కరీముల్ తన బైక్‌ను అంబులెన్సుగా మార్చేశారు. ఉచితంగా సేవలందిస్తున్నారు. ఇప్పటి దాకా ఆయన 7,000 మంది ప్రాణాలను కాపాడగలిగారు. ఆయన సేవలను గుర్తించి 2017లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని అందించింది. ఆ తర్వాత 2018లో కరీముల్ జీవిత కథను సినిమాగా తీసేందుకు వినయ్ మొద్గల్ కాంట్రాక్టు కుదుర్చుకున్నారు. తొలుత హిందీలో తీద్దామనుకున్నా అది చివరకు బెంగాలీకి మారింది. దేవ్‌ను హీరోగా తీసుకున్నారు. ఇటీవలే కరీముల్ ఇంటిని దేవ్ సందర్శించారు. ఆయన అందిస్తున్న సేవలను చూసి అబ్బురపడ్డారు.

నోట్లతో చాదర్



పంజాబ్‌లోని జాగ్రావ్‌కు చెందిన కొంత మంది రూ.90,000 నోట్లతో తయారు చేసిన 60 అడుగుల చాదర్‌ను ఉత్తరాఖండ్‌లోని రూర్కీలో ఉన్న పైరన్ కలియార్ దర్గాకు సమర్పించారు. ఈ చాదర్‌ను పూలతో అలంకరించారు. దేశంలో శాంతి సౌభాగ్యాలు విలసిల్లాలని కోరుతూ దీనిని సమర్పించినట్లు వారు తెలిపారు. అంతేకాకుండా నాలుగు రోజులపాటు కిచెన్ (లంగర్) ఏర్పాటు చేసి పేదలకు అన్నదానం చేశారు.

పాక్ వ్యాఖ్యలపై భారత్ ఆగ్రహం

దిల్లీ: మన దేశంలో మైనారిటీలు హింసకు గురవుతున్నారంటూ పాకిస్థాన్ నోరుపారేసుకోవడంపై విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్‌లో మైనారిటీలు భయానక రీతిలో, వ్యవస్థాగతంగా అణచివేతకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఆ సంగతి జగద్విదితమని, ఇతరులపై వేలెత్తి చూపడం ద్వారా ఎంత దాచాలని ప్రయత్నించినా మరుగున పడదని వ్యాఖ్యానించారు. భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకల వేళ ఘర్షణలు చోటుచేసుకోవడంపై స్పందించాలని పాక్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి తాహిర్ అంద్రాబీని మీడియా ప్రతినిధులు కోరారు. దీంతో అంద్రాబీ స్పందిస్తూ.. భారత్‌లో మైనారిటీలపై దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్న సంగతి గమనార్హం.

గొంతులో రాయి ఇరుక్కొని ఏడాది బాలుడి మృతి

మలప్పురం: కేరళలోని మలప్పురం జిల్లాలో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. చంగారంకుళం ప్రాంతంలో ఓ ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న ఏడాది బాలుడు పొరపాటున రాయిని మింగేశాడు. మేప్రూస్, రుమానా దంపతుల కుమారుడు అస్లాం నూహ్ ఆదివారం సాయంత్రం వారి ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా రాయిని నోట్లో పెట్టుకున్నాడు. అది గొంతులో ఇరుక్కుపోయి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తింది. బాలుడిని ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అదే రాత్రి మృతిచెందాడు.

తుర్కియేలో కాల్పులు

- ఆరుగురు ఉగ్రవాదులు, ముగ్గురు పోలీసుల మృతి

అంకారా: తుర్కియేలోని వాయువ్య ప్రాంతంలో ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్రవాదులు, పోలీసుల మధ్య సోమవారం ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఆరుగురు ఉగ్రవాదులు, ముగ్గురు పోలీసు అధికారులు మృతిచెందారు. మరో 8 మంది గాయపడ్డారు. ఇస్తాంబుల్‌కు దక్షిణంగా ఉన్న ఎల్వాలీ జిల్లాలోని ఓ ఇంట్లో ఉగ్రవాదులు ఉన్నారన్న నిఘా సమాచారంతో పోలీసులు అక్కడ దాడిచేసిన సందర్భంగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.

బంగ్లా ఎన్నికల బరిలోకి తారిక్ రహ్మాన్

ఢాకా: పదిహేడేళ్ల తర్వాత స్వదేశానికి తిరిగి వచ్చిన బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) తాత్కాలిక ఛైర్మన్ తారిక్ రహ్మాన్ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రెండు చోట్ల నుంచి పోటీ చేయనున్నారు. సోమవారం ఆయన ఢాకా-17 నియోజకవర్గంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. బోగ్రా-6 స్థానం నుంచి కూడా ఆయన పోటీ చేయనున్నారు. ఆ స్థానంలో ఆయన తరఫున బీఎన్‌పీ నేతలు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

క్రైస్తవులపై దాడులను ఖండిస్తూ.. మోదీకి కె.సి.వేణుగోపాల్ లేఖ


దిల్లీ: ఇటీవల క్రిస్మస్ వేళ కొన్ని రాష్ట్రాల్లో క్రైస్తవులపై దాడులు జరగడాన్ని ఖండిస్తూ ప్రధాని మోదీకి కాంగ్రెస్ నేత కె.సి.వేణుగోపాల్ సోమవారం లేఖ రాశారు. రాజ్యాంగం ప్రసాదించిన మత స్వేచ్ఛపై జరిగిన దాడులుగా ఆ ఘటనలను అభివర్ణించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రధాని జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ దాడుల విషయంలో మోదీ మౌనం.. విధ్వంసకారులకు ధైర్యాన్నిస్తోందని విమర్శించారు. దిల్లీ, ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ సహా కొన్ని రాష్ట్రాల్లో క్రైస్తవులపై జరిగిన వరుస దాడుల వల్ల క్రిస్మస్ పర్వదినం స్ఫూర్తి దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేణుగోపాల్ లేఖపై భాజపా ఘాటుగా స్పందించింది. వ్యక్తిగత, ఆస్తి వ్యవహారాల్లో జరిగిన గొడవలకు కొందరు మతం రంగు పులిమారని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి టామ్ వడక్కన్ విలేకర్లతో పేర్కొన్నారు. మోదీ క్రైస్తవులకు దగ్గరవుతుండటాన్ని ఓర్వలేక కె.సి.వేణుగోపాల్ ఆరోపణలు గుప్పిస్తున్నారని అన్నారు.

అతి పెద్ద డ్రగ్స్ కేంద్రంపై దాడి: ట్రంప్

వాషింగ్టన్: దక్షిణ అమెరికాలోని అతి పెద్ద డ్రగ్స్ కేంద్రంపై దాడి చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అయితే దానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించలేదు. వెనెజువెలాపై ఒత్తిడిలో భాగంగా ఈ దాడి చేశామని వివరించారు. డ్రగ్స్‌ను సరఫరా చేసే ఓడలతో ఈ కేంద్రానికి సంబంధం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఓ రేడియో ఇంటర్వ్యూలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. కరీబియన్, తూర్పు పసిఫిక్ సముద్రాల ద్వారా డ్రగ్స్‌ను తరలిస్తున్న పడవలపై దాడులు చేసిన అంశంపై ఈ ఇంటర్వ్యూలో ట్రంప్ చర్చించారు. గత సెప్టెంబరు నుంచి ఇప్పటిదాకా 29 దాడులు చేసినట్లు, 105 మంది మృతి చెందినట్లు గుర్తు చేశారు. 'మీరు చదివారో.. చూశారో నాకు తెలియదు. అది అతి పెద్ద ప్లాంటుగానీ, కేంద్రంగానీ కావొచ్చు. వారు అక్కడి నుంచే డ్రగ్స్‌ను పంపుతున్నారు. పడవలూ అక్కడి నుంచే వస్తున్నాయి. రెండు రాత్రుళ్ల కిందట దానిని ధ్వంసం చేశాం. గట్టిగా కొట్టాం' అని ట్రంప్ తెలిపారు. రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌గానీ, అమెరికా మిలిటరీ సోషల్ మీడియా ఖాతాల్లోగానీ ఈ దాడులకు సంబంధించిన వివరాలను పంచుకోలేదు. వెనెజువెలా ప్రభుత్వ మీడియా కార్యాలయం కూడా ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించలేదు.



దాడి జరిగిన తర్వాత..



పునర్నిర్మించిన తర్వాత..

మేరియుపోల్ కళా కేంద్రం పునరుద్ధరణ

మాస్కో: ఉక్రెయిన్ నగరం మేరియుపోల్‌లో మూడేళ్ల కిందట బాంబు దాడులలో కూలిన కళా కేంద్రాన్ని (థియేటర్) మళ్లీ రష్యా పునర్నిర్మించింది. ప్రస్తుతం ఈ నగరం రష్యా ఆధీనంలో ఉంది. అప్పట్లో ఉక్రెయిన్ ప్రజలు తలదాచుకున్న ఈ కేంద్రంపై 2022 మార్చి 16న రష్యా దాడి చేయడంతో వందల మంది మరణించారు. కళా కేంద్రం ధ్వంసమైంది. ఈ దాడిలో 600 మంది మరణించినట్లు మీడియా ప్రచురించింది. డొనెట్స్క్ అకాడమిక్ రీజనల్ డ్రామా థియేటర్ పేరుతో పునర్నిర్మించిన ఈ కేంద్రంలో ఆదివారం రాత్రి కచేరీ జరిగింది. దీనికి రష్యా పాక్షికంగా ఆక్రమించుకున్న డొనెట్స్క్ రీజియన్ హెడ్ డెనిస్ పుషిలిన్, సెయింట్ పీటర్స్‌బర్గ్ గవర్నర్ అలెగ్జాండర్ బెగ్లోవ్ తదితరులు హాజరయ్యారు.

పుతిన్ ఇంటిపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి యత్నం

మాస్కో: రష్యాలోని నొవ్‌గొరొడ్ ప్రాంత గ్రామంలో ఉన్న పుతిన్ ఇంటిపై ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం డ్రోన్లతో దాడికి ఉక్రెయిన్ ప్రయత్నించింది. మొత్తం 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను ఆ దేశం ప్రయోగించినట్లు రష్యా విదేశాంగ శాఖ మంత్రి లవ్రోవ్ తెలిపారు. అయితే అన్నింటినీ నిర్వీర్యం చేశామని, ఇంటికి ఎటువంటి నష్టం కలగలేదని ఆయన వెల్లడించారు. ఉక్రెయిన్‌పై సరైన సమయంలో దాడి చేసే హక్కు తమకు ఉందని స్పష్టం చేశారు. శాంతి చర్చలకు విఘాతం కలిగించే దాడి ఇదని వ్యాఖ్యానించారు.

ఎస్ఐఆర్ భయంతో గిరిజనుడి ఆత్మహత్య

రఘునాథ్‌పుర్ (పశ్చిమబెంగాల్): ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)లో భాగంగా తన పేరు ఎక్కడ కొట్టేస్తారోనన్న భయం కారణంగా 82 సంవత్సరాల వృద్ధుడు ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పశ్చిమబెంగాల్‌లోని పురులియా జిల్లాలో చోటుచేసుకున్నట్టు పోలీసులు సోమవారం వెల్లడించారు. పారా పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌతాలా గ్రామానికి చెందిన గిరిజనుడైన దుర్జన్ మాఝీ ఈ తీవ్ర చర్యకు పాల్పడ్డాడని వారు వివరించారు. మాఝీ తన ఓటరు నమోదు పత్రాన్ని అధికారులకు సమర్పించాడని, అయితే అధికారులు వివరాల సమీక్ష కోసం రావాల్సిందిగా పిలుస్తూ అతనికి నోటీసు జారీచేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. నోటీసు అందుకున్న నాటి నుంచీ మాఝీ తీవ్ర మానసిక ఒత్తిడి అనుభవించాడని కుటుంబ సభ్యులు వెల్లడించారు. సోమవారం ఉదయం ఇల్లు విడిచి వెళ్లిన మాఝీ మధ్యాహ్నం రైలు పట్టాలపై శవమై కనిపించాడని పోలీసులు చెప్పారు.

మరోవైపు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఓటరు జాబితా ముమ్మర సవరణ కార్యక్రమంలో పాల్గొంటున్న బూత్ లెవెల్ అధికారుల(బీఎల్ఓల) ఆకస్మిక మరణాలపై రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఆవేదన వ్యక్తంచేశారు. ఓ బీఎల్ఓ మృతిచెందడం సమ్మతమే కానీ ఒక చొరబాటుదారుడు మాత్రం సమ్మతం కాదు అన్న విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందా అని సిబల్ తన సోషల్ మీడియా పోస్టులో ప్రశ్నించారు.

పొగమంచుతో మసకబారిన దిల్లీ

దిల్లీ: దట్టమైన పొగమంచు కారణంగా దిల్లీ విమానాశ్రయ అధికారులు సోమవారం 128 విమానాలను రద్దుచేశారు, ఎనిమిదింటిని దారి మళ్లించారు. దిల్లీ నుంచి నడిచే దాదాపు 470 విమాన సర్వీసులు దట్టమైన పొగమంచు కారణంగా ఆలస్యంగా నడిచాయి. వాతావరణం మసకబారడంతో 64 విమానాల రాకలను, అంతే సంఖ్యలో విమానాల పోకను రద్దుచేసినట్టు అధికారి ఒకరు వెల్లడించారు. వాతావరణం తీవ్రంగా మసకబారిన స్థితిలో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. దిల్లీ నుంచి హైదరాబాద్, ముంబయి, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, అహ్మదాబాద్ వంటి ప్రధాన నగరాలకు వెళ్లే విమానాలను పలు సంస్థలు రద్దు చేశాయి. పొగమంచు ప్రభావం రైలు రాకపోకలపై కూడా తీవ్రంగా కనిపించింది. దేశ రాజధానిలోని రైల్వే



స్టేషన్లకు వచ్చే 40కిపైగా రైళ్లు గంటల కొద్దీ ఆలస్యమయ్యాయి. సోమవారం ఉదయం 9 గంటలకు దిల్లీ సగటు వాయు నాణ్యత సూచి(ఏక్యూఐ) 400కి చేరిందని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ) వెల్లడించింది. ఇది తీవ్ర కేటగిరీలోకి వస్తుంది.

డిజిటల్ అరెస్టు అంటూ.. వృద్ధురాలి నుంచి రూ.3.7 కోట్ల కాజేత

- మాజీ సీజేఐ పేరుతో ఆన్‌లైన్‌లో విచారణ నిర్వహించిన ఓ నిందితుడు

ముంబయి: డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ వృద్ధురాలిని భయపెట్టిన కేటుగాళ్లు.. ఏకంగా మాజీ సీజేఐ పేరు చెప్పి ఆన్‌లైన్‌లో నకిలీ విచారణ చేపట్టారు. ఆమె నుంచి రూ.3.7 కోట్లు కాజేశారు. ముంబయిలోని అంధేరీ వెస్ట్ ప్రాంతంలో నివాసముంటున్న 68 ఏళ్ల మహిళకు ఈ ఏడాది ఆగస్టులో ఓ ఫోన్‌కాల్ వచ్చింది. ఆ తర్వాత నుంచి పోలీసులు, సీబీఐ అధికారులంటూ పలువురు ఆమెకు వరుసగా వాట్సప్, వీడియో కాల్స్ చేశారు. ఆమె ఆధార్ కార్డుతో అనుసంధానమై ఉన్న బ్యాంకు ఖాతాలో రూ.6 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిగాయని చెప్పారు. దీనిపై కేసు నమోదైందంటూ ఓ డిజిటల్ కాపీని పంపించారు. అందులో సీబీఐ లోగో, ఇతరత్రా వివరాలు ఉండటంతో నిజమేనని నమ్మిన బాధితురాలు.. వారు అడిగినట్లు తన సొంత బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర ఆస్తుల గురించి చెప్పారు. ఈ కేసులో డిజిటల్ అరెస్టు చేశామని నమ్మించిన నిందితులు.. ఆన్‌లైన్‌లో విచారణకు హాజరవ్వాలని బెదిరించారు. కొన్ని రోజుల తర్వాత సుప్రీంకోర్టు మాజీ సీజేఐ పేరుతో ఓ వ్యక్తి ఆమెను విచారించి.. ఈ కేసులో బెయిల్ నిరాకరిస్తున్నట్లు చెప్పాడు. అంతేకాదు.. తన వద్ద ఉన్న డబ్బంతా వెరిఫికేషన్ కోసం సీబీఐకి డిపాజిట్ చేయాలని న్యాయమూర్తిగా నటించిన వ్యక్తి ఆదేశించాడు. బాధితురాలు చేసేదేం లేక.. వారు సూచించిన పలు బ్యాంకు ఖాతాలకు డబ్బు బదిలీ చేశారు. అలా ఈ ఏడాది అక్టోబరు వరకు పలు దఫాలుగా దాదాపు రూ.3.71 కోట్ల వరకు పంపారు. ఆ మొత్తాన్ని వెరిఫై చేసి తిరిగి అప్పగిస్తామని బాధితురాలిని నమ్మించిన కేటుగాళ్లు.. ఆ తర్వాత వృద్ధురాలిని సంప్రదించడం మానేశారు. మోసపోయానని గ్రహించిన ఆమె పోలీసులను ఆశ్రయించారు. వృద్ధురాలు బదిలీ చేసిన డబ్బులో అధిక మొత్తం గుజరాత్‌లోని ఓ వ్యక్తి ఖాతాలో జమ అయినట్లు పోలీసులు గుర్తించారు. అతణ్ని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.



పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ట్రామ్ సేవలు మొదలై 152 ఏళ్లు అవుతున్న సందర్భంగా సోమవారం స్థానిక టెర్మినస్‌లో సంబరాల్లో పాల్గొన్న మహిళలు

'రచనాత్మక కాంగ్రెస్' అధ్యక్షుడిగా సందీప్ దీక్షిత్

దిల్లీ: పౌర సమాజం, నిపుణులు, విద్యావేత్తలతో పార్టీ బంధాన్ని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ఏర్పాటు చేసిన 'రచనాత్మక కాంగ్రెస్'కు అధ్యక్షుడిగా సీనియర్ నేత సందీప్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈ రచనాత్మక కాంగ్రెస్‌ను గతంలో 'అవుట్‌రీచ్ సెల్' అని పిలిచేవారు. విధాన నిర్ణయాలు, సామాజిక సమస్యలపై వివిధ సమూహాలు, వ్యక్తులతో ఎప్పటికప్పుడు అనుసంధానమవ్వడానికి, వారి అభిప్రాయాలను తెలుసుకోవటానికి ఈ వేదికను కాంగ్రెస్ ఉపయోగించుకుంటుంది. దీక్షిత్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ నియామకం సత్వరం అమల్లోకి వస్తుందని పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది.

నితిన్ నబీన్‌కు దిల్లీలో అధికారిక బంగ్లా!

దిల్లీ: భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు దిల్లీలో ప్రభుత్వ బంగ్లా కేటాయించే అవకాశం ఉంది. ఆయనకు లుట్యెన్స్ దిల్లీలోని 9- సునెహ్రీ బాగ్ నివాసాన్ని కేటాయించనున్నారని అధికార వర్గాలు తెలిపాయి. వచ్చే నెలలో ఆయన దీనిలోకి మారే అవకాశం ఉంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో సహా పలువురు ప్రముఖ నేతలు సునెహ్రీబాగ్ రోడ్డులో అధికారిక బంగ్లాల్లో నివాసం ఉంటున్నారు. బిహార్‌లో నీతీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో మంత్రిగా చేసిన నబీన్.. త్వరలో భాజపా సారథి అయ్యే అవకాశాలున్నాయి.

ఇరాన్ సెంట్రల్ బ్యాంక్ అధిపతి రాజీనామా

టెహ్రాన్: ఇరాన్ కరెన్సీ (రియాల్) విలువ గణనీయంగా పడిపోవడంతో దేశ సెంట్రల్ బ్యాంక్ అధిపతి మొహమ్మద్ రెజా ఫర్జిన్ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. కరెన్సీ పరిస్థితిపై టెహ్రాన్ సహా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తుతున్నవేళ ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రదర్శనల్లో వందలమంది వ్యాపారాలు పాల్గొంటున్నారు. 1979లో రాచరిక పాలనకు స్వస్తిపలికి ఇస్లామిస్టులను అధికారంలోకి తీసుకురావడంలో వ్యాపారులు కీలక పాత్ర పోషించారు. టెహ్రాన్‌లో కొన్నిచోట్ల నిరసనకారుల్ని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. తాజాగా డాలరు విలువ 13.8 లక్షల రియాల్స్‌కు చేరింది. 2022లో ఫర్జిన్ బాధ్యతలు తీసుకున్న సమయానికి ఇది 4.30 లక్షల రియాల్స్‌గా ఉండేది.

చైనీయులకు నేపాలీ వధువుల విక్రయం!

బీజింగ్: చైనాలో ప్రతి 104 మంది పురుషులకు 100 మంది స్త్రీలే ఉండటంతో విదేశీ వధువుల కొనుగోలు ఎక్కువైంది. ఇంతకుముందు లావోస్, మయన్మార్, వియత్నాంల నుంచి యువతులను అక్రమంగా చైనాకు రవాణా చేసి వధువులుగా విక్రయించిన ఘటనలు చాలానే వెలుగులోకి వచ్చాయి. ఇప్పుడు ఈ చట్టవిరుద్ధ చైనీస్ పెళ్లిళ్ల పేరయ్యల దృష్టి నేపాల్ వధువులపై పడినట్లు హాంకాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక బయటపెట్టింది. ఈ అక్రమ సీమాంతర వివాహాల బ్రోకర్ల మీద నేపాల్ ప్రభుత్వం విరుచుకుపడుతోంది. రాజధాని కాఠ్‌మాండూలో అద్దె ఇళ్లలో చైనా జాతీయులతో నివసిస్తున్న నేపాలీ యువతుల సంగతి గత నెలలో సర్కారు దృష్టికి వచ్చింది. ఈ యువతులను చైనీయులు వీడియో తీసి చైనాలోని తమ మిత్రులకు పంపుతున్నారు. ఆన్‌లైన్‌లో కూడా పోస్ట్ చేస్తున్నారు. వీసా ఉల్లంఘనలు ఉల్లంఘించారని నలుగురు చైనీయులను వెనక్కు పంపేశారు. నేపాల్‌లోని చైనా రాయబార కార్యాలయం కూడా నేపాల్‌లో వధువుల కొనుగోలుపై పారాహుషార్ అని శుక్రవారం తమ దేశవాసులను హెచ్చరించింది. అక్రమ పెళ్లిళ్ల పేరయ్యలను, మ్యాట్రిమోనీ సంస్థలను నమ్మవద్దనీ, అవి చేసే సీమాంతర వ్యాపారం చట్టవిరుద్ధమని పేర్కొంది. ఇలాంటి అక్రమ వివాహాల వల్ల సాంస్కృతికంగా, చట్టపరంగా, ఆస్తుల పంపకం, బిడ్డల సంరక్షణ పరంగా చిక్కులు వస్తాయని తెలిపింది. కొన్ని సంస్థలు నేపాలీ వధువులు కావాలంటే 5000 యువాన్ల నుంచి 1,88,000 యువాన్ల వరకు వసూలు చేస్తున్నాయి.

అన్నమయ్య జిల్లాలో 24 మండలాలు

ఈనాడు, అమరావతి: కొత్త జిల్లాల ఏర్పాటు, మార్పులు, చేర్పులకు మంత్రివర్గం సోమవారం ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల భౌగోళిక స్వరూపాలు మారనున్నాయి. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల్లోని 19 మండలాలతో తొలుత మదనపల్లె జిల్లా ప్రతిపాదించారు. తాజాగా రాయచోటి నియోజకవర్గం కూడా ఇందులోకి రానుంది. దీంతో అన్నమయ్య జిల్లాలో 24 మండలాలు అవుతాయి.
✦ కడప జిల్లాలో ప్రస్తుతం 36 మండలాలున్నాయి. అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం పరిధిలో ఉన్న మండలాలను కడపలో చేర్చాలని నిర్ణయించటంతో ఈ జిల్లాలో మండలాల సంఖ్య 40కి పెరగనుంది.
✦ రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లా నుంచి తిరుపతిలో చేరుస్తున్నారు. దీంతో తిరుపతి జనాభా 29.47 లక్షలకు చేరనుంది. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన జిల్లాగా నిలవనుంది. ✦ అల్లూరి సీతారామరాజు జిల్లాలో అంతర్భాగంగా ఉన్న రంపచోడవరం నియోజకవర్గాన్ని విభజించి.. ప్రత్యేకంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో రాష్ట్రంలో అత్యల్ప జనాభా కలిగిన జిల్లాగా పోలవరం నిలవనుంది. 12 మండలాలు, 3.50 లక్షల జనాభాతో ఈ జిల్లా ఏర్పాటు కానుంది. ✦ తిరుపతి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో 36 చొప్పున మండలాలు ఉన్నాయి.

ముందుగానే కాళింగి పనులు పూర్తి చేయడానికి ఆమోదం

ఈనాడు, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుగా మారనున్నాయి. ఇందుకు సంబంధించి చట్ట సవరణకు ఆర్డినెన్స్ జారీ కోసం చేసిన ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది. మంత్రి మండలిలో తీసుకున్న మరికొన్ని నిర్ణయాలివీ..
✦ జీవీఆర్ సంస్థ కాళింగి నది ఒడ్డున ఎడమవైపు ఫ్లడ్ బ్యాంకు అభివృద్ధి పనుల్లో భాగంగా ప్యాకేజీ-1 కింద చేపడుతున్న వాటిని నిర్దేశించిన సమయం కంటే ముందుగానే పూర్తి చేసేందుకు ఆమోదం. ✦ ఈ-కోర్ట్స్ ప్రాజెక్ట్ కింద రాష్ట్రంలోని 13 జిల్లా కోర్టుల్లో 13 సిస్టమ్ ఆఫీసర్ (రూ.40,970-రూ.1,24,380), 26 సిస్టమ్ అసిస్టెంట్ (రూ.25,220-రూ.80,910)ల నియామకానికి ఆమోదం. ప్రస్తుతం కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న సిబ్బందిని కొత్త పోస్టుల్లో విలీనం చేయనున్నారు. మిగతా ఖాళీల్ని కాంట్రాక్ట్ విధానంలోనే భర్తీ చేస్తారు. ✦ బాపట్లలో తెదేపా జిల్లా కార్యాలయ నిర్మాణానికి 2 ఎకరాల్ని 33 ఏళ్ల లీజు కేటాయింపునకు ఆమోదం. ఏడాదికి ఎకరాకు రూ.1000 చొప్పున లీజు చెల్లింపు. ✦ హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ఫేజ్-1, స్టేజ్-1 కింద పంపింగ్ స్టేషన్లకు సంబంధించి ఇండక్షన్ మోటార్లలో పెరిగిన మెగావాట్ కెపాసిటీ కోసం అదనపు ఖర్చు కింద రూ.76 లక్షలు చెల్లించేందుకు ఆమోదం. ✦ హైకోర్టు తీర్పు మేరకు సూపర్ న్యూమరరీ పోస్టును సృష్టించి కె.సురేశ్‌కుమార్‌ను అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా నియమించి, ఆయన బ్యాచ్‌మేట్లతో సమానంగా సీనియారిటీ, ఇతర ప్రయోజనాలు కల్పిస్తూ నిర్ణయం.

హోరాహోరీగా ఏపీ సచివాలయ సంఘం ఎన్నికలు

- ఎక్కువ పదవులు రామకృష్ణ ప్యానెల్‌కే
- రాజేశ్ ప్యానెల్ నుంచి ప్రధాన కార్యదర్శిగా నాపా ప్రసాద్ విజయం

ఈనాడు, అమరావతి: ఏపీ సచివాలయ (ఉద్యోగుల) సంఘం ఎన్నికలు సోమవారం హోరాహోరీగా సాగాయి. ఉదయం నుంచి ఓటింగ్ జరిగింది. మొత్తం 1,159 ఓట్లకుగాను 1,105 ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఓట్ల లెక్కింపు నిర్వహించారు. అధ్యక్షుడిగా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా పవన్ కుమార్ ఎన్నికయ్యారు. ఆయన ప్యానెల్ ఎక్కువ స్థానాలను దక్కించుకుంది. ఉపాధ్యక్షులుగా(మహిళ) ఎం.లక్ష్మణకుమారి, సంయుక్త కార్యదర్శిగా (ఆర్గనైజింగ్) కేవీ రాజేంద్రప్రకాష్, సంయుక్త కార్యదర్శిగా(మహిళ) పి.సునీత, సంయుక్త కార్యదర్శి (స్పోర్ట్స్)గా ఇ.మధుబాబు విజయం సాధించారు. కోట్ల రాజేశ్ ప్యానెల్‌కు చెందిన నాపా ప్రసాద్ 6 ఓట్ల ఆధిక్యంతో ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు. అదే ప్యానెల్‌కు చెందిన బి.లింగారెడ్డి అదనపు కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

అంటువ్యాధుల నియంత్రణకు..'ప్రత్యేక టాస్క్‌ఫోర్స్'

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అంటువ్యాధుల నివారణ, నియంత్రణ చర్యల సమర్థ అమలుకు ప్రభుత్వం 24 మంది సభ్యులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా వైద్య ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జి.వీరపాండియన్ వ్యవహరిస్తారు. సభ్యులుగా జాతీయ స్థాయి వైద్య సంస్థల నిపుణులతోపాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య, పశు సంవర్ధక, పంచాయతీరాజ్, పురపాలన, వ్యవసాయ శాఖ అధికారులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఆకస్మికంగా వ్యాధులు వ్యాప్తి చెందితే తక్షణ చర్యలపై సమగ్ర అధ్యయనం చేసి వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందిస్తుంది. ఆసుపత్రుల సన్నద్ధత, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల అమలు, ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాల విధులు తదితర అంశాలపై దృష్టిసారిస్తుందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అధిక వడ్డీ వచ్చేచోటే డిపాజిట్ చేయండి

ప్రభుత్వ రంగ సంస్థల సొమ్ముపై ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు తమ వద్ద పెట్టుబడులను అంచనా వేసి, వాటిని తక్షణమే అధిక వడ్డీతో, ఉత్తమ రాబడి వచ్చే చోట్ల మళ్లీ పెట్టుబడులు పెట్టడంపై అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ రంగ సంస్థలైన కార్పొరేషన్లు, సొసైటీలు, బోర్డులు, ట్రస్టులు, సంస్థలు, విశ్వవిద్యాలయాలు, స్పెషల్ పర్పస్ వెహికల్స్ వంటివి వివిధ ఆర్థిక సంస్థలు, కమర్షియల్ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటాయని, అలాగే ఈ ప్రభుత్వ రంగ సంస్థలు తమ వద్ద ఉన్న అదనపు నిధులను అదే బ్యాంకుల వద్ద డిపాజిట్లు చేస్తున్నాయని, వాటికి 5 నుంచి 7 శాతమే వడ్డీ వస్తోందని గమనించినట్లు ప్రభుత్వం పేర్కొంది. అందుకే ఎక్కువ వడ్డీ ఇచ్చే ఇతర షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు, గతంలో ఏపీ ప్రభుత్వం స్థాపించిన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో డిపాజిట్లు చేయడంపై తక్షణమే దృష్టి సారించాలని ఆదేశించింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ సోమవారం ఉత్తర్వు జారీచేశారు.

'ఎస్సీ, ఎస్టీలకు ఎంఎస్ఎంఈ పార్కులు కేటాయించాలి'

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తోన్న 175 ఎంఎస్ఎంఈ పార్కుల్లో.. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్లు, డెవలపర్లకు 25 పార్కులు కేటాయించాలని దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు మామిడి సుదర్శన్ కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రియాంక, రాహుల్ శిబిరాలుగా కాంగ్రెస్ చీలిపోయింది: భాజపా

దిల్లీ: కాంగ్రెస్ పార్టీ రెండుగా విడిపోయిందని భాజపా తెలిపింది. వీటిలో ఒకటి ప్రియాంకా గాంధీ వాద్రా శిబిరం, మరొకటి ఆమె సోదరుడు రాహుల్ గాంధీ శిబిరమని పేర్కొంది. రాహుల్ గాంధీ స్థానంలో వేరొకరిని నియమించాలనే డిమాండ్ ఆ పార్టీలో ఉందని తెలిపింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, విదేశీ గడ్డపై భారత్‌ను అప్రతిష్ఠపాల్జేస్తున్నారని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మండిపడ్డారు.





ముఖ్యమంత్రి చంద్రబాబును సన్మానిస్తున్న ఏపీ జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్, నేతలు ★ చంద్రబాబుతో ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు, నేతలు ★ టీఎన్‌యూఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, ఏపీజీఈఏ ఛైర్మన్ సూర్యనారాయణ తదితరులు

కొత్త ఏడాదిలో నూతనోత్సాహంతో పనిచేద్దాం

- ఉద్యోగ సంఘాల నేతలతో సీఎం చంద్రబాబు
- పలు సంఘాల క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరణ

ఈనాడు, అమరావతి: వచ్చే ఏడాదిలో మరింత ఉత్సాహంతో స్వర్ణాంధ్ర సాధనకు పని చేద్దామని ఉద్యోగులకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ప్రాధాన్యమిస్తుందని, సమష్టి భాగస్వామ్యంతో రాష్ట్రాభివృద్ధిలో మీరంతా ముఖ్య భూమిక పోషించాలని పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్లపై పూర్తి అవగాహన, స్పష్టమైన దృష్టి ఉన్నాయని, దశల వారీగా అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేస్తూనే ఉద్యోగుల హక్కులు కాపాడేలా నిర్ణయాలు తీసుకుంటామని సీఎం వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఏపీఎన్జీవో, ఏపీ ఐకాస, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏపీఎన్జీవో, ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా), ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్), తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం, రెవెన్యూ, ఆర్టీసీ ఈయూ, కోఆపరేటివ్, ప్రధానోపాధ్యాయులు, కార్మిక అధికారులు, పీఆర్ ఇంజినీర్లు.. తదితర సంఘాల డైరీలు, క్యాలెండర్లను సీఎం ఆవిష్కరించారు. ఉద్యోగినుల ఛైల్డ్ కేర్ లీవ్‌కు సంబంధించిన వయోపరిమితిని తొలగించినందుకు ఏపీఎన్జీవో, ఏపీ ఐకాస అమరావతి నేతలు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల హామీపై వెంటనే ఉత్తర్వులు ఇచ్చినందుకు ఆర్టీసీ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉద్యోగ సంఘాల నేతలు విద్యాసాగర్, బొప్పరాజు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, భూపతిరాజు రవీంద్రరాజు తదితరులు ఉన్నారు.

అన్ని ఆలయాల్లో శ్రీవారి సేవకుల తరహా విధానం

- వాలంటీర్ల విధానాన్ని ప్రోత్సహించాలి
- సమీక్షలో సీఎం ఆదేశాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో శ్రీవారి సేవకుల తరహా విధానాన్ని అమలు చేయాలని సీఎం చంద్రబాబు దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్టీజీఎస్ నుంచి రెవెన్యూ, వ్యవసాయం, పౌర సరఫరాలు, వైద్యం, రవాణా, అగ్నిమాపక, దేవాదాయ శాఖల పనితీరును సోమవారం ఆయన సమీక్షించారు. 'రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో స్థానికంగా వాలంటీర్లను నియమించుకోవాలి. వారిని ప్రోత్సహించి, తగిన గుర్తింపు ఇవ్వాలి. శ్రీశైలంలోనూ తిరుమల తరహా విధానం అమలవుతుంది. రాష్ట్రంలో అన్ని ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు ఉండాలి. వాటిలో రోజువారీ అంశాలపై కలెక్టర్లు దృష్టి పెట్టాలి. ప్రజలు నిత్యం సందర్శించే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వాసుపత్రుల్లో పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. భూముల సర్వేలో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రెవెన్యూ యంత్రాంగం పనిచేయాలి. పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించి, మట్టిలో పోషక విలువల గురించి రైతులకు తెలపాలి. ఎక్కువ యూరియా వినియోగిస్తే వచ్చే నష్టాలను, ప్రజారోగ్యం దృష్ట్యా పంటల సాగులో పాటించాల్సిన విధానాలను వారికి వివరించాలి. ధాన్యం కొనుగోళ్లలో ఫిర్యాదు రాకుండా చూడాలి. ఎక్కడైనా మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. మెరుగైన ప్రజారోగ్యం కోసం వ్యవసాయ, వైద్యారోగ్య శాఖలు కలిసి పనిచేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలి' అని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ పనితీరు బాగుందని సీఎం అభినందించారు.

కోనేరు హంపి, అర్జున్ ఇరిగేశిలకు చంద్రబాబు అభినందనలు

ఈనాడు, అమరావతి: దోహాలో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు సాధించిన తెలుగు తేజాలు కోనేరు హంపి, అర్జున్ ఇరిగేశిలకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. వారి విజయం దేశానికి గర్వకారణమని కొనియాడారు.

తెలుగు తేజాలు హంపీ, అర్జున్‌కు పవన్‌కల్యాణ్ అభినందనలు

ఫిడే ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు సాధించిన కోనేరు హంపి, అర్జున్ ఇరిగేశిలకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. 'కోనేరు హంపీ అత్యున్నత స్థాయిలో చూపుతున్న స్థిరమైన ప్రదర్శన ఆమె ప్రతిభకు నిదర్శనం. అర్జున్ ప్రదర్శన.. ఆట పట్ల అతని అంకితభావం, ఆత్మస్థైర్యం, నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. రాబోయే టోర్నమెంట్లలోనూ మరిన్ని విజయాలు సాధించాలి' అని పవన్‌కల్యాణ్ ఆకాంక్షించారు.

యువ ఆటగాళ్లకు ప్రేరణ: జగన్

ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు సాధించిన కోనేరు హంపి, అర్జున్ ఇరిగేశిలకు మాజీ ముఖ్యమంత్రి జగన్ అభినందనలు తెలిపారు. 'మీ పోరాట స్ఫూర్తి చాలా మంది యువ చెస్ ఆటగాళ్ల ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు ప్రేరేపిస్తాయి' అని సోమవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

ఏపీ క్యాడర్‌కు 8 మంది యువ ఐపీఎస్‌లు


ఈనాడు, అమరావతి: 2023 బ్యాచ్‌కు చెందిన 8 మంది యువ ఐపీఎస్ అధికారులను కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది. ఈ జాబితాలో 1.అశ్విన్ మణిదీప్ కాకుమాను(ఆంధ్రప్రదేశ్), 2.జీను శ్రీ జశ్వంత్ చంద్ర(తెలంగాణ), 3.జీబీఎల్ఏ ప్రత్యూష(ఆంధ్రప్రదేశ్), 4.తరుణ్(హరియాణా), 5.జయ శర్మ(దిల్లీ), 6.నిరంజన్ మహేంద్ర సింగ్(మహారాష్ట్ర), 7.బన్న వెంకటేశ్(ఆంధ్రప్రదేశ్), 8.తరుణ్ ప్రతాప్ మౌర్య(ఉత్తర్‌ప్రదేశ్) ఉన్నారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలో వీరు సాధించిన ఫలితాల ప్రాతిపదికన క్యాడర్ కేటాయింపులు పూర్తి చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ అండర్ సెక్రటరీ సంజీవ్‌కుమార్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర గెజిట్‌లో ప్రచురిస్తూ సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పట్టణాల్లో రూ.25 కోట్లతో షేర్డ్ సర్వీస్ సెంటర్లు

ఈనాడు, అమరావతి: పట్టణాల్లో మున్సిపల్ షేర్డ్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటుకు 15వ ఆర్థిక సంఘం నిధుల్లో నుంచి రూ.25 కోట్లను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఆర్థిక సంఘం సిఫార్సులపై ఈ నిధులు కేటాయిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలకు వివిధ సేవలు మరింత మెరుగ్గా అందించే ఉద్దేశంతో షేర్డ్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. మున్సిపల్ ఆస్తుల సంరక్షణ, వాటి ద్వారా ఆదాయ సమీకరణ తదితర అంశాల్లోనూ ఈ సెంటర్లు సేవలు అందించనున్నాయి.

ఎస్ఎస్ఏలో డిప్యుటేషన్లకు ఎస్పీడీ అనుమతి తప్పనిసరి

ఈనాడు, అమరావతి: సమగ్రశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ప్రాజెక్టు డైరెక్టర్ అనుమతి లేకుండా జిల్లా కార్యాలయాల్లో ఎవరినీ డిప్యుటేషన్లపై తీసుకోవద్దని ఎస్ఎస్ఏ ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కార్యాలయాల్లో అదనపు ప్రాజెక్టు సమన్వయకర్తలు ఇతర శాఖల నుంచి సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఎస్పీడీ అనుమతి లేకుండా ఎవరినైనా తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యుటేషన్‌కు సంబంధించిన దస్త్రాన్ని రాష్ట్ర కార్యాలయానికి పంపించాలని సూచించారు.



2026లో ఇలా బరువు తగ్గండి

✦ పండ్ల రసాలు, షేకులు, మద్యం తాగొద్దు ✦ పగటి పూట బ్లాక్ కాఫీని సేవించండి ✦ భోజనం చేసిన ప్రతిసారీ 15 నిమిషాలు నడవండి ✦ రోజుకు కనీసం 7,000 అడుగుల నడకను లక్ష్యంగా పెట్టుకోండి ✦ ఉదయపు అల్పాహారంలో పిండిపదార్థాలు వద్దు ✦ వారంలో 3-4రోజులు వ్యాయామశిక్షణ పొందండి ✦ రోజూ కనీసం 80-120 గ్రాముల ప్రొటీన్ తీసుకోండి ✦ రోజూ మీరు తీసుకునే ఆహారంలో 500-800 కేలరీలకు కోత పెట్టండి ✦ వారానికి రెండు రోజులు కార్డియో వ్యాయామం చేయండి

– అభి రాజ్‌పుత్, ఫ్యాట్ లాస్ కోచ్

వచ్చే ఏడాది నుంచి పదో తరగతి మార్కుల జాబితాల్లో ఒకేషనల్ మార్కులు

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం (2026-27) నుంచి పదో తరగతి మార్కుల జాబితాలో ఒకేషనల్ సబ్జెక్టు మార్కులను చేర్చనున్నట్లు సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఇక నుంచి మార్కులు గ్రేడింగ్‌లో వృత్తివిద్య కోర్సు కీలక పాత్ర పోషించనుందని వెల్లడించారు. విజయవాడలో సోమవారం రాష్ట్ర స్థాయి నైపుణ్య పోటీలు నిర్వహించారు. 26 జిల్లాల నుంచి 10 ట్రేడ్లలో 260 ప్రాజెక్టులు పోటీలో పాల్గొన్నాయి. ఈ పోటీల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో అన్ని ఉన్నత పాఠశాలల్లో ఒకేషనల్ ఎడ్యుకేషన్‌ను ప్రవేశపెట్టేందుకు బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. వృత్తి విద్యను ఒక అదనపు సబ్జెక్టుగా కాకుండా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా మార్చాలని నిర్ణయించాం' అని తెలిపారు. వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందిన విద్యార్థులు స్వయంగా తాము రూపొందించిన దుస్తులు ధరించి ర్యాంప్ వాక్ చేశారు.

●పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ట్రేడ్ వారీగా ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు చొప్పున నగదు, పతకాలు అందించారు.

గుర్తింపు కార్డు నిబంధన తొలగించాలి: ఈయూ

ఈనాడు-అమరావతి: స్త్రీశక్తి పథకం కింద ప్రయాణిస్తున్న మహిళల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు పెద్దగా లేనందున.. మహిళలు ఏదైనా గుర్తింపు కార్డు చూపించాలనే నిబంధన తొలగించాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) కోరింది. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేసినట్లు ఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య తెలిపారు. దీని వల్ల కండక్టర్లపై ఒత్తిడి తగ్గుతుందని, బస్సెక్కిన ప్రతి మహిళకు సులువుగా స్త్రీశక్తి పథకం టికెట్ జారీ చేసేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్నందున ఆర్టీసీ సొంతంగా 3,000 బస్సులు కొనుగోలు చేయాలని, 10,000 మందిని నియమించాలని కోరినట్లు తెలిపారు. విద్యుత్ బస్సులను ప్రభుత్వ సహకారంతో కొనుగోలు చేసి, నిర్వహించేలా చూడాలని, సంస్థలో పనిచేస్తున్న 8,000 మంది పొరుగు సేవల ఉద్యోగులకు తగిన ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ఎంయూఏ క్యాలెండర్ ఆవిష్కరించిన సీఎం

నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ)కు చెందిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఏపీ జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్‌తోపాటు, ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షులు వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు సీఎంను కలిసి క్యాలెండర్ ఆవిష్కరణ చేయించారు.

ఇ-13 రోడ్డు నిర్మాణానికి అటవీ భూమి మళ్లింపునకు అనుమతి

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిని యర్రబాలెం నుంచి చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారితో (ఎన్‌హెచ్-16) అనుసంధానించే ఇ-13 రోడ్డు నిర్మాణం కోసం ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ పేరిట అటవీ భూమి మళ్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. యర్రబాలెం నుంచి ఎన్‌హెచ్-16 వరకు 3.54 కి.మీ. మేర నిర్మించబోయే ఈ మార్గంలో కొంతమేర అటవీ ప్రాంతముంది. సుమారు కిలోమీటరు పొడవున కొండలపై ఘాట్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. దీని కోసం గుంటూరు డివిజన్‌లోని తాడేపల్లి రక్షిత అటవీ ప్రాంతం కంపార్ట్‌మెంట్ నంబరు 132లో 0.21 హెక్టార్ల అటవీ భూమి మళ్లింపు కోసం కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు దరఖాస్తు చేసుకోగా అక్కడి నుంచి అనుమతి లభించింది. ఈ నేపథ్యంలో ఆ భూమిని సీఆర్‌డీఏ కమిషనర్ పేరిట బదిలీ చేస్తూ పీసీసీఎఫ్‌కు అనుమతిస్తూ అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విశాఖలో నాలుగు ఇండిగో విమానాలు రద్దు

విశాఖపట్నం(ఎన్ఏడీకూడలి), న్యూస్‌టుడే: ఇండిగో సంస్థలో నెలకొన్న కార్యకలాపాల నిర్వహణ కారణాల వల్ల సోమవారం ఒక్కరోజే నాలుగు విమానాలు రద్దయినట్లు విశాఖపట్నం విమానాశ్రయ డైరెక్టర్ పురుషోత్తం, ఇండిగో స్టేషన్ మేనేజర్ చాణిక్య తెలిపారు. బెంగళూరు-విశాఖ (6ఇ 217/6ఇ218), హైదరాబాద్-విశాఖ (6ఇ6408/6ఇ779, 6ఇ 6227/6ఇ216, 6ఇ6285/6ఇ6286) విమానాలు రద్దు అయినట్లు పేర్కొన్నారు.

అరకొర సిబ్బంది.. అడపాదడపా తనిఖీలు

- నిర్వహణను గాలికొదిలేసిన గుత్తేదారులు
- రైల్వే శాఖ పర్యవేక్షణ అంతంతే

ఈనాడు, విశాఖపట్నం: రైళ్లలో ఏసీ బోగీల్లోనే ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా రెండేళ్లుగా రైళ్లలో స్లీపర్ కోచ్‌లను క్రమంగా తగ్గిస్తూ, ఏసీ బోగీల సంఖ్యను పెంచారు. వాటి నిర్వహణకు సరిపడా నిపుణులు లేకపోవడం సమస్యగా మారింది. లోకోషెడ్‌లో రైలు చక్రాలు, ఇంజిన్ ఇతర మెకానికల్ పనులను రైల్వే చూస్తుండగా.. ఏసీల నిర్వహణ, పారిశుద్ధ్యం, ఎలక్ట్రికల్ సహా మరికొన్ని పనులను పొరుగు సేవల సిబ్బందితో చేయిస్తున్నారు. దూరప్రాంతాలకు రాకపోకలు సాగించే రైలులో 8 మంది సిబ్బంది ఉండాలి. అందులో ముగ్గురు రైల్వే ఉద్యోగులు కాగా, మిగిలినవారు పొరుగు సేవల సిబ్బంది. వీరిలో మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఏసీ టెక్నీషియన్, ఇతర సహాయకులు ఉండాలి. జీతాల భారం తగ్గించుకునేందుకు గుత్తేదారులు అరకొరగా సిబ్బందిని నియమిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై శాఖాపరమైన తనిఖీలు చేపడితే వాస్తవాలు వెలుగు చూడొచ్చు.

ఫిర్యాదులొస్తేనే స్పందన

విశాఖ మీదుగా నిత్యం 120 రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా, వాటిల్లో 600 వరకు ఏసీ బోగీలు ఉన్నాయి. ప్రతి రైలుకూ ప్రైమరీ, సెకండరీ తనిఖీలు చేపట్టాలి. ప్రైమరీ తనిఖీలో భాగంగా విశాఖలో 30కి పైగా రైళ్లను మరుగుదొడ్ల నుంచి ఇంజిన్ వరకు అమూలాగ్రం పరిశీలించి ఫిట్‌గా ఉన్నట్లు నిర్ధారించాకే పంపాలి. సిబ్బంది కొరతతో ఈ ప్రక్రియ పక్కాగా జరగడం లేదన్నది ఆరోపణ. బోగీల్లో ఏసీలు సరిగా పనిచేయడం లేదని ఫిర్యాదులు వచ్చినప్పుడు తప్ప, నిరంతర పర్యవేక్షణ లోపిస్తోంది.

●గతేడాది విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై ఆగి ఉన్న కోర్బా ఎక్స్‌ప్రెస్(18517)లోని ఓ ఏసీ బోగీ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నికి ఆహుతైంది. ఆ సమయంలో ప్రయాణికులు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

● తాజాగా ఎలమంచిలిలో టాటా-ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్‌లో రెండు ఏసీ బోగీలు కాలిపోగా, ఒకరు మృతిచెందారు. కోచ్ బ్రేకులు పట్టేయడం వల్ల ప్రమాదం జరిగి ఉండొచ్చని సిబ్బంది చెబుతున్నారు. ప్యాంట్రీకార్ పక్కనున్న బోగీలోంచి తొలుత మంటలు రేగినందున ప్రమాదానికి ప్యాంట్రీ కారణమై ఉండొచ్చనీ అనుమానిస్తున్నారు.

ఆర్టీసీ అధికారుల పదోన్నతులకు ఎంఆర్ఆర్, ఏసీఆర్‌ల పరిగణన

ఈనాడు, అమరావతి: ఆర్టీసీలోని అధికారుల పదోన్నతులకు మెరిట్ రేటింగ్ రిపోర్టులు(ఎంఆర్ఆర్), వార్షిక రహస్య నివేదిక(ఏసీఆర్)లను శాఖాపరమైన పదోన్నతుల కమిటీ(డీపీసీ) సంయుక్తంగా పరిగణనలోకి తీసుకోవాలంటూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఆర్టీసీలో పదోన్నతులకు సంబంధించి అధికారికి చెందిన ఐదేళ్ల ఎంఆర్ఆర్‌ను పరిగణనలోకి తీసుకునేవారు. ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం కావడంతో.. ఇతర శాఖల ప్రభుత్వ అధికారుల మాదిరిగా పదోన్నతులకు ఏసీఆర్‌లు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. మొదటిస్థాయి గెజిటెడ్ అధికారుల పదోన్నతుల్లో.. వరుసగా నాలుగు ప్యానల్ ఇయర్స్‌లో ఈ రెండింటిని కలిపి పరిగణనలోకి తీసుకునేలా ఆదేశాలిచ్చారు.

●ప్రస్తుత.. 2025-26 ప్యానల్ ఇయర్ కోసం అంతకుముందు ఐదేళ్లలో నాలుగేళ్ల ఎంఆర్ఆర్‌లు, ఒక ఏడాది ఏసీఆర్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.

●2026-27 ప్యానల్ ఇయర్‌లో.. మూడేళ్ల ఎంఆర్ఆర్‌లు, రెండేళ్ల ఏసీఆర్‌లు చూడనున్నారు.

●2027-28కి రెండేళ్ల ఎంఆర్ఆర్‌లు, మూడేళ్ల ఏసీఆర్‌లు పరిగణనలోకి తీసుకుంటారు.

●2028-29కి ఒక ఏడాది ఎంఆర్ఆర్, నాలుగేళ్ల ఏసీఆర్‌లు చూడనున్నారు.

●2029-30 ప్యానల్ ఇయర్ నుంచి మాత్రం పూర్తిగా అంతకుముందు ఐదేళ్ల ఏసీఆర్‌లనే పరిగణనలోకి తీసుకొని పదోన్నతులు ఇవ్వనున్నారు.

వర్క్‌షాపుల్లో పనిచేసే ఉద్యోగులకు 16 సెలవులు

ఆర్టీసీలోని విజయనగరం, విజయవాడ, నెల్లూరు, కడప జోనల్ వర్క్‌షాపులు, స్టోర్స్, టైర్ రీట్రేడింగ్ షాపుల్లో పనిచేసే ఉద్యోగులకు వచ్చే ఏడాది 16 సెలవులను ఖరారు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వు జారీ చేసింది. ట్రాఫిక్, గ్యారేజ్ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు ఐదు సెలవులను ఖరారు చేసింది.

లిటిగేషన్ పాలసీపై మంత్రి వర్గ ఉపసంఘం సమావేశం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వ్యాజ్య విధానం (లిటిగేషన్ పాలసీ)-2025 రూపకల్పనకు సంబంధించి ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సచివాలయంలో సోమవారం తొలిసారి భేటీ అయింది. మంత్రులు ఫరూక్, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌యాదవ్‌లు న్యాయశాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఫరూక్ మాట్లాడుతూ అనవసరమైన వ్యాజ్యాల్ని తగ్గించడానికి, కోర్టులపై అధిక భారాన్ని నివారించడానికి, పాలనాసామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పరిపాలనా స్థాయిలో వివిధ పద్ధతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తుందని తెలిపారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ తదుపరి జీవోఎం సమావేశం నాటికి ప్రభుత్వ శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెప్పించాలని న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవికి సూచించారు.

కేసీఆర్‌తో రేవంత్ కరచాలనం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు సోమవారం మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కేసీఆర్ హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందే.. ప్రతిపక్షనేతగా తనకు కేటాయించిన సీటులో ఆయన ఆసీనులయ్యారు. మరికొద్ది నిమిషాల్లో సభ ప్రారంభమవుతుందనగా.. సభలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి..నేరుగా కేసీఆర్ కూర్చున్న స్థానం వద్దకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం రాకతో లేచి నిల్చున్న కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి నమస్కారం చేస్తూ కరచాలనం చేశారు. కేసీఆర్ కూడా ప్రతి నమస్కారం చేస్తూ సీఎంతో కరచాలనం చేశారు. భారాస అధినేత ఆరోగ్యం గురించి కుశల ప్రశ్నలు వేశారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, గంగుల కమలాకర్ తదితరులను కూడా సీఎం పలకరించారు. ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ విప్‌లు, పలువురు మంత్రులు కూడా వచ్చి కేసీఆర్‌ను పలకరించారు. అనంతరం జాతీయ గీతాలాపనతో సభ ప్రారంభమైంది. సంతాప తీర్మానాలు సభలో ప్రవేశపెడుతున్న సందర్భంలో.. కేసీఆర్ సభ నుంచి బయటకు వచ్చి.. నేరుగా నందినగర్‌లోని తన నివాసానికి వెళ్లారు. సభ ప్రారంభానికి ముందు.. అసెంబ్లీకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు కొండా సురేఖ, అజారుద్దీన్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మండలి కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు, అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కేసీఆర్‌కు భారాస ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కాలేరు వెంకటేశ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు.



పరస్పరం అభివాదం చేసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భారాస అధినేత కేసీఆర్. చిత్రంలో తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, ఆది శ్రీనివాస్

సంక్రాంతికి హైవేపై 'టోల్‌గేట్లు' వద్దు!

- కేంద్రానికి లేఖ రాయనున్న మంత్రి కోమటిరెడ్డి
- పండుగ వేళ ట్రాఫిక్ నియంత్రణపై నేడు సచివాలయంలో సమావేశం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సంక్రాంతి పండగ రోజుల్లో టోల్‌గేట్ల నిర్వహణను నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులోభాగంగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ)కు లేఖ రాయాలని నిర్ణయించింది. సచివాలయంలో ఈ అంశంపై ఎన్‌హెచ్ఏఐ, ఆర్‌అండ్‌బీ అధికారులు, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని కలెక్టర్లతో మంగళవారం రోడ్లు-భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఏటా సంక్రాంతి సమయంలో ఈ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, వంతెనలు, సర్వీసురోడ్ల పనులు జరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మూడు, నాలుగు రోజులపాటు టోల్‌గేట్ల నిర్వహణను ఆపాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాయాలని కోమటిరెడ్డి నిర్ణయించారు.

2 నుంచి 21.80 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ వెల్లడి



ఈనాడు, అమరావతి: వచ్చే నెల 2 నుంచి 9 లోపు రాష్ట్రవ్యాప్తంగా 21.80 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ రాజముద్రతో కొత్తగా ముద్రించిన వీటి పంపిణీకి ఏర్పాట్లు చేశామని సోమవారం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. "గత పాలకుడు తన ఫొటోను రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలపై ముద్రించారు. సర్వే రాళ్లను సైతం వదల్లేదు. పెద్దఎత్తున ప్రజాధనం దుర్వినియోగం చేశారు. ప్రస్తుతం పంపిణీ చేయనున్న పాస్ పుస్తకాల్లో తప్పులేమైనా దొర్లితే వెంటనే సరి చేయాలని అధికారులను ఆదేశించాం. గ్రేటర్ విజయవాడ, తిరుపతి ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. రాబోయే రోజుల్లో వాటిని మహా నగరాలుగా అభివృద్ధి చేయనున్నాం" అని సత్యప్రసాద్ వివరించారు.

'ప్రజల సేవలో ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

- పార్టీ శ్రేణులకు అచ్చెన్నాయుడు, పల్లా దిశానిర్దేశం

ఈనాడు, అమరావతి: 'ప్రజల సేవలో ప్రభుత్వం' కార్యక్రమంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతి తెదేపా నాయకుడు, కార్యకర్త పాల్గొనాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. మంగళ, బుధవారాల్లో ప్రతి నాయకుడు ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని వివరించాలని సూచించారు. తెదేపా ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులతో ఇద్దరు నేతలు సోమవారం టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా విధ్వంసానికి గురైందని, కూటమి ప్రభుత్వంలో వికాసం వైపు పయనిస్తోందని వివరించారు.

గతేడాది కంటే అదనంగా 8 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

- మంత్రి నాదెండ్ల మనోహర్



ఈనాడు, అమరావతి: గతేడాది కంటే ఈ ఖరీఫ్‌లో రైతుల నుంచి ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌లో మొత్తం 34.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. '5.59 లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.8,206 కోట్లు చెల్లించాం. రైతులు నష్టపోకుండా మద్దతుధర అందించాం. కూటమి ప్రభుత్వంపై విశ్వాసంతో అనేకమంది పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా కింద రూ.50 వేల కోట్లు పింఛన్ల కింద ప్రజలకు అందజేశాం. గత ప్రభుత్వం గ్రామాలను నిర్లక్ష్యం చేయగా.. ప్రస్తుతం పెద్దఎత్తున రోడ్లు నిర్మిస్తున్నాం. ఇందుకోసం తాజాగా రూ.2,500 కోట్లు కేటాయించాం. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పల్లె పండగ కార్యక్రమాన్ని చేపట్టి, పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. డేటా లేక్ ద్వారా ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. రాష్ట్రాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నాం. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోంది' అని మనోహర్ వివరించారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన టీఎఫ్‌డీఏ ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ (టీఎఫ్‌డీఏ) ప్రతినిధులు విజయవాడలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధి, టీఎఫ్‌డీఏ బలోపేతం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అన్నివిధాలుగా సహకరిస్తామని దుర్గేష్ వారికి హామీ ఇచ్చారు. వారి ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించారు. ఈ భేటీలో టీఎఫ్‌డీఏ ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, సంయుక్త కార్యదర్శి వడ్డాణం రమేశ్, ఎస్వీ భాస్కర రెడ్డి, దర్శకుడు రాజా వన్నెంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రస్ట్‌గేట్ల బిగింపు పనులు గడువులోగా పూర్తి చేయాలి: తుంగభద్ర మండలి

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్ర ఆయకట్టు రైతుల ను దృష్టిలో పెట్టుకుని కొత్త క్రస్ట్‌గేట్ల బిగింపు పనులు నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని తుంగభద్ర మండలి అధ్యక్షుడు ఎస్.ఎన్.పాండే, సభ్యులు ఇంజినీర్లను కోరారు. సోమవారం హొసపేటె (టీబీడ్యాం)లోని మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోర్డు సమావేశంలో వారు మాట్లాడారు. రెండో పంటకు నోచుకోక రైతులు తీవ్ర నష్టాన్ని చూశారని, రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కొత్త గేట్ల బిగింపు పనులకు అదనంగా కార్మికులను నియమించుకుని వేగం పెంచాలని సూచించారు. వచ్చే ఏడాది జూన్ మొదటిలోగా గేట్ల బిగింపు పనులు పూర్తికావాలని ఆదేశించారు. మండలి ఇంజినీర్లు రోజూ దగ్గరుండి పనులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. సమావేశంలో కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏపీ సభ్యుడు నరసింహమూర్తి, కర్ణాటక సభ్యుడు ఎజాజ్ హుసేన్, తెలంగాణ సభ్యుడు రహీముద్దీన్, పర్యవేక్షక ఇంజినీరు నారాయణ్ నాయక్, ఎస్డీవో జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కోణంలోనే జిల్లాల పునర్విభజన: సీపీఐ

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్విభజనను రాజకీయ కోణంలో ఇష్టానుసారంగా చేపట్టడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య విమర్శించారు. "రాష్ట్రంలోని జిల్లాలను కూటమి ప్రభుత్వం 28కి పెంచుతూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా కొన్ని జిల్లాలకు సంబంధించి రాజకీయ దురుద్దేశం కనిపిస్తోంది. అన్నమయ్య జిల్లాలోని రాయచోటిని మదనపల్లె కొత్త జిల్లాకు, రాజంపేటను కడప జిల్లాకు, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాకు మార్చుతూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. సాక్షాత్తూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పదేపదే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో ఆయన ఆవేదనకు గురై క్యాబినెట్‌లో కన్నీరు పెట్టుకున్న సంఘటన దురదృష్టకరం" అని పేర్కొన్నారు.